ద్రావిడి

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

PRASAARAANGA

ద్రావిడి

సంపుటి - 3

జూలై-డిసెంబర్ 2024

సంచిక-1

ISSN: 2319-3905

ద్రావిడి

(Peer Reviewed Journal)

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

సంపుటి - 3 | జూలై - డిసెంబర్ 2024 | సంచిక-1

గౌరవ సంపాదకులు

ఆచార్య ఎం.దొరస్వామి, ఉపాధ్యక్షులు i/c

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్, సంచాలకులు, ప్రచురణలు

ద్రావిడ విశ్వవిద్యాలయం

ద్రావిడి

(Peer Reviewed Journal)

(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

సంపుటి - 3 **జూలై-డిసెంబర్ 2024** **సంచిక - 1**

గౌరవ సంపాదకులు

ఆచార్య యం.దొరస్వామి, *ఉపాధ్యక్షులు* i/c

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

సంచాలకులు, ప్రచురణలు

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య కె.శ్రీదేవి, *ద్రా.వి.వి.*

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, *హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.*

ఆచార్య విస్తాలి శంకరరావు, *మద్రాసు విశ్వవిద్యాలయం.*

డా.డి.ఉదయ కుమారి,*ద్రా.వి.వి.*

డా.వి.పళని, *ద్రా.వి.వి.*

డా.యం.హరికృష్ణ, *ద్రా.వి.వి.*

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

Dravidi (Peer Reviewed Journal)
HALF-YEARLY RESEARCH JOURNEL IN TELUGU
July - December 2024, Vol.III, Issue No.1

© Dravidian University

Editorial Board

Editor

Prof. D.V.Sravan Kumar

Members

Porf. K.Sridevi
Prof. Darla Venkateswara Rao
Prof. Vistali Shankara Rao
Dr. D.Udaya Kumari
Dr. V.Palani
Dr. M.Harikrishna

Published by
Director
Department of Publications
Dravidian University
Kuppam - 517 426

For Copies
The Director
Department of Publications
Dravidian University
Srinivasavanam
Kuppam – 517 426

ISSN No.2319-3905

Printed at
Vijayavani Printers
Chowdepalle

సందేశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో 1977వ సంవత్సరం ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. ద్రావిడ విశ్వవిద్యాలయం భావసమైక్యతను సాధించడానికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రచురణలు & విస్తరణల సేవల కేంద్రం (ప్రసారాంగ) ఐదు ప్రధాన దాక్షిణాత్య భాషలతో పాటు ఆంగ్ల భాషలో సైతం రచనల్ని వెలువరించింది. ఏ విశ్వవిద్యాలయమూ ఇన్ని భాషల్లో ప్రచురణల్ని చేపట్టిన దాఖలా లేదు. స్వతంత్ర గ్రంథాలతో పాటు అనువాదాలను, నిఘంటువులను పరిశోధనా గ్రంథాలను, భాషాశాస్త్ర గ్రంథాలను ప్రసారాంగ ప్రచురించింది. వీటితో పాటు "ద్రావిడి" వెలువుడుతూ వుండేది. కానీ ద్రావిడి రాకకు కొంత జాప్యం కల్గిన మాట వాస్తవమే. కానీ ప్రస్తుతం ద్రావిడి తీసుకురావడం ఎంతైనా ముదావహం. ఈ పత్రిక తెలుగు సాహిత్య, సాంస్కృతికాభిమానులను అలరిస్తుందనేది అక్షరసత్యం.

పరిశోధకులు ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలను ప్రచురించడానికి ప్రామాణిక వేదిక అవసరం. ఈ విషయాన్ని గుర్తించిన నేపథ్యంగా వచ్చిన వరమే "ద్రావిడి" అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక.

"ద్రావిడి" తెలుగు పరిశోధక పత్రికను ఆదరించి, తెలుగుని గురించిన ఉత్తమ పరిశోధన పత్రాలను పంపి, సాహిత్యాభిమానులు దీన్ని మరింత బలోపేతం చేయగలరని విశ్వసిస్తున్నాను.

ఆచార్య ఎం.దొరస్వామి
ఉపాధ్యక్షులు i/c

సంపాదకీయం

ద్రావిడ భాషల అధ్యయనం, ద్రావిడ సంస్కృతిని గూర్చిన పరిశోధన, ఆ భాషల్లోని విశిష్ట సాహిత్య పరిశీలన ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడింది. భారత దేశంలో ద్రావిడ భాషల ఉనికి పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. బెలూచిస్థాన్‌లో కూడా బ్రాహుయి అనే ద్రావిడ భాష ఉండడం ఈ ఉపఖండంలో ద్రావిడ భాషల ప్రత్యేక స్థానాన్ని గుర్తించేట్లు చేసింది. ఈ భాషలను గురించి చేయవలసిన పరిశోధన అపరిమితంగా ఉందనే విషయాన్ని గుర్తించి ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం జరిగింది.

విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన మూడు బాధ్యతలు బోధన, పరిశోధన, ప్రచురణ. ఈ మూడింటి వల్ల జ్ఞాన ప్రసారం సుగమమవుతుంది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఈ మూడింటినీ నిర్వహిస్తూ ఉండడం ముదావహం. ముఖ్యంగా ప్రచురణల కేంద్రం ఏ విశ్వవిద్యాలయమూ చేపట్టని విధంగా ఆరు భాషలలో గ్రంథాలను ప్రచురిస్తోంది. ఇలా ప్రధాన ద్రావిడ భాషలలో, ఆంగ్లంలో పుస్తక ప్రచురణ చేస్తున్న మరో విశ్వవిద్యాలయం ఏదీ లేదు.

పుస్తక ప్రచురణతో బాటు వివిధ భాషలలో పరిశోధన పత్రికలను ప్రచురించాలనుకోవడం ద్రావిడ విశ్వవిద్యాలయం చేపట్టిన మరో మహత్కార్యం. ఈ విషయంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు, రిజిస్ట్రారు, ప్రచురణల శాఖను అభినందించాలి. పరిశోధన కోసం విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ కార్యం ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకం కాగలదని చెప్పక తప్పదు.

తెలుగులో ఒకానొక కాలంలో పరిశోధన, గ్రంథ పరిష్కరణ, విమర్శ, సాంస్కృతిక అధ్యయనం వికసించాలనే ఉద్దేశంతో అనేక పత్రికలు వెలువడేవి. వృత్తాంతిని, వర్తమాన తరంగిణి, హితవాది, ఆంధ్రభాషా సంజీవని, వివేకవర్ధిని లాంటి పత్రికలు 19వ శతాబ్దిలోనే తెలుగు భాషా సాహిత్యాలకు అమూల్యమైన సేవ చేశాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో గౌతమి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, కృష్ణా పత్రిక, అముద్రిత గ్రంథ చింతామణి, ఆంధ్ర పత్రిక మొదలైనవి చేసిన సేవ చిరస్మరణీయం.

ఒకప్పుడు ఏ సాహిత్యవేత్త అయినా, పరిశోధకుడైనా తమ వ్యాసాలు ప్రచురించాలంటే ముఖ్య వేదికగా 'భారతి' ఉండేది. ఈ పత్రిక తెలుగు సాహిత్య వికాసానికి చేసిన సేవ మరువరానిది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (వాఙ్మయి), ఉస్మానియా విశ్వవిద్యాలయం (వివేచన), కాకతీయ విశ్వవిద్యాలయం (విమర్శిని), తెలుగు అకాడెమీ (తెలుగు), దక్షిణ భారత హిందీ ప్రచారసభ (స్రవంతి) లాంటి సంస్థలు కూడా పరిశోధన రంగానికి తమ వంతు సేవల్ని అందించాయి.

ప్రస్తుతం పరిశోధనకు సంబంధించిన కొత్త విషయాలను చెప్పాలంటే సరైన వేదిక అంటూ లేదు. వేలమంది తెలుగులో పరిశోధనలు జరుపుతున్నా ఉన్నత ప్రమాణాలను అనుసరించటం లేదనే ఆరోపణ ఉంది. పరిశోధన చెయ్యాల్సిన విషయాలకు కొదువ లేదు. కాని కష్టపడకుండా పరిశోధన పట్టం పుచ్చుకోవాలనే తపన పరిశోధకులలో ఎక్కువవుతూ ఉంది. అలా కాకుండా తెలుగులో ఉత్తమ పరిశోధనకు ఆకరంగా వ్యవహరించాలని, ద్రావిడ భాషల తులనాత్మక పరిశీలనకు ఒక వేదిక కావాలని ఈ పత్రికను ప్రారంభించటం జరిగింది. మధ్యలో కొంతకాలం పత్రికను అనివార్య కారణాల వల్ల తీసుకురాలేకపోవడం జరిగింది. అందుకు క్షంతవ్యులం. తిరిగి 'ద్రావిడి'ని పునరుద్ధరించి తీసుకురావడం ఆనందదాయకం.

'ద్రావిడి'ని తిరిగి తీసుకురావటానికి కారకులైన ప్రస్తుత ఉపాధ్యక్షులు (ఇంఛార్జి) ఆచార్య ఎం.దొరస్వామి గారికి, రిజిస్ట్రారు (ఇంఛార్జి) ఆచార్య వి.కిరణ్ కుమార్ గారికి ధన్యవాదాలు. ఈ సంచికలో మంచి పరిశోధనాత్మక వ్యాసాలు వున్నాయి. 'ద్రావిడి'ని తిరిగి తీసుకువస్తున్నామని చెప్పగానే స్పందించి వ్యాసాలను పంపిన రచయితలందరికీ ధన్యవాదాలు. సంపాదక మండలి సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ ముద్రణా బాధ్యతలో పాలుపంచుకున్న ప్రసారాంగ బోధన, బోధనేతర ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు.

ఈ మా ప్రయత్నాన్ని హర్షించి పరిశోధకులు ఉత్తమ వ్యాసాలను ప్రచురణకు పంపి 'ద్రావిడి' పత్రికను నిరంతరాయంగా తీసుకురావడంలో సహకారం అందిస్తారని ఆశిస్తున్నాను.

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

సంపాదకులు

విషయ సూచిక

సందేశం iiii

సంపాదకీయం v

1.'మేనక, రంభ' ఖండ కావ్యాలు-వస్తు నిర్వాహణ 1

-ఆచార్య కె.మధుజ్యోతి

2. తెలంగాణ భాషపై ద్రవిడ భాషల ప్రభావం 10

- ఆచార్య సూర్య ధనుంజయ్

3. మాలతీ చందూర్ నవలల్లో సామాజిక చైతన్యం 26

- ఆచార్య కె.శ్రీదేవి & వై.స్రవంతి

4. యానాదుల జీవన విధానం - వినోదాలు - వేడుకలు 51

- ఆచార్య పి.రమాదేవి

5. ద్రావిడ జానపద ప్రదర్శన కళలు 59

- ఆచార్య టి.రామ ప్రసాద రెడ్డి

6. గురజాడ సంస్కరణాభుద్యదయం 66

- ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

7. అన్నమయ్య - భావుకత 74

- ఆచార్య ఎం.రామనాథం నాయుడు

8. తెలుగు కళలు - ద్రావిడ సంస్కృతి ప్రతిఫలనం 80

- ఆచార్య ఎస్.చిన్నరెడ్డెయ్య

9. జానపద కథలలో - స్త్రీ పాత్ర చిత్రణ 95

-డా.జి.శైలమ్మ

10. అనువాద కళ: యంత్రానువాదం - విశ్లేషణ 107

- డా.టి.వెంకటస్వామి

11.తిరువళ్లువర్, వేమన రచనల్లో సారూప్యత - విశ్లేషణ 114

-డా.యం.హరికృష్ణ

12. **బంజారా భాషా సాహిత్యం పరిరక్షణ – ఆవశ్యకత** 122

– డా. వి. గోపాల్

13. **తెలుగుకథా సాహిత్య వికాసం – సన్నపురెడ్డి కథల్లో పాత్ర చిత్రణ** 127

– డా. డి. జ్యోతమ్మ

14. **గిరిజన తెగల్లో వివాహాలు – విభిన్న సంప్రదాయాలు** 135

– డా. తరపట్ల సత్యనారాయణ

రచయితల చిరునామాలు 143

శైలీ పత్రం 144

"ద్రావిడి" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు. విశ్వవిద్యాలయం బాధ్యత వహించదు.

1

'మేనక, రంభ' ఖండ కావ్యాలు-వస్తు నిర్వాహణ

- *ఆచార్య కె.మధుజ్యోతి*

1.వైసివీరెడ్డిగారు (ఎమ్మనూరు చిన్న వెంకట రెడ్డి) కడప జిల్లా వాస్తవ్యులు. వీరు తెలుగు సాహిత్యానికి అద్భుతమైన ఖండకావ్యాలను వచన కవిత్వాన్ని అందించారు. వీరు సున్నిత మనస్కులు. ఆ సున్నితత్వం భావుకత వీరి సాహిత్యంలో పుష్కలంగా గోచరిస్తాయి. 1926 లో మార్చి 26వ తారీఖున జన్మించిన వైసివీరెడ్డిగారు 1989 అక్టోబర్ 8వ తేదీన మరణించారు. తొలుత భావుకతతో రచనలు ప్రారంభించిన వీరు, తర్వాత కాలంలో వచన కవితని రాశారు. అభ్యుదయ ధోరణితో ప్రయాణం చేశారు. వీరు అరసం సభ్యులుగా ఉన్నారు. అరసానికి అధ్యక్షులుగా చాలా కాలం పని చేశారు. 1972 నుంచి కడప జిల్లా అభ్యుదయ రచయితల సంఘ అధ్యక్షునిగా 1989 వరకు కొనసాగారు.అంటే 17 సంవత్సరాలు నిరంతరాయంగా కొనసాగారు. వీరికి సాహిత్యం పట్ల సమాజ పురోగమనం పట్ల ఉన్న ఇష్టానికి ఇది నిదర్శనం. సాహిత్యాన్ని ప్రేమించే వైసివీరెడ్డిగారు సాహిత్య సభలోనే పరమపదించటం, విధి వీరి ఇష్టాన్ని గుర్తించిన తీరుకి నిదర్శనం.

ఈ కవి ఎందరో ప్రముఖుల సాన్నిహిత్యాన్ని పొందారు. గడియారం వేంకట శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, ధర్భాక రాజశేఖర శతావని వంటి దిగ్గజాల పరిచయం ఉంది. 'వాధూల' అనే పేరుతో తొలుత సాహిత్య సృజన చేసిన కవి, తర్వాత తన సొంత పేరుతోనే రచనలు చేయడం విశేషం. వీరి సాహిత్యం రెండు చందాల బలమైనది. భారత భాగవత రామాయణాలు, ప్రబంధాలు, కావ్యాలు వంటి ప్రాచీన సాహిత్యాన్ని చదివిన, ఆ సాంప్రదాయాలను ఎరిగినటువంటి వైసీవీరెడ్డిగారు, ఆ తరువాత కాలంలో అభ్యదయ భావజాలం పట్ల ఆకర్షితులై ప్రగతిశీల దృక్పథంతో మమేకమై సాహిత్య సృజనకి పూనుకొన్నారు. ఈ అభ్యుదయ ధోరణి వారి పద్య సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. వీరి సాహిత్యం కడప జిల్లా ప్రాంత ప్రాతినిధ్యం వహించే అద్భుతమైన రచన సౌందర్యం. సాహిత్యం ప్రాంతీయ భాషా సౌందర్యంతో ప్రజల నుడికారంతో ప్రజా వ్యవహార భాషా సౌందర్యంతో అందాన్ని

పొందుపరచుకొని ఉంది. వీరు సాహిత్య సృజనకే కాదు సాహిత్య విశ్లేషణకు విమర్శకు కూడా పెట్టింది పేరుగా ప్రఖ్యాతి గాంచారు. వీరిని గురించి సాహిత్యోన్నతి సాధించిన ప్రముఖులు ఎంతో గౌరవంగా సాహిత్య గుణాలను మెచ్చుకుంటూ పేర్కొనడం విశేషం.

2.వైసివీరెడ్డిగారు రాసిన అనేక రచనలలో 'మేనక రంభ' రెండు విశేష రచనలు. ప్రాచీన సాహిత్య ప్రాముఖ్యమున్న వస్తువును, తన భావనాచాతురితో విశేష ఖండకావ్యాలుగా తీర్చిదిద్దారు. ప్రాచీన కావ్యాలలోని వస్తువును మార్చలేని ఒక పరిమితి కవికి ఉంటుంది. కథను మార్చలేరేమో కానీ కావ్యాన్ని భావనా చమత్కారంతో కల్పిత భావోద్వేగాలతో తగిన ఔచిత్యంతో సముచిత అలంకారాలతో పాత్రలని నైగనిగ్యంతో చిత్రించడానికి అవకాశం ఉంది. మేనక రంభ ఇద్దరూ, ప్రాచీన సంప్రదాయ సాహిత్య పాత్రలు. వీరిద్దరూ అప్సరకాంతలు. ఇద్దరూ ఇంద్ర సభను అలరారించే దేవ కాంతలు. వీరిని బలమైన వ్యక్తిత్వం కలిగిన సంభాషణా చాతుర్యం కలిగిన పాత్రలుగా తీర్చిదిద్దటంలో వైసీవీరెడ్డిగారు కృతకృత్యులయ్యారు. సమయోచిత తెలివిని ప్రదర్శించిన పాత్రలుగా చూపించారు. మేనక ఇంద్ర విశ్వామిత్రులను ఒప్పించిన పాత్ర కాగా రంభ రావణుడితో వాదించి ఆయన వాదనకు తల ఒగ్గిన పాత్ర. ఈ రెండు పాత్రలు తమ వ్యక్తిత్వ బలాన్ని ప్రదర్శించాయి. ప్రాచీన కథాంశాన్ని మార్చలేని వస్తువు ఉన్న చోట మేనక గెలిచింది తన కోరిక నెరవేర్చుకుంది. రంభ, రావణుడి కోరికను, రావణుడి వాదనాబలంతో అంగీకరించింది. ఈ రెండు పాత్రలు నూతన అభ్యుదయ భావవీచికలను చుట్టుకొని, ఈ కావ్యాలలో సాక్షాత్కరించటం కవి సామర్థ్యపు ప్రదర్శన ఫలితం.

3.'మేనక' 1950 అక్టోబర్‌లో రచించినది. బ్రహ్మర్షి స్థానం కోసం తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడి దీక్షను భగ్నం చేయటానికి మేనకను ఇంద్రుడు పంపడం మూలంలోని కథ. ఇందులోనూ, విశ్వామిత్రుడి తపస్సు భంగం చేయడానికి ఇంద్రుడు పంపాడు. కానీ అది మేనక కోరికపై. ప్రధాన కథను మార్చలేరు. కానీ నూతన కల్పన చేయవచ్చు. అదే కవి ఇక్కడ చేసింది. ఈ వస్తువుని నిర్వహించటంలోనే కవి సమర్థత కనిపిస్తుంది. మూలంలో ఇంద్రుడి పంపున విశ్వామిత్రుడి తపస్సు భగ్నం చేయడానికి మేనక వెళ్ళినట్లు ఉంది. రంభ వెరచినట్టుంది. మేనక భయంతోనే అయినా విశ్వామిత్రుడు తపస్సు భగ్నం చేయటానికి ధైర్యం చేసింది. 'అయినను నా నేర్చు విధంబున నమ్మునివరు చిత్తంబుమెత్తన చిత్తదాయత్తంబగు నట్లుగా జేసెద' (39.ఆది.చతుర్థాశ్వాసం)అని ఇంద్రుడికి మాటిచ్చింది మేనక. ఇది మూలంలో ఉన్న ఘట్టం.

మేనక విశ్వామిత్రుల కలయిక భరతుడి జననానికి భారతదేశపు ఘనతకి కారణమైనదిగా భావించటం కద్దు. అదే విషయం రెడ్డిగారి రచనలో నూతనంగా అందంగా ఆవిష్కృతమైంది. కేవలం అచ్చరకాంతగానో, దేవ కన్యగానో ఇంద్రుని పంపున వచ్చిన వనితగానో కాకుండా, రమణీయమైన భావుకమైన సున్నితమైన ప్రేమను రెడ్డిగారు చిత్రించటం విశేషం. భావ కవిత్వం

ఉధృతంగా వస్తున్న కాలాలలో, స్త్రీని సౌందర్యభరితమైనశృంగార బొమ్మగా మాత్రమే కాకుండా స్త్రీని బహు విధాలుగా ఆరాధించటం పూజించడం కవుల రచనలలో వెలుగు చూస్తున్న కాలంలో, రెడ్డిగారి మేనక, ప్రణయ తత్త్వం నిండిన మూర్తిగా నిలిచింది. ఈమె ఇష్టం, విశ్వామిత్రుడి పట్ల కలిగిన ప్రేమ ఆయన పట్టుదల వల్ల వచ్చింది. ఈమె కోరిక నెరవేరటం ప్రధాన అంశం. మూలంలో ఉన్న మేనక ప్రభావం విశ్వామిత్రుడిలోని సంచలనం ఇక్కడ మార్పు చెందాయి. గడియారం వెంకట శేష శాస్త్రిగారు, మేనక 'పరిచయము'లో అన్నట్టు, పూర్వ కథలోని 'యింద్రుని ప్రయత్నముగానీ మేనక ప్రవృత్తిగానీ, విశ్వామిత్రుని చాపలముగానీ నైతికముగా నుదాత్తములు గావనియు, భరతుని యాభిజాత్యమునకు శీల సత్త్వముల నింపలేవనియు, నీ కావ్యకర్త తలంచినట్టున్నది. ఈ సన్నివేశముల నడుమ నిండుగా బుష్పించిన కవితా విన్యాసమంతయు జక్కని ధారతో నిండు కూర్పుతో తీయని పలుకుబడితో అందమైన యలంకారములతో భావనా శుభగమై ఔచితీ విలసితమై హృద్యముగా బరిమళించినదని ముందు ముందు చదువరులే గ్రహింపగలరు' అన్నారు. ఈ మాటలు వాస్తవం. ఇవి కావ్య ఆంతర్యాన్ని తెలుపుతాయి. వీరి ఔచిత్యవంత చిత్రణ అద్భుతం. భావధార అద్భుతమే. రచన ఈ రెండింటితో గౌరవ ప్రదంగా నిలిచింది. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ఈ కావ్యానికి 'అభిప్రాయము' రాస్తూ 'ఇంత చిన్ని కావ్యములో నింత సౌందర్యము నిముడ్చుట సామాన్యమైన శిల్పముగాదు

వృత్పత్తి ప్రయత్నం సాధ్యము. సంస్కారం దైవదత్తము. ఈ కావ్యమున సంస్కారము పద పదమునకున్నది.

వృత్పత్తి సంస్కారమును ద్రోసిరాజనకుండుటీ కావ్యములోని మహాగుణము' అని అనటంలో సంస్కార యుతమైనటువంటి ఔచిత్యాన్ని ఔన్నత్యాన్ని పాత్రలలో ఎలా నిలిపారో గ్రహించవచ్చు.

ఘనతరం అమోఘము అయిన తపము చేస్తున్న విశ్వామిత్రుడు పట్ల మేనక మనసుపెట్టి వలపు నిలిపినట్టుగా కవి కల్పించాడు. తన పనిపై మనసు లగ్నం చేయలేనంత 'వలపు కడలిలో నాశయన్నడవ నెక్కి / తెరువెరుంగని బేలయై తిరుగుచుండె' మేనక. తన ప్రణయాగ్నిలో ఆమె కొట్టుమిట్టాడుతూ ఉండటాన్ని అద్భుతంగా చిత్రించాడు కవి. అప్సర కన్యల పట్ల నిరసన తేలిక భావంలేని సగౌరవం ఈ చిత్రణలో కనిపిస్తుంది. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఊర్వసికై కబురు పంపింది. ఈ సందర్భంలో దూతగా వెళ్ళిన చేటికి ఊర్వశికి నడుమ జరిగిన సంభాషణ నాటికీయశిల్ప తీరుని తెలుపుతూ ఉంది. మేనకలో కలుగుతున్న సంచలనం, మన్మథ బాధ ఊర్వశి తెలుసుకొని, ఆమెకు సహాయం చేయడానికై బయలుదేరింది. ప్రాచీన సాహిత్యం విశేషంగా చదివిన కవి రచనలో పోతన శ్రీనాథుడు మను వసుచరిత్రకారులు తదితరుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. 'అనుచు బలవించి మొరపెట్టు నబల వెంట/ పదము కంటే ముందు మది ముందు పరువులెత్త' ఊర్వశి మేనకను చేరింది. 'కుడిచి కూర్చుండకీ వట్టి గొడవమేలే?' అని

ఊర్వశి ప్రశ్నించడానికి కవి తన జనుల నుడికారాన్ని తెచ్చి పెట్టాడు. మేనక, ఇంద్రుడిని అర్థించి, విశ్వామిత్రుడు సేవకు తనను పంపమని ఊర్వశిని అభ్యర్థించింది. ఇంతలో ఇంద్రసభ నుంచి మేనకకు నృత్య ప్రదర్శనకై పిలుపు రాగా ఆమె శృంగార సమంచిత అయి, సభకు వెళ్లింది.

'నిలిచి కనువారి కనుల వెన్నెలలువోసి

సొగసి వినువారి చెవులలో సుధలుజిలికి

తలచి మరియు డెందముల కౌగిలికి దాటి

చంద్రకళవోలే మేనకాప్సరస యాడె'. ఆమె నృత్యానికి ఇంద్రుడు మెచ్చి 'కోరుకొమ్మేమి వలయినో సారసాక్షి' అని అడగగా సిగ్గుతో పలకకున్న ఆమె వైఖరి చూసి ఇంద్రుడు సభను విడిచి వెళ్ళాడు. ఇది ఔచిత్యవంతమైన చర్యగా కవి చిత్రించాడు. ఆమె కావలసినది కోరటానికి సంకోచిస్తున్నదని గుర్తించి సభలో అందరి ముందు ఆమె అడగలేదని గ్రహించి, ఇంద్రుడు సభను విడిచి వెళ్ళాడు. ఆయన వెంట వెళ్లి 'చల్లకై వచ్చి ముంత దాచంగానేల' అంటూ సంకోచిస్తూనే తన కోర్కెను తెలియజేసింది మేనక. బ్రహ్మత్వానికి ప్రయత్నిస్తున్న విశ్వామిత్రుడి పట్ల తన మనసు లగ్నం కావడాన్ని వివరించింది. ఇంద్రసేవకు కొంత సెలవిచ్చి తనను పంపమని అభ్యర్థించింది. మేనక కోరికను విని ఇంద్రుడు, విశ్వామిత్రుడి తపస్సును భంగపరచటానికిది మంచి దారి అని భావించి

'కోరవలసిన కోర్కెయే కోరుకొంటి

వబల! నీకు బ్రియంబె మాకభిమతంబు

కౌశికుండేమి నీకు ముక్కంటి గూడ

వశుడగును బోయి రమ్మని వరం మొసంగి' జాగ్రత్తలు చెప్పి పంపాడు. అంతట మేనక విశ్వామిత్రుని సేవించటానికి పూనుకొంది. ముని ఆశ్రమాన్ని చేరి, నిర్భర సమాధిలో తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడిని చేరింది.

'సకల సౌందర్యములను మేనక కొసంగి

నలువ సృష్టింపగా నామె నైజ శోభ

నవ్వనము నెల వింత సోయగం నింద

నిలిచి ముని జూచి తల యూచి తలచెనిట్లు!' భగవంతుడు ఆమెకు సౌందర్యం ఇస్తే ఆమె స్వభావ సౌందర్యం అడవికి వింత సోయగాన్నిచ్చిందని కవి కల్పించటం అతనిలోని భావన చాతురికి నిదర్శనం.

మన్మథుడినీ మదన పరివారాన్ని నమస్కరించింది. తన హృదయంలో తలెత్తిన ఆశ నెరవేరాలని కోరుకుంటూ ఉంది. పూలతీగలను గాలిని తుమ్మెదలను చిలుకలను మదన

పరివారాలను బతిమాలి కొలచి, వనదేవతలకు తనను దీవించమని కోరుకుంది. దివ్యదృష్టితో తన రాక తెలియకపోతే కళ్ళు విప్పి తనని చూడమని ప్రార్థించింది. ఆమె ప్రార్థన ఆలకించినట్టుగా కళ్ళు విచ్చిన విశ్వామిత్రుడు, ఆమెని చూసి,

'కువలయ దళాయతాక్షి! నీ వేవతె వెట్టి

జ్ఞాన సముపార్చనము సేయ గదలి యిటకు

నున్నతోన్నత శిఖరాలనుండి దుమికి

పరుగు లిడితివి సెలయేటి పడుచు వోలె!' అని ప్రశ్నించాడు. మేనక ఆయన తపస్సు నుంచి కళ్ళు విచ్చేలా చేసిన ఎదుట ఉన్న అప్సరసకాంతను, ఏ జ్ఞాన సముపార్జనకు వచ్చావు అని ప్రశ్నిస్తున్న విశ్వామిత్రుడి చిత్రణలో కవి ఉన్నత మనసు ఉంది. సంస్కారం ఉంది. అప్సరస కాంతను చూసిన శృంగార భావం విశ్వామిత్రుడిలో పొడచూపలేదు. ఆమె తాను మునీంద్రుడిపై ఎంతగా మనసు నిలిపిందో 'నిలుతు మీ నీడ– మనసులో మెలుగు కొందు' అంటూ తన మనసుని వ్యక్తం చేసింది. ఆమె 'నేర్పులకు మెచ్చి విచ్చుకొను డెందమును గప్పిపుచ్చి' విశ్వామిత్రుడు ఆమె చేష్టలకు మాటలకు మన మనసు పొంగినా, 'బ్రహ్మత్వ మాశించి ఎద బిగించి/ కూరు చున్నాడ; ఇది చెడగొట్ట దలతే....నీ వూరకున్న/ నుండనీరు సురలు నిన్నుబ్బ జేసి/ పంపగా వచ్చితివి నా తపంబు జెరుప/ బడతి! యా నీటికి బేడలుడక వింక' అని ఆమెని ఇంద్రుడి పంపున వచ్చిన స్త్రీగా భావించాడు. ఇక్కడ కవి జన వ్యవహారంలోని "పప్పులు ఉడకవు" అనే మాటని కావ్యగతం చేశాడు. తనపై నింద మోపుతున్న విశ్వామిత్రుడితో,

'ఒక్కనాడది శుభకరమో యశుభమొ

మనసులో లగ్నమయ్యే మీ మహిత మూర్తి

అదియ బీజమై అంకురమైన ప్రవృద్ధ

మై మనోరథ లత హృదయంబు నిండె.

ఓ మహామునీ! తపము చేయుదువు నీవు

నీ తపము చేత నే కృశనైతి నేల?' అంటూ ఒక్కచోట దేహం వేరొక చోట ఆత్మ నిలవగలవా అని ప్రశ్నించింది. ఆమె మాటలలో ఉన్న స్వచ్ఛత ప్రేమార్తి ప్రణయ తత్త్వం నింద తొలగించుకోవడమే కాక విశ్వామిత్రుడి మనసు గెలవడానికి మార్గాన్ని వేసింది.

'అందుకై నన్ను మీకు సర్వార్పణగ/ ధారవోసితి నా పుష్పధన్వు సాక్షి'గా అని ఆయన పాదాలపై వాలింది. ఆమె సిగపూల పరిమళం ఆమె నిట్టూర్పులు ఆమె చెమట, మది గుభాలింప, ముని 'కంపమానకరములంటి ఆమెను లేపాడు. కవి తన చమత్కారాన్ని ఈ కింది పద్యంలో ఎలా చెప్తున్నాడో గమనించండి.

'కౌశికుని జాలి మేనక గడుసు దనము

విధి విలాసము మన్మథు విక్రమంబు

కారణంబేది యైన నౌగాక తుదకు

ముష్కర తపస్వి యొక వెన్న ముద్దయయ్యె'. అంతేనా ఇంకా కవి ఇలా అంటున్నాడు

'రెప్పవాల్పని చూపులో నుప్పతిల్లి

మేన బారాడి తలపులో మెరుపువోలె

భావమొక టేదియో స్వయం ప్రభావమగుచు

నిగిడి మనసెల్ల మౌనికి నిండి కొనియె!'

ఈ వృత్తాంతం వారి భవిష్యత్ దర్శనంతో రచించినట్టుగా భావించవచ్చు. మూలంలో వారిరువురి కలయికలో వ్యక్తం కాని పరమార్థాన్ని కవి ఊహించాడు.

'లలిత కుంతలయగు శకుంతల ప్రశాంత

మైన కణ్వుని యాశ్రమమందు తిరుగు

సరస ధర్మావతార దుష్యంత నృపుడు

భరతుడొక్కసారి తలపులో దిరిగిరేమో?' విశ్వామిత్రుడు మేనకను ఆలింగం చేసుకొన్నాడు. ఇది భవిష్యత్తులో ధర్మ ప్రతిష్ఠాపన కోసం దివ్యదృష్టితో చూడగలిగిన విశ్వామిత్రుడి సామర్థ్యాన్ని కవి ఊహించాడు. అంత నిష్ఠాగరిష్ఠుడైన విశ్వామిత్రుడికి మేనక వలన తపస్సు భంగం కలగటానికి కవి చేసిన కల్పన. ధర్మం కోసం భరత జననం కోసం తన తపస్సుని భగ్నం చేసుకోవడానికి కూడా విశ్వామిత్రుడు సిద్ధపడినట్టుగా కవి కల్పించడం ద్వారా కావ్య పాత్రలకు గౌరవం ఔచిత్యవంతమైన ఆలోచనలను అందించాడు. వస్తువుకు ఎలాగైతే నూతన కల్పనలని భావ మాధుర్యాన్ని చేర్చాడు అలాగే భాషలో కూడా, సమాజంలో ప్రజలలో ఉన్న వ్యక్తీకరణలను తెచ్చి పెట్టడం విశేషం. కవి తన సమకాలీనతకు భాషని నుడికారాన్ని వ్యక్తీకరణను ఒక రకంగా కావ్యంలో నిలిపాడు అని విశ్వసించవచ్చు. భాష భావాలను వినూతనంగా ఆవిష్కరించిన మృదు మధురకావ్యం 'మేనక'.

4. 'రంభ' ఇది మరో విశిష్ట కావ్యం. దీనిని దుర్ముఖి నామ సంవత్సరంలో రాసినట్టుగా తెలుస్తూ ఉంది. మేనక రంభ రెండింటిలోనూ విశేషమైన అభివ్యక్తి సామర్థ్యం భావన చాతురి పొంగులు వారుతూ ఉంది. రంభ నలకూబరుల కథ రామాయణంలో ఉంది. నలుకూబరుడి కోసం వెళ్తున్న రంభను రావణుడు కోరికతో ఆపటం మూలంలో ఉన్న కథ. రంభ నలకూబరుడికి విషయం చెప్పటం దాని మూలాన ఏ స్త్రీని ఆమె ఇష్టం లేకుండా తాకినా రావణుడి ప్రాణం పోతుంది అని శపించాడు. అది సీత విషయంలో రావణుడికి ప్రమాదంగా అయినట్టు రామాయణ

కథ తెలుపుతూ ఉంది. రంభ రావణ సంవాదం మాత్రమే రెడ్డి గారు గ్రహించారు. 'రంభ' కావ్యంలో రంభ నలకూరుడి కోసం సర్వాంగ సుందరంగా తయారై వెళ్లడానికి సిద్ధమయ్యింది. రావణాసురుడు, కుంభకర్ణుడు మేఘనాథుడు తదితరులతో కలసి యుద్ధాలు చేస్తూ జయాలను పొందుతూ హిమగిరిని ఆక్రమించాడు. అశేష సైన్యం సేద తీరుతుండగా, రావణుడిలో చల్లని వెన్నెల పిల్లగాలి వలన పలుభావాలు తలెత్తగా, స్త్రీ సాన్నిహిత్యాన్ని ఆకాంక్షించటం ఆరంభించాడు.

మన్మథుడు 'తన నేర్పులతో నొక్క పల్లవాధరన్/ రమణి బయోజగంధి గొని రాదు గదా నన్ను జేర' అని '..దేవతల గెల్వదలపడు ధీరమతిని నాదు కోర్కుల దీర్చుటన్యాయమగునె?' అని ప్రకృతి తనలో రేపుతున్న సంచలనాలకు మన్మథుడి కారణంగా భావించి మన్మథుడే తనకు ఒక నెచ్చెలిని తెచ్చి ఇస్తే బాగుంటుంది అని భావించాడు. అంతలో అటుగా వెళుతున్న రంభను చూశాడు. కవి రంభ సౌందర్యాన్ని అందంగా వర్ణించాడు. ఆమె సౌందర్యం కవిలో శ్రీనాథుడి కవితా సౌందర్యాన్ని గుర్తింప చేసింది. అందమైన అందంగా అలంకరించుకొని సాగుతున్న రంభను చూసి ఆకాశం అనుకొందట 'అస్తి నాస్తి విచికిత్స హేతు శాతోదరిన్/ దన శక్తిని గెలవంగ లేనని మదిన్ దర్కించె నాకాశమున్'. ఆకాశమైతే పిడికిటిలో దొరకదు అలాగే రంభ నడుము కూడా దొరకనంతటి సుకుమారంగా ఉందని వర్ణన. శ్రీహర్షుడి హస్తినాస్తి విచికిత్సహేతు శాతోదరి అనే పాదాన్ని శ్రీనాథుడు ఇష్టపడి అలాగే తెచ్చుకోవడం ప్రాచీన సాహిత్యంలో గుర్తించిన అంశం. అదే భావాన్ని అదే పాదాన్ని అలాగే తెచ్చి పెట్టుకొన్న కవికి శ్రీహర్షుడి పట్ల శ్రీనాథుడి పట్ల ఎంతటి ఇష్టం ఉందో అర్థం అవుతుంది.

ఆమె సౌందర్యాన్ని చూసి ఆమెను అడ్డగించి 'నీ కొరకెవ్వ దుగ్ర తప మర్థిన్ జేసెనో?... నీ సొగసు లంతో యింతో మాకు అందవో?' అని నిలువరింప చేశాడు. అతనిలోని పట్టుదలని గమనించింది రంభ. 'జవ్వనిన్ విడువ జూడని వాని మదాంధ వృత్తియున్' చూసి, తాను రంభనని, ఇంద్రుడి కొలువులో ఉంటానని నలకూబరుడిని సేవించటానికి వెళ్తున్నానని విన్నవించింది. రంభ రావణ సంభాషణ సుదీర్ఘమైన వాక్చాతుర్య ఫలితం. అందరూ రంభ సన్నిధిని ఆశిస్తుంటే ఆమె మరొకరి కోసం పరువులెత్తడం రావణుడికి ఆశ్చర్యంగా అసంగతంగా అనిపించింది. మునులు సోమపవ్రజము సన్యాసిగణము వీరుల కులము

'మింతలై మీదు భవనోప కంటములను

దిరిగి వేసారి నీ పైట చెరగు సోకి

నంత ధన్యులమని యెంతురంట;యిట్టి

నీవు రంభవు పరులకై పోవుటేమి!' అని ప్రశ్నించాడు. ఇంకా, తనను అనుగ్రహించమని తనకు ఈ అడవిలో ఇంక తోడు ఎవరని తన అదృష్టం కొద్దీ రంభ ఇక్కడికి వచ్చిందని అన్నాడు. 'నే బనసల్ జెప్పి గడించు పున్నెములు కుప్పల్వోసి యాచించెదన్' అని మనసుని తెలియజేశాడు.

ISSN No.2319-3905

వినయము భయము వివేచనము ముప్పిరిగొని రంభ తగు జాగ్రత్తగా అతడిని నిలువరించటానికి ప్రయత్నించింది.

'వల రాచవాని నెచ్చలి
నలకూబరు గోరి నడుచు నన్నాపకు మి
మ్మలరించి యించు వేడ్కల

వలపించెడు భాగ్య మబ్బ వలదా మాకున్' అనటం విని రావణుడు 'కనులు విప్పి కులంబు స్మరింపు మింత' ఆలోచన ఎందుకు అంటూ తనకు ఆశాభంగం కలిగించవద్దని అభ్యర్థించాడు. తన ఘనత ఆమె తనపై కరుణ చూపితే కలిగే సౌఖ్యాలు ఆపలేని మోహముతో చెప్తున్న అతని మాటలు విని అతడిని నయానో భయానో ఆపటం సాధ్యం కాదని గ్రహించిన రంభ 'ఉండినచో నుండక యేల యీ వలపు గొంటిన్, గంటినీపాట్లు! బ/ల్మిని నామానము వీటి బుచ్చకింక దాల్మిన్ వీడు పోనిచ్చునే' అని అనుకొంది. 'వీనికి లొంగిపోనిచో నవినయ మెంత సేయునో కదా! యెటులీ చెర బాయ నేర్తునో' అని పూర్ణ చంద్రుడు గుణోదారుడు నలుకూబరుడు 'నను బూర్ణ ప్రేమ రంజించు; నా బ్రతుకెల్లన్ చెడగొట్టి తద్భుజ పరిష్వంగ చ్యుతున్ జేయుదే?' అని తన దారిలో తనను వెళ్ళనివ్వమని కోరుకొంది. రావణుడు, తన మనసులో నినదించే విషయాలు రెండు అంటూ 'సాత్త్విక స్థాయిత నీశ్వరుం గొలిచి ధన్యత నొందుట రాజసంబునన్/ దీయని భోగముల్ గొనుట' తన ఆసక్తులన్నాడు. 'మిము మీ పోకల బోవ నీ వలయు నేమి?' అంటు తనతో భోగించమని అర్థించాడు. కవికి వసుచరిత్రకారుడు శుభమూర్తి పట్ల ఎంతో మక్కువ. వసుచరిత్రలో గిరిక ఏడ్చిన వైనాన్ని అందంగా వర్ణించాడు. దానిని ఇష్టపడిన రెడ్డిగారు కొంత మార్పుతో 'ఈ జాబిల్లి వెలుగు వెల్లువలలోని' అంటూ 'రాజీవానన'ను రమ్మని అలరించమని రావణుడు కోరటాన్ని చోపాడు. వాదోపవాదాలు అంగీకరింప చేసే ప్రయత్నాలు ఎన్నో జరిగాయి.

'అన విని, హావ భావ పులకాంకురవత్కి లికించితమ్ములన్
మొనసిన మేనితో నిలువు పూచిన తీవియవోలె రంభ సి
గ్గున దలవంచి చూపు మెరుగుల్ కడకన్నుల బర్వ రాక్ష
సేంద్రుని గనుగొంచు నిల్చె జివురుం బెదవిన్ మునిపంట నొక్కుచున్'

ఈ పద్యము కవి భావన చాతుర్యానికి నిదర్శనం. రంభ నలకూబరుడిపై మనస్సు పెట్టి వెళ్తున్న సందర్భం. రావణుడు ఆమెను చూసి తన కోర్కెని వెలువరించిన సందర్భం. రంభ పై రావణుడికి, నలకూబరుడిపై రంభకి ఉన్న మక్కువ మార్పు చెందిన తీరును ఈ పద్యం చూపిస్తుంది. దేవకన్య అయిన రంభ నలకూబరుడి వద్దకు వెళుతూ రావణుడి కోర్కెలను వద్దని చెబుతూ, తన ఘనతను అతను ప్రకటించుకుంటూ ఉంటే ఆయనని నిలవరించలేని అసహాయతలో క్రమంగా అతని వైపుకి తన మనసుని మళ్లించుకొన్న తీరుని ఇక్కడ చూపిస్తున్నాడు కవి. అంతవరకు

నలకూబరుడిని చేరాలి అని అనుకున్నా, అనివార్యంగా రావణుడిని అంగీకరించవలసిన స్థితిలో మనసుని అంగీకరింపచేసుకొంది అనే భావం ఈ పద్యంలో అర్థమవుతుంది. ఇది ఆమె పరోక్ష అంగీకారాన్ని వ్యక్త పరుస్తూ ఉంది. శారీరక అభినయం చూపు మెరుగుల్ కడకన్నుల బర్వ రాక్షసేంద్రుని గనుగొంచు నిల్చె' ఇలా ఓర చూపులతో రావణుడిని చూస్తూ ఉంది. అంతే కాదు 'చివురున్ పెదవిన్ మునిపంట నొక్కుచున్' నిల్చొంది. ఇవన్నీ మారిన ఆమె మనసుని రావణుడి కోర్కె పట్ల అంగీకారాన్ని వ్యక్తం చేస్తున్న స్థితి. ఈ రెండు సందర్భాలలో రెండు పాత్రల పట్ల ఔచిత్యంతో రచన కనిపించడాన్ని గుర్తించవచ్చు. రంభ మూర్ఖపు పట్టుదలగా ఆపై నిష్టూరంగా నలకూబరుడితో చెప్పే పరిస్థితిని కాదు కవి చిత్రించింది. తన అభిమతాన్ని స్పష్టంగా చెబుతూ భయపడుతూ వినయంతో ఉంటూ తప్పనిసరి పరిస్థితులకు అంగీకరించవలసి వస్తూ ఉన్నటువంటి పాత్ర గమనాన్ని అద్భుతంగా చిత్రించాడు కవి. అలాగే రావణాసురుడు అంత బల సంపన్నుడు యుద్ధ వీరుడు తానెంత ఘనుడో చెప్పుకుంటూ వస్తూనే ఆమెని తన మాటలతో నయానో భయానో తనకు అంగీకరింప చేసుకోవాలి అనే తపనతో సంభాషించడాన్ని గుర్తించవచ్చు. ఎక్కడా తన బలపరాక్రమాలను ఆమెను వశం చేసుకోవడానికి వినియోగించినట్టుగా కవి చిత్రించలేదు. రావణుడి పాత్ర పట్ల ఎంత రాక్షసేంద్రుడైన రాక్షస బలిమిని ప్రదర్శించకపోవడం కవి కల్పన. రంభ అనివార్యమై అంగీకరించటం అది ఇష్టపూర్వకంగా అంగీకరించటం కవి కల్పన. ఈ రెండు చోట్ల ఈ రెండు పాత్రలని ఔచిత్యవంతంగా కవి చిత్రించాడు. పాత్రల సమన్వయంలో వస్తువుని నిర్వహించడంలో కవి చూపిన చాతురి కావాన్ని గౌరవప్రదం చేసింది.

4. మేనక రంభ రెండు ఖండకవ్యాలు కథాపరమైన ఘనతను చెప్తూనే పాత్రలను సంస్కారవంతంగా చూపుతూ ఏ పాత్రనూ తేలిక భావంతో చూడకుండా ఉంటూ ఔచిత్యవంతమైన సంభాషణలని పెడుతూ కథను నిర్వహించిన తీరు విశేషంగా పాఠకులను ఆకట్టుకొంటుంది. ఇది వారి రచనా సౌందర్యాన్ని రచన సామర్థ్యాన్ని చూపటం మాత్రమే కాదు ఏ పాత్రనైనా ఒక ప్రత్యేకమైన స్థితిలో స్థాయిలో ఉంచి చూడటం స్త్రీ పాత్రలని నీచంగా హేళనగా చూడకపోగా వారి హృదయ ఔనత్యాన్ని ప్రదర్శించడం ప్రేమైక జీవులుగా వారిని చూపించటంలో కవి కృతకృతులయ్యారు. ఈ రెండు కావ్యాలు వారి రచనా గరిమకు నికషోఫలాలు.

ISSN No.2319-3905

2

తెలంగాణ భాషపై ద్రవిడ భాషల ప్రభావం

– ఆచార్య సూర్య ధనుంజయ్

మనిషి అస్తిత్వాన్ని జగతికి పరిచయం చేసేది భాష. మానవీయ భావాల వ్యాప్తికి భాషయే మాధ్యమకారిణి. ఆ భాష ఒక జాతిని ఇతర జాతులతో సంబంధ బాంధవ్యాలు నెరిపేలా చేసింది. ప్రపంచం రాజ్యాలుగా, దేశాలుగా మారకముందు జాతులు జీవనంకోసం సంచారం సాగించాయి. ఆ క్రమంలో ఆయా ప్రాంతాల వాక్ పరిమళమైన భాష కూడా ప్రయాణం చేసి మరో ప్రాంతానికి చేరుకుంది. ఈ పరిణామ క్రమం కొంతకాలం కొనసాగి స్థిరజీవనం ఏర్పడ్డాక కొంత సీమిత ప్రాంతాలకు, దేశాలకు పరిమితమై స్థిరపడింది.

ఆక్రమంలో భారతదేశానికి అనేక భాషలు తరలివచ్చాయి. స్థానిక భాషల సరసన వాటి స్థానాన్ని అవి నిలబెట్టుకున్నాయి. భాషా శాస్త్రవేత్తలు నిర్ణయించిన ఏకరూపతతో అవి నాలుగు కుటుంబాలుగా విభజింపబడ్డాయి. అవి ఇండోఆర్యన్, టిబెటో బర్మన్, ఆస్ట్రో ఏషియాటిక్, ద్రవిడ భాషాకుటుంబాలు. మిగితా కుటుంబాల భాషలు ద్రవిడ భాషలను ఎంత ప్రభావితం చేసినా అవి అంతగా ప్రభావితం కాక తనదైన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నాయి. అందుకే ద్రవిడ భాషా కుటుంబం నేటికి పదిలంగా ఉంది.

జంబూద్వీపంగా అనాదిగా పిలవబడుతున్నదీ భారతదేశం. ఈ దేశానికి తనదైన నాగరికత, సంస్కృతీ, సంప్రదాయాలు, భాషలు ఉన్నాయి. గంగా సింధూ మైదానంలో జీవనం ప్రారంభం కాకముందు దక్షిణ భారతదేశంలోని వివిధ జాతులు మాట్లాడే భాష వైవిధ్యంతో మనుగడ సాగించింది. ఈ భాషా భిన్నత్వం కలిగిన జాతులు మాట్లాడే భాషలన్నింటిని ఒకదగ్గర కుప్పపోస్తే ఏర్పడ్డదే ద్రవిడ భాష. ఉత్తర దక్షిణ భారతాలుగా విభాజితమై భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించే భారతదేశంలో దక్షిణ భారత ప్రజలు మాట్లాడే భాషలన్నింటిని కలిపి ద్రవిడ భాషా కుటుంబమని, ఇక్కడ వాసంచేసే ప్రజలను ద్రవిడులని పిలుస్తారు.

ఈ ద్రవిడ భాషా కుటుంబంలోని భాషలు కొన్ని క్రమేపి నర్మదా తపతి నదుల సానువుల గుండా సంచారులతో ప్రయాణం సాగించి నేటి సింధులోయలో కొంతకాలం వైభవాన్ని

చవిచూశాయి. ఈ ప్రయాణంలో ద్రవిడ భాషలు నేటిమధ్య భారతం నుండి ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, మలేషియా, జావా, సింగపూర్ దాకా విస్తరించాయి. అందుకనే ఈ భాషా కుటుంబం చాలా పెద్దది. ఇది మూడు ఉప కుటుంబాలుగా విభజింపబడింది.

అందులో దక్షిణ ద్రవిడ,దక్షిణ మధ్య ద్రవిడ, మధ్య ద్రవిడ , ఉత్తర ద్రవిడ భాషా కుటుంబాలు ఉన్నాయి. ఈ ఉప కుటుంబాల్లోని దక్షిణ మధ్య ద్రవిడ భాషా కుటుంబంలో తెలుగుభాషకు స్థానం లభించింది. ఈ తెలుగుభాష మాట్లాడే ప్రాంతాలలో మాండలికాల రూపంలో వైవిధ్యాన్ని కల్గి ఉంది.తెలంగాణలో మాట్లాడే తెలుగుభాష మాండలికం మిగితా ప్రాంతాలతో పోల్చుకుంటే అచ్చతెలుగుకు దగ్గరగా ఉంటుంది. అందుకే స్వరాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ మాట్లాడే భాషను తెలంగాణ భాష అని ప్రత్యేకంగా పిలుస్తున్నారు.

ద్రవిడ శబ్ద వివరణ:

ద్రవిడ శబ్దం ఆవిర్భావాన్ని పరిశీలిస్తే ద్రవిడమనే పదానికి పూర్వరూపము ద్రమిళమని తెలుస్తుంది. ఈ పదం సంస్కృతంలో ద్రవిడంగా పిలవబడింది. అతి ప్రాచీనతను కల్గిన ప్రాకృత భాష మాట్లాడేవారు దాక్షిణాత్యుల భాషను వారు పాటించే ధర్మాచరణను బట్టి ద్రమిళ, ద్రవిడ, తిరిమిళ, తమిళ అని పిలిచారు. ధర్మమును త్రికరణ శుద్ధిగా పాటించేవారు కనుక వింధ్యాచల పర్వతాలకు ఆవల సహ్యాద్రికి కిందివైపున జీవనం సాగించే ప్రజలను ధర్మికులని పిలిచేవారు. ఆ ధర్మికమనే పిలుపే తుదకు కాలాంతరంలో ద్రమిళమని, ద్రవిడమని పిలవబడింది. ఈ ప్రాంత ప్రజలు మాట్లాడే భాషలను అన్నింటిని కలిపి భాషా శాస్త్రవేత్తలు ద్రవిడ భాషా కుటుంబంగా పిలిచారు.

ద్రవిడ భాషా కుటుంబంలో ఉన్న నాల్గు ఉప కుటుంబాల్లో మొదటిదైన దక్షిణ ద్రావిడంలో కన్నడ, మలయాళం, తమిళం, బడగ, తొడ, తుళు, కొడగు, కొరగ, కొడగు, ఇరళ మొదలగు భాషలుంటే, మధ్య దక్షిణ ద్రవిడంలో తెలుగు, అబుజ్, గోండి, కుయి, కొండ, మండ, పెంగో, కువి వంటి భాషలున్నాయి. మధ్యద్రవిడంలో కొలామి, నాయకి, పర్జి, గదబ, ఒల్లారి వంటి భాషలు చోటుచేసుకున్నాయి. ఇక కడపటిదైన ఉత్తర ద్రవిడంలో బ్రాహుయి, కుదుక్, మాల్తో వంటి భాషలున్నాయి. ఈ భాషలన్నీ వివిధ ఉపశాఖల్లో బందించబడినా వాటన్నింటి ప్రభావం ఒకదానిమీద ఒకటి కల్గి ఉంటాయి అని చెప్పవచ్చు.

మూల ఘటిక కేతన తను రాసిన 'ఆంధ్ర భాషా భూషణము'అను గ్రంథంలో......

"తల్లి సంస్కృతంబు ఎల్ల భాషలకు/దానివలన కొంత కానబడియె

గొంత తాన గలిగి అంతయు నేకమై / తెనుగు బాస నాగ వినుతికెక్కె"

అంటే, వినుకొండ వల్లభరాయడు క్రీడాభిరామంలో ....

ISSN No.2319-3905

"జనని సంస్కృతంబు సకల భాషలకును / దేశభాషలందు తెలుగు లెస్స" అని అన్నాడు.

ఈ రెండు వాదనల నుండి భాషా శాస్త్రవేత్తలు ద్రావిడభాషలను బయటపడేసి వాటికి ఉన్న సహజ స్వతంత్రతను, తమదైన మనుగడను ప్రపంచం ముందుంచారు. ద్రవిడ భాషలు సంస్కృతం నుండి ఉద్భవించలేదని తొలిసారిగా బ్రిటీష్ సివిల్ సర్వెంట్, భాషావేత్త ఫ్రాన్సిస్ వైట్ ఎల్లీస్ అనే భాషా శాస్త్రవేత్త పరిశోధనాత్మకంగా తెలియజేశారు. దక్షిణాది భాషలకు ద్రవిడ భాషలనే నామాన్ని కూడా ఆయనే పెట్టి ఒక కుటుంబంగా ఏర్పడేందుకు దోహదం చేశాడు. రాస్మన్ రాస్క్ అనే భాషావేత్త ద్రవిడ భాషల్ని మలబారిక్ భాషలన్నాడు. బహుశా ఆయన కేరళ ప్రాంతంలో ఎక్కువకాలం సంచరించి ఉంటాడు. అందుకే ఇక్కడి భాషల్ని మలబారిక్ భాషలన్నాడు.కాని రాబర్ట్ బిషప్ కాల్వెల్డ్ఈ భాషలన్నింటిని కలిపి ద్రవిడ భాషా కుటుంబంగా పేర్కొన్నాడు.

వ్యాస మహాభారతం సభాపర్వం, 31వ అధ్యాయంలోని 71వ శ్లోకంలో దక్షిణ భారతంలో ఉన్న ప్రాంతాలను ......

"పాండ్యా0శ్చ ద్రవిడాంశ్చైవ సహితం శ్చోద్ర కేరళ:/అంధ్రాం స్తాలవనాంశ్చైవ కళింగా నుష్ట్ర కర్ణికాన్"

అంటూ వర్ణిస్తుంది. అలాగే స్కంద పురాణం.......

"కర్ణాటా శ్చైవ త్రైలింగ ఘూర్జర రాష్ట్ర వాసిన / ద్రావిడా: ద్రావిడా: పంచ వింధ్య దక్షిణ వాసిన"

అంటూ దక్షిణాన ఉన్న ప్రాంతాలను అన్నింటిని కలిపి ద్రవిడ దేశంగా అక్కడి ప్రజలను ద్రవిడులుగా చెప్తుంది. కాల్వెల్డ్ దొర తన 'కంపారిటివ్ గ్రామర్ ఆఫ్ ద్రవిడియన్ లాంగ్వేజెస్' గ్రంథ పీఠికలో

"ఐతిహాసిక యుగమునకు బూర్వపు టజ్ఞాన యుగము నుండియూ ద్రావిడులు హిందూ దేశములో నున్నను నంతకుముందటి ఏదో కాలమున ద్రావిడులు మధ్యాసియాలో(సెంట్రల్ ఏషియా) నుండి యుండవలయునని చెప్పక తీరదు. ఎల్లజాతుల వారును నచటి నుండి వ్యాపించిన వారే కదా! ద్రావిడులు మధ్యాసియాలోని యార్యుల తోడను, తురేనీయుల(సిథియన్స్) తోడను వీడి వచ్చుచు బెలుచిస్తానమున నొకచో కొంతకాలము నుపనివేశనము నేర్పరుచుకునిరి. అచట గొందరు నిలువగా గొందరిండియాకు వచ్చిరి"

–(కాల్వెల్డ్ పీఠిక 67), (వఝ్జల చినసీతారామయ్యశాస్త్రి–ద్రావిడభాషా పరిశీలనము, మొదటి సంపుటము,పుట. 10)

అంటూ కాల్వెల్డ్ తన వాదమును తెలిపాడు. ఆఫ్ఘానిస్తాన్, బెలూచిస్తాన్ లో మాట్లాడే ద్రవిడ భాష అయిన బ్రాహుయి భాష ఈ వాదానికి బలాన్ని అందిస్తున్నది. కాలాంతరంలో

దక్షిణ దేశానికి తరలిన ఈ ప్రజల భాషలు వేటికవే ప్రాచీనమని కూడా కాల్వెల్డ్ మహాశయుడు ఉద్ఘాటించాడు.

గ్రీయర్సన్ "The Pisaca Languages Of North- Western India" అను గ్రంథంలో భారతదేశానికి ఈశాన్యంలో, పశ్చిమోత్తర ప్రాంతాలలో పైశాచిక జాతుల వారున్నారని చెప్పారు. వారు మాట్లాడే భాషలే మూల ద్రవిడ భాషలైనాయని ఆయనకు తోచినట్టు ఈ గ్రంథం వల్ల మనకు స్పష్టమవుతుంది. చిలుకూరు నారాయణరావు గారు కూడా పైశాచి ప్రాకృతము నుండి ద్రవిడ భాషలు ఉద్భవించాయన్న వాదాన్ని అవలంభిచినట్టుగా వజల సీతారామయ్య గారు తన గ్రంథంలో వివరించారు. ఏది ఏమైనా భారతదేశంలో ఉన్న మిగితాభాషా కుంటుంబాలకు ద్రవిడ భాషాకుటుంబానికి భిన్నత్వం ఉన్నది. సంస్కృత భాష, దానిని అనుసరించి ఏర్పడ్డ ఇతర భాషలకు ద్రవిడ భాషలకు ఎటువంటి సంబంధం లేదని భాషా శాస్త్రవేత్తలు నిర్ణయం చేశారు.

తెనుగు, తెలుగు, తెలంగాణ భాష:

'తెన్' అనగా దక్షిణ దిక్కు అని అర్థం. తెనుంగు, తెనుగు అను ఈ రెండు రూపాలు మొదట నన్నయ ఆంధ్రీకరించిన మహాభారతంలో గ్రంథస్థమై కనిపించాయి. ధ్వని పరిణామాన్ని బట్టి చూస్తే హ్రస్వం మీద పూర్ణ బిందువుకు లోపం విభాషగా ఉండడం వల్ల ఈ రెండు రూపాలు కావ్య భాషలో ఏర్పడ్డాయని భాషా పండితులు తెలియజేశారు.

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో/నారసి మేలు నా నితరు లక్షర రమ్యత నాదరింప నా /నారుచిరార్థ సూక్తి నిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా/భారత సంహితా రచనబందురుడయ్యె జగద్ధితంబుగన్"

ఈ పద్యంలో నన్నయ తెలుగుకు బదులు తెనుగు అనే మాట భాషకు వాడడం మనం చూడవచ్చు. భాషావేత్తల ప్రకారం ఆంధ్ర భాష, తెనుగు భాష వేరువేరు అన్నది స్పష్టం. తెనుంగుకు వర్ణములు 36, ఆంధ్రమునకు 56 అన్నది అందరికి విదితమే. చరిత్రకారుల ప్రకారం ఆంధ్రులు ఉత్తరాది నుండి వలస వచ్చిన వారుగా చెప్పబడ్డారు. కాలాంతరంలో వారు ఇక్కడి ప్రాంతీయుల భాషను తమదిగా చేసుకొని వర్ణముల సంఖ్యను పెంచి ఉండవచ్చు.

కాని తెలంగాణలో నేటికి 'తెనుగు కులం' అనే ప్రత్యేక కులం వారు ఉన్నారు. వారినే నేడు ముదిరాజులుగా పిలవడం మనం గమనించవచ్చు. ఆ జాతివారు దక్షిణ దిక్కులో నివసించడం మూలాన వారు నివసిస్తున్న ఈ ప్రాంతం 'తెన్' అని పిలవబడి ఉండవచ్చేమో? ఈతెనుగు క్రమేపి 'తెలంగ్' గా తెలుంగు గా, తెలుగుగా పరిణామం చెందడం వల్ల ఇక్కడి ప్రజల భాష తెలుగు అని పిలవబడింది. నేటికి 'తెలంగే భేడంగే' అని ఉత్తరాది వారు తెలంగాణ వారిని అనడం మనం గమనించవచ్చు. తెనుగు భాష, ఆంధ్ర భాషల వర్ణాల సంఖ్య విషయంలోనూ బేధాన్ని స్పష్టంగా చూడవచ్చు. కావున తెనుగు అనేది తెలంగులు మాట్లాడే భాషగా, తెలంగాణవారు మాట్లాడే

భాషగా అనుకోవచ్చు. ఈ విధంగా ఒక వర్గం వారు మాట్లాడే భాష అయిన తెనుగు కాలాంతరంలో తెనుగు నుండి తెలుగుగా మారి ఉండవచ్చు. ఈ దిశగా పరిశోధన కొనసాగితే నిజాలు నిగ్గు తేలవచ్చు.

శబ్ద దిగర్థమున్నద్రావిడ పదాంశంగా తెలుగు భాషలో 'తెన్' అనే శబ్దం వ్యవహారం నుండి తొలగిపోయింది (భద్రిరాజు కృష్ణమూర్తి,తెలుగు భాషా చరిత్ర, పుట06) భాషా పరిణామక్రమంలో మార్పులు జరిగి రూపురేఖలు మారినట్టుగా మనకిక్కడ అర్థమవుతుంది.

తెలంగాణ భాష విషయానికి వస్తే పద ప్రయోగం దృష్ట్యా, సంబోధనల దృష్ట్యా, వాచికత దృష్ట్యా ఆంధ్రరాష్ట్ర ప్రజలు మాట్లాడే భాషకు భిన్నంగా ఉంటుంది. అన్నింటా ఒక ప్రత్యేకతను కల్గి ఉండడం చేత నేడు ఇక్కడి ప్రజల భాషను తెలంగాణ భాష అని పిలుస్తున్నారు. తెలుగు భాష మాట్లాడే ప్రాంతంగా మొదటినుండే చారిత్రకంగా పేరున్న నేల తెలంగాణ. శాతవాహనుల కాలం కంటే ముందు నుండే ఇక్కడ తెనుగు జాతి నివసిస్తున్నది. షోడశ మహా జనపదాల్లో అస్మక దేశంగా, మంజీరక దేశంగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్గి ఉన్న నేల ఇది. ఇక్ష్వాకులు, చాళుక్యులు, కాకతీయులు, విష్ణుకుండినులు, అసఫ్జాహిలు, కుతుబ్షాహీలు ఈ నేలను మూల కేంద్రంగా చేసుకొని పాలన కొనసాగించారు. హాలుడు ఈ నేలమీదనే తన గాథా సప్తశతిని విరచించాడు. అందులో ఎన్నో తెలంగాణ పదాలు కనిపిస్తాయి. ఈ నేలమీద ఉన్న బొమ్మలమ్మ గుట్ట ఇచ్చిన శాసనమే తెలుగు భాషకు ప్రాచీన హోదాను అందించిందన్నది అక్షరసత్యం.

ఈ నేలమీద మాట్లాడే భాషపై ద్రవిడ భాషలైన కన్నడం, తమిళం, గోండి, కోలామి వంటి భాషల ప్రభావం ముఖ్యంగా కనిపిస్తుంది. భౌగోళికంగా కన్నడ ప్రాంతం ఒకప్పుడు ఒకే పాలనా ఛత్ర ఛాయలో ఉండడం, ఇక్కడి కవులు తెలుగుతో పాటు కన్నడ రచనలు చేయడం సాహిత్య చరిత్రలలో కనిపిస్తాయి. పాల్కురికి సోమనాథుడు తెలుగు కన్నడ రచనలు చేసి ఇరు ప్రాంతాల ప్రజల హృదయాలను ముడివేశాడు. కన్నడ ఆదికవి పంపడు వేములవాడ ప్రాంతంలో ఉండి తన సాహితీధారను లోకానికి అందించాడు. అస్మక రాజ్య రాజధాని అయిన బోధన్ నగరం ఒకప్పుడు కన్నడ కవులకు ఆవాసంగా ఉన్నట్టు చరిత్ర చెబుతుంది. ఈ రకంగా కన్నడ భాష తెలంగాణ తెలుగుపై ఎంతో ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

తెలంగాణ భాషపై – కన్నడ భాషా ప్రభావం:

తెలంగాణ భాషపై–కన్నడ భాష ప్రభావాన్ని ఇక్కడి ప్రజలు వాడే పదజాలాన్ని, ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాల ఆధారంగా ఆధార సహితంగా చూపవచ్చు. ముఖ్యంగా కర్ణాటకతో సరిహద్దుల్ని పంచుకుంటున్న ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నిజామాబాద్ వాసుల భాషలో ఈ ప్రభావాన్ని దర్శించవచ్చు. సామాన్య వ్యవహారంలో ఉపయోగించే పదజాలంలో,

బందువాచకాల్లో , యథాతథ పద స్వీకరణలో,అర్థ సామ్యత విషయంలో, వాక్య ప్రయోగంలో ఈ ప్రభావాన్ని చూడవచ్చు.

ఉమ్మడి మహబూబ్ నగర్ లోని కొన్ని ప్రాంతాల ప్రజలు తమ సంభాషణల్లో వీధులను 'కేర్లు' అని పిలుస్తారు. 'కెరెయ్' అన్నది కన్నడంలో పల్లెకు పర్యాయపదం. అలాగే 'హల్లి' అంటే కూడాపల్లె అనే అర్థాన్ని సూచిస్తుంది. ఈ కెరెయ్ అన్నది కాలక్రమంలో పల్లెల్లోని వీధులను సంబోధించే పదంగా మారినట్టు కనిపిస్తుంది. అదే మహబూబ్ నగర్ జిల్లాలో కనిపిస్తుంది.

పిండివంటలను 'అప్పచ్చి' అని పిలుస్తారు. 'అప్పాలు గారెలు' అన్నది ఇక్కడ పిండివంటలకు మారుపేరుగా కన్నడంలో వాడబడే 'అప్పచ్చి' అన్నది స్థిరపడినట్టుగా తెలుస్తుంది. 'ఉప్పిట్టి' అనే పదాన్ని ఉప్మాకు బదులుగా, 'చౌళేకాయ' అనే పదాన్ని గోకరకాయకు, బెండకాయకు 'బెండేకాయ'అని, బీరకాయకు 'బీరేకాయ'అని,'బేకు' అన్నది 'కావాలి' అని అవసరాన్ని ప్రకటించడానికి నేటికి పాలమూరు ప్రజలు వాడుతున్నారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్, నారాయణపేట వాసులు ఈ పదాలను ఉపయోగిస్తారు. అప్పాలు అన్న పదం తెలంగాణలో చేసే పిండివంటకు వాడుతారు. అప్పచ్చి అనే పదం వైభక్తికమై అప్పాలు అని పలకబడం, బీరేకాయ అన్నదాంట్లో ఏత్వం ఎగిరిపోయి బీరకాయగా పలకడంగా గమనించవచ్చు.

'త్వరగా రా' అనడానికి 'బేగి బన్ని' అంటారు కన్నడీగులు. పాలమూరు వాసులే కాదు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి వంటి జిల్లాల వారు కూడా ఈ 'బేగి' అన్న పదాన్ని త్వరగా అనడానికి బదులుగా వాడుతున్నారు. తాకట్టును 'జగ్గి'అని, అలాగే అని ప్రతి సమాధానమివ్వడానికి పలికే 'అలాగే'అన్నదాన్ని 'హాగే' అని, తెలుసు అనడానికి 'గొత్తు'అని, కబురును 'సుద్ది' అని, చిలుముపట్టింది అనడానికి 'కిలుం'పట్టింది అని, పొద్దు పొద్దున్నే అనడానికి పలికే 'మస్కుమస్కునే' అనే పదాన్ని 'నస్కునస్కులే' అని, డబ్బులను 'దుడ్లు' అని పాలమూరు వాళ్ళు వాడడం గమనించవచ్చు.

ప్రజలందరూ అనడానికి వాడే 'ప్రజలెల్ల' అనడంలోని 'ఎల్ల'అనే పదం కన్నడం నుండి వచ్చిచేరింది. 'ఎల్ల జనగళు బందే' ప్రజలందరూ వచ్చారు అనడానికి కన్నడంలో వాడబడే వాక్యం అది. అందులో ఉన్న మొదటి పదం తెలంగాణ తెలుగు భాషలో చాలా చోట్ల మనం చూడవచ్చు.

ఉదా: ఎల్లలోకాలు అనే పదంలో ఎల్ల, ఊరెల్లా లోని ఎల్ల, నిలువెల్ల లోని ఎల్ల, బయలుంఎల్ల= బయలెల్ల, బయలెల్లింది మొదలగువాటిలో చోటుచేసుకున్న 'ఎల్ల' అనే పదం తెలంగాణ భాషపై కన్నడ భాష ప్రభావాన్ని చూపకనే చూపుతుంది.

పెనాన్ని పెంకను పెంకే/పెంచు అని, బడిని 'సాలె' అని, బిగ్గరగా అనడానికి 'లగ్గి'అని పిలుస్తున్నారు పాలమూరు, ఉమ్మడి రంగారెడ్డిలోని కొన్ని ప్రాంతాల ప్రజలు. 'లగ్గాంచి' అని

బలంగా అనడానికి బదులు తెలంగాణ ప్రజలు వాడడం మనకు తెలుసు. ఈ పదం 'లగ్గి' అనే కన్నడ పదం నుండి వచ్చి మార్పుచెందినట్టు కనిపిస్తుంది. పాఠశాలను 'సాలె' అనడం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ లలోనూ గమనించవచ్చు. 'శాల' అనేమాటకు ప్రాంగణం అనే అర్థమున్నది. అదే మాట జ్ఞానకేంద్రమైన బడికి వాడడం జరుగుతుంది. 'శాల' అనేది మార్పుచెంది 'సాల'గా పిలవబడడంగా గుర్తించవచ్చు.

సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన పదాల్లో వియ్యంకున్ని 'బీగుడు', వియ్యపురాలిని 'బీగురాలు' అయ్యను 'అప్ప'గాను, అన్నను 'అన్న' తమ్ముడిని 'తమ్మా' భర్తను 'గండదు' అని, చిన్నాన్నను 'చిత్తప్ప' అని పాలమూరు, నాగర్ కర్నూల్, నారాయణపేట, నారాయణ్ ఖేడ్, తాండూర్ ప్రాంతాల్లో పిలుచుకోవడం చూడవచ్చు.

'మట్టి పిసుకు' అన్న పదం కన్నడంలో 'మన్ను హిసుకు' అనే మాటగా వాడతారు. ఈ మాటలోని 'మన్ను' అన్నది మట్టికి బదులుగా తెలంగాణలో అధికంగా వాడబడుతున్న పదం. ఇక పిసుకు అన్నది 'హ' కార రూపమెత్తి స్వల్ప భేదంతో 'హిసుకు' అని పిలువబడుతున్నది. మూల ద్రావిడంలోని 'ప' తెలుగులో 'హ'కారంలోకి పరిణామంచెందడం చూడవచ్చు. ఇటువంటిదే ఇంకొకటి 'పాలు'. పాలను కన్నడంలో"హాలు'అంటారు. దీనిలో కూడా పై సంబంధమైన మార్పు జరగకపోవడాన్ని చూస్తాం. గాథా సప్తశతిలో చెప్పబడ్డ అయ్య, అత్త, రాతిరి(రత్తి) తెలుగు పదాలు కన్నడంలోనూ వాడుతారు.

ఇదే గాథా సప్తశతిలో .....

"తడసంఠిఅ ణీడే క్కం/తపీలుఆ రక?ణేక్క దిన్ణమణా / అగణి విణి వాభయా / పూరేణ సమం వహఇ కాఈ" (గాథా సప్తశతి మాణస్స2-2)

అనే పద్యంలో 'పీలుఅ' అనే మాటకు కాబక: అని అర్థం. అంటే పిల్ల అని కులబాలదేవుడు అర్థం చెప్పాడు. పిళ్ళై, పిళ్ళే, పిన్న అనేటటువంటి తమిళ, కర్నాట శబ్దాలు పిల్ల, పిలుక అనే శబ్దాలకు సమానార్థకాలుగా వాడబడుతున్నాయి. పిల్ల అన్న పదం తెలంగాణలో అధికంగా వాడుతారు.

ఉదా: పెండ్లిపిల్ల, పెండ్లి పిల్లగాడు, పెద్దింటి పిల్ల, బద్మాష్ పిల్ల.

మరొక దగ్గర.....

"హ్హాణ హలిద్దా భరిఅం/ తరాఇ జాలాఇ జాలవల అస్స /సోహంచి కిలించిఅకం / టఏణ కం కాహిసీ కఅత్థ0" (గాథా సప్తశతి మాణస్స2-2)

అనే పద్యంలో 'కిలించిఅ' అనే శబ్దానికి పాఠా0తరంగా గ్రహించిన 'కిలించిఅ' పదానికి 'సూక్ష్మం' అని అర్థమని వ్యాఖ్యాతలు నిర్ణయించారు. ఇదే పదానికి సన్నని, నీచమైన, క్రించు,

కించు అని తెలుగులో కూడా అర్థం ఇవ్వడం జరిగింది. తమిళ, కన్నడ భాషలలోని కిళి,కిళ్, కిళి0జల్ అనే శబ్దాలకు సన్నని, సన్నగా, చేయు, చించు, విని, విను అనే సమాన అర్థాలు కనబడతాయి.

వేములవాడను పాలించిన అరికేసరి అనే చాళుక్యరాజు కన్నడ ఆదికవిగా విఖ్యాతి గాంచిన పంప మహాకవి రాసిన విక్రమార్జున విజయాన్ని అంకితం తీసుకొని అతనికి నేటి ధర్మపురిని దానంగా ఇచ్చాడు. ఈ కారణంగా పంప మహాకవి తన పరివారంతో తెలంగాణ మాగాణంలోనే నివసించాడు. అతని తమ్ముడు జినవల్లభుడు తెలుగు, కన్నడ పండితుడు. అతడు వేయించిన బొమ్మలమ్మ గుట్ట (కుర్క్యాల శాసనం) శాసనంలో తెలుగు, కన్నడం, సంస్కృత పదాలు తారసపడ్డాయి. ఈ శాసనమే తెలుగు భాషకు ప్రాచీన హోదాను అందించింది.

ఇరు భాషల్లో సమానంగా వాడే పదాలను గమనిస్తే లోట, గబ్బు, అంగి, అమ్మ, అక్క అన్న, గుంపు, తప్పు, దారి, ఒప్పుకో, కట్టు, ఉప్పు, సుట్టుముట్టు, కత్తి, తాత, అవ్వ, కోతి, ఐదు, అడవి, గుడి, జిడ్డు, జాస్తి మొదలైన పదాలు కనబడుతాయి. మెదక్ జిల్లాలోని నారాయణ్ ఖేడ్ ప్రాంతం, నిజామాబాద్ లోని కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో నేటికి కన్నడ పదాల మేళవింపుతో కూడిన పసందైన భాషను, వేషభుషణాదులను, ఆరాధనా పద్ధతులను, సంస్కృతీ సంప్రదాయాలను గమనించవచ్చు.

తాలవ్యీకరణం చెందిన పదాల్లో కిలుము అన్నదాన్ని (చిలుము), కెవి (చెవి), కేళి (వినుము), కెంపు (ఎరుపు),హులి(పులి),హుత్త(పుట్ట), హణ(పణ),హల్లు(పల్లు), హెట్టు(పెట్టు), హేడి (పేడి)హళ్లి (పల్లె)వంటివి పాలమూరు తదితర సరిహద్దు ప్రాంతాల్లో వాడుతున్నారు.

మూల ద్రవిడం	కన్నడం	తెలుగు	తెలంగాణ తెలుగు
చిక్కు	చిరుతె	చిరుత	సిరుత
చిమ్ము	చిమ్ము	చిమ్ము	సిమ్ము
చుక్కయ్	చుక్కె	చుక్క	సుక్క
చు్రయ్	సుత్త	చుట్ట	సుట్ట
కోరి	కోళి	కోడి	కోడి
కాళమ్	గాళమ్	గాలమ్	గాలమ్

ఇలా పదాలు మూలద్రవిడం నుండి కన్నడ, తెలుగు భాషల్లో తమదైన మార్పుతో పలకబడుతున్నాయి. తెలుగుభాష లోకి వచ్చేటప్పటికి ఏత్వం రాలిపోయి అకారాంత, ఉకారాంత పదాలు చోటుచేసుకుంటున్నాయి. పదాలు కన్నడ, తెలుగు భాషల్లోనూ 'చ'కారం తోనే మొదలయ్యాయి. పదాంతాలు మాత్రం పై భాషల్లో స్వల్ప స్వరభేదంతో పలకబడుతూ సహజాత

ISSN No.2319-3905

పదాలుగా తమ సోదరత్వాన్ని కనబరుస్తున్నాయి. తెలంగాణ మాండలికంలోకి వచ్చేసరికి పదాది 'చ' కారం 'స' కారంగా మారడాన్ని చూడవచ్చు.

ఈ విధంగా ఎంతో పదసంపద ఇరుభాషల్లో తారసపడుతుంది. కనుక కన్నడ తెలుగు భాషలు ఒకే తల్లికి పుట్టిన అన్నదమ్ముల్లా! అన్నట్టు అడుగడుగునా ఒకదాని ప్రభావాన్ని ఇంకో దానిమీద కనబరుస్తూనే ఉంటాయి.

తెలంగాణ భాష-తమిళభాష :

ద్రవిడ భాషా కుటుంబంలో ఒకటైన మధ్య ద్రవిడ భాషా కుటుంబంలో స్థానం పొందిన తెలుగుభాషను ప్రాంతీయంగా ఒక నియంత్రిత భౌగోళిక సరిహద్దులకు పరిమితం చేసినా మనుషుల సంచారాన్ని ఈ సంచారం మూలానా, పాలనా పరంగా కలిగే ఆదాన ప్రదానతలను ఎవ్వరూ నియంత్రించలేరు. ఈ క్రమంలో ఒకభాషపై మరొక భాష ప్రభావం అనేది ఖచ్చితంగా ఉంటుంది. అదే విధంగా తెలుగు భాషపై కన్నడ భాష వలెనే తమిళ భాష ప్రభావం కూడా కనబడుతుంది. ఈ ప్రభావాన్ని సూక్ష్మంగా గమనిస్తే అర్థం చేసుకోగలము. తెలంగాణ భాషావేత్త, బహుభాషా కారుడు డా. నలిమెల భాస్కర్ గారు తెలంగాణ భాషపై తమిళ భాషా ప్రభావాన్ని చక్కగా విడమరిచి చెప్పాడు.

తెలంగాణలో మట్టిసుగంధాన్ని పదాలుగా చేసి మాట్లాడే పల్లెల్లో వాడబడే మాటల్ని ముందుగా ప్రస్తావించుకుంటే

'అర్ర' ఇంట్లో ఉండే గదిని అర్ర అని సంబోధిస్తారు తెలంగాణ పల్లె వాసులు. 'మా ఇంటి అర్రల నా సిన్నప్పటి ఒల్లెలు(దోవతులు) ఉన్నయ్' అని ఇక్కడి వాళ్ళు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు. ఈ సంభాషణ వాక్యంలో అర్ర అనే పదానికి మూలరూపం తమిళంలోని 'అఱై' అనే పదం నుండి ఏర్పడినట్టు తెలుస్తుంది. శకట రేఫం ఎగిరిపోయి సాదురేఫం చేరడం, అదికాస్తా ద్విరుక్తమవ్వడం ఈ పదమార్పులో గమనించవచ్చు. ఇదే వరుసలో 'ఒల్లె'. ఒళ్ళును కప్పి ఉంచే వస్త్రాన్ని(పుట్టు పంచెలు) తెలంగాణ ప్రజలు ఒల్లెలు అంటారు. ఈ పదాన్ని కేవలం తెలంగాణ వాసులు మాత్రమే వాడడం గమనించవచ్చు. ముఖ్యంగా ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో ఈ పదం వాడతారు

'అరికాలుకు ముళ్ళు గుచ్చింది' అనే మాటలో 'ముళ్ళు' అనేది 'ముళ్' అనే తమిళభాషా పదం నుండి వచ్చింది. గుచ్చుకుంటుంది కావున దానిని ముళ్ అని అంటారు. ఇంకొక అర్థం 'ముడి' అని కూడా. 'పట్టె గొలుసులు మస్తుగున్నయ్' అనే మాటలోని పట్టె గొలుసులు అనే మాటను స్వల్ప స్వరబేధంతో 'పట్టై కొలుసు' అని, 'దొరసాని' ని 'దురైశాని' అని, 'తెల్వనితనం' అనే మాటను 'తెలియాత్తనం' అని, 'కష్టం' అనే మాటను చాలామంది పల్లెటూరు ప్రజలు నేటికి

'కట్టం' అనే వికృతి పదాన్ని వాడుతారు. తమిళంలో ఈ పదాన్ని పల్లెవాసులు వాడినట్టుగా తెలంగాణలో కూడా 'కట్టం' అనే వాడబడడం చూడవచ్చు.

'వాని తెరువుకు ఎందుకు బోయినవ్ బిడ్డా' అంటూ తెలంగాణ పెద్దలు ఇంకొకరి మీదికి వాదానికి పోయినప్పుడు పలికే మాట ఇది. ఈ మాటలోని 'తెరువు' అన్నది తమిళ పదం. ఈ పదానికి మార్గం, దారి, తొవ్వ అని కూడా అర్థాలున్నాయి. 'పిల్లంగొయ్య' అని పిల్లన గ్రోవిని ఇక్కడి ప్రజలు పిలుచుకుంటారు. ఈ పదం 'పుల్లాంగులల్' అనే తమిళ పదం నుండి వచ్చి చేరిందని నలిమెల భాస్కర్ తెలంగాణ పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు.

ధనవంతులు నిత్యంవాడే మాటల్లో 'టుంగుటుయ్యాల'(ఊగే ఊయల).వారు విశ్రాంతి తీసుకోవడానికి, తమను చూడడానికి, తమతో అవసరం ఏదైనా ఉండి వచ్చిన వారితో మాట్లాడేటప్పుడు టుంగు టుయ్యాల మీద కూర్చొని ఊగుతూ మాట్లాడుతుంటారు. ఈ టుంగుటుయ్యాల అన్నది 'తూ0గువుదు' అనే పదం నుండి వచ్చింది. ఈ టుంగు అనేది 'తూ0గు' అనే మాటగా ముందు ఉండేది. తూ0గు అంటే కునుకు తీయడం, నిద్రపోవడం అని అర్థం.

'కన్ను' అనే పదాన్ని తీసుకుంటే తమిళంలో 'కణ్' అంటున్నారు. రెండు భాషల పదాలను తులనాత్మక కోణంలో పరిశీలిస్తే తెలుగులో విభక్తులు లేకుండా పదనిర్మాణత జరగదు కనుక కన్ను అని వైభక్తికంగా వాడుతాం. తమిళంలో అది కనబడదు. రెండు భాషల్లో కనిపించే తేడా అదొక్కటే. రెండు పదాలు ఒక్కటే అన్నంతగా సామ్యతను కలిగి ఉన్నాయి. ఇదే విధంగా కాలును 'కాల్' అని, నేను అనే మాటను 'నాన్' అని, నీరును 'నీర్' అని, నూలు ను 'నూల్' అని, తేలును 'తేల్' అని, పేరును 'పేయర్' నాలుగు అను సంఖ్యను 'నాన్కు' చేయిని 'కయ్' అని స్వల్ప స్వరభేధంతో పలకబడడం మనం చూడవచ్చు. సమీప సామ్యత ఇరు భాషల్లో చాలా వరకు కనిపించడం ఇక్కడ గమనార్హం.

మూల ద్రవిడం	తమిళం	తెలుగు	తెలంగాణ తెలుగు
కోఱి	కోఱి	కోడి	కోడి
చుక్కయ్	చుక్కై	చుక్క	సుక్క
చిక్కు	చిరుతై	చిరుత	సిరుత

తెలుగు కన్నడం మాదిరిగానే తమిళంలోనూ పదాలు సహజాతాలుగా భాషా సోదరత్వాన్ని నిరూపిస్తూ పదాది'చ'కారాలు ఏకరీతిగా ఉన్నా పదాంతాలు మారుతున్నాయి. తెలంగాణ మాండలికంలో మాత్రం కొన్ని పదాల్లో ముఖ్యంగా'చుక్క-సుక్క, చిరుత-సిరుత' వంటివి పదాది'స'కారాన్ని సంతరించుకుంటూ పలకబడుతున్నాయి.

ఇరు భాషల్లో స్వల్ప స్వరభేధంతో కొంత యథాతథంగా వాడబడే పదాలను గనుక గమనిస్తే...

అవ్వను 'అవ్వ' అని,'అమ్మను 'అమ్మా', తాతను 'తాత్త', ఊరును 'ఊరు', అక్కను 'అక్కా', అత్తను 'అత్తై' అని, నమ్మకాన్ని 'నంబిక్కే' సరికిసరి అనడాన్ని 'సరిక్కుసరి'అని, గడ్డపారను 'కడప్పార'అని పులుపును 'పుళిప్పు'అని, వాసనను 'వాసనై' అని, ఉప్పును 'ఉప్పు', పప్పును 'పరప్పు' అని,పగలును 'పగల్' అని ఇలా చాలా వరకు పదసంపద ఇరుభాషల్లో పలకబడుతుంది. భాషలమధ్య తాడనం చెందుతూ పరిమళాల వేదజల్లింపు కల్గిస్తున్న ప్రభావాన్ని తెలుగు తమిళ భాషల మధ్య చూడవచ్చు.

ఇవేకాకుండా పగవాడు-పగైవాన్,ఊగొట్టడం-ఊ0గొట్టుదల్, తమ్ముడు-తంబి, పళ్ళెం-తట్ట, మల్లెలు-మొవ్వల్, తోటను-తోట్టం, పది అను సంఖ్యను పత్తు అని చాలా పదాలు కనబడతాయి. ఈ రెండు భాషలు ఒకే మూలద్రావిడం వచ్చిన సోదరభాషలు కనుక పరస్పర ప్రభావాన్ని ఒకదానిమీద ఒకటి కలిగి ఉన్నాయి.

తెలంగాణ భాష-గోండిభాష:

తెలంగాణ మట్టిలో గుస్సాడి నృత్యం పరిమాళాలు అణువణువునా తాండవిస్తున్నట్టు అనిపిస్తుంటాయి. నెమలి కన్నులను తలకు అలంకరించుకున్నారా అన్నట్లుగా కాళ్ళకు సంప్రదాయ గిరిజన గజ్జెలను కట్టుకొని వాద్యాల చప్పుళ్ళను లయబద్ధమైన నృత్యంగా మారుస్తారు గోండులు. వీరి నృత్యం వలెనే వీరి వేషభూషణములు, సంప్రదాయాలు, వాటికి జీవం పోస్తున్న ప్రాచీన భాష వారి సొంతం. దక్షిణ మధ్య ద్రవిడ భాషా కుటుంబంలో తెలుగుకు సోదర భాషగా భాషా సాహిత్య చరిత్రలో తనదైన ముద్రను వేసుకున్నది గోండి భాష. ప్రాచీన లిపి ఉన్నా, అంతగా విస్తరనలోకి రాకున్నా ద్రవిడ భాషా కుటుంబ భాషల నిర్మాణానానికి సంబంధించిన శోధనకు ఉపయోగపడుతున్నది. మధ్య భారతదేశం నుండి తెలంగాణ వరకు వ్యాపించి ఉన్న అనాది జాతి గోండుజాతి. గుణాద్యుడు పేర్కొన్న పైశాచిక జాతి ఇదేనని కొందరు భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. దేశంలోనే ఇదొక ప్రత్యేకమైన గిరిజన జాతి అని చెప్పుకోవచ్చు. ఈ గోండి భాషా ప్రభావం తెలుగు మీద, తెలుగు భాషా ప్రభావం గోండి మీద కనబడుతూ ఉంటుంది.

భాషాశాస్త్రవేత్తల ప్రకారం సుమారు క్రీస్తు పూర్వం1100 సంవత్సరం కంటే ముందు కాలంలో తెలుగు, గోండి, కువి ఒకే భాషగా ఉండేవి. అనంతరం ఇవి వేటికవి విడిపోయి స్వతంత్ర భాషలుగా ఏర్పడ్డాయి. వర్ణ వ్యత్యయంలో ఏర్పడ్డ మార్పు భాషల శబ్ద, వాక్య నిర్మాణతను ప్రభావితం చేసిన తీరును విశదపరుస్తుంది. కువి- గోండి భాషల్లో మూల ద్రావిడ ధాతువులోని అచ్చు తెలుగు భాషలో హల్లుగామారడాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు.

ఉదా: అవన్రు-వాడు, ఇవన్రు వీడు, ఒరళ్-రోలు, ఊర్-వూరు, ఏర్-యేడు,(ఇందులో వర్ణ వ్యత్యయం 'ర' 'డ' గా మారుతుంది).

ప్రముఖ భాషా శాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి ప్రకారం తెలుగు దక్షిణ ద్రవిడ భాషల నుండి వేరుపడింది. కీ.పూ 5,6 వ శతాబ్దం కాలం నాటికి తెలుగు తన సోదర భాషల నుండి విడిపోయి తనదైన రూప నిర్మాణతను సంతరించుకొనడం మొదలైంది. తెలుగు నుండి గోండి, కుయి, కువి వంటి భాషలు పద సంపదను అరవుకు తెచ్చుకున్నట్లు తెలుస్తుంది.

ఉదా: 'చేట' అన్న తెలుగు పదం గోండిలో 'సేతి, హేతి, ఏతి' అని పలకబడుతుంది. హేచ్, ఏచ్ అనునవి హేతి, ఏతి అనబడ్డాయి. 'చెరుగు' అనే పదం కుయి భాషలో 'సేసి', కొండ భాషలో 'సేర్వి', పెంగో, మండ లలో చేట 'హేచి' అనబడుతుంది.'చే' అనునది 'సే' గా మార్పు చెందడం గమనించవచ్చు. కుయి, కువి, మండ, గోండిలో 'క' కారయుక్త రూపాలు ఉండాలి కాని సకారాది రూపాలు చోటుచేసుకుంటాయి. పైన కనబడే మార్పు చ కారం 'స'కారం అవుతుంది. ట్, ట అన్నది 'త' అవుతుంది అంటారు భద్రిరాజు కృష్ణమూర్తి తన తెలుగు భాషా చరిత్ర గ్రంథంలో. ఈ మార్పులతో కూడిన సామీప్యతను గమనిస్తే గోండి, కుయి, కువి భాషలకు తెలుగు భాషతో విడదీయలేని సంబంధం ఉందని అర్థమవుతుంది.

కొన్ని గోండి పదాలను దగ్గరగా పరిశీలిద్దాం....

హేరు-నీరు, తిన్-తిను, వాతోర్-వచ్చారు, కుర్సి-కూర, పండి-పండు, పుంగ్ హ-పువ్వులు, కెయి-చేయి (తాలవ్యీకరణం చెందని పదం), కొర్రు - కోడి , మర్క- మామిడి, కట్టేంగ్- కట్టెలు , కోవె - కోతి, పాల్ -పాలు, ఆకి-ఆకు, గుడి -గుడి, తల్ల -తల , పిట్టే - పిట్ట, గుట్టంగ్-గుట్టలు

ఇలా ఎంతో పదసంపద గోండి నుండి తెలుగుకు, తెలుగు నుండి గోండికి తరలి వెళ్లిందని తెలియకనే తెలుస్తుంది. ఈ దిశగా ఇంకా పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉన్నది.

తెలంగాణ భాష-కొలామి భాష:

కొలామి భాషకు తెలంగాణ తెలుగుకు గల సంబంధాన్ని పరిశీలిస్తే గోండి వలెనే చాలా దగ్గర సంబంధం కాన వస్తుంది. కొలామి పదాలను తెలుగు పదాలను దగ్గరగా సునిశిత దుష్టితో పరిశీలిస్తే చాలా సామీప్యత కనిపిస్తుంది. గోండి, కొలామి ప్రజలు ప్రక్కప్రక్కనే అన్నదమ్ముళ్ళ వలే కలిసి జీవిస్తున్నారు. తెలంగాణాలోని ఆదిలాబాద్ ఇందుకు వేదికగా నిలుస్తుంది.

కన్ను అనే పదాన్ని 'కన్' అని పిలుస్తారు కోలామీలు. తెలుగు భాషలో ఈ పదం ఉకారాంతమై, వైభక్తికంగా దర్శనమిస్తుంది. అలాగే గాడ్డి-గాడిద. ఈ పదం ఇరు భాషల్లో సామిప్యతను చూపిస్తుంది.పదాంత అచ్చులోపం కోలామిలో కనిపిస్తుంది.'గాడిద-గాడ్డి'లో ముందు అక్షరంలో వర్ణం సంయుక్తం అవుతుంది. ఈ పదం తెలుగులో సరళంగా పలకబడుతుంది.

ISSN No.2319-3905

అలాగే గోర్-గోరు, సినుక్-చినుకు, సీపుర్-చీపుర్, సుట్టం- చుట్టం, తెడ్ %-% తెడ్డు, నమ్మ్-నమ్మకం, అఙ్గడి- అంగడి, ఉస్క - ఇసుక, ఆర్ - ఆరు, ఆప్- ఆపు, అంటిప్-అంటించు, ఇర్వే-యిరవై మొదలగు పదాలు పరస్పర భాషా ప్రభావాన్ని నిరూపిస్తున్నాయి.

తెలంగాణ భాష-కోయ భాష:

కోయలు తమ మనసులోని భావాలను పంచుకునేందుకు మాట్లాడే భాషను కోయ భాష అని పిలుస్తున్నారు. రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూల్డ్ లో చేర్చబడ్డ గిరిజన తెగలలో ఒకటి కోయ. దక్షిణ మధ్య ద్రవిడ కుటుంబంలోని కోత, కొండ, మంగో, పెంగో వంటి భాషలతో కలిసి కోయభాష కూడా సహజీవనం చేస్తున్నది. కోయ భాషను మాట్లాడే కోయలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో జీవనం సాగిస్తున్నారు. తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోయలు ఎక్కువగా నివసిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి పరివాహకంలో భద్రగిరి మీద ఉన్న రామయ్యను తమ్ముల దమ్మక్క అనే కోయ వృద్ధ మహిళయే ముందుగా చూసి లోకానికి తెలియజేసింది.

తెలంగాణ తెలుగు భాషకు ప్రక్కప్రక్కనే బ్రతుకును కొనసాగిస్తున్న కోయభాష మధ్య తెలంగాణ తెలుగుభాష మధ్య ఒక జీవసంబంధం ఉన్నట్టుగా అనిపిస్తుంది. ఇరు భాషల పదజాలాన్ని పరిశీలిస్తే ఈ సత్యం బోధపడుతుంది. భాషాశాస్త్రవేత్తలు మధ్య భారతదేశంలోని గోండులకు ఉప విభాగంగా కోయలను పేర్కొంటున్నారు. గోండి భాషకు కోయ భాష ఒక మాండలికంగా, తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం మాదిరిగా కోయభాష కూడా ఒక స్వతంత్రభాష అని ఒప్పు కుంటున్నారు. ఈ కోయలు తమ మాతృభాష అయిన కోయతో పాటుగా తెలుగుభాషను కూడా మాట్లాడడం గమనించవచ్చు. ఈ కోయావారిలో రాచకోయ, లింగాధారి కోయ, కమ్మర కోయ,అరటి కోయ అనే ఉప తెగలని కూడా చూడవచ్చు. వీరు మాట్లాడే భాష వీరందరినీ కలిపి ఉంచుతుంది.

కోయ - తెలంగాణ తెలుగు	కోయ -తెలంగాణ భాష	కోయ- తెలంగాణ భాష
ఏరు	నీరు పెదరు పేరు	ఇయ్య అయ్య,
అవ్వ-అమ్మ, అవ్వ,	ఇలావా ఇటురా	ఎబేల ఎలా
నిమ్మా - నీవు,	నమ్మా - నేను,	అద్దు - ఆమె,
ఇద్దు - ఈమె,	యన్న - అన్న,	ఎబబ్బా - బాబాయి,

చిన్నయవ్వ చిన్నవ్వ, చిన్నమ్మ, చెల్లో చెల్లెలు, ఎబెరియవ్వగపెద్దవ్వ, పెద్దమ్మ, ఎబదురూప్గ అయిదు రూపాయలు, రెండ్ రూప రెండు రూపాయలు మొదలగునవి చూస్తే కోయ భాష పదాలలో ప్రాచీన తెలుగుభాష మూలాలు ఉన్నట్టు కనిపిస్తుంది. తెలుగుభాష పరిణామం చెందినా కోయభాష ఇంకా అనాది పదాలనే వాడుతూ మార్పుకు గురికానట్టుగా అనిపిస్తుంది.

కోయభాషలో 'నీవు చెప్పావు'అనడానికి 'నీమ్మ కెచ్చనీర్' అంటారు. 'నీమ్మ' అనే పదంలోని 'మ' 'వ'కారంలోకి మారి నీవు అయినట్టు గమనిస్తే, 'కెచ్చనీర్' అనే పదంలోని 'కెచ్చ' అన్నది తాలవ్యీకరణం చెంది పదాది లోని 'క' తెలుగులో 'చ' గా మారడాన్ని గమనించవచ్చు. ద్విరుక్త 'చ్చ' 'ప్ప' గా పరిణామం చెందడం చూడవచ్చు.

'నమ్మా దోడ తిత్తిని ' అనే కోయ వాక్యానికి 'నేను అన్నం తిన్నాను' అని అర్థం. ఈ వాక్యంలో తిన్నావా అనడానికి వాడిన 'తిత్తినే' అనే పదాన్ని గమనిస్తే 'తిత్తి' అన్నది 'తింటి' అనే పదానికి దగ్గరగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇంకా ఎన్నో అంశాలు భాషాపరంగా తెలుగుతో సాన్నిహిత్యాన్ని పంచుకున్న విధాన్ని, పరస్పర ప్రభావాన్ని ఈ సందర్భంగా గమనించవచ్చు.

తెలంగాణ భాష- మళయాళ భాష:

తెలంగాణ భాష - మలయాళ భాషను పరికిస్తే చాలా వరకు దగ్గరి ప్రభావమే తారసపడుతుంది. దక్షిణ ద్రవిడ భాషా కుటుంబంలో ఒకటైన మలయాళం సుమారు క్రీస్తు పూర్వం తొమ్మిది నుండి పదమూడవ శతాబ్దంలో తమిళం నుండి విడివడి ప్రత్యేకమైన భాషగా పరిణామం చెందినట్టుగా తెలుస్తుంది. ఆదిమూలంలో భాషల మాతృకకు జన్య సంబంధం లాంటి బంధం ఉండడం వల్ల తెలంగాణ భాషపై కూడా అంతర్లీనంగా మళయాళ భాషా ప్రభావం కొంత కనబడుతూనే ఉంటుంది. మలయాళి తెలంగాణ తెలుగు భాషా పదాలను సునిశితంగా పరిశీలిస్తే ఈ ప్రభావాన్ని గమనించవచ్చు.

మలయాళంలో బండిని 'వండి' అంటారు. పదాదిలోని 'వ' కారం 'బ' కారంగా మారడాన్ని మనం ఈ పదంలో చూడవచ్చు. పదం కొంత స్వరమార్పుతో పలకబడుతుంది. అలాగే మల్లెపువ్వును 'ముల్లపూ' అని తెలంగాణ పలుకుకు అతి దగ్గరగా పలుకుతారు మలయాళీలు.

మల్లెపూవు అన్నది మల్లెపూ-మల్లెపూవ్- మల్లెపూవు- మల్లెపువ్వు గా పరిణామం చెందిన తీరును ఈ సందర్భంగా గమనించవచ్చు. ఇదే తీరుగా పేర్-పేరు, ప్రేమమ్ %-%ప్రేమ, మూకు-ముక్కు, వా- దా (రమ్ము,ముగం-ముఖం, సూర్యన్-సూర్యుడు వంటివి ఇరు భాషల్లో కొంత స్వరమార్పుతో చాల వరకు సామీప్యతతో పలుకబడుతూ కనబడతాయి.

మలయాళంలో సంస్కృత భాషా పదాలు అధికంగా కనిపిస్తాయి. సంస్కృత భాషా ప్రభావం వల్ల,సంస్కృత భాషా పదాల ఆదానత వల్ల మలయాళంలో ఈ మార్పులు కలగడం జరిగింది. దీని ఫలితంగా ఇరుభాషల పదాల కలయికతో వచ్చిన మణిప్రవాళ శైలి వెలుగులోకి వచ్చింది. తెలుగుభాషపైన కూడా సంస్కృత భాషా ప్రభావం ఉన్న విషయం విధితమే. ఈ ప్రభావం మూలంగా తెలంగాణ తెలుగులోనూ సంస్కృత ఆదానత కలిగి మలయాళం భాష వలే సమాన ఉచ్చారణతో పలకబడే పదాలను గమనిస్తే.....

మలయాళం-పచ్చడి-తెలుగు-పచ్చడి,

మ-కవిగతె-కవి,మ-పనిగతె-పని,మ-అమ్మగతె-అమ్మ,మ- కన్నుగతె-కన్ను,మ-భయంగతె-భయం,మ-తలగతె-తల,మ-ఇష్టంగతె-ఇష్టం,మ-దాహంగతె-దాహం మొదలైన పదాలు సమాన ఉచ్చారణతో ఇరు భాషల్లోనూ పలుకబడుతున్నాయి. ద్రవిడ భాషా కుటుంబపు ఉప కుటుంబాల్లో చోటు చేసుకున్న భాషలు ఎంతగా మార్పు చెందినా జన్యు సంబంధాన్ని కల్గి అంతర్లీనంగా ఒకదానితో ఒకటి సజీవ మైత్రిని పంచుకుంటూనే ఉన్నాయన్నది సత్యం.

తెలంగాణ భాష- బ్రాహుయి:

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో నివసించే బ్రాహుయి భాష ఉత్తరాదికి వలసపోయిన ద్రవిడ భాషల్లో ఒకటిగా చెప్పబడుతుంది ఈ భాషను మాట్లాడే ప్రజలు నేటికి అక్కడ ఉండడం గమనార్హం. తెలంగాణాకే ప్రత్యేకమైన శక్త్యారాధాన అందులో ముఖ్యంగా అమ్మతల్లి ఆరాధన, దేవదాసి వ్యవస్థ సింధూ నాగరికతలో కనబడ్డది. సింధూ నాగరికత ప్రజలు దక్షిణాదికి చెందిన వారుగా, అక్కడి సంప్రదాయాల్ని పాటించినవారుగా పండిత్ జవహార్ లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో మొదటి భాగంలో పేర్కొన్నాడు. ఈ కథనాన్ని బట్టి బ్రాహుయి మాట్లాడే ప్రజలు సింధూ ప్రాంతం ధ్వంసం అయ్యాక అక్కడి నుండి నేటి పాకిస్తాన్ ఆఫ్ఘానిస్తాన్ ప్రాంతాలకు వలస పోయి ఉండవచ్చనిపిస్తుంది.

ఇరు భాషా సామీప్యతను చూస్తే.....

మూల ద్రవిడం	**బ్రాహుయి**	**తెలంగాణ తెలుగు**
కణ్	ఖన్	కన్ను
కాక్కయ్	ఖాఖో	కాకి
కల్	ఖలిజ్	కల్ల
కళ -	ఖలిజ్గ్	కలుపు
ఎలి	హల్	ఎలుక
పెట్టయ్	పట్టి	పెట్ట
కణ్	ఖన్	కణుపు

మూల ద్రవిడం, బ్రాహుయి , తెలుగు భాషల పదాలను గమనిస్తే అన్ని పదాల్లో వర్ణ సాదృశ్యం తక్కువగా ఉన్నా సహజతత్వం కనిపిస్తుంది. మూల ద్రవిడంలోని 'క' గ 'ఖ'గా, 'ఎ'గ 'అ'గా, 'ణ'గన గా, ళగ ల గా బ్రాహుయి భాషలో మారడం గమనించవచ్చు. మొత్తంగా స్వల్ప భేదం గల్గిన జన్యు సంబంధం తెలుగు-బ్రాహుయిలోనూ కనిపిస్తుంది.

దొరికిన సమాచార సాధనాల ప్రకారం తెలంగాణా తెలుగుభాషపై అన్య ద్రవిడ భాషల ప్రభావాన్ని సోదాహరణంగా వివరించేందుకు ఆస్కారం ఏర్పడింది. ఈ దిశగా పయనం సాగించి విస్తృతమైన పరిశోధనలు చేయాల్సిన అవసరం, ఆవశ్యకత నేడున్నదని భాషా శాస్త్రవేత్తలు, పరిశోధకులు గమనించాలి. ఆ దిశగా తమ శోధనలు సాగించాలి. వాటి ఫలితంగా అమూల్యమైన భాషావిజ్ఞానం చేతికందుతుంది.

ముగింపు:

ద్రవిడ భాషా కుటుంబంలోని భాషలు అన్నదమ్ముల వలే విడిపోయి వేరు కాపురాలు పెట్టుకొని పరిణామ క్రమంలో అభివృద్ధికి దగ్గరైన చందంలా కనిపిస్తాయి. దక్షిణ, దక్షిణ మధ్య ద్రవిడ, మధ్య, ఉత్తర ద్రవిడ భాషా కుటుంబాలుగా భాషావేత్తలు విడగొట్టిన తీరు ఈ ఉపమానాన్ని నిరూపిస్తుంది. దక్షిణ మధ్య ద్రవిడ భాషల్లో అగ్రగామిగా చెప్పుకోబడే తెలుగు, అందులో సజీవ సుగంధాన్ని పంచే తెలంగాణ తెలుగు భాష ఆదినుండి తన ప్రాచీనతను వెలిబుచ్చుతున్నది, తనకంటూ ప్రత్యేకమైన పదజాలంతో, తనకు ఇతర ద్రవిడ భాషలతో గల జన్యు సంబంధాన్ని సందర్భానుసారంగా నిరుపిస్తూనే ఉన్నది. తనపై తోబుట్టువులైన అన్య ద్రవిడ భాషల ప్రభావాన్ని లోకానికి సునిశితంగా చాటుతూనే ఉంది. తనకున్న కమ్మని భాషా పరిమళాన్ని పంచుతూనే ఉంది.

ISSN No.2319-3905

3
మాలతీ చందూర్ నవలల్లో సామాజిక చైతన్యం

– ఆచార్య కె.శ్రీదేవి & వై.స్రవంతి

50వ దశాబ్దంలో విద్యా, ఉద్యోగ రంగాలలోకి అడుగు పెడుతున్న యువతులకు, యువకులకూ ఎన్నో సందేహాలు. ఇళ్ళుదాటి పాత సంప్రదాయాలు ఒదిలి, కొత్తవాటిని అందుకోవాలంటే భయసంకోచాలతో కంపిస్తూ, జీవితపు కూడలిలో ఎటుపోవాలో, ఏ విలువలు అందుకోవాలో తెలియని అయోమయంలో ఉంది. యువతరం. స్వాతంత్ర్యం రాకముందు వారికంత అయోమయం లేదు. స్వాతంత్ర్య సాధన గురించి వారికి అస్పష్టత లేదు. కానీ దేశం స్వతంత్రమయ్యాక వారికెన్నో ఆశలు. అభివృద్ధికి, ఆధునికతకూ ఎన్నో నిర్వచనాలు. జీవితాలను మార్చుకోవాలనీ, తీర్చి దిద్దుకోవాలనీ తపనలు. నగరాలలో, కొత్త పరిసరాలలో వచ్చే వైరుధ్యాలను పరిష్కరించుకోవటమెట్ల, తమని తాము కొత్త పద్ధతులలో సంస్కరించుకోవటమెట్లా అని సతమతమయ్యే యువతరానికి ఒక మంచి సలహాదారు, కౌన్సిలరు, తమకు దూరంగా ఉంటూ తమ జీవితాలలోకి కొద్దిగా తొంగిచూసి మంచిమాట చెప్పే పెద్దదిక్కు కావలసి వచ్చింది. సమష్టి కుటుంబాలలో పెద్దల మాటలూ సలహాలూ క్రమంగా పోతున్నాయి. సమస్యలు, సందేహాలు పెరుగుతున్నాయి. ఎవరితోనైనా పంచుకోకపోతే అవి వాళ్ళను నిలువనివ్వవు. మరీ పరిచయస్తులతో చెప్పుకోటానికి సంకోచం. మనకు ముఖ పరిచయం కూడా లేని వ్యక్తి, మనం కావాలనుకున్నా కలవటం కష్టమైన వ్యక్తి, ఎంతో జ్ఞానం ఉన్న వ్యక్తి, మనల్ని వినటానికీ, మన భుజం తట్టటానికీ, మన నెత్తిన మొట్టటానికి వున్నారంటే చాలా రిలీఫ్. అది ఆనాటి సామాజిక అవసరం. అందువల్లనే ప్రమదావనం' శీర్షిక అంత విజయవంతమయింది. మాలతీచందూర్కి అంతకీర్తి వచ్చింది. ఆ రోజుల్లో (యిప్పటికీ) మద్రాసు వెళ్ళినవారికి దర్శనీయ వ్యక్తులలో మాలతీచందూర్ ఒకరు. సినిమా తారలతో సమానమైన గ్లామర్ ఆవిడ సంపాదించటానికి ప్రమదావనం కారణమైంది. మాలతీ చందూర్ ఆంధ్రదేశంలోని అనేక కుటుంబాలలో ఆప్తురాలి స్థానం సంపాదించుకుంది.

మాలతీ చందూర్ నవలా సాహిత్యమంతా చదివి ఏమిటీవిడ నవలల సారాంశం? మాలతీ చందూర్ ఈ నవలల ద్వారా ఏ సాహిత్య ప్రయోజనాన్ని ఆశించారు? ఏ ముఖ్యాంశాలను చర్చకు పెట్టారు? పాఠకులకు ఎలాంటి చూపును అందించదల్చుకున్నారు అని ప్రశ్నించుకుంటే మనకు

అనేక విషయాలు అర్థమవుతాయి. ఆమె రాసిన నవలలన్నిటిలో వాస్తవ జీవితం, ఆధునిక దృష్టి, పాత సంప్రదాయాల నిరసన, కొత్త దారులలో నడిచేవారి జీవితాలలో వచ్చే సమస్యల పట్ల సానుభూతి, స్త్రీల సమస్యలను ఆధునిక దృష్టితో పరిశీలించటం, కుటుంబ సంబంధాలలో దోపిడి, ఇరుకుతనాలను ప్రశ్నించటం, వివిధ జీవన సందర్భాలలో చిక్కుకున్న పాత్రల మానసిక విశ్లేషణ, ఇలా యెన్నో అంశాలు మన దృష్టికి, మనం పెద్దగా కష్టపడకుండానే కనిపిస్తాయి. ఇంకొంచెం లోతుకు వెళ్ళి చూస్తే ఆమె నవలలన్నిటినీ ఆవరించి ఒక పునాదిలా ఉన్న సామాన్యమైన అంశం ఒకటుంది. అది స్త్రీలపై సమాజంలో రకరకాల రూపాలలో జరిగే హింస. రెండు మూడు నవలలు దీనికి మినహాయింపు కావచ్చు గానీ తక్కిన నవలలన్నిటిలో అతి విషాదకరమూ, అనంతమూ అయిన స్త్రీలపై హింసను దాని వాస్తవరూపంలో మనకు చూపించారు మాలతీ చందూర్.

ఈ మాట ఆశ్చర్యకరంగా వుండొచ్చు. కానీ చలం తర్వాత స్త్రీలపై వివిధ రూపాలలో జరిగే హింసను యింత విస్తృతంగా రాసిన రచయితలు తక్కువ. ఎక్కువమంది రచయిత్రులు కుటుంబ హింసను గురించి రాశారు. కుటుంబ హింసలో కూడా భార్యా భర్తల సంబంధంలోని హింసనే ఎక్కువ పట్టించుకున్నారు. మాలతీ చందూర్ స్త్రీలపై జరిగే హింసను అనేక పార్శ్వాల నుంచి చర్చించారు. ఆమె నవలల్లోకి వెళ్ళి పరిశీలించేముందు స్త్రీలపై జరిగే హింస పితృస్వామిక సమాజంలో ఎంత లోతైనదిగా ఉంటుందో, ఆ సమాజ మనుగడకు ఆ హింస యెలా అవసరమవుతుందో, దోహద పడుతుందో చూస్తే మాలతీ చందూర్ నవలల ప్రాముఖ్యం మనకు అర్థమవుతుంది.

కుటుంబ హింస గానీ, లైంగిక హింసగానీ మరే రకమైన హింస అయినా అది కేవలం స్త్రీల మీద చేసే భౌతికమైన దాడి, బలవంతం మాత్రమే కాదు. హింస అనే దానిలో దోపిడి, వివక్ష, అసమాన ఆర్థిక సాంఘిక నిర్మాణాలను కొనసాగించటం ఉంటుంది. హింస ఉద్దేశమే అది. స్త్రీలను నిరంతరం భయపెట్టే భయానకమైన వాతావరణాన్ని సృష్టించి, బెదిరించటంతో ఈ హింస సాగుతుంటుంది. ఇంట్లో, వీధిలో, పనిచేసే చోట జరిగే ఈ హింసాత్మక చర్యల వల్ల స్త్రీలు నిత్యం లొంగివుండేలా తయారవుతారు. హింస అనేది స్త్రీలను సాంఘికంగా కంట్రోలు చేసే సాధనం. అది వ్యక్తిగతం, సంస్థాగతం, సంకేతం, సారాంశం కూడా అవుతుంది. స్త్రీలకున్న బానిసత్వపు, హోదాను అలాగే కొనసాగించటానికి హింస ఉపయోగపడుతుంది. స్త్రీలకున్న వ్యక్తిగత సరిహద్దులు హింసవల్ల నిరంతరం కుంచించుకుపోతాయి. లైంగిక హింస ద్వారా స్త్రీలలో ఒక భయాన్ని సృష్టించి స్త్రీలను నిశ్శబ్దంలో పడేసి లొంగదీస్తుంది పితృస్వామ్య సమాజం. లైంగిక హింసను ఒక పద్ధతిలో కొనసాగించటం, ఆ హింస గురించిన భయాన్ని స్త్రీలలో సృష్టించటం ఈ రెండింటివల్లా స్త్రీలు నిరంతరం భయంతో బతుకుతుంటారు. రాజకీయ, మత టెర్రరిజంల గురించి అందరు మాట్లాడతారు. ఆలోచిస్తారు. టెర్రరిజం నివారణకు మార్గాలు వెతుకుతారు. ఐతే స్త్రీలు నిరంతరం టెర్రరిజంలో బతుకుతున్నారని గమనించినవారెంతమంది? తమ మీద

ISSN No.2319-3905

ఎప్పుడు ఏ రకమైన దాడి, హింస, హత్య, అత్యాచారం జరుగుతాయోననే భయంతోనే స్త్రీలు జీవితమంతా గడుపుతారనే వాస్తవం ఎంతమంది అర్థం చేసుకోగలుగుతారు? ఈ భయం పిత్రుస్వామ్య సాంఘిక అసమానత్వంలో విడదీయలేని భాగం. కేవలం 'భౌతిక దాడుల వల్ల మాత్రమే స్త్రీలలో ఆ భయం సృష్టించబడటం లేదు. తప్పు, గౌరవం, పవిత్రత, శీలం, అవినీతి, కన్యాత్వం, మర్యాద యిలాంటి మాటలతో, ఆ మాటల వెనక వున్న సాంస్కృతిక భావజాలంతో ఆ భయం స్త్రీలలో మొదలవుతుంది. భౌతికదాడి, సాంస్కృతిక భావజాల ప్రభావాన్ని దాటిన తర్వాతి దశ అవుతుంది చాలాసార్లు. స్త్రీలను ఎన్నటికీ అసమానత్వంలో వుంచటానికి సాంస్కృతిక సమాజం సృష్టించిన ఆచారాలు, సంప్రదాయాలు చివరకు హింస ద్వారా అమలవుతుంటాయి. స్త్రీల మీద హింస అనేక శతాబ్దాల నుండీ అమలవుతున్నా దాని విశ్వరూపాన్నీ, స్త్రీల అణచివేతతో దానికిగల విడదీయరాని సంబంధాన్నీ అర్థం చేసుకున్నది మాత్రం 20వ శతాబ్దంలోనే. 19వ శతాబ్దంలో స్త్రీల గురించి పనిచేసిన సంస్కర్తలు స్త్రీల సమస్యలను ఏవో కొన్ని దురాచారాలుగా మాత్రమే గుర్తించారు. ఆ దురాచారాలను నిర్మూలిస్తే, వాటిని నిషేధిస్తూ చట్టాలు తెస్తే చాలనుకున్నారు. కానీ స్త్రీల అభివృద్ధి కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా అభివృద్ధి సాధ్యపడటం లేదనే విషయం క్రమంగా తెలిసి వచ్చింది. స్త్రీ పురుష సమానత్వం సాధించనిదే స్త్రీల అభివృద్ధి జరగదు. సమానత్వం సాధించాలంటే సమాజంలో స్త్రీల పట్ల వున్న వివక్షలు నిర్మూలించాలి. వివక్ష పోతేగానీ సమానత్వం రాదు. వివక్ష పోకుండా అడ్డుపడుతున్నది యేమిటని ఆలోచించిన వారికి అది హింస అని అర్థమైంది. స్త్రీల మీద యెన్నో రూపాలలో అమలవుతున్న హింస వారి మీద వివక్షను మళ్ళీ మళ్ళీ విధిస్తున్నది. కొత్త కొత్త రూపాలలో ఆ వివక్షను కొనసాగించటానికి హింస ఉపయోగపడుతుంది. కాబట్టి స్త్రీల అణిచివేతలో హింస పాత్ర కీలకం. ఇదిఅర్థమైన తర్వాత స్త్రీల ఉద్యమం హింస మీద కేంద్రీకరించి పని చేయటం మొదలు పెట్టింది. 1970వ దశాబ్దంలో యిది మొదలయింది. 70వ దశాబ్దంలో వెలువడిన మాలతీ చందూర్ నవలల్లో ప్రధానాంశం కూడా హింస కావటం యాదృచ్ఛికం కాదనిపిస్తుంది. ఆమె అంతకు ముందు రాసిన నవలలో ఈ విషయం వున్నప్పటికీ 70వ దశాబ్దంలో ఆమె రాసిన జయ–లక్ష్మి, కృష్ణవేణి, ఏది గమ్యం–ఏది మార్గం, చుక్కలు – రెక్కలు, సద్యోగం నవలల్లో నిస్సహాయ స్థితిలో, %ఎబశ్రీఅవతీఖఎశ్రీవ జూశీంట్ఱశీఅ% లో వున్న స్త్రీలపై జరిగే హింసే ప్రధాన వస్తువు. భౌతిక పరమైన, మానసికమైన, సాంస్కృతిక భావజాల పరమైన హింసలు, స్త్రీల జీవితాలను ఎలా శిథిలం చేస్తాయో, స్త్రీలు ఈ హింస నుంచి బైటపడి ఊపిరిపీల్చుకోటానికి, యెలా పెనుగులాడతారో మాలతీచందూర్ నవలలు చదివితే అర్థమవుతుంది. కుటుంబం, వివాహం, వ్యభిచారం, వుద్యోగం, సంపాదన, ప్రేమ, పేదరికం ఈ అన్నింటిలో స్త్రీలు అనుభవించే హింసను ఆమె విపులంగా రాశారు. ఐతే హింస గురించిన ఈ రచనలు స్త్రీలకు శక్తినిస్తాయి. పై వ్యవస్థలన్నిటిలో దాగివున్న హింసా ప్రవృత్తిని అర్థం చేసుకుని ఆ హింసను తప్పించుకుని జీవించగల ధైర్యాన్నిస్తాయి.

జయ–లక్ష్మి, కృష్ణవేణి నవలల గురించి యిక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆ రెండు నవలల్లోని పాత్రలు సాహిత్యంలోకి చాలా అరుదుగా ప్రవేశించే పాత్రలు. ఈ నవలల్లో కథ విజిలెన్స్ హోమ్లోని ఆడపిల్లలకూ, స్త్రీలకూ చెందినది కావటంతో సమాజంలో స్త్రీల మీద జరిగే సమస్త హింసలూ, వాటి విశ్వరూపంతో నగ్నంగా పాఠకుల ముందుకొస్తాయి. ఇవి చిన్న నవలలే గాని చదువుతుంటే ప్రముఖ రష్యన్ నవలాకారుడు కుప్రిన్ రచించిన 'యామా ది పిట్' లీలా మాత్రంగా గుర్తు రాకుండా ఉండదు. 'యామా ది పిట్'లో కథ వ్యభిచార గృహాలలో జరుగుతుంది. మాలతీచందూర్ నవలల్లో వ్యభిచార గృహాల నుంచి వచ్చినవారు, మళ్ళీ వాటికి తిరిగి వెళ్ళాలనుకునేవారు, ఆ నరకం నుంచి తప్పుకోవాలనుకునేవారు, వారిని ఉద్ధరించాలనుకునేవారూ ఉన్నారు. నిస్సహాయ స్థితిలోని స్త్రీలను, ఈ వ్యవస్థ వ్యభిచార కూపంలోకి ఎంత తేలికగా లాగుతుందో ఈ నవలల్లో అర్థమవుతుంది.

విజిలెన్స్ హోమ్ అనగానే అక్కడ యెప్పుడూ బాధ, యేడుపు, డిప్రెషన్లో వుండవు. అక్కడి కొచ్చే పిల్లలు జీవన సమరంలో రకరకాల పద్ధతుల్లో, మార్గాలలో ఆరితేరినవారు. వాళ్ళు సజీవంగా చైతన్యంతో వుంటారు. హోమ్లో కూడా తమ తమ ప్రత్యేకతలతోనే బతుకుతుంటారు. ఇలాంటి నవలలు రాసేటప్పుడు బాధిత స్త్రీలంతా చాలా మంచి వాళ్ళన్నట్టు, వాళ్ళందరినీ ఒక ఛాయ నుంచే చిత్రించే ప్రమాదంలోరచయితలు పడతారు. మాలతీ చందూర్ మంచి చెడులను కలగలిపి వాస్తవంగా జీవితంలో అనేక ఛాయలతో వుండే మనుషులనే చూపారు. జీవితం అందరికీ మంచివాళ్ళుగా బతికే అవకాశం యివ్వదు. రకరకాల పరిస్థితులలో రాటుదేలిన స్త్రీలను, వారి హింసా పూరిత నేపథ్యాలను చూపుతూ, నేపథ్యం మారినా మారని వారిని, మంచి నేపథ్యంలో మార్పు కోరుకునేవారిని చిత్రించారు.

'ఆరోగ్యం' జీవితాన్ని సవతి తండ్రి నాశనం చేస్తాడు. చిన్నపిల్లను లొంగ దీసుకుని, ఆ పిల్ల మంచిది కాదని తల్లికి చెప్పి యింటి నుంచి వెళ్ళగొట్టించి, తన గుప్పిటిలో పెట్టుకుని డబ్బు సంపాదించాలని చూస్తాడు. ఆరోగ్యం హోమ్లోకి వచ్చినా ఈ నేపథ్యం ఆమెనెలా ఒదులుతుంది? వ్యభిచారం చేస్తూ హోమ్లోకి వచ్చిన పిల్లగానే అందరూ ఆరోగ్యాన్ని చూస్తారు గానీ ఆ పిల్ల యిష్టాలేమిటి, ప్రత్యేకత లేమిటి అని కనుక్కోరు. ఆరోగ్యం వంటపంతులు చేసే దొంగతనాల్లో సహకరిస్తుంది. అందరూ ఆమెను తిట్టుకుంటారు. చీదరించుకుంటారు. కానీ ఆరోగ్యం ఆ పనులు యెందుకు చేస్తుందో యెందుకు వంటపంతులుతో కలిసిందో తెలిసేసరికి పాఠకులకు కళ్ళనీళ్ళొస్తాయి. వంటపంతులిచ్చే పిప్పరమెంటు బిళ్ళల కోసం ఆశపడుతుంది ఆరోగ్యం. ఆ బిళ్ళలు ఆ పిల్ల జిహ్వా చాపల్యం తీర్చుకోటానికి కాదు. ఆరోగ్యానికి చిన్నపిల్లలంటే యిష్టం. వాళ్ళకి పిప్పరమెంట్లిచ్చి స్నేహం కలుపుకోటానికి యిన్ని పాట్లు పడుతుంది. తనకు చిన్నపిల్లలంటే యిష్టమనీ, వారి పనులు చేస్తాననీ హోమ్ సూపర్నెంటుతో చెప్పుకోవచ్చని కూడా ఆరోగ్యానికి తెలియదు. తన యిష్టాలంటే అందరికీ కోపమనీ, అవి చెబితే వచ్చేది తిట్లు, తన్నులేననేది ఆమె గత జీవితానుభవం. దాంతో తన యిష్టాలను రహస్యంగా, దొంగతనంగా తీర్చుకోవటమే చేస్తుంది.

ISSN No.2319-3905

అవి యెంత మంచి యిష్టాలైనా సరే. జీవితం కొందరికి యెంత కఠినంగా వుంటుందో ఆరోగ్యాన్ని చూస్తే అర్థమవుతుంది. ఆరోగ్యం యిష్టం తెలిశాక ఆమెను చిన్నపిల్లలతో కలిసి పని చేయమని బాధ్యత అప్పగిస్తుంది మేట్రన్ సత్యవతి.

అనాథ అయిన జయ హోమ్లో పెరిగి, కలవారింట్లో పనిమనిషిగా చేరి, ఆ యింటి కోడలవుతానని కలలు కని చివరికి వ్యభిచార వృత్తినే ఆశ్రయించాల్సిన స్థితిలో పడుతుంది. ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. సినిమాల్లో వేషాలు సంపాదిద్దామని యిల్లు వొదిలి మద్రాసు చేరిన లక్ష్మి వ్యభిచార కూపంలో పడి హోమ్కు చేరుతుంది. సూపర్నెంట్ కృష్ణవేణి సహాయంతో తలిదండ్రులను కలుసుకుని జీవితానికో మార్గం యేర్పరుచుకుంటుంది.

సుశీలది మరీ విషాదపూరితమైన కథ. గృహ హింస నుంచి బైటపడటానికి ప్రయత్నిస్తూ తన ప్రమేయం యేమీ లేకుండా తన తప్పేమీ లేకుండా హోమ్కి తీసుకురాబడుతుంది. ఒక రెడిమేడ్ బట్టల ఫాక్యరీలో చిన్న వుద్యోగం చేసుకుంటూ హాయిగా బతికే సుశీల పెళ్ళి చేసుకుని వుద్యోగం మాని భర్తతో వెళ్లిపోతుంది. మొదటి సంవత్సరం వివాహ జీవితం బాగానే వుంటుంది. చుట్టుపక్కల ఆడవాళ్ళు భర్తలతో పేచీ పడుతూ, తన్నులు తింటూ వుంటే వాళ్ళకు కనీసపు చదువులేక అలా వుంటున్నారనీ తను చాలా తెలివిగా, మంచిగా కాపురం చేస్తున్నాననీ అనుకుంటుంది. ఇల్లు చక్కదిద్దుకోవటం, ఇంటిపనీ యివన్నీ చాలా అర్థవంతమైన పనులుగా కనపడతాయి సుశీలకు. ఐతే త్వరలోనే అదంతా కలలాగా చేజారిపోయి భర్త పేకాటకూ, తాగుడికి అలవాటైతే, యిల్లు గడవక పిల్లల కడుపులు నింపలేక, భర్తతో పేచీలు పడి తన్నులు తినే స్థితికి వస్తుంది. “మొదట్లో నేను అలానే అనుకునేదాన్ని. నా మొగుడు నేను గీసిన గీటు దాటడు. జీతమంతా తెచ్చి నా చేతుల్లో పోస్తాడు. పిల్లలకి మంచి చదువులు చెప్పించాలి. ఇలా ఎన్నో వెర్రికలలు కన్నాను. చివరికి ఏమయింది. నేనూ అందరిలాగానే అయ్యాను. దెబ్బలు తిన్నాను. ఏడ్చాను. పిల్లలకి పిడికెడు మెతుకులు పెట్టలేక పోయాను..... పెళ్ళి అయేదాక ఉద్యోగం చెయ్యనిచ్చాడు మానాన్న. ఆ రెండేళ్ళు నేను ఎంత సుఖంగా ఉన్నానని – హాయిగా, చీకూ చింతా లేకుండా. పెళ్ళి అయేదాకా ఆడవాళ్ళు యింత కష్టపడతారని, తిండికి కూడా కరువాచాల్సిన స్థితిలో వుంటారని నాకు తెలియదు. పెళ్ళంటే ఇదా.” అంటుంది సుశీల. పుట్టింటికి వచ్చి పూర్వపు వుద్యోగం మళ్ళీ సంపాదించుకుని పిల్లల్ని పోషించుకుందామని ఫ్యాక్టరీకి వెళ్తుంది. అక్కడ పాత స్నేహితులు కలుస్తారు. సుశీల ఆ రోజు చాలా ఆనందంగా గడుపుతుంది. ఒంటరిగా కుటుంబ హింసలో మగ్గుతున్న అనేకమంది స్త్రీలకు తెలియదు, ఇళ్ళనుంచి బైటికి వచ్చి ఒక సామూహిక జీవితంలో యేదో వొక పని చేస్తూ బతికే బతుకే అర్థవంతమని. సుశీల ఆ రాత్రి తోటి వాళ్ళతో కలిసి సినిమాకి వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుంటే ఆమె పర్సు యెవరో కొట్టేస్తారు. అతన్ని సుశీల పట్టుకుని పోలీసుని పిలిస్తే అతను సుశీలే తనను రమ్మని పిలుస్తోందని, బలవంతం చేస్తోందని చెప్పి వేశ్యగా ముద్రవేస్తాడు. ఆ రాత్రే విజిలెన్స్ హోమ్కి తీసికెళ్తారు. రాత్రిపూట బైటికి వెళ్ళిన స్త్రీకి యేమైనా జరగొచ్చు. సుశీల కథ స్త్రీలందరి స్థితికి అద్దం పడుతుంది. ఒక్క నిమిషంలో

ఆమె జీవితం తలకిందులయింది. ఏ పిల్లల కోసం వుద్యోగం చేద్దామని యిల్లు కదిలి వచ్చిందో ఆ పిల్లలకు దూరమైంది. ఈ ముద్ర పడ్డ సుశీలను వదిలేస్తానని పిల్లల్ని తీసుకుపోతానని సుశీల మొగుడు వేసే వీరంగాలకు భయపడి సుశీల తండ్రి ఆమెచెల్లెల్నిచ్చి పెళ్ళి చెయ్యటానికి సిద్ధపడతాడు. పేద స్త్రీల బతుకులు ఒక్క రోజులో మరి కోలుకోలేని విధంగా యెట్లా కుప్పకూలుతాయో ఈ కథ చెబుతుంది. పిల్లలను ఒక్కసారి చూడటం కోసం సుశీల హోమ్లో అలమటిస్తుంటుంది. క్రమంగా కృష్ణవేణి చెప్పినట్లు పనిచెయ్యటం, చదువుకోవటం చేస్తుంది.

ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో పాల్గొని అక్కడ తోటి మగవాళ్ళతో అత్యాచారానికి గురైన సంపన్న కుటుంబానికి చెందిన మంజులది మరో కథ. రాజకీయాలలో స్త్రీకి భద్రత లేదనే విషయాన్ని రుజువుచేస్తుంది.

గీతకు వ్యభిచార జీవితం మీదే ఆకర్షణ. అక్కడి స్త్రీ అదుపులేని జీవిత గమనమే కావాలనుకుంటుంది. హోమ్నుంచి తప్పించుకుని పాత జీవితానికే వెళ్ళాలనుకుంటుంది. ఎందుకంటే ఆమె పరదాలలో, కఠినమైన నిర్బంధాలలో బైటి ప్రపంచమంటే యేమిటో తెలియకుండా పెరిగింది. ఆ నిర్బంధాలలో పెరిగిన ఆమెకు ఈ స్వేచ్ఛా జీవితం బాగుందనిపించింది. హోమ్లో యానివర్సరీ జరిగినపుడు ముఖ్య అతిథిగా వచ్చిన జడ్జీని గీత తన కస్టమర్ గుర్తుపట్టింది. ఆయన చెప్పిన ఉపన్యాసం గురించి అంబుజంతో “ఈయన ఇన్ని పెద్ద ఖబుర్లు చెప్పాడా? మేమున్న ఇంటికి రోజూ వస్తుండేవాడు. అక్కడున్న పదిమంది దగ్గరకూ వస్తుండేవాడు!” అంటుంది.

“ఆరోజు ఆయన వేషం తల్చుకుంటే నాకింకా నవ్వుగానే వుంటుంది. పంచ చేతబుచ్చుకుని, పోలీసులు అనగానే దొడ్డిదారిని పరుగోపరుగు. ఒకే పరుగు” విరగబడి నవ్వుతోంది. ఆ నవ్వులో విషాదం గీతకు అర్థంకాకపోయినా మనకు అర్థమవుతుంది. నేరాలు చేసే మగవాళ్ళు జడ్జీలు కాగల అవకాశాలుంటాయి. నేరమేమిటో కానిదేమిటో తెలియని అమాయకపు ఆడపిల్లలకు భయంకరమైన శిక్షలుంటాయి. దరిద్రంతో, ఆకలితో, రోగాలతో నలిగే స్త్రీల జీవితాలను యింత విపులంగా రాసిన నవలలు అరుదు.

‘క్షణికం’ అనే నవలలో మాలతీచందూర్ చిత్రించిన సంఘటన బహుశ యదార్థ సంఘటనే కావచ్చు. రాత్రిపూట భర్తలేని సమయంలో ఒక దొంగ ఆమె గదిలోకి వచ్చినా ఆమెను అనుమానించే కుటుంబసభ్యులు, ఆ అనుమానంతో రాత్రికి రాత్రి ఆమె వీధిన పడాల్సి రావటం, ఇక చచ్చిపోవటం తప్ప మరో గత్యంతరం లేకపోవటం యిదే ఆ చిన్న నవల యితి వృత్తం. ఎవరు ఎలాగైనా ఆమె నిస్సహాయత్వాన్ని వాడుకోవచ్చు. ఇందులో ఆమెను అనుమానించటంలో ఆడవాళ్ళు కూడా భాగస్వాములుగా ఉంటారు. ఐతే అధికార సంబంధాల చట్రంలో వాళ్ళు పైనున్నారు.

కుటుంబంలోని అనేక అధికార సంబంధాలను వాటిలో అంతర్గతంగా ఉండే హింసనూ మాలతీ చందూర్ తన నవలల్లో విప్పి చూపుతారు. అవి స్త్రీ పురుషుల మధ్యే కాదు. స్త్రీల మధ్య

ISSN No.2319-3905

కూడా పని చేస్తాయి. బడ్డారు.

శతాబ్ది సూరీడులో వితంతువులపై ముఖ్యంగా బాల వితంతువులపై జరిగే హింసను గురించి రాశారు. వితంతువు కోరికలనూ, అవసరాలను అణచివేయటం, ఆమె తినే తిండినీ యితర వస్తువుల వాడకాన్ని (తలనూనెతో సహా) తగ్గించి వేయటం, ఆమె ఇంట్లో చేయాల్సిన శ్రమను విపరీతంగా పెంచటం ఈక్రమాన్ని శతాబ్ది సూరీడులో మాలతీచందూర్ స్పష్టంగా రాశారు. వితంతువు ఒక యింట్లో కాదు అనేక యిళ్ళల్లో పనిచేయటానికి తయారైన ఒక యంత్రం. బంధువుల యిళ్ళల్లో యెక్కడ పని వుంటే అక్కడామె ప్రత్యక్షం కావాలి. పైసా యివ్వకుండా వెట్టి చేయటానికి పుట్టిన అభాగ్యులు వాళ్ళు. కుటుంబ సభ్యులే వాళ్ళపై లైంగికహింసకు కారకులవుతారు. కుటుంబం లోపలే, కుటుంబపు అండలోనే వున్నట్లు కన్పించే, నిస్సహాయులు నిరాశ్రయులు అయిన బాల వితంతువుల హింసా పూరిత జీవితాలను, శతాబ్ది సూరీడులో మాలతీ చందూర్ కుటుంబపు మాయ తెరలు తీసి చూపించారు.

సామాన్యంగా లోకంలో అందరూ అనుకునేది, నమ్మేది, పాక్షికంగా సత్యమైనది ఒక అభిప్రాయం వుంది. అదేమిటంటే స్త్రీలపై యిన్ని రకాల యింత హింస జరగటానికి కారణం ఆర్థిక పరాధీనతే అనేది. ఆర్థికంగా ఒకరి మీద ఆధారపడకపోతే, ఉద్యోగాలు చేసి సంపాదిస్తుంటే స్త్రీలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, హింసల పాలు గాకుండా బతకగలరనే అభిప్రాయాన్ని చాలామంది నమ్ముతారు. నిజానికి అలాంటి పరిస్థితికి అవకాశం వుండాలి. ఆర్థికంగా యెవరిమీదా ఆధారపడనపుడు, తనే కుటుంబాన్ని పోషించగలిగినపుడు, యిక యెవరి పెత్తనాన్నయినా, యెవరి అధికారాన్నయినా వాటి భౌతికరూపమైన హింసనైనా యెందుకు భరించాలి, యెందుకు తలవంచాలి? అనే ప్రశ్న సహజంగా వస్తుంది. ఐతే వాస్తవంలో సంపాదనాపరులైన స్త్రీలు ఆ హింసకు తలవంచుతూనే వున్నారు. ఎందుకు? ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. ఉద్యోగం, సంపాదన, సామాజిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల స్త్రీలకు సమకూరిన వనరులు. కానీ ఆ మార్పులు సాంస్కృతిక జీవితంలో, భావజాలంలో రాలేదు. చాలా నెమ్మదిగా వస్తున్నాయి. సాంస్కృతిక భావజాలం స్త్రీలలో తాము పరాధీనులమనే, అబలలమనే భావనను అనంతవిధాలుగా కలిగిస్తూ వుంటుంది. వాళ్ళ భౌతిక జీవితాలలో యెన్ని మార్పులొచ్చినా కుటుంబం లోపలి, సమాజంలోని అధికార సంబంధాలను ఆమోదించే ఆలోచనా విధానంలో మాత్రం మార్పురాదు. ఆ మార్రానంతవరకూ, ఆ మార్పు రాకుండా వుండటం కోసం స్త్రీల మీద హింస మరింత పకడ్బందీగా, కొత్త పద్ధతుల్లో జరుగుతుంటుంది. డబ్బు సంపాదించటం వల్లనే, ఆ కారణంగానే హింసల పాలైన స్త్రీల గురించి మాలతీ చందూర్ మంచి నవలలు రాశారు.

"చంపకం – చెదపురుగులు' "రేణుకాదేవి ఆత్మకథ" ఈ రెండూ ఆడవాళ్ళు సంపాదిస్తుంటే, కుటుంబాలు – పుట్టింటి వాళ్ళు, భర్తయింటివాళ్ళు కూడా వారి సంపాదనను అనుభవించాలనే

కాంక్షతో యెలా హింసిస్తారో చెప్పే నవలలు. ఆడవాళ్ళ సంపాదనకూ, మగవాళ్ళ సంపాదనకూ మధ్య వ్యత్యాసాన్ని మనకు చాలా స్పష్టంగా చూపించే ప్రయత్నం చేశాయి ఈమె నవలలు.

సామాన్యంగా పురుషులు సంపాదిస్తారు. ఎంత సంపాదిస్తే వాళ్ళంత ప్రయోజకులవుతారు. అధికారాన్ని పొందుతారు. కుటుంబంలో అందరూ వాళ్ళ అధికారాన్ని ఆమోదించి గౌరవించి వారికి లొంగి వుంటారు. సంపాదన పెద్దగా లేకున్నా పురుషులకు కుటుంబంలో అధికారముంటుంది. అదే యెక్కువ సంపాదన వున్నపుడు అతని అధికారం మరింత పెరుగుతుంది. కుటుంబంలోని వారు అతని ప్రేమను, అభిమానాన్ని సంపాదించటానికి పోటీ పడతారు.

ఇక స్త్రీల పని సంపాదన కాదు. వాళ్ళు ఇళ్ళల్లో ఉండి ఇంటి పనులు, కుటుంబానికవసరమైన సేవలూ చెయ్యాలి. 19వ శతాబ్దంలో ఈ పరిస్థితి మారింది. 1920వ దశాబ్దం నుంచీ అక్కడక్కడ స్త్రీలు ఉద్యోగాలు చేయటం, సినిమా, నాటక రంగాలలో ప్రవేశించి సంపాదించటం మొదలు పెట్టారు. ఆ సంపాదనను ఎలా చూడాలి అన్నది మొదట్లో కుటుంబాలకు పెద్ద ప్రశ్నగా ఉండేది. ఆడదాని సంపాదన అనే చిన్న చూపు ఉండేది. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళే గానీ ప్రధానాధారంగా చూడకపోవటం ఉండేది. ఐతే ఇదంతా పైనే. లోపలికి వెళ్తే ఆడవాళ్ళ సంపాదన అనుభవించటంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ వాళ్ల సంపాదన మీద వాళ్ళకు హక్కు లేకపోవటమనేది స్పష్టంగా తెలుస్తుంది. స్త్రీ సంపాదన మీద పెత్తనం చేయటానికి పెళ్ళి కాకముందు తండ్రులో, అన్నలో, బావలో, తల్లులో, అక్కలో ఉంటే పెళ్ళయిన తర్వాత భర్తలూ, మామగార్లు ఉంటారు. సంపాదన ద్వారా పురుషుడికి వచ్చిన అధికారం స్త్రీలకు సామాన్యంగా రాదు. తాను సంపాదిస్తున్నందువల్ల ఎక్కువ గర్వపడకుండా, మిడిసిపడకుండా, అణకువగా వుండే అదనపు బాధ్యత స్త్రీల మీద పడుతుంది. స్త్రీలు సంపాదిస్తే సంపాదిస్తారు గానీ, ఆ సంపాదనను సక్రమంగా ఖర్చు చేయటం, నిర్వహించటం, పెంచటం యివి స్త్రీలకు చేతకావనే ప్రచారం చాలా కాలం పాటుసమాజంలో వుంది. అందువల్ల సంపాదన నిర్వహించే సామర్థ్యం పుట్టుకతోనే వచ్చిందని నమ్మే మగవాళ్ళ చేతుల్లో డబ్బు పోయాలి. ఆ బాధ్యత తీసుకున్న పురుషుడికి జవాబుదారీ తనం ఉండనవసరం లేదు. ఆడది డబ్బు లెక్కలు అడిగితే తిరుగుబాటే – దానికి ఆమెను తిట్టే, కొట్టే హక్కు మగవాడికుంటుంది. ఇలాంటి భావజాలం సమాజంలో యిప్పటికీ వుంది. ముఖ్యంగా అపరిమిత సంపాదనకు అవకాశం ఉన్న సినిమారంగంలో ఈ భావజాలం యిప్పటికీ ఉండటం మనం చూస్తుంటాం. రేణుకాదేవి ఆత్మకథ ఛాయలు డంజరి ఆర్తి అగర్వాల్ జీవితంలో కనపడతాయి. మధ్యలో యెందరో నటీమణులు, తమ నటనా సామర్థ్యంతో దేశ ప్రజలను ముగ్ధులను చేసినవారు, తమ సంపాదనను సమర్థించుకోలేక, వేరే వాళ్ళ చేతికి అప్పగించి చివరికి చిక్కుల్లో పడ్డారు. కొందరి జీవితాలు దయనీయంగా సమాప్తమయ్యాయి. 50వ దశాబ్దంలోనే సినిమారంగంలో స్త్రీల సంపాదన మీద కుటుంబాలు చేసే పెత్తనాన్ని వివరంగా చిత్రించిన

ISSN No.2319-3905

నవల రేణుకాదేవి ఆత్మకథ. స్వీయ ఆర్జన, సమాజంలో గుర్తింపూ వున్నా, మనశ్శాంతి లేని జీవితాలెలా ముగుస్తాయో చెప్పే నవలిది.

అయితే స్త్రీలందరూ యిలా వుంటారని, ఉన్నారనీ కాదు. తమ సంపాదనతో కుటుంబంలో ఒక అధికారాన్నీ గౌరవాన్నీ పొందిన పాత్రలు మాలతీ చందూర్ నవలల్లో ఉన్నాయి. ఉదాహరణకు శతాబ్ది సూరీడులో కమల తనకున్న కొద్దిపాటి ఆస్తినీ, టీచర్గా తనకొచ్చే జీతాన్ని చాలా తెలివిగా తన కుటుంబాన్ని చక్కదిద్దుకోటానికి వినియోగించింది. చిన్న ఇల్లే అయినా పైన గదులు వేయించి అద్దెకివ్వటం, ఉన్నంతలో పొదుపుగా జీవిస్తూనే తనకిష్టమైన సినిమాలకు ఖర్చు పెట్టుకోగలగటం, ఇద్దరమ్మమ్మల జిహ్వా చాపల్యాన్ని వాటివల్ల వచ్చే అనారోగ్యాల్ని డబ్బు ఖర్చు అనుకోకుండా భరించటం, వీటన్నిటిలో కమల సామర్థ్యము, మానవత్వమూ రెండూ తెలుస్తాయి. కమల ఎస్.ఎస్.ఎల్.సి. మాత్రమే చదివింది. టీచర్ ట్రైనింగ్ చేసింది. కానీ తన జీవితానికి తనే కర్తననుకోవటం వల్లా, కుటుంబ బాధ్యతలన్నీ తనే చూడాల్సి రావటం వల్లా, ముఖ్యంగా కూతురిని బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలనే కర్తవ్యం ఉండటం వల్ల, సంపాదనను చాలా బాధ్యతగా ఖర్చు చేసింది. పెద్దమ్మమ్మ పద్మ చదువుకోసం ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవటమనేది చాలా పెద్ద విషయం. పరమచాదస్తురాలు, కమల జీవితం మోడులా మారటానికి కారణమైన పెద్దమ్మమ్మ, ఆడపిల్లలను ఉన్నత విద్య అవసరం గ్రహించి దానికి డబ్బు దాచాలనే ఆలోచన చేసిందంటే, స్త్రీలు తామంత తాము అమాయకులూ మూరు?లు కాదనీ, కుటుంబాలు, సామాజిక విలువలూ వాళ్ళనలా చేశాయనీ, ఒకసారి వాళ్ళకు సమస్య అర్థమైతే దానిని చక్కగా పరిష్కరించుకోగలరనీతెలుస్తుంది. ఐతే దానికొక ప్రీ కండిషన్ వుంది. వాళ్ళమీద పురుషుల పెత్తనం ఉండకూడదు. ఆ పెత్తనం వుంటే వీళ్ళ సామర్థ్యం వెలుగులోకి రాదు.

చదువుకున్న వాళ్ళంతా తమ సంపాదనను యింత చక్కగా నిర్వహించు కోలేరనీ, దానికి కూడా పురుషులే కారణమనీ చూపే రచనలు కూడా మాలతీ చందూర్ రాశారు. స్త్రీల సంపాదనను ఖర్చు చేసే అధికారాన్ని పురుషులు తమ చేతుల్లోకి తీసుకోవటం, స్త్రీల సంపాదన మీద వారికంటే తమకు యెక్కువ హక్కున్నట్లుగా ప్రవర్తించటం, డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో నిర్ణయాలన్నీ పురుషులే తీసుకోవటం, తమ నిర్ణయాలతో స్త్రీలు విభేదించినపుడు వారిమీద హింస ప్రయోగించటం వీటన్నిటి వల్లా, కొంతమంది స్త్రీలు యెంత సంపాదించినా ఆ సంపాదనను తమ కోసం, తమ సుఖం కోసం, తమ స్వంత అభిరుచుల కోసం, తనవారి కోసం ఖర్చు పెట్టలేకపోతారు. అవన్నీ పురుషుల దృష్టిలో వృథా ఖర్చులుగా, తెలివి తక్కువ పనులుగా కనపడతాయి. కోప్పడతారు. కొడతారు. ఎగతాళి చేస్తారు. ఏదో ఒక పేరుతో స్త్రీలను డబ్బు నిర్వహణనుంచి తప్పిస్తారు. ప్రేమలేని ఆ భర్తలే కాదు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్తలు సహితం అదే పని చేస్తారు. ఉదాహరణకు "ఏది గమ్యం ఏది మార్గం" నవలలో మేరీ విశ్వంలు యిద్దరూ డాక్టర్లు. ఆధునిక భావాలతో కులమతాలను లక్ష్యపెట్టక వివాహం చేసుకున్నారు. మద్రాసులో మేరీ ఉద్యోగంలో చేరితే విశ్వం ప్రాక్టీసు పెట్టాడు.

ఐతే ఎప్పుడూ మేరీ సంపాదనే యెక్కువగా ఉండేది. ఎవరిది ఎక్కువ సంపాదన ఎవరిది తక్కువ అనే ఆలోచన రాకపోయినా విశ్వనాథం తన కోసం వాళ్ళ వాళ్ళందరినీ ఒదులుకున్నాడనే కృతజ్ఞత భావంతో (నిజానికి మేరీ కూడా ఒదులుకుంది కానీ, 'విశ్వనాథం బాహ్మణుడు కాబట్టి, పురుషుడు కాబట్టి, అతని త్యాగం ఎక్కువని అందరితో పాటు మేరీ కూడా నమ్ముతుంది) మేరీ "అతనికి ఏం తక్కువవుతుందో అనే తాపత్రయంతో కొట్టుకునేది. కొత్త సంసారానికి కావల్సినవి అమర్చటంతో పాటు బీరువాలో ఎల్లప్పుడు రెండు మూడొందలు ఉండేట్లు చూసేది. అందువల్ల విశ్వనాథానికి డబ్బు సమస్య ఉండేది కాదు".

ఆడవాళ్ళు సంపాదిస్తున్నపుడు మగవాళ్ళ అవసరాల గురించి వారికి న్యూనతా భావం రాకుండా ఉండటం కోసం ఎంత పట్టించుకుంటారో, పట్టించుకోవాల్సి వస్తుందో మనకు మేరీ చేసిన పనిలో అర్థమవుతుంది.

తర్వాత మేరీ విశ్వనాథంలు, విశ్వనాథం స్వంత వూరికి వెళ్ళి ప్రాక్టీసు పెడతారు. అక్కడ మేరీ విపరీతంగా సంపాదిస్తుంది. ఆ సంపాదన విశ్వనాథం తన యిష్టం వచ్చినట్లు ఖర్చుపెడతాడు. మేరీ అభ్యంతరం చెప్పదు. తమ్ముడిని చదివిస్తాడు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేస్తాడు. ఆ పెళ్ళికి మేరీ డబ్బు పనికొచ్చింది గానీ, మేరీకి కనీసం ఆహ్వానం కూడా రాలేదు. ఐనా వెళ్ళి, వాళ్ళు దూరంగా కూచోబెడితే కూచుని, వేరుగా భోజనం చేసి వచ్చింది. ఆ రోజే నా డబ్బు తీసుకుని పెళ్ళి చేసుకుని నన్నిలా అవమానం చేయటమేమిటని మేరీ ప్రశ్నించి వుంటే, ప్రతిఘటించి వుంటే పరిస్థితి వేరుగా ఉండేది. విశ్వనాథం ప్రేమ మీది నమ్మకం ఆమెను అవన్నీ భరించేలా చేసింది.

ఆ తర్వాత మే ంపాదించటం, విశ్వనాథం క్లబ్బులకూ, పేకాటలకు, తనవాళ్ళకూ, ఎన్నికలలో పోటీ చేయటానికి మేరీ డబ్బుని ఖర్చు చేయటం యిదే సాగుతుంది. ఇదంతా బాగోలేదని, తన సంసారం పాడవుతోందనీ మేరీకి తెలిసినా నా సంపాదన నా యిష్టం లేకుండా నువ్వు ఖర్చు పెట్టకూడదు అని కచ్చితంగా చెప్పలేకపోయింది. ఒకటి రెండు సార్లు అడిగినా "ఆ మాత్రం మంచీ చెడూ నాకు తెలియదనే అనుకుంటున్నావా?" అని విశ్వం గద్దించటంతో ఆగిపోయింది. మరింత గట్టిగా "సంపాదన లేదు గాని, వ్యసనాలు అబ్బినాయి" అనేసరికి విశ్వనాథం పెద్ద పుస్తకాన్ని మేరీ మీదకు విసరటం, మేరీ కిందపడటం, టేబుల్ మొన డొక్కలో పొడుచుకోవటం జరిగింది. తర్వాత విశ్వనాథం సేవలు చేసినా హింస అనేది ప్రారంభమయింది.

ఆ హింస పెరిగింది. భౌతికహింస కంటే మానసిక హింస మరింత పెరిగి అది తట్టుకోలేక మేరీ ఆత్మహత్య చేసుకుంది. విశ్వనాథం మేరీ చేసిన పనికి తట్టుకోలేక పోయాడు – కానీ అసలీ అగాధానికి కారణం ఏమిటి? విశ్వనాథం మేరీ సామర్థ్యాన్ని, సంపాదనను గుర్తించలేక పోవటం. గుర్తించటానికి అతని అహం అడ్డచ్చింది. ఆమెకు విపరీతమైన ప్రాక్టీసు. తనకు లేదు. ఇది అతని అంతరాంతరాల్లో బాగా పని చేసింది. ఎన్నికల్లో పోటీ చేసి తన ఘనతను

ISSN No.2319-3905

నిరూపించుకోవాలనుకున్నాడు. ఆ అహం వారి మధ్య అగాధాన్ని పెంచింది. అలాగే మేరీ సంపాదనను ఆమె నిర్ణయాల ప్రకారం 'ఖర్చు చెయ్యాలనే పాటి గౌరవం ఆమె మీద చూపలేకపోయాడు. అట్లా చూపే అవకాశం లేదు. స్త్రీల సంపాదన మీద మొత్తం హక్కులు పురుషుడివే అని సమాజం గట్టిగా చెబుతుంది. నా సంపాదన మీద నీకు హక్కు లేదు. నేను యిష్టపడి యిస్తే తప్ప దానిని నువ్వు ఖర్చు చెయ్యకూడదు అని ఏ స్త్రీ అయినా అంటే ఇక ఆ సంబంధం నిలవదు. ఆ స్త్రీ గయ్యాళిదవుతుంది. ఐతే 99% పురుషులు తను సంపాదన ఎంతో ఎలా ఖర్చు చేస్తున్నారో, తమ భార్యలకు చెప్పాల్సిన అవసరం లేదనుకుంటారు. భర్తసంపాదన మీద భార్య పెత్తనం చేస్తుంటే భర్తను అసమర్థుడిగా, భార్యను గడుసుదానిగా, మొగరాయుడిగా చెప్పుకుంటారు. ఇద్దరూ లక్షలు గడిస్తున్న ఈ కంప్యూటర్ యుగంలో కూడా భార్య జీతమంతా తనకివ్వాలని భర్త డిమాండ్ చేస్తున్నాడు. ఇద్దరూ కలిసి ప్లానింగ్ చేసుకుని డబ్బు ఖర్చు చేసే కుటుంబాల సంఖ్య చెప్పుకోదగ్గంతగా పెరగటం లేదు. 'ఆడ పెత్తనం పంబల దొరతనం' వంటి సామెతలు పాతబడినా వాటి సారాంశమే అమలవుతుంది. శతాబ్దాల పాటు ఆస్తుల, డబ్బుల నిర్వహణకు దూరంగా వున్న స్త్రీలు కొన్ని తప్పులు చేయొచ్చు. కొన్ని నష్టాలు తేవచ్చు. కానీ వందల సంవత్సరాలుగా ఈ విషయాలు చూస్తున్న పురుషులు నష్టాలు తేవటం లేదా? ఈ విషయాలు లోతుగా ఆలోచించినపుడే చలం "స్త్రీ సర్వనాశనం కావటానికైనా సరే ఆమెకు స్వేచ్ఛ కావాలి" అన్న మాటల్లో అంతరార్థం మనకు అర్థమవుతుంది. కొన్ని జీవితాలు నాశనమైనా స్త్రీలు నేర్చుకోగలుగుతారు. "మధుర స్మృతులు" నవలలో కూడా డాక్టర్ నాగమణి ప్రేమ వివాహం చేసుకుంటుంది. అతను డాక్టర్ కాదు. ఏ పనీ చెయ్యలేని అసమర్థుడు. నాగమణి సంపాదన మీద తాను బతకుతున్నాననే ఆత్మ న్యూనతా భావంతో ఇల్లు ఒదిలి వెళ్ళిపోతాడు. స్వాతంత్ర్యానంతరపు తొలిరోజుల్లో బాగా సంపాదించే ఆడవాళ్ళు తమ సంపాదన వల్ల కుటుంబ జీవితాలలో ఎంత హింస అనుభవించారనే విషయం మాలతీ చందూర్ రాసినంత విస్తృతంగా వాస్తవికంగా మరింకెవరూ రాయలేదని పిస్తుంది. పేద స్త్రీల పరిస్థితి మరింత ఘోరం. వారికి ఉ ద్యోగాలు దొరకవు. భర్తల సంపాదన మీద వీరికేమీ హక్కుండదు. భర్త సంపాదించినంతా తగలేసినా ఈస్త్రీలు చేయగలిగింది లేదు.

1947లో నేషనల్ ప్లానింగ్ కమిటీ "విమెన్స్ రోల్ ఇన్ ప్లాన్ ఎకానమీ" గురించి నియమించిన సబ్ కమిటీ తన రిపోర్టులో స్త్రీల ఆర్థిక పరాధీనత గురించి యిలా రాసింది.

"సబ్ కమిటీ అన్ని తరగతుల స్త్రీలు చేసే విలువలేని శ్రమ మీద, స్త్రీల ఆర్థిక పరాధీనత, వనరులు లేకపోవటం అనే వాటి మీద ఎక్కువ దృష్టి పెట్టింది.

శ్రామిక వర్గాలలో పనిచేసి సంపాదించటం ద్వారా మాత్రమే ఆస్తి కలిగి వుండే అవకాశం ఉంటుంది. స్త్రీల ఆర్థిక స్వాతంత్రం ఆమె సంపాదించే డబ్బు మీద ఆమెకి పూర్తి కంట్రోలు

వుండటం మీదే ఆధారపడుతుంది. స్త్రీల సంపాదన ఆమె భర్తగానీ కుటుంబంలో యితర పురుషులు గానీ బలవంతంగా లాక్కోవడమనేది సామాన్యంగా జరిగే వ్యవహారమే. స్త్రీలు సంప్రదాయ నేపధ్యాల వల్ల తమ జీతాలను మొత్తం కుటుంబసంపాదనలో భాగంగా చూడటానికే అలవాటుపడతారు. వేతనాలు వచ్చే గ్రూపులన్నిటిలో ఇలాగే జరుగుతుంది. ఆశ్చర్యకరంగా ఈ మనస్తత్వమే వృతి విద్యా నిపుణుల గ్రూపులలో కూడా కొనసాగుతుంది. స్త్రీ శ్రామికులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. కుటుంబ సంపాదనలో స్త్రీలకు కొంత భాగం చెందేలా ప్రభుత్వానికున్న ఈ బాధ్యత గురించి చూడాలి" కృష్ణవేణి నవలలో సుశీల ఆవేశంగా అడుగుతుంది. "అమ్మా గవర్నమెంటు స్త్రీలకి ఏదో చేస్తుందంటారు. ఎవరికి చేశారు, ఎక్కడ చేశారని బిగ్గరగా అరవాలనిపిస్తుంది. కుటుంబాన్ని పోషించక సంపాదించిన డబ్బు రేసులకీ పేకాటలకు తగలేస్తున్నపుడు కుటుంబాలు బీదవికాక ఏమై పోతాయి. ఫ్యాక్టరీల్లో జీతాలు పెంచి ఏం లాభం? ఆ జీతం రాళ్ళు ఇంటికి నవ్యంగా వచ్చే 'చట్టం' చేసినపుడు గాని మాలాటి వారు బాగుపడరు." అంటుంది సుశీల.

1947లో నేషనల్ ప్లానింగ్ కమిషన్ సభ్కమిటీ చేసిన రికమండేషన్లు సుశీల చట్టంగా అడిగింది. వాళ్ళు అధ్యయనం చేసి రాశారు. సుశీల జీవితానుభవంతో అడిగింది. మొత్తానికి స్త్రీల ఆర్థిక పరాధీనత గురించి నేషనల్ ప్లానింగ్ కమిషన్ ఆలోచించినంత బాధ్యతగా మాలతీ చందూర్ ఆలోచించారు. ఆ పరాధీనతలోని వివిధ కోణాలను, ఆ పరాధీనతవల్ల అనివార్యంగా ఎదురయ్యే హింసలనూ మాలతీచందూర్ తన నవలల్లో విపులంగా రాశారు.

'భూమిపుత్ర" నవలలో దుర్గపాత్ర ద్వారా స్త్రీల సామర్థ్యం తెలిపారు. మంచి తనంతో, వివేకంతో, పొదుపుతో, మానవత్వంతో, సంసార భారాన్ని సులువుగా, ఆనందంతో, ఆడుతూ పాడుతూ సృజనాత్మకంగా మోస్తుంది దుర్గ. దుర్గలాంటి స్త్రీలు బీదవారిలో లక్షల సంఖ్యలో ఉ ంటారు. రకరకాల కారణాల వల్ల ఒంటరిగా కుటుంబాల భారం నిర్వహిస్తున్న స్త్రీల సంఖ్య మనదేశంలో తక్కువకాదు. వాళ్ళ శక్తి సామర్థ్యాలు, సహనశక్తి, చొరవ తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. అలాంటి పాత్రనూ మాలతీచందూర్ సృష్టించారు.

'ఆమె నవలలన్నిటిలో దాదాపు స్త్రీలు ఉద్యోగం చేసేవాళ్ళే. లేదా ఏదో చిన్న పని చేసి కుటుంబాన్ని ఆదుకునే వారే. 20వ శతాబ్దంలో విద్య వల్ల సంపాదనలోకి వచ్చి దాని, తాలూకూ వెలుగు నీడల్ని, బరువు బాధ్యతల్ని అనుభవించే స్త్రీలే మాలతీ చందూర్ కథా నాయికలు. కేవలం గృహిణులుగా వుంటూ భర్త కాస్త మంచిగా చూస్తే చాలనుకునే స్త్రీ పాత్రలు కావు ఆమెవి. అందం, అహంభావం, ప్రేమ తప్ప మరో సమస్యలేని కాల్పనిక పాత్రలూ కావు. అనేక సంక్లిష్టత్వాలతో, (Complexities) తో నిండిన పాత్రలను ఆవిడ సృష్టించారు.

స్త్రీ పురుష సంబంధాలు: 20వ శతాబ్దంలో స్త్రీ పురుష సంబంధాలలో అనేక మార్పులొచ్చాయి. వివాహం గురించిన చర్చ జరిగింది. ధర్మబద్ధము, విచ్ఛేదం చేయటానికి కుదరనిది

ISSN No.2319-3905

అని నమ్మే వివాహం గురించి 19వ శతాబ్ది ఉత్తరార్థం నుంచే చర్చలు మొదలైనా, 20వ శతాబ్దంలో వివాహం మతం నుంచి వేరు చేయబడి పౌర సమాజ పరిధిలోకి వచ్చింది. అంటే ధర్మం, సంప్రదాయం, ఆచారం, పవిత్రం, మార్పుకి వీలులేనిది అనే భావజాలం నుంచి సాంఘిక వ్యవస్థగా, మార్పులకు వీలైనదిగా, వ్యక్తి స్వేచ్ఛకు, యిష్టానిష్టాలకూ చోటు వుండేదిగా వివాహాన్ని మార్చాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అనేక చర్చలు, ఉద్యమాలూ జరిగాక హిందూకోడ్ బిల్లు కూడా వచ్చింది. ఐతే పౌర సమాజం అంతా దీనిని యథాతథంగా విశ్వసించలేదు. ఆమోదించలేదు. సాంస్కృతిక భావజాల ప్రభావం తగ్గలేదు. వ్యక్తి స్వేచ్ఛకూ సంప్రదాయానికీ మధ్య ఘర్షణ మొదలైంది. ఆ ఘర్షణ తాలూకూ ఫలితాలను స్త్రీ పురుషులిద్దరూ అనుభవించారు. సామాజికంగా స్త్రీలకున్నన్ని ఆంక్షలు, విధి నిషేధాలూ పురుషులకు లేకపోవటం వల్ల పురుషుడు తక్కువ గాయాలతో ఈ ఘర్షణ నుంచి బైట పడ్డాడు. స్త్రీలకు చాలా గాయాలయ్యాయి. చాలాసార్లు జీవితాలే బలయ్యాయి. నిరర్థకంగా గడిచిపోయాయి. అదే సమయంలో కొందరు స్త్రీ పురుషులు ప్రేమలోని ఆనందాన్ని అనుభవించగలిగారు.

ఇలాంటి భిన్న దశలలో భిన్న రీతులల్లో వున్న స్త్రీ పురుష సంబంధాలను మాలతీచందూర్ తన కథా వస్తువులుగా స్వీకరించారు. ఆ సంబంధాలను చిత్రించటంలో మాలతీ చందూర్ ఉద్దేశం స్త్రీ పురుషులలో సంస్కార దృష్టి పెరగాలనేదే. సంప్రదాయం, డబ్బు, బలవంతం అనే వాటికి స్త్రీ పురుష సంబంధాలలో విలువ లేకుండా, ప్రేమకు, స్నేహానికి, సమానత్వానికి విలువ యివ్వాలనీ, అట్లా యిచ్చినప్పుడే స్త్రీ పురుషులు శాంతిగా బతకగలుగుతారని మాలతీచందూర్ విశ్వాసం. ఐతే ప్రేమ, స్నేహం, సమానత్వం అనేవి స్త్రీ పురుషులిద్దరూ కష్టపడి సాధించుకోవాల్సినవి తప్ప ఆటోమాటిక్ గా వచ్చేవి కావు. సమాజంలో యెక్కువ మందికి స్త్రీ పురుష సమానత్వం మీద నమ్మకం లేనపుడు, అత్యధిక భాగం పురుషులు తమ నిత్యావసరాలు తీర్చే మనిషి కోసం, తన వంశాన్ని వృద్ధి చేసే సంతానం కోసం మాత్రమే వివాహం చేసుకుంటున్నపుడు ప్రేమ, స్నేహం సమానత్వాలు మృగ్యమై పోతాయి. స్త్రీలు సమానత్వాన్ని కోరుతూ ప్రేమ, స్నేహాలు వివాహంలో కావాలనుకున్నపుడు సమస్య మరింత క్లిష్టమవుతుంది. స్త్రీలు యేదో తమకింత తిండి పెట్టేవాడైతే చాలనుకుని, పురుషులు ప్రేమ కోరుకునే వారైనా సమస్య వస్తుంది. అంటే సమాజంలో స్త్రీ పురుషులమధ్య అసమానత ఉన్నపుడు, వివాహం నుంచి వారు ఆశించేది వేరు వేరుగా వున్నపుడు వారి జీవితాలు అశాంతి మయమవుతాయి. ఆ అశాంతి నుంచి బైటపడటానికి రకరకాల మార్గాలు వెతుకుతారు. ఆ మార్గాలు సరైనవి కానపుడు మరింత చిక్కుల్లోకి వెళ్తారు. ఆ మార్గాలనూ, చిక్కులను వివరించి స్త్రీ పురుషులను ఆలోచింప జేయటమే మాలతీ చందూర్ తన నవలల ద్వారా చేసిన పని.

"ఆలోచించు", "కలల వెలుగు" "చుక్కలు – రెక్కలు" "ఏమిటీ జీవితాలు," "ఎన్ని మెట్లెక్కినా" "కాంచన మృగం" "మధుర స్మృతులు" వంటి అనేక నవలల్లో రకరకాల స్థాయిలలో, సంస్కారాలతో,

సమస్యలతో వున్న స్త్రీ పురుషులను పాత్రలుగా తీసుకున్నారు. ఆ పాత్రల ద్వారా అనేక విషయాలు చర్చకు పెట్టారు.

వివాహ సంబంధాలనూ, వివాహేతర సంబంధాలనూ కూడా మాలతీ చందూర్ తన కథాంశాలుగా తీసుకున్నారు. వివాహ సంబంధాలను దాటి వచ్చే స్త్రీ పురుషులు, వివాహ సంబంధాలలో నలిగే స్త్రీ పురుషులు, మాలతీ చందూర్ నవలల్లో మనకు కనిపిస్తారు. ప్రేమకూ, పెళ్ళికీ మధ్య నలిగి ప్రేమకు విలువ యిచ్చే పాత్రలు మనకు ఈ నవలల్లో కనిపిస్తాయి. ప్రేమ అంటే యేమిటో స్పష్టత లేక దొరికిన ప్రేమలను కోల్పోయిన వ్యక్తులు ఈ నవలల్లో కనిపిస్తారు. కలల వెలుగులో రామచంద్ర వివాహం నుంచి ప్రేమను ఆశించలేదు. కొన్ని సౌకర్యాలను మాత్రమే ఆశించాడు. అవి కూడా దొరకలేదు. ప్రేమ దొరికినట్టే దొరికి మాయమయింది. తను వివాహంలో ఆశించిన సాంసారిక సుఖ సౌఖ్యాలన్నింటినీ యిచ్చిన పద్మను ప్రేమించలేకపోయాడు. జాలిపడ్డాడు. హింసించాడు. నిజానికి అతను ప్రేమ గురించిన అస్పష్టతలతో, అయోమయాలతో బాధపడ్డాడు. వివాహం ద్వారా పురుషుడికి దొరికే భోజనసౌఖ్యం, ఇంటి సౌఖ్యం యితర సాంసారిక సుఖశాంతులు చాలనుకున్నాడు గానీ అతనికవి చాలవని అతనికీ తెలియదు. ఆధునిక స్త్రీ నుంచి పురుషుడు ఆశించే సాహచర్యంలో పై సుఖాలతో పాటు అతన్ని ఒక ప్రత్యేక వ్యక్తిగా గుర్తించటం, అతను చేస్తున్న పనులను మెచ్చుకోవటం, అతనికి బలాన్ని, ఫుత్సాహాన్నీ యివ్వటం యివన్నీ వున్నాయి. ఇవి విద్యావంతురాలైన స్త్రీ మాత్రమే యివ్వగలగుతుంది. ఈ రెండూ వివాహ వ్యవస్థలో దొరకటం యిరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో అంత తేలికగా జరగలేదు. అందులో వివాహాన్ని పెద్దల చేతికి వదిలేసిన స్త్రీ పురుషులకు అది మరింత కష్టమయింది. రామచంద్ర జీవితమంతా ఆ కష్టంలోనే గడిచిపోయింది. "ఏమిటీ జీవితాలు'లో కథానాయకుడు పెద్దలు చేసిన పెళ్ళిని కాదని వచ్చేసి తను ప్రేమించిన సురేఖతో ఉంటాడు. వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ వుంటుంది.

వివాహం చేసుకున్న భార్య గురించి అతనే మాత్రం ఆలోచించడు. ఆమె తన పుట్టింట్లో కూతుర్ని పెంచుకుంటూ జీవిస్తుంది. ఇక్కడ అతను భార్య దృష్టిలో దుర్మార్గుడు–ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. సురేఖ దృష్టిలో మంచివాడు. అనురాగాన్ని పంచినవాడు. ఒకే వ్యక్తి కొందరికి మంచివాడు కొందరికి చెడ్డవాడు అవటం జీవితంలో తప్ప సాహిత్యంలో అరుదుగా జరుగుతుంది. సామాన్యంగా రచయితలు ఒక పాత్ర పక్షం వహిస్తారు. ఆ పాత్ర మామూలు లోక దృష్టికి అందనిదైనా, ఆ పాత్రను పాఠకులకు అర్థం చేయించి పాఠకుల సానుభూతిని సంపాదించేలా రచయితలు ప్రయత్నిస్తారు. ఐతే ఆ పాత్ర చేసినది మంచి పనా కాదా అనే సందేహంలో పాఠకులనుంచి, తనే తీర్పు యివ్వకుండా ఏ పక్షమూ వహించకుండా ఉండే రచయితలు అరుదు. 'ఏమిటీ జీవితాలు'లో రాజగోపాల్ ముందు పెద్దల కోసం తనకిష్టంలేని పెళ్ళి చేసుకున్నాడు. పెద్దలనెదిరించేంత బలం అతనికి లేదు. తన పెళ్ళి వల్ల కుటుంబం కుదుటపడుతుంది కాబట్టి పెళ్ళాడాడు. కానీ ఆ పెళ్ళికి కట్టుబడి వుండే బలం కూడా అతనికి లేదు. తను ప్రేమించిన

ISSN No.2319-3905

సురేఖను వదలి వుండలేడు. పెద్దలను కాదని సురేఖ దగ్గరకు వచ్చి వుంటే కృష్ణవేణి జీవితం రక్షింపబడేది. కానీ సమాజంలో పెద్దల నెదిరించటమనే భావన యింకా బలపడలేదు. ఎదిరించేంత బలం వుండటం తేలిక కాదు. ఆ అడుగు వేసిన తర్వాత యొక దానికే కట్టుబడి వుండటం ధర్మమనుకుంటారు. ప్రేమించిన వ్యక్తిని వదలటం అధర్మమనుకునే వాళ్ళు తక్కువ. ఎందుకంటే వివాహంలో సంఘానికి కమిట్ ఔతారు. ప్రేమలో వ్యక్తికి కమిట్ ఔతారు. సంఘం, ధర్మం వీటన్నిటినీ కాదనుకునే కంటే ప్రేమించిన వ్యక్తిని కాదనుకోవటం తక్కువ అన్యాయం అని లోకం అనుకుంటుంది. ధర్మానికి కట్టుబడి ప్రేమ లేకపోయినా భార్యతో ఉండే వ్యక్తికి సానుభూతి దొరకటం తేలిక. భార్యను ఆమె కర్మానికి ఒదిలి తను ప్రేమించిన వ్యక్తితో సుఖపడే పాత్రకు సానుభూతి దొరకటం కష్టం. ఐతే జీవితాలు ఎవరి సానుభూతుల కోసమూ ఆగవు. అలాగే వ్యక్తి ఆనందంగా ఉండటం ప్రధానం. 'ఏమిటీ జీవితాలు'లో రాజగోపాల్ భార్యతో వుండివుంటే యిద్దరి జీవితమూ నరకమయ్యేది. ఇప్పుడతని జీవితం సుఖమయ మయింది. భార్య జీవితం నీరసమయింది గానీ నరకం కాలేదు. ఒక సంధి దశలో ఎవరో ఒకరి జీవితం నీరసం కాక తప్పదు. భూస్వామ్య సమాజ నీతులకూ, ఆ సమాజం మారి ఆధునిక భావాలు స్థిరపడని దశలో వున్న నీతులకూ మధ్య వైరుధ్యం ఉంటుంది. ఆ వైరుధ్య ప్రభావాన్ని సామాన్యులు తప్పించుకోలేరు. ఎక్కడో ఒకచోట ఆ సంధి కాలపు వేటు వారిమీద పడుతుంది. ఈ నవల నుంచి పాఠకులు నేర్చుకునేది యేమైనా వుంటే అది జీవితాశయాలకు సంబంధించి వ్యక్తిగతయిష్టాలకీ ప్రాధాన్యం యివ్వాలి తప్పితే పెద్దలకు కాదనేదే. కృష్ణవేణిలాంటి స్త్రీలు వివాహం విషయంలో స్వంత నిర్ణయాలు తీసుకోవటం నేర్చుకోవాలి. అవి కూడా అన్నీ మంచి ఫలితాలనిస్తాయని అనుకోలేం. జీవితంలో ఓటములను, ఒడిదుడుకులను సరిదిద్దుకోగల సామర్థ్యాన్ని సంపాదించుకుని, తన జీవితాన్ని తను చక్కదిద్దుకోవాలి. కృష్ణవేణి ఆ పని దాదాపు చేసింది. స్త్రీ పురుష సంబంధాలలో వచ్చే వైరుధ్యాలకు స్త్రీలు యెక్కువ నలగటానికి కారణం వారి నిస్సహాయత. ఆర్థిక పరాధీనత ఒకవైపు, సంఘ భయం ఒకవైపూ వారిని సమస్యలను అధిగమించనీయవు. జీవితాన్ని అనుభవించనీయవు. అదే లేకపోతే కృష్ణవేణి వేరొక వివాహం చేసుకోగలిగేది. తన ప్రమేయం యేమీ లేకుండా తన జీవితం నిర్ధకమవుతుంటే చూస్తూ వూరుకోకుండా దానిని సార్థకం చేసుకునేది. భవిష్యత్తు లోనైనా స్త్రీలు ఈ నిస్సహాయతనుండి బైటపడి తమ జీవితాలను తమ చేతుల్లోకి తీసుకుంటే 'ఏమిటీ జీవితాలు' అనుకోవాల్సిన అవసరం ఉండదు.

'ఎన్నిమెట్లెక్కినా' నవలలో అవధాని వివాహ జీవితంలోని అసంతృప్తికి సమాధానం బైట వెతుకుతాడు. శకుంతల అనే అమ్మాయితో సంబంధం పెట్టుకుంటాడు. ఆమె అతన్ని ప్రేమిస్తుంది. ఆమె గర్భవతి. బహిరంగంగా వివాహం చేసుకునే ధైర్యం అవధానికి లేదు. రహస్యంగా తల్లి కావటం శకుంతల కిష్టం లేదు. దాంతో శకుంతల ఆత్మహత్య చేసుకుంటుంది. తెలివైన మరో రచయిత్రి అనసూయ, సాహిత్యరంగంలో పైకి పోవటానికి అవధానిని మెట్టుగా వాడుకుంటుంది.

నైతిక విలువలను వదిలేస్తే అనసూయే తెలివిగలదిగా కనపడుతుంది. ఆమె ఏం చేస్తున్నదో, ఎందుకు చేస్తున్నదో ఆమెకు స్పష్టంగా తెలుసు. అవధాని దగ్గర దాచలేదు. అవధాని బలహీనతను ఆమె వుపయోగించుకుంది. సుప్రసిద్ధ రచయిత్రి అయింది. కానీ స్త్రీ పురుష సంబంధాలలో అనైతికత అనేది యేదైనా వుంటే అది ఈ సంబంధంలోనే వుంది. ఇది వివాహ సంబంధమూ కాదు ప్రేమ సంబంధమూ కాదు. వ్యాపార సంబంధం. తన ప్రయోజనం కోసం శరీరాన్ని ఉపయోగించుకోవటం. దీనివల్ల యెవరికీ చివరకు సంఘానికి కూడ ఏ అపకారమూ జరగకపోవచ్చు. వ్యాపారంలో యిరుపక్షాలూ లాభపడవచ్చు. కానీ అది స్త్రీ పురుష సంబంధాలలో వాంఛనీయమైన పార్శ్వం కాదు. శకుంతల అవధానితో సంబంధం వల్ల ఆత్మహత్య పాలయింది. అనసూయ సాహిత్య అకాడెమీ అవార్డు సంపాదించుకుంది. శకుంతలకు అవధాని మీద ప్రేమ వుంది. అనసూయకు లేదు. శకుంతల ప్రేమ ఆమెకు యెందుకు ధైర్యాన్నివ్వలేక పోయింది? ప్రేమ కంటే వ్యాపార సంబంధమే మెరుగైనదా? అలాగే కనిపిస్తుంది. కాని అది నిజంకాదు. నిజమైతే ప్రేమ అనేదే విలువలేనిదైపోతుంది. శకుంతల బాధకీ మరణానికి కారణం ప్రేమకాదు.' శకుంతల ప్రేమతో తృప్తిపడలేదు. శకుంతలకు బహిరంగ వివాహం కావాలి. సంఘపు ఆమోదం కావాలి. అవధాని వివాహితుడని తెలిసీ అవధానిని ప్రేమించింది. కానీ ఆ ప్రేమకు సామాజిక అమోదాన్ని, చట్ట సమ్మతిని కోరింది. అవి దొరకవు కాబట్టి ఆమె ప్రేమ లేని జీవితాన్ని గడపలేననుకుని చచ్చిపోయింది. ఆ రెండూ వద్దనుకుంటే తన బతుకు తను బతకగలిగేదే. ఆమె తన మనసుకి, సంఘ భయానికీ మధ్య నలిగింది. "ప్రేమకు సంఘనీతితో సమన్వయం కుదరటం కష్టం" అంటాడు కొ.కు పంచకల్యాణి నవలలో. సంఘ సమ్మతి లేని సంబంధంలో ఉండటం స్త్రీలకు తేలికకాదు. అవమానాలు, వెలి, బీదరికం అన్నీ చుట్టుముడతాయి. ప్రేమికులకు యింత అడ్డమైన సంఘనీతి, ప్రేమలేని వ్యాపార సంబంధంలోని స్త్రీ పురుషులను అడ్డగించలేదు. అనసూయ సంగతి తెలిసినా, ఆమె రచనలన్నీ అవధాని తిరగరాసినవని తెలిసినా సంఘం నోరు మెదపదు. తెలియనట్టు నటిస్తుంది. బహిరంగ ప్రేమకు శిక్షలు విధించే సంఘం రహస్య వ్యాపార సంబంధాల గురించి తనకు తెలియనట్లే నటిస్తుంది. నటించక గత్యంతరం లేదు. సంఘంలోని ఈ కపటత్వాన్ని అర్థం చేసుకుంటే సంఘాన్ని చూసి భయపడకుండా ప్రశ్నించ గలిగితే, సంఘానికి యెంత విలువ యివ్వాలో అంతే విలువ యిస్తే శకుంతలలా బలి కావలిసిన అవసరం ఉండదు. కానీ దానికి సాహసం, అనేక వనరులు కావాలి. శకుంతలకు ఆర్థిక వనరులున్నా సాంఘిక చట్రానికి, చట్టానికీ అతిగా విలువ యిచ్చి చచ్చిపోయింది.

అనసూయకు సం ఘమంటే గౌరవం లేదు. భయంలేదు. సంఘపు కపటత్వాన్ని తన ప్రయోజనానికి వాడుకోగలిగిన చాతుర్యం ఉంది. ఇలాంటి వాళ్ళను సంఘం యేమీ చెయ్యలేదు. దీనిని బట్టీ స్త్రీ పురుష సంబంధాలలో సంఘపు నీతులూ, విలువలూ అన్నీ కపటమైనవనీ, సత్య దూరమైనవనీ అర్థం చేసుకోవచ్చు. సత్యంతో కూడిన ప్రేమలను సఫలం చేసుకోవచ్చు. దానికి

వ్యక్తులు బలంతెచ్చుకుని సంఘాన్ని కూడా మార్చే ప్రయత్నం మొదలుపెట్టాలి. అంతవరకూ శకుంతలలు బలి అవుతారు. అనసూయలు లాభం పొందుతారు.

'చుక్కలు – రెక్కలు'లో వాసుదేవరావు జానకిల మధ్య కూడా వివాహేతర సంబంధమే. వాసు కుటుంబం కోసం చెల్లెని పెళ్ళి కోసం తను తన యిష్టాయిష్టాల గురించి ఆలోచించకుండా సౌభాగ్యాన్ని పెళ్ళాడతాడు. ఇంజనీరింగ్ చదువు తప్ప లోకజ్ఞానం లేదు. సౌభాగ్యం మీద అతనికే ప్రేమా లేదు. ఏదో మొక్కుబడిగా తప్పని సరైనట్లు ప్రవర్తిస్తాడు. ఐతే రైల్లో పరిచయమైన అనాథ, జానకి మీద వాసుకి ప్రేమ కలుగుతుంది. ఆ పిల్లకు సహాయ పడటంలో ఆమె మీద ప్రేమ పెంచుకుంటాడు. చివరికి భార్యాభర్తల్లాగా కలిసి కాపురం ఉంటారు. సౌభాగ్యం తండ్రి వచ్చి గొడవ చేస్తే అసలు విషయం బైట పడుతుంది. జానకి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతుంది.

వాసుకి సౌభాగ్యం అంటే ప్రేమ లేదు. ప్రేమ లేకుండా పెళ్ళాడటం తప్పని అనుకోలేదు. చెల్లెలి పెళ్ళికి కట్నం కావాలి. తండ్రి 60 వేల రూపాయల కట్నంతో ఒక సంబంధం కురిస్తే పెళ్ళి చేసుకున్నాడు. మావగారిని, డబ్బుందన్న అతని అహంకారాన్ని చూస్తే వెగటు. సౌభాగ్యం తనమీదున్న కోరిక చూస్తే ఆశ్చర్యం. తన రిసెర్చి తప్ప మరింకేం తెలియదు. అలాంటి వాసు జానకిని రక్షించే భారం మీద వేసుకుని ఆమెని ప్రేమిస్తాడు. చాలా ప్రమాదంలో తను తప్ప మరో ఆధారం లేని దయనీయమైన స్థితిలో ఉన్న జానకి అతనిలో ప్రేమ భావనను మేల్కొలపగలిగింది. ఐతే లోకజ్ఞానం బొత్తిగా లేని వాసు జానకిని నిస్సహాయంగా వదిలేయక తప్పలేదు. జానకికి ఆత్మహత్య తప్పలేదు. వాసు జానకిలకు పాఠకుల సానుభూతి దొరుకుతుంది. మరి సౌభాగ్యం సంగతేమిటనేది ప్రశ్న. భర్త వివాహేతర సంబంధంలోకి వెళ్ళినపుడు భార్యల పరిస్థితి యేమిటి ఈ ప్రశ్నకు ఒకటే సమాధానం. ప్రేమ అనే భావన ఒక్కటీ జీవితాన్ని ఆనందమయం చెయ్యలేదు. ప్రేమను నిలబెట్టుకునే సామర్థ్యం, జ్ఞానం కూడా ఉండాలి. అసలు ప్రేమ గురించి గానీ, వివాహం గురించి కానీ యేమీ ఆలోచించకుండా వున్నపుడు వాసులా పరిస్థితులకు కొట్టుకుపోవటం తప్పదు. ఇంట్లో వాళ్ళు పెళ్ళాడమంటే ఆడాడు. జానకి మీద అనివార్యంగా కలిగే ప్రేమను పర్యవసానాల గురించి ఆలోచించకుండా అనుభవించాడు. దానివల్ల ముగ్గురి జీవితాలూ కల్లోలమయ్యాయి. ఇందులో యెవరిది తప్పు అని యెంచటం కంటే ధర్మబద్ధమై ఒకరకమైన వ్యాపార సంబంధమైన వివాహానికీ, వ్యక్తినిష్టమూ, లాభనష్టాల గురించీ, పర్యవసానాల గురించీ ఆలోచించనివ్వని ప్రేమకూ మధ్య జరిగిన సంఘర్షణగా అర్థం చేసుకోవాలి. ఈ సంఘర్షణలో ప్రేమ, వివాహమూ రెండు గాయపడ్డాయి. వ్యక్తులు నలిగారు. భిన్న సంస్కారాలు గల వ్యక్తులు వివాహం ద్వారా దగ్గరైనపుడు వారి మధ్య ఘర్షణ తప్పదు. ఆ సంబంధంలో అశాంతి తప్పదు. ఎందరి జీవితాలలోనో యిలా జరుగుతూ ఉంటుంది.

' ఆలోచించు' నవలలో ప్రేమ, స్నేహం, సమానత్వం అన్నీ వున్నాయనుకున్న స్త్రీ పురుష సంబంధాన్ని చిత్రించి దాన్ని ఒక వూపు వూపి చూశారు. లలిత, మూర్తి యిద్దరూ ఆధునిక

భావాలు కలవాళ్ళు........ఒకరినొకరు యిష్టపడి పెళ్ళి చేసుకున్నారు. ప్రతిదీ తర్కించి నిశితంగా ఆలోచించి చూడగలిగేవారు. ఆఖరికి పిల్లల విషయంలోకూడా తామిద్దరూ సమానస్తులుగా ఆలోచించారే తప్ప అతను మొగవాడు, తాను ఆడది అన్న ఎక్కువ తక్కువలు ఎరగరు. అతన్ని తను చాలా రోజులదాకా మూర్తి అని పిలిచేది.......... భార్య భర్తల్లో సమానత్వానికి అది తొలిమెట్టు అని అతని వాదన." ఇలాంటి భార్యా భర్తల మధ్య పెద్ద అగాధం వచ్చింది. మూర్తి మరొక అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. మామూలు భార్యా భర్తలయితే యిది యేదో ఒక రకంగా సమసిపోయేది. మగాడు ఇలాంటివి చేస్తాడు అని భార్య పోట్లాడి సరిపెట్టుకునేది. అతనూ భార్యను గదమాయించో, బెదిరించో, బుజ్జగించో దారికి తెచ్చుకునేవాడు. కానీ వీళ్ళిద్దరి మధ్యా ప్రేమ వుంది. ప్రేమ వుండగా 'యింకొకరు' తమ మధ్యకు యెలా వస్తారనేది లలిత ప్రశ్న. కానీ వచ్చింది. మామూలు సగటు భార్యాభర్తలయితే సంఘం యిందులో జోక్యం చేసుకునే వీలుంటుంది. బంధుమిత్రులు, స్నేహితులు యేదో రాజీ చేసే ప్రయత్నాలు చేస్తారు. కానీ వీరిద్దరూ వ్యక్తిత్వం, ఆత్మగౌరవం, సామర్థ్యం వున్నమనుషులు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలనుకునే మనుషులు. దీనంతటితో లలితకు మానసికంగా పెద్ద భాధ, ఘర్షణ, అంతర్మధనం. అనేక రకాలుగా ప్రయత్నించి చివరకు తన స్థాయికి తగిన మార్గంలోనే నడుస్తుంది లలిత. తన భర్తతో సంబంధం పెట్టుకున్న అమ్మాయికి సహాయపడి ఆమె జీవితాన్ని చక్కదిద్దుతుంది. తన జీవితాన్నీ చక్కదిద్దుకుంటుంది.

ఈ నవలలో స్త్రీ పురుష సంబంధాలలోని ఒక మిక్కి బద్దలు కొట్టారు. అవి యెంత వ్యక్తిగతమో అంతగా సామాజిక విలువలతో, ఆర్థిక పరిస్థితితో ముడిపడి వుంటాయి అని మూర్తి జీవితం చూస్తే అర్థమవుతుంది. ఈ సామాజిక విలువలను లెక్క చెయ్యనన్నాళ్ళూ మూర్తి లలితను సమానంగా చూశాడు. గౌరవించాడు. ప్రేమించాడు. అతనికి మామూలు విలువలైన ఆస్తి, పేరు, ప్రతిష్ట, పై వాళ్ళిచ్చే గౌరవం యివి ముఖ్యమైన తర్వాత లలితకు క్రమంగా దూరమయ్యాడు. అతనికి లలిత మీద ప్రేమ వుంది. కానీ దానిని పూర్వంలాగా అపురూపంగా గౌరవంగా చూసుకోలేకపోయాడు. "దానికేమవుతుంది. ఆ ప్రేమ అలా చెక్కు చెదరదు. యిదేదో ఓ చిన్న విషయమని అనుకున్నాడు. అలా అనుకోవటమంటే, అతి ముఖ్యమైన ప్రేమ విషయంలో తను చేసే పని పర్యవసానాల గురించి ఆలోచించకుండా బాధ్యతా రహితంగా వుండటమంటే అతనికి ఆ ప్రేమ మీద విలువలేదన్నమాట. ఇదే లలితను ఎక్కువ బాధ పెట్టింది. అది అర్థం కానంతవరకూ లలిత మరో అమ్మాయిని ద్వేషించింది. అట్లా ప్రేమను నిర్లక్ష్యం చెయ్యగలగటం ఈ సమాజపు కృత్రిమ విలువల ప్రభావం వల్లనే. మూర్తి అంత డబ్బు సంపాదించకపోతే అతను లలిత ప్రేమను అవమానించగలిగేవాడు కాదు. ఎంత గట్టి ప్రేమనైనా ఒక పట్టు పట్టి చూడగలిగే శక్తి డబ్బుకి వుంటుంది. డబ్బు, మగవాడిగా సమాజం అతనికిచ్చే అవకాశాలు, భావజాలం యివన్నీ మూర్తిని, అతనికి లలితమీద గల ప్రేమని ప్రభావితం చేశాయి. ఆ ప్రభావాల నుంచి తప్పుకోవటం తేలిక

కాదు. ఐతే చాలామంది ప్రేమకీ, పై విషయాలకూ సంబంధం వుంటుందని కూడా అనుకోరు. డబ్బు యెక్కువ వున్నపుడు ప్రేమ వుంటుందనుకునే వాళ్ళూ, డబ్బుకీ ప్రేమకూ సంబంధం లేదనుకునేవాళ్ళూ యెక్కువ మంది వుంటారు. డబ్బ డబ్బుగానే వుండదు. అది అనేక సామాజిక, సంప్రదాయ విలువలకు కూడలిగా వుంటుంది. డబ్బు సంపాదించటంలో, కూడబెట్టడంలో, ఖర్చు పెట్టటంలో అనేక సామాజిక విలువలు ప్రతిఫలిస్తాయి. దానిని గుర్తించకపోతే, జాగ్రత్త పడకపోతే మానవ విలువల పతనం ప్రారంభమవుతుంది. మాధవరావు మొదటినుంచీ డబ్బు, అది తెచ్చే సామాజిక హోదా, మగవాడిగా తన కున్న సాంఘిక హోదా, వీటి గురించి తన అభిప్రాయాలతో స్పష్టంగా ఉన్నాడు. మూర్తి అభిప్రాయాలు, ఆదర్శాలూ అన్నీ వాటికి భిన్నం. అతనివి ఆధునిక విలువలు. సంప్రదాయాలను తిరస్కరించి నూతనంగా ఆలోచించే తత్త్వం అతనిది. మగవాడిగా తనకున్న హోదాను వాడుకోవాలని అతను చూడలేదు. తన భార్య తనకన్నా తక్కువని అతడెన్నడూ అనుకోలేదు. ఐతే మాధవరావుతో కలిసి చేసిన వ్యాపారం, సంపాదించిన డబ్బు మూర్తిని మాధవరావు విలువల్లోకి ప్రయాణం చేసేలా చేశాయి. మూర్తి మాధవరావులా తయారవకపోవచ్చు.కానీ మాధవరావుని విమర్శ లేకుండా స్వీకరించగలిగాడు. తను కొన్ని ఫాల్స్ వాల్యూసిని నేర్చుకున్నాడు లోకపు నీతులను రీతులనూ విమర్శ లేకుండా ఆమోదించసాగాడు. మగవాడిననే హోదాను వినియోగించుకున్నాడు. ఇవన్నీ పనిచేయటం వల్లనే మూర్తి యింకొక అమ్మాయితో సంబంధం పెట్టుకోగలిగాడు. ఇదంతా గమనించి వీటినుంచి జాగ్రత్త పడినపుడే ప్రేమను విలువగా నిలుపుకోగలుగుతారు.

లలిత కూడా మూర్తి మీద అతనిలో వచ్చే మార్పుల మీదా విమర్శ పెట్టటం తప్ప గట్టిగా వ్యతిరేకించలేక పోయింది. ప్రతిఘటించలేక పోయింది. తీరా తన ప్రేమ పునాదే బీటలు వారేసరికి కారణాలు వెతుకుతూ తల్లడిల్లిపోయింది. ఇలా తల్లడిల్లటం మంచిదే అయింది. మూర్తి సంపాదనతో తృప్తిపడి, ఉద్యోగం మాని, ఇల్లు పిల్లలూ తప్ప మరో వ్యాపకం లేకుండా జీవితం గడుపుతున్న లలిత ఈ కుదుపుతో తన జీవితానికో సార్ధకతను వెతుక్కుంది. తన సంస్కారాన్ని, ప్రత్యేక విలువలను, డబ్బుతో పోగొట్టుకోలేదు గాబట్టి ఈ సంక్షోభాన్ని అధిగమించి తన సంస్కారపు స్థాయిని కూడాపెంచుకోగలిగింది. మరో స్త్రీని ద్వేషించటం నుంచి బైటపడి అర్థం చేసుకుని ఆదరించే స్థాయికి ఎదిగింది. చాలామంది స్త్రీల జీవితాల్లో యిలాంటి సంక్షోభాలు వస్తుంటాయి. భర్త మరో స్త్రీతో సంబంధం పెట్టుకోవటమనే భయం అందరు ఆడవాళ్ళనూ వేధించే నిరంతర భయం. ప్రేమ వున్నా లేకపోయినా భర్త మీద ఒక అధికారం, పొజెసివ్ నెస్ వుండటం, అతనిమీద ఆధారపడి వుంటే ఆ అభద్రత, యివన్నీ పని చేస్తూవుంటాయి. చాలామంది విషయంలో ఆ భయాలు నిజమవుతాయి. దాంతో వాళ్ళ జీవితం సర్వనాశనమయిందని వాళ్ళూ అనుకుంటారు. చుట్టు పక్కల వాళ్ళూ అనుకూంటారు. సాధారణంగా స్త్రీలు ఆ 'మరోస్త్రీ' పట్ల ద్వేషంతో తమ జీవితాలను నాశనం చేసుకుంటారు. భర్త నుంచి విడిపోయినా సరే భర్త గురించి మరో స్త్రీ

గురించిన పగతోనే, ఆ మంటతోనే జీవితాన్ని అర్థరహితం చేసుకుంటారు. 'ఆలోచించు' నవల అలాంటి స్త్రీలను ఆలోచింపజేస్తుంది. తమ మధ్య ఎడం ఎందుకొచ్చిందనే కాదు, అవతలి వ్యక్తిని అర్థం చేసుకోవాలని, పగతో కాక సానుభూతితో జాలితో, ప్రేమతో సమస్యను పరిష్కరించుకోవాలనీ చెబుతుంది. అలిత విషయంలో అదే జరిగింది. తన పరిధిలో తన పరిస్థితులలో ఆమె శాంతిని తెచ్చుకో గలిగింది. నిరాశతో, ఆత్మహత్యా ప్రయత్నాలతో దుర్భరమైన జీవితం నుంచి తనను, మరో స్త్రీనీ, భర్తను కూడా రక్షించగలిగింది. దాంపత్యంలో ఎదుటి వ్యక్తి బలహీనతలను గుర్తించటం, వాటితో తాము యెంతవరకు సర్దుకు పోగలమని ఆలోచించటం, తనకు నచ్చని వాటిని ప్రతిఘటించటం అవసరమని చెబుతుంది. ఎదుటి వ్యక్తి చేసింది మోసం కాకపోతే బలహీనత అని నమ్మినప్పుడు క్షమించటమనేది వారిమీద మనకు అధికారాన్ని ఇస్తుంది. ఐతే క్షమను అనర్హులకు యిస్తే అది బలహీనత అవుతుంది. వీటి గురించి ఆలోచించాలనీ, ఆ ఆలోచనల వెలుగులో జీవితాన్ని చక్కదిద్దుకోవాలని చెబుతుంది 'ఆలోచించు' నవల.

తెలిసీ తెలియని వయసులో టీనేజ్ అని మనం పిల్చే వయసులో ఆడపిల్లలు తమ జీవితాల గురించి సరైన నిర్ణయాలు తీసుకోలేనపుడు వచ్చే సమస్యలను మాలతీ చందూర్ కాంచన మృగం, సద్యోగం, కృష్ణవేణి నవలల్లో కథాంశాలుగా తీసుకున్నారు. కాంచన మృగంలో అమ్మాయి తల్లి వివేకవంతురాలైతే, సద్యోగంలో తండ్రి వివేకవంతుడు. ఆడపిల్లలు ప్రేమ అనే భ్రమలోనో వ్యామోహంలోనో పడి ఇళ్ళు వదిలి వెళ్ళినపుడు తలిదండ్రులు చాలా సంక్షోభంలో పడతారు. మోసపోయి తిరిగి ఇంటికి వచ్చినపుడు వారి పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది. పరువు ప్రతిష్టలు, చుట్టూ సమాజం కోసం ఒకరకంగా స్పందిచాల్సిన పరిస్థితి. తమ పిల్లల భవిష్యత్తు కోసం మరొకరకంగా స్పందించాల్సిన పరిస్థితి. వీటిలో చాలామంది తలిదండ్రులు పిల్లలను ద్వేషించటం హింసించటం, ఇంటినుంచి దూరంగా వుంచటం చేస్తారు. ఆడపిల్లలు గర్భవతులైతే ఇక అది చాలా పెద్ద సమస్య ఔతుంది. పూర్వం చాలామంది వితంతువులను కాశీ, రామేశ్వరం లాంటి పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్ళి అక్కడ బిడ్డ పుట్టిన తర్వాత ఆ బిడ్డలను అనాథ శరణాలయాల్లోనో, క్రిస్టియన్ మిషనరీలలోనో వదిలి వచ్చేవారు. కాలం మారే కొద్దీ కాశీ రామేశ్వరాల అవసరం తీరి తెలిసిన వారెవరూ లేని చోటికి తీసుకెళ్ళటం మామూలయింది. ఐతే ఆడపిల్లలను విపరీతంగా నిందించటం, వారిని ఆత్మహత్యలకు తరమటం, అసలు జరిగిన దేమిటో ఆలోచించుకునే వ్యవధిని, సహాయాన్ని యివ్వక పోవటం, వీటితో ఆ ఆడపిల్లలను హింసించేవారు తలిదండ్రులు, కాంచన మృగంలో తల్లి తన కూతురు గర్భవతి అనే విషయాన్ని ఇంట్లో మరెవ్వరికీ తెలియనియ్యకుండా ఆ అమ్మాయిని తీసుకుని మరో ఊరెళ్ళి అక్కడ ఆ అమ్మాయిని తన పేరుతో చేర్పించి కూతురికి మానసికంగా ఎంతో ధైర్యాన్నిస్తుంది. కూతురు ఆ అనుభవంతో కుంగిపోకుండా, ఆ అనుభవంతో వివేకం నేర్చుకుని ఎదిగేలా చేస్తుంది.

ISSN No.2319-3905

'సద్యోగం' నవలలో సుమిత్ర కూడా స్కూలు చదువుతో చదువాపేసి ఏవేవో ప్రభావాలతో ఒక యువకుడితో వెళ్ళిపోయి అతని వల్ల బాధలు పడి చివరకు తప్పించుకుని ఇల్లు చేరుతుంది. తండ్రి ఆ అమ్మాయిని తిట్టి కొట్టటం కాకుండా అండగా నిలబడతాడు. సుమిత్రను ఆ ఊరునుంచి మద్రాసు పంపి చదివిస్తాడు. ఆస్తిలో వాటా యిచ్చి భవిష్యత్తు గురించి భయం లేకుండా చేస్తాడు. తండ్రి ప్రేరణతో అన్న కూడ అండగా నిలుస్తాడు. సుమిత్ర లాయరై ఒక మంచి సీనియర్ దగ్గర చేరి పని నేర్చుకుంటుంది. తనను మోసం చేసినవాడి కేసు తీసుకుని అతనికి శిక్ష పడకుండా వాదిస్తుంది. మోసం చేసిన వారికి వ్యతిరేకంగా వాదించటం యెవరైనా చేసేపని. సుమిత్ర మోసం చేసిన వాడిని విడిపించటానికి పనిచేస్తుంది. వృత్తి ధర్మంలో తన పర భేదాలు చూడగూడదనీ, అతని కేసు వాదించటమంటే అతనికంటే చాలా ఎత్తున వున్నట్టు నిరూపించుకోవటమనీ, సీనియర్ చేసిన బోధ సుమిత్రకు ఒక ప్రొఫెషనల్గా, వ్యక్తిగా ప్రాణం పోస్తాయి.

ఈ రెండు నవలలూ స్త్రీలకెంతో ధైర్యాన్నిస్తాయి. సమస్యలు మనం వూహించుకునేంత భయంకరమైనవి కావనీ, మనం వివేకంతో నిర్ణయాలు తీసుకుంటే పరిష్కారాలు అసాధ్యం కావని అనిపింపజేస్తాయి. కృష్ణవేణి నవలలో లక్ష్మి సినిమాలలో ఛాన్స్ కోసం వచ్చి వ్యభిచారంలోకి జారినపుడు కూడ అమ్మాయికి తను చేసిన పొరపాటు దిద్దుకునే అవకాశం కలుగుతుంది.

వివిధ వృత్తులలోని స్త్రీలను మాలతీ చందూర్ వలే పరిచయం చేసిన రచయితలు చాలా తక్కువ. డాక్టరు, లాయర్, టీచర్, నర్సు, కళాకారులు, నటులు, సామాజిక సేవా రంగంలో పనిచేసేవారు, రేడియోలో పనిచేసేవారు, సెక్స్ వర్కర్స్ అనేక వృత్తులలోని స్త్రీలు పాత్రలుగా నవలల్లో ప్రవేశిస్తారు. ప్రతి వృత్తినీ అందులోని సాధక బాధకాలనూ క్లుప్తంగానే అయినా, ముఖ్యమైన వివరాలు మిస్ కాకుండా చెబుతారు రచయిత్రి. స్త్రీగా ఆ వృత్తిలో ఆమెకున్న అనుకూలాంశాలనూ, ప్రతికూలాంశాలనూ కూడా చెబుతారు. స్త్రీలు కొత్తగా ఆయా వృత్తులలో ప్రవేసిస్తున్న సందర్భంలో వాళ్ళు సమాజం తమకు నేర్పిన, అలవరిచిన బలహీనతలనూ, పరిమితులను, పరిధులనూ దాటి బైటికి రావాలనీ, 'ప్రొఫెషనల్' గా తయారు కావాలనీ మాలతీ చందూర్ ఆశించారు. అలాంటి వృత్తేజాన్ని స్త్రీలలో నింపే పాత్రలను సృష్టించారు. వృత్తికి అంకితమయ్యే స్త్రీ పాత్రలు సృష్టించటం తేలిక కాదు. సద్యోగంలో సుమిత్ర లాయర్. 'ఏమిటీ జీవితాలు'లో సురేఖ నర్తకి. 'ఏది గమ్యం ఏది మార్గం', మధుర స్మృతులు' లో మేరీ, నాగమణి డాక్టర్లు. కాంచనమృగంలో ఎలిజిబెత్ నర్సు. రేణుకాదేవి ఆత్మకథలో రేణుక, కలల వెలుగులో పద్మనటులు, రాగరక్తిమలో లెక్చరర్, కలల వెలుగులో యశోద లెక్చరర్. కృష్ణవేణి విజిలెన్స్ హోమ్ సూపర్నెంట్. అంబుజం హోమ్లో మేట్రన్. ఆలోచించులో లలిత టీచర్, తర్వాత విద్యారంగంలో కృషిచేసే కార్యకర్త, హృదయనేత్రిలో స్వరాజ్యం వృద్ధాశ్రమం స్థాపించాలనుకుంటుంది. ఇలా ఒక్కొక్క పాత్ర ఒక్కో వృత్తిని తమ జీవితాలకు అతి ముఖ్యమైనవిగా భావిస్తాయి. ఈ స్త్రీలు తమ కర్తవ్య నిర్వహణ

కంటే యేదీ ముఖ్యం కాదనుకుంటారు. నిజాయితీతో, అంకితభావంతో పని చేస్తారు. ఒకోసారి అక్కడ కూడా హింసకూ, దోపిడీకి గురవుతారు. స్త్రీలు 'ప్రొఫెషనల్గా ' వుండరనే విమర్శ చాలా బలంగా పెట్టే వెంకట్రామన్ పాత్రను సద్యోగం నవలలో సృష్టించి ఆ అవసరాన్ని నొక్కి చెప్పారు. వెంకట్రామన్ ఆడవాళ్ళను పరిహసిస్తాడు, అవహేళన చేస్తాడు. ఐతే అవి సుమిత్రలో పట్టుదల పెరగటానికి, మంచి లాయర్ తయారవటానికీ పనికొస్తాయే తప్ప ఆమెను కుంగదీయవు. చిన్న వ్యతిరేకత యెదురైనా, ఒక ప్రతికూలపు మాట వినిపించినా, యిక ఆ పని వదిలేసి పారిపోతే స్త్రీలు వివిధ వృత్తులలో రాణించలేరు. ఆయా వృత్తిరంగాలన్నీ పురుషులతో నిండిపోయాయి. పురుషులకే స్థిరపడి పోయాయి. వాటిలో కొత్తగా ప్రవేశించే స్త్రీలకు యెంతో బలం, సాహసం, పట్టుదల, ధైర్యం కావాలని చెబుతాయి మాలతీ చందూర్ నవలలు.

మాలతీ చందూర్ ఈ నవలల్లో మనకు ఒక మంచి విషయం చెప్పినట్లు కనిపిస్తుంది. ఈ నవలల్లోని స్త్రీలు కుటుంబ జీవితంలో భార్యలుగా, గృహిణులుగాపరాజయం చవి చూశారు, అశాంతి పాలయ్యారు గాని తమ వృత్తులలో ప్రతి ఒక్కరూ విజయాలే సాధించారు. ఆటంకాలన్నీ అధిగమిస్తూ, తమ శక్తి నిరూపించుకుంటూ, తమ ముద్ర వేసుకుంటూ ఆయా వృత్తులకు వన్నె తెచ్చారు. డాక్టర్లుగా మేరీ, నాగమణి చాలా నైపుణ్యం గలవారు. కానీ వాళ్ళ కుటుంబ జీవితంలో హింసలకూ బాధలకూ లోనయ్యారు. రేణుక ఎంత మంచి నటైనా కుటుంబ జీవితంలో దోపిడికి గురయింది. సుమిత్ర ముందే లైంగిక హింసకు గురైంది – తర్వాత యిక పెళ్ళి ప్రసక్తి పెట్టుకోలేదు. లాయర్ మధురం తన వృత్తిలో చాలా నైపుణ్యం వుండి, బాగా సంపాదిస్తూ తోటి లాయర్కి రెండవ భార్యగా వెళ్ళి అతని దోపిడీకి గురైంది. 'ఆలోచించు'లో లలిత కుటుంబంలోని అశాంతి వల్ల సమాజానికి వుపయోగపడే విద్యారంగంలో పనిచేయటానికి వస్తుంది. అద్భుతమైన నర్తకిగా పేరు తెచ్చుకున్నా తల్లిని కాలేక పోయాననే అశాంతితో జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకుంటుంది 'ఏమిటీ జీవితాలు'లో సురేఖ. ఈ కథలనూ, ఈ పాత్రలనూ చదువుతుంటే అనిపిస్తుంది కుటుంబంలో స్త్రీలకు దొరుకుతాయనుకునే భద్రత, సుఖం, శాంతి మిధ్యలేమోనని. భార్యగా, తల్లిగా తమ జీవితాలను సార్థకం చేసుకోవాలనే బోధనలను వదిలి స్త్రీలు తమను తాము నిరూపించుకుంటూ, తమ శక్తి సామర్థ్యాలు తాము తెలుసుకుంటూ, తెలియజేస్తూ, తమ అస్తిత్వాన్ని నిరూపించుకున్నపుడే వారి జీవితాలకు నిజమైన సార్థకత లభిస్తుందేమోననే ఆలోచన కలగజేస్తాయి ఈ నవలలు.

ఉద్యోగాలలో, వృత్తులలో వున్న స్త్రీల మధ్య స్నేహాన్ని, సంఘీభావాన్నీ మాలతీ చందూర్ చాలా సహజంగా చూపించారు. ఒకరికొకరు ఆ స్త్రీలు అండగా నిలబడటంతో చాలా ధైర్యం వస్తుంది. 'సద్యోగం' నవలలో మధురం ఘోరంగా మోసపోయినపుడు తోటి లాయర్లు సుమిత్ర, మేరీ ఆమెకు తోడుగా నిలబడతారు. మేరీ మధురాన్ని తన ఇంటికి తీసుకెళ్తుంది. అన్ని విధాలుగా ఆదుకుంటుంది. 'కలల వెలుగు'లో పద్మ తన సర్వస్వం అని నమ్మిన రామచంద్రం శవాన్ని

కూడా చూడలేని స్థితిలో వుంటే తోటి నటి ఆమెను ఆదుకుంటుంది. తన ఇంట్లో ఆశ్రయిమిచ్చి, యూనియన్తో మాట్లాడి ఆమెను రామచంద్రంతో సంబంధం వున్న వ్యక్తిగా గుర్తింపజేస్తుంది. 'ఏది గమ్యం ఏది మార్గం' లో డాక్టర్ మేరీకి ఆమె స్నేహితురాలు ఎన్నో మంచి సలహాల నిస్తుంది. అవకాశాలను చూపిస్తుంది. ఇక కృష్ణవేణి, జయ–లక్ష్మి నవలల్లోనైతే ఏ దిక్కూలేని స్త్రీలు ఒకరికొకరు దిక్కవుతారు. వుద్యోగం మానేసి పెళ్ళి చేసుకుని వెళ్ళి, అక్కడ హింసలు తప్పించుకునే మార్గం వెతుకుతూ వచ్చిన సుశీల గార్మెంట్ ఫాక్టరీలో తన తోటి వుద్యోగినులను చూసి పడిన ఆనందంలో వారి స్నేహం తెలుస్తుంది. కుటుంబంలో స్త్రీలకు దొరికే సహాయ సహకారాల కంటే సమాజంలో, పనిచేసేచోట దొరికే సహాయ సహకారాలు ఎక్కువనే విషయం మనకు అర్థమవుతుంది. 'ఆలోచించు' నవలలో స్కూలు అభివృద్ధికి ప్రిన్సిపాలు, లలిత పాటు పడటం, లలిత తన భర్తతో సంబంధం పెట్టుకున్న స్త్రీని అన్ని విధాలుగా ఆదుకుని, గౌరవంతో చూడటం, ఇలాంటి అపురూప సన్నివేశాలు ఈ నవలల నిండా వున్నాయి. కుటుంబంలో స్త్రీలకు సహాయ సహకారాలు అందినా అవి తప్పనిసరి బాధ్యతలు గానో, సహాయం చేసే వారి అవసరం కూడా కలిసి వుండటం వల్లనో జరుగుతాయి గానీ స్నేహంలో కలిసిన స్త్రీల మధ్య మానవత్వ పూరితమైన సంబంధాలు కనిపిస్తాయి.

శతాబ్దాల తరబడి పాతుకుపోయిన కుటుంబ సంబంధాలు బీటలు వారటమూ, అక్కడ స్వార్థం, స్వీయ ప్రయోజనాలే పెద్ద పీట వేసుకుంటే, ఆధునిక సమాజంలో చదువుల కోసం, వుద్యోగాల కోసం బైటికి వచ్చిన స్త్రీలకు తోటి స్త్రీల, నుంచి స్నేహం సహకారం అందటమనే అందమైన దృశ్యాన్ని మన ముందుంచారు మాలతీ చందూర్. స్నేహితులను ఆదుకోగల శక్తి కూడా కుటుంబ సంబంధాల పరిధిలో వున్న స్త్రీల కంటే, స్వతంత్రంగా వున్న స్త్రీలకు యెక్కువ వుంటుందని కూడా చెప్తారు మాలతీ చందూర్. సద్యోగం నవలలో మధురానికి తను ఎక్కువ సహాయపడలేక పోతున్నాననీ, దానికి కారణం తను అన్న ఇంట్లో, వారి అండన వుండటమని సుమిత్ర చెప్తుంది. మధురం భారాన్ని స్వతంత్రంగా జీవిస్తున్న మేరీ అవలీలగా స్వీకరిస్తుంది.

జాతీయోద్యమం ప్రధాన నేపధ్యంగా సాగిన హృదయ నేత్రి నవలలో స్త్రీ పాత్రలను చూస్తే ఎంత త్యాగాలు చేసిన స్త్రీలు కూడా అధికార రాజకీయాలకు చాలా దూరంగా ఉండిపోవాల్సిన పరిస్థితి వుందనీ, వుంటుందనీ మనకు అర్థమవుతుంది. జాతీయోద్యమంలో వేలమంది స్త్రీలు ఎంతో అంకితభావంతో పనిచేశారు. దేశ స్వతంత్ర సాధన తప్ప తమకు మరింకో వ్యక్తిగత జీవితమంటూ లేకుండా చేసుకున్నారు. త్యాగాలలో, తెలివితేటలలో, కార్యదీక్షలో, సామర్థంలో పురుషులకు తీసిపోమని నిరూపించుకున్నారు. ఐనప్పటికీ దేశం స్వతంత్రమైన తర్వాత దేశాభివృద్ధి కోసం కీలకమైన స్థానాలలో, పదవుల్లో వుండి పనిచేసే అవకాశం వారికి దొరకలేదు. వారు మార్జినలైజ్ చేయబడ్డారు. అధికార రాజకీయాలలో ముఠాతత్వాలు, అవినీతి చోటు చేసుకోవటానికి దోహదపడే పురుషులు ప్రవేశించారు. స్త్రీలు నిష్క్రమించి సేవారంగాలలోకి వెళ్ళాల్సివచ్చింది.

లేదా నిరాశలో కూరుకు పోవటం, కుటుంబ జీవితానికే పరిమితమవ్వటం జరిగింది.

'హృదయనేత్రి"నవలలో రామలక్ష్మమ్మ, జానకమ్మ పాత్రలు ఇలాంటివి. ముఖ్యంగా జానకమ్మ చీరాల పేరాల ఉద్యమం దగ్గరనుంచీదేశంకోసం జీవిస్తూ వచ్చింది. ఆమె అనుభవాన్ని స్వాతంత్ర్యానంతరం దేశాభివృద్ధి కోసం యెవరూ వాడుకోలేదు. ఆమె చాలా తెలివైనది, చురుకైనది. కానీ పాలన రాజకీయాలు ఆమెను దూరంగా ఉంచాయి. ఐనా ఆమె గ్రామం కోసం తను చెయ్యగలిగింది చెయ్యటం మానలేదు. గోపాలరావు వంటి నిజాయితీపరులు తాము చేసిన సేవల కోసం ప్రభుత్వం యిచ్చిన ఐదెకరాల భూమిని నిరాకరించారు. అది స్వార్థత్యాగమనుకున్నారు. కానీ జానకమ్మ ఐదెకరాలు తీసుకుంది. ఒంటరి ముసలమ్మకు యెంత ఆశ అని యెవరనుకున్నా చలించలేదు. ఆ ఐదెకరాలను గ్రామం బాగుకోసం, భూమిలేని వారి కోసం వినియోగించింది. కులాంతర వివాహం చేసుకున్న జంటను వూరంతా వెలివేస్తే తాను ఆశ్రయమిచ్చింది. ఊరి పెద్దల కుటిల రాజకీయాలను అర్థం చేసుకుని తన చిన్న చర్యల ద్వారా వీటిని దెబ్బతియ్యాలని చూస్తుంది. జానకమ్మ తనకు కావాల్సిన పద్ధతిలో రాజీ పడకుండా బతికింది. కానీ ఆమె అనుభవాల నుంచీ ?? కార్యదీక్ష నుంచీ, సమర్థత నుంచి, దేశం నేర్చుకునేందుకు లేకుండా, దేశాభివృద్ధి క్రమంలో జానకమ్మ వంటి వాళ్ళ పాత్ర లేకుండా రాజకీయపార్టీలు చేశాయి. స్వరాజ్యం తాతయ్య స్వతంత్ర పోరాటంలో జైలుకి వెళ్ళాడు. తండ్రి విప్లవపార్టీలో పనిచేస్తూ మరణించాడు. స్వరాజ్యం వృద్ధాశ్రమం స్థాపించాలనే గమ్యానికే పరిమితమయింది. అది బాధాకరమే. కానీ యువతరానికి ముఖ్యంగా స్త్రీలకు అవినీతిమయము, అధికారబలంతో నిండిన ఆ రాజకీయాలలో ప్రవేశించటం తేలిక కాదు. తామూ ఆ కుటిలత్వంతో కలిసిపోతే తప్ప మనుగడ లేని విధంగా రాజకీయ పార్టీలున్నపుడు సేవారంగాన్ని యెంచుకున్నదని స్వరాజ్యాన్ని తప్పుబట్టి యేం లాభం. స్వరాజ్యం తీసుకున్న నిర్ణయం వాస్తవానికి దగ్గరగానే వుంది.

మాలతీ చందూర్ నవలల్లోని స్త్రీ పాత్రలేవీ కారికేచర్ పాత్రలు కావు. అలా కాకుండానే పాఠకులకు కలకాలం గుర్తుంటాయి. కారికేచర్ పాత్రలను గుర్తుంచుకోవటం తేలిక. అతిలోక సౌందర్యవతులూ, సుగుణాల ప్రోవులు, మరీ అమాయకులు, విపరీతమైన హింసలు భరిస్తూ వుండేవారు, అతి దుర్మార్గులు, మరీ మంచివాళ్ళు యిలా పాత్రలలో ఆయా లక్షణాలను మూసపోసి మూర్తులుగా తయారుచేస్తే, ఆ పాత్రకు సంబంధించిన రసం –కరుణో, శృంగారమో, హాస్యమో, శాంతమో పాఠకులలో కలిగి ఆ పాత్రలు యెక్కువకాలం గుర్తుంటాయి. అదొక రచనా పద్ధతి. మాలతీచందూర్ పద్ధతి అది కాదు. వాస్తవ జీవితంలో అతి సామాన్యమైన పాత్రలు, మంచి చెడులతో, బలాలు, బలహీనతలతో, కాస్త అమాయకత్వం, మరికాస్త లౌక్యంతో, నిత్యం మారే కాలంతో పాటు తామూ మారుతూ వుండే పాత్రలను సృష్టించారు మాలతీ చందూర్.

కొడవటిగంటి కుటుంబరావు తర్వాత ఇలాంటి సామాన్యమైన పాత్రలను యెక్కువ సృష్టించిన రచయిత్రి మాలతీ చందూర్. మధ్య తరగతికి చెందిన సామాన్య వ్యక్తులు, ఆశయాలున్నా

ఆచరణలోకి తేలేనివాళ్ళు, రాజీపడే వాళ్ళు, అన్నీ తెలిసీ చేతకాని వాళ్ళలా వుండవలసి వచ్చిన వాళ్ళు, కాలంతో పాటు మారేవారు. – యిలాంటి పాత్రలతో కథ రక్తి కట్టించటం కష్టం. ఆ కష్టాన్ని అవలీలగా దాటారు మాలతీ చందూర్. ఆదర్శ పాత్రలు, నమూనా పాత్రలూ, ఈమె నవలల్లో కన్పించవు. బలహీనులు, ఆపన్నులు, దోపిడీకి గురయ్యే వ్యక్తులే నవలల్లో కథానాయికలుగా ప్రవేశిస్తారు. చాలా ఆదర్శాలున్న, వ్యక్తిత్వమున్న పాత్రలు కూడా సంక్లిష్ట సందర్భాలలో సామాన్యుల వలే బలహీనతలకు లోనై, వాటిపై పోరాటం చేసి జయిస్తారు తప్ప అతీతవ్యక్తులల్లే ప్రవర్తించరు.

పురుష పాత్రలను కూడా చాలా సమతూకంతో నిర్వహించారు. "వాళ్ళు మామూలు మనుషులు. దుర్మార్గంగా ప్రవర్తించినా వారి వారి నేపథ్యాల వల్లా, సమాజం వారికిచ్చిన బలం వల్లా ఆ ప్రవర్తన వచ్చినట్లు పాఠకులకు స్పష్టంగా తెలుస్తుంది. కలల వెలుగులో రామచంద్ర, ఏమిటీ జీవితాలులో రాజగోపాల్ 'ఏది గమ్యం ఏది మార్గం'లో విశ్వనాథం, 'ఎన్ని మెట్లెక్కినా' లో అవధాని చాలా బలహీనులు. వారు భార్యలనో, యితర స్త్రీలనో బాధించటమనేది సమాజం వారికిచ్చిన బలం వల్లా, వారి నేపథ్యం వల్లా జరిగింది. అది రచయిత్రి బలంగా చెప్పటంతో పాఠకులు ఆ పాత్రలను ద్వేషించలేరు. అర్థం చేసుకుని అలా ప్రవర్తించకుండా ఉండాలనుకుంటారు. మనుషులను, జీవితాలను సమాజాన్ని అర్థం చేసుకోగల శక్తినిచ్చేదే మంచి సాహిత్యం. పురుషుల అహంకారం, అవకాశాలు, బలహీనతలు అన్నీ అర్థం చేయించి, ఆ అహంకారాన్ని, బలహీనతలను సహించని వ్యక్తిత్వం తెచ్చుకోమని చెప్తాయి మాలతీ చందూర్ నవలలు.

ఆధార గ్రంథాలు

1. డాక్టర్ సంజీవమ్మ పి., తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం అభ్యుదయ రచయితల సంఘం కడప.
2. వెంకటసుబ్బయ్య వల్లంపాటి, నవలా శిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్.
3. డాక్టర్ శ్రీదేవి కే, స్త్రీవాద తాత్వికత ఓల్గా సాహిత్యంబీ సంహిత పబ్లికేషన్స్, హైదరాబాద్ .
4. డాక్టర్ నాగరాజు పొదిలి, . రాయలసీమ నవల సాహితీ పబ్లికేషన్స్ మైదుకూరు.
5. బాలగోపాల్ కే., రూపం– సారం సాహిత్యం పై బాలగోపాల్, , హైదరాబాద్ బుక్ ట్రస్టు.
6. హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
7. డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ప్రతిబింబం, అధి విమర్శ వ్యాసాలు, , ఆముక్త ప్రచురణలు, సికింద్రాబాద
8. సంపాదకుడు ఏ.కే ప్రభాకర్, బహుళ(సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు,ప్రమేయాలు పరికరాలు), పర్స్పెక్టివ్స్, సామాజిక శాస్త్రం/ సాహిత్యం, హైదరాబాద్

4

యానాదుల జీవన విధానం – వినోదాలు – వేడుకలు

– ఆచార్య పి.రమాదేవి

గిరిజనులు వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలువబడుతున్నారు. అలాంటి వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యానాది తెగ కూడా ఒకటి. యానాదుల గురించి వివిధ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. యానాదులకు ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, కళలు ఉన్నాయి. అనేక మంది జానపద విజ్ఞాన పరిశోధకులు తమ అధ్యయనాల్లో చెంచులే యానాదులని వీరు ఒకే సంతతికి చెందిన వారని అనేక ఉదాహరణల ద్వారా తెలిపారు. అంతేకాదు. ఆంధ్రప్రదేశ్ గిరిజనుల విచారణ కమిటీ నివేదిక ప్రకారం కూడా చెంచులు యానాదులు ఒకటే. కొండ కోనల్లో నివసించే చెంచులే మైదాన ప్రాంతాలకు చేరి యానాదులయ్యారని వీరి అభిప్రాయం. వారి ఆహారపుటలవాట్లు, మతపరమైన నమ్మకాలు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం అన్నీ ఒకటే.

కర్నూలు యానాదులు ఎక్కువగా నెల్లూరు, గుంటూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తారు. ఆంధ్రప్రదేశ్ మైదాన ప్రాంతంలో నివసించే ప్రధాన గిరిజన తెగలలో ఎరుకలు, యానాది లంబాడీలు ముఖ్యులు. వీరు గ్రామ శివార్లలో నివసిస్తారు. యానాదుల ప్రధాన వృత్తి చేపలు పట్టడం. ఇప్పుడిప్పుడే మిగిలిన వృత్తులు కూడా చేపడుతున్నారు.

యానాదులు నివాసముండే ప్రాంతాన్ని సంఘం (గూడెం) అంటారు. సంఘంలో కొన్ని పదుల సంఖ్యలో ఇండ్లు ఉంటాయి. ప్రతి సంఘంలో దేవుడి గుళ్ళు ఉంటాయి. అటవీ ప్రాంతంలో నివసించే వారు గుడిసెలలో మైదాన ప్రాంతంలో నివసించేవారు సాధారణ ఇండ్లలో నివసిస్తున్నారు. యానాదుల్లో భార్య భర్తను పేరుపెట్టి పిలువరు. యానాదుల్లో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవలు జరిగితే సాధ్యమైనంత వరకు ఆ గొడవ గ్రామపెద్దల ద్వారానే పరిష్కరించబడుతుంది. ఇతర గిరిజన తెగలవలె యానాదులకు ప్రత్యేక భాష అంటూ లేదు. తెలుగే వారి మాతృ భాష. వీరు మాట్లాడేది రాసేది తెలుగే. ప్రాంతాన్ని బట్టి 'యాస' మారుతుంది. గతంలో వీరు కొత్త వారిలో త్వరగా కలిసేవారు కాదు. ఇతరుల దగ్గర భయం, బిడియంతో ఉండేవారు. ప్రస్తుతం వారిలో చాలా మార్పు వచ్చింది. పిల్లలను చదివించే ప్రయత్నం చేస్తున్నారు.

జీవన విధానం

వృత్తిపనులు

యానాదులు జీవనం కోసం వివిధ పనులు చేస్తూ తద్వారా వచ్చిన ఆదాయంతో తమ కుటుంబాన్ని పోషించుకునేవారు.

అల్లికలు

గతంలో యానాదులకు బుట్టలు అల్లడం, చాపలు అల్లడం, లేసుల అల్లికలను ప్రభుత్వం నేర్పించేది. వీరు శ్రద్ధగా నేర్చుకొని పనిచేసేవారు. అయితే ప్రస్తుత కాలంలో అంతగా అవకాశాలు లేవు.

ఆహారం దినుసుల సేకరణ

ఆకులు

బొద్ది ఆకు, కలిశ, బీర, గడ్డనెల్లి, దేవదారు, తాటేటి,పొన్నగంటి, నెల్లి, గొట్టిగడ్డల, సన్నపాయ, గున్నంగి, పానపాత్ర, తూటాకు, నీరగబ్బ వంటి ఆకులను సేకరిస్తారు.

గడ్డదినుసులు

గొట్టిగడ్డలు, పెన్నేరు, పెద్దీత, చిట్టీత, కొండీత, మొగశెరి, కన్నెకోమలి, అల్లి, గిట్టిగీ, గోరుచుట్లూ, ఇంజేటి, కొండలోరా, కొండెల్లి, పూరి ఎల్లి, అడవి పెండలం, భూచక్రగడ్డ వంటి గడ్డ దినుసులను సేకరిస్తారు.

విత్తనాలు

చారపప్పు, పొగడ, గొట్టి, తంబ, పొన్నగాని, అల్లిబీర, ఊటి వంటి విత్తనాలను అడవిలో సేకరిస్తారు.

ఫలాలు

పొగడపండ్లు, గుత్తి, బీర,కలే, కొండ ఈత, మోవి, అల్లి దేవదారు, తుమ్మెద, వానకలే, చార వంటి ఫలాలను సేకరిస్తారు.

తేనె సేకరణ

కొండపైన ఉండే చెట్టు మొదలుకు మోకు బిగించి దానిని పట్టుకొని కిందకు దిగుతారు. తేనె తట్టకు సమంగా నిలబడి ముందు వెనకకు ఊగుతూ కడిచేతిలో ఉన్న కత్తితో తెట్టెను నరికి ఎడమ చేతిలో ఉన్న బుట్టలోకి వేసుకుంటారు. ఆ సమయంలో ఈగలు కుట్టకుండా గొంగడిని కప్పుకుంటారు. చేతిలోని దివిటితో ఈగలను తరముతారు. ఇటాంటి సాహసాన్ని ప్రాణంతో చెలగాటంగా చెప్పవచ్చు.

పాములు పట్టడం

యానాదులకు నాగుపాములంటే భయంలేదు. భక్తిలేదు. పట్టుకున్న పాములను పాములవారికి అమ్ముకుంటారు. చల్లా యానాదుల్లో చాలా మంది కుర్రవాళ్ళు అవలీలగా పాము

కంఠం వద్ద నొక్కి తమ దగ్గర ఉన్న బ్లేడుతో తల మొదలు తోక వరకు గీచి కండలను, ఎముకలను సునాయాసంగా వెలుపలికి నెట్టి చర్మాన్ని చుట్ట చుట్టి తాటాకుల బుట్టలో వేసుకుంటారు. తాటి పులుగు, నాగు పాము, కట్ల పాముల చర్మాలకు నాలుగు రూపాయలు చొప్పున సంపాదిస్తారు.

పాముకాటుకు మందు

నల్లేపరివేర్లు, నాగముష్టి బెరడు, గొట్టిచెక్క పాముకోర గింజలు, చిన్న పాము మరియు పెద్ద పాము గింజలు, నేలవేము కొమ్మల పొడిని దంచి తయారు చేస్తారు. ఈ పొడిని కొబ్బరినీళ్ళల్లో కలిపి ముద్దగా చేసి పది నిమిషాలు నానబెట్టి ఇవ్వాలి. చేదుగా ఉండే ఈ మందు పాముకుట్టిన వ్యక్తికి తియ్యగా ఉంటుంది. విషం ఎక్కని వ్యక్తికి చేదనిపిస్తుంది.

ఎలుకలు పట్టడం

రైతులు ఎలుకలు నుండి తమ పంటను రక్షంచుకోవడానికి యానాదులను ఆశ్రయిస్తారు. యానాదులు తమ దగ్గర ఉన్న బుట్టలను ఉపయోగించి ఎలుకలను పట్టుతారు.

ఎలుకబోను తయారీ

ఒక ఆడుగు పొడవుండే వెదురు బద్దకు గడ్డం అనే అడ్డుబుడిపె ఉంటుంది. ఈ బద్దకు ఒకవైపున చిన్న రెండు బద్దలతో త్రిభుజాకారంలో ఫ్రేములాగా మేకులు కొట్టి బిగిస్తారు. ఫ్రేముకు వెనుక వైపున ఎలుకకు తినడానికి పదార్థాలు వేసే బుట్ట బిగిస్తారు. ఫ్రేముకు ఎలుక తల లేదా శరీరాన్ని కొట్టి పట్టి ఉంచడానికి వీలుగా ఒక చిన్న బద్దను అమరుస్తారు. దీనికి పెద్ద వెదురుబద్ద నుంచి వచ్చిన సైకిలు ట్యూబు రబ్బర్లను పొగడానికి వీలుగా తొడుగుతారు. బెట్ట లోపలి వైపున ఎలుక కాలు పెడితే మందిగం బద్ద జారిపోయి పుల్ల ఎగిరిపోయి రబ్బర్లు కొట్టిన బద్ద క్రిందికి కొడుతుంది. రాంతో ఎలుక ఇరుక్కుపోతుంది.

తోటలో కావలా

మగవారు మామిడి తోటల్లోని కాయలను ఎవరూ కోయకుండా ఉండటానికి ఎండాకాలం సమయంలో కాపలాదారులుగా పనిచేస్తారు. తోట యజమానితో మొదట కుదిరిన ఒప్పందం ప్రకారం జీతం తీసుకొని పనిచేస్తారు. ఇతర సమయాల్లో జామాయిల్ కర్రలను కోయడానికి కూలీలుగా వెళ్తారు.

బంగారం వెతకడం

బంగారం అమ్మే దుకాణాల వద్ద మురికి కాలువల్లో జల్లెడ పడుతుంటారు. దుకాణాల్లో కసువు ఊడ్చినప్పుడు వచ్చే బంగారం మురికి కాలువల్లో పడినప్పుడు జల్లడ పడితే దొరుకునందేమోనని వీరి ఆశ. దీని కోసం రెండు మూడు రోజులు ప్రయత్నిస్తారు. దొరికితే దుకాణాదారుడితో సగం సగం అని పంచుకుంటారు. లేకపోతే రెండు లేదా మూడు వందలు డబ్బు తీసుకుంటారు.

చేపలువట్టడం

చేపలు పట్టడంలో యానాదికున్న నేర్పరితనం మరే వర్ణానికి తేదనవచ్చు. ఎండాకాలం ప్రారంభం కాగానే ఎండిపోయ్యే గుంటల్లోకి, పంటకాలువల్లోకి, చెరువుల్లోకి గుంపులు గుంపులుగా ఊతలను నెత్తిన బెట్టుకొని పరుగెత్తడం అనుదినం మనకు కనపడే దృశ్యం. చిన్న చిన్న చెలవలకు అడ్డుకట్ట కట్టి కుండపెంకులతోనూ దోసెళ్ళతోను నీటిని బయటికి చల్లి మిగిలిన బురదలో వట్టి చేతులతోనే చేపలను పట్టుతారు. చేపలు పట్టడానికి వీరు పెద్ద రంధ్రాలున్న బుట్టలను కూడ ఉపయోగిస్తారు. ఈ రంధ్రాలనుంచి లోపలికి వెళ్ళిన చేపలు బయటకు రాలేవు. కొందరు వలలు వేసి చేపలు పడుతుంటారు.

ఆచారాలు

యానాదులు పూజించే దేవతలు జానపదుల దేవతలు ఒకరే అయినా వీరికి మాత్రం అడవి దేవతలు కూడా ఉంటారు. వారు ఈ విధంగా ఉన్నారు.

కులదేవతలు

యానాదులు ఊరిలో ఉండే ఎల్లమ్మ దేవతనే కాకుండా నెల్లూరు కావలి దగ్గర వుండే ఆలయాలకు వెళ్ళి అక్కడి దేవతలను దర్శించుకుంటారు. అక్కడ ఉండే చెంచు దేవత అంకమ్మ తల్లి, కనకదుర్గ, బయటవెంకమ్మ, పాంచాల, మహాలక్ష్మి, పోతురాజు, తదితర దేవతను కొలుస్తారు. నరసింహాస్వామి తిరుపతి వెంకన్నలను కూడా కొలుస్తారు.

అడవి దేవతలు

ఊరి బయట అడవి లాంటి ప్రదేశంలో చెట్టుకింద ఉండే ఎల్లమ్మను పూజిస్తారు. అక్కడ ఒక నల్లని, తెల్లని రాతికి ఎల్లమ్మ దేవతను చెక్కినట్లుగా శిల్ప ఆకారం ఉంటుంది. మాదిగ దేవత అనే దేవర కూడా ఒక చెట్టు క్రింద విగ్రహంగా చెక్కబడి ఉంటుంది. చెంచులక్ష్మీని తమ ఆడపడుచుగా, నరసింహాస్వామిని అల్లుడుగా భావిస్తారు. లక్ష్మిదేవి చెంచుకులంలో పుట్టింది. మాకు ఆమె దేవత అని చెంచమ్మనే కొలుస్తారు. ఈ తెగలో చాలా మంది చెంచమ్మ అనే పేరును కలిగి ఉంటారు.

పూజా విధానం

యానాదులు వారికి వారే పూజారులుగా పని చేస్తారు. కర్రలతో తయారు చేసిన వివిధ రూపాలను విగ్రహాలుగా పూజిస్తారు. శ్రీహరికోట సమీపంలో ఇటుకలు, రాళ్ళు, వేపాకులు నీళ్ళ కలిపిన కుండలు, ఇళ్ళపై గీసిన దేవతల బొమ్మలు, బంకమట్టిని దేవుళ్ళ బొమ్మలుగా చేసి అరుక చెట్టు క్రింద ఒక గద్దెపై పెట్టి హిందువుల మాదిరిగానే పవిత్రంగా పూజిస్తారు. పూజకు కుంకుమ, పసుపు, పూలు ఉపయోగిస్తారు. అగరువత్తులను వెలిగించి హారతి ఇస్తారు. పండ్లు, పప్పుల్లాంటివి ప్రసాదంగా పంచి పెడతారు.

పండుగలు

వీరు హిందూ సంస్కృతిలోని పండుగలన్నీ జరుపుకుంటారు. జరుపుకనే పద్ధతిలో ఆడంబరాల్లో తేడా ఉన్నా పండుగలు చేసుకోవడం తప్పనిసరి. వినాయక చవితికి గణేష్ విగ్రహం తెచ్చి ప్రతిష్టించుకొని పదకొండు రోజుల పాటు యానాది మోళంతో వేషాలు వేసుకొని పద్యాలు పాడడం, ఆడడం చేస్తారు. అలాగే సంక్రాంతి, శివరాత్రి, ఉగాది శ్రీరామ నవమి దీపావళి, వెంకటమ్మ పండుగ వంటి పండుగలన్నీ జరుపుకొంటారు. పిల్లలు డాన్సులు చేస్తూ సంతోషంగా గడుపుతారు. ఆయా పండుగలకు సంబంధించి పిండి వంటలు కూడా చేసుకుంటారు.

పొలాల పండుగ

భూమాత అనుగ్రహం కోసం పొలాల పండుగ రోజున చేలకు దగ్గరగా కొలువై ఉన్న ఎల్లమ్మ దేవతను కొలుస్తారు. వర్షాలు పడకపోయినా ఆ దేవతకే మొక్కులు చెల్లిస్తారు. పసుపు, కుంకుమ కలిపిన నూటా ఒక్క బిందెల నీళ్ళతో ఎల్లమ్మ దేవతకు అభిషేకం చేస్తారు. అలా చేయడం వల్ల కొన్ని రోజులకు వర్షాలు కురుస్తాయి. ఇది కేవలం నమ్మకం. భక్తితో చేసినప్పటికీ వర్షాలు కురవడం విశేషం. ఈ కార్యక్రమాన్ని ప్రతి యేటా జరుపుతారు. వర్షాల కోసం ఒక కర్రకు వేప మండల మధ్యలో కప్పను కట్టి ఊర్లో తిప్పుతుంటే ప్రతి ఇంటి వారు నీళ్ళనుపోసి ముక్కుకుంటారు.

జాతర్లు

జాతరలను ప్రజలు అత్యంత ఉత్సాహంతో సామూహికంగా సాంఘిక ఉత్సవాలుగా జరుపుకుంటారు. జానపదుల పండుగల్లో జాతరలకు ఒక విశేషం ఉంది అందుకే జానపదుల పండుగలు అంటే జాతరలే అని ప్రసిద్దిని పొందాయి. ఊరి అవతల పోలేరమ్మ దేవతకు సంబరంగా తిరునాళ్ళు జరుపుతుంటారు. అక్కడ జరిగే జాతర కోలాహలంగా ఉంటుంది. నెల్లూరు ప్రాంతంలో జరిగే జాతర్లకు కూడా వీరు వెళ్తుంటారు.

సంస్కృతి:– గిరిజనులతో ఇతర తెగలకు ఉన్నట్లూ వీరికి కూడా సాంస్కృతిక విధానం ఉంది.

పురుషుల వస్త్రధారణ

యానాదులు తల వెంట్రుకలను కత్తిరించరు. అవసరము అంతగా లేనందున క్షవరము చేయించరు. యానాదులు జానపదులకు దగ్గరగానే ఉంటారు. అందువల్ల వారి వస్త్రధారణ ప్రభావం వీరిపై ఉంటుంది. చొక్కా, బనియన్లు, లుంగీ, భుజంపై తండుగడ్డ వేసుకుంటారు. యవకులైతే ప్యాంటు చొక్కా తొడుక్కుంటారు.

స్త్రీల వస్త్రధారణ

యానాది స్త్రీలు కట్టుకొనే చీరలు రవికలు పాచిపని చేయించుకునే యజమానులు ఇచ్చే పాత గుడ్డలుగానే ఉంటాయి. మెడలో నల్లపూసలు వేసుకుంటారు. కాటుక, కుంకుమ

ISSN No.2319-3905

పెట్టుకుంటారు. పాతకాలపు యానాదులు ఇంకను కొప్పులను వదలలేదు, విడిచిపెట్టలేదు. ముప్పై సంవత్సరాల క్రితం వారు ఈ కొప్పుల్లో దురుముకుంటూ ఉండినది ఉచితముగా లభించే తంగేడుపూలే.

<u>అలంకరణ – నగలు</u>

ప్రస్తుతం స్త్రీలు ఇత్తడితో చేసిన చెవిరింగులు, కొన్ని సార్లు బంగారంతో చేసిన చెవిపోగులు లేదా కమ్మలు పెట్టుకుంటారు. ఇత్తడితో చేసిన ముక్కపుడకను ముక్కుకు దరిస్తారు. చేతులకు గాజుతోచేసిన గాజులను తొడుక్కుంటారు. అల్యూమినియంతో చేసిన కడియాలను చేతులకు, వెండి గొలుసులను కాళ్ళకు ధరిస్తారు. కాలి రెండో వేలికి మట్టెలను, మంగళసూత్రాన్ని, నల్లపూసలను మెడలో ధరిస్తారు.

<u>ప్రసవం</u>

అమ్మాయి ప్రసవ వేదన పడుతుంటే కొందరు ఆడవాళ్ళను పిలుచుకుంటారు. వారిలోని పెద్దావిడ మంత్రసానిగా పనిచేస్తుంది. గర్భం సులభం కావడానికి ఆముదం ఊయడం, ద్రవాలు తాగించడం చేస్తారు. అలా చేయడం వల్ల సుఖ ప్రసవం జరిగేది. ప్రస్తుత కాలంలో కాన్పుసమయంలో డాక్టర్ల సలహాలు తీసుకోవాలనే ప్రచారం జరపడం వల్ల ఆసుపత్రులకు వెళ్తున్నారు.

<u>నామకరణం</u>

పిల్లలకు పేర్లు పెట్టాలనుకుంటే పురోహితుని దగ్గరకు వెళ్ళి పుట్టిన సమయం, రోజు, తిథి నక్షత్రాలను బట్టి ఏ అక్షరం వస్తుందో ఆ అక్షరంతో పేర్లు పెడతారు. నామకరణం రోజున బంధు మిత్రులందరినిపిలిచి తమకు తోచిన రీతిలో భోజనాలు పెట్టి పంపిస్తారు.

<u>కేశఖండనం</u>

పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీసేసమయంలో మేనమామకు కొన్ని బియ్యం ఒక కొత్త బట్ట, ఎనిమిది అణాలు కానుకగా ఇస్తారు. కేశఖండన కార్యక్రమంలో భాగంగా మేనమామ పిల్లవాడి వెంట్రుకలను కత్తిరిస్తాడు. వాటిని ముడివేసి అరుక చెట్టు కాండానికి కడతాడు. గుండు చేసిన తర్వాత పిల్లలను గ్రామ దేవతకు మొక్కిస్తారు. అతిథులు అంతా భోజనం చేసిన తర్వాత సాయంత్రం వరకు ఉండి చీకటి పడే సమయంలో కాగడాల వెలుతురులో నృత్యాలు చేస్తారు.

<u>మరణం – కర్మకాండలు</u>

యానాదులు చనిపోయిన వారిని పాతిపెడతారు. ఇంటిముందు ఆకులు వేసి శవాన్ని వాటిపై ఉంచి స్నానం చేయించి దుస్తులు వేస్తారు. కొడుకుచేత ఇతర బంధు వర్గంచేత మరమరాలు శవంపై చల్లిస్తారు. శవాన్ని తెల్లగుడ్డతో కప్పి స్మశానానికి తీసుకెళ్తారు. గోతికి దగ్గర ఒక నిర్ణీత స్థలంలో గీసిన అడ్డ నిలువు గీతలో శవాన్ని ఉంచి చూట్టూ తిరుగూ మంత్రాలు చదువుతారు. శవం దగ్గర వక్కలు, రాగి నాణేన్ని పెడతారు. స్మశాన కాపలాదారు యానాది భత్యస్తుడికి శవాన్ని

అప్పగిస్తారు. శవంపై గుడ్డతీసి గొయ్యలో బోర్లా పడుకోబెడతారు. ముందుగా పెద్ద కొడుకు ఇతర బంధువులతోకలసి మూడు పిడికళ్లతో మట్టిని తీసుకొని గొయ్యిలో శవంపై వేస్తాడు. తరువాత మట్టితో గోతిని నింపూస్తారు. అందరూ తిరిగి గూడేనికి చేరుకున్న తర్వాత స్నానాలు చేసి శుద్ధి అయి తమ గుడిసెలలోకి వెళ్తారు. మూడో రోజు మాత్రం స్తోమత ప్రకారం ఫోటో దగ్గర పాలు పోస్తారు. చిన్నదిన్న పేరుతో ఆహార పదార్థాలు నైవేద్యంగా పెట్టి భోజనాలు చేస్తారు. 12 రోజులకు జరిపే పెద్దకర్మకు మాత్రం బంధుమిత్రులందర్ని పిలిచి భోజనాలు పెడతారు. ఆడపడుచులు కొందరికి బట్టలు కూడా పెడతారు.

<u>పుష్పవతి వేడుక</u>

రజస్వల వేడుక వివాహ కార్యక్రమంలాగా జరుపుకుంటారు. దేనినే 'సీగదింపు శోభనం' అని కూడా అంటారు. రజస్వలను, పెళ్ళివేడుకల ఖర్చులను తగ్గించుకునేందుకు వీలుగా ఒక్కసారి జరుపుతారు. బంధువులందరికీ పంపబడే 'పుట్టు' అనే తినే పదార్థం లేకుండా రజస్వల కార్యక్రమం ఉండదు.

<u>బ్రహ్మంగారి దీక్ష</u>

బ్రహ్మంగారి దీక్షను 41 రోజులపాటు చేసి ముగిస్తారు. దీక్షకు మగవారు కాషాయ వస్త్రాలు ధరిస్తారు. ముట్టులేని ఆడవాళ్లు దీక్షలో పాల్గొంటారు. దీక్ష రోజుల్లో అందరూ గుడి పరిసరాల్లో ఉంటూ అక్కడే వంటలు చేసుకుంటారు. భోజనాలు చేస్తూ భజనల్లో పాల్గొంటారు. 40వ రోజు గురువు చేత ఇరుముడులు వేయించుకొని బ్రహ్మంగారి మఠం చేరుతారు. ముడుపుల అయచెల్చిఇ దీక్షను విరమించుకుని తిరిగి ఇంటికి వచ్చి పొంగలి చేసుకుంటారు. దీక్షధారి అత్తామామలు ఉంటే వారికి బట్టలు పెడతారు. పూజా కార్యక్రమాల అనంతరం బ్రహ్మంగారి ఉత్సవ విగ్రహం లేదా చిత్రపటాన్ని ఊరేగిస్తారు. బంధు మిత్రులందరినీ పిలిపించుకొని ఆనందంగా భోజనాలు చేసి దీక్షను ముగిస్తారు.

<u>బలి</u>

యానాదులు తమ కోరికలు నెరవేరాలని దేవుడిని కోరుకుంటారు. అవి నెరవేరిన తర్వాత వారు తమ శక్తి సామర్థాల మేరకు ఆర్థిక పరిస్థితుల పరంగా 'బలి'ని సమర్పిస్తారు. వీరు జానపదుల మాదిరిగా దసరా పండుగకు బలులు ఇవ్వరు. పోలేరమ్మకు పొంగలి పెట్టేటప్పుడు, నరసింహస్వామి తిరనాల, బ్రహ్మంగారి తిరునాల వంటివి ముగిసిన తర్వాత ఊరంతా కలిసి అమ్మవారి గుడి దగ్గరకు వెళ్ళి ఆర్థిక పిరస్థితిక తగినట్లుగా కోళ్ళను గానీ, మేకపోతులను గానీ సంతోషంగా బలి ఇచ్చి నైవేద్యం పెట్టి వండుకొని తిని ఆనందోత్సాహాలతో గడుపుతారు.

<u>ఆహారం</u>

యానాదులు మాంసాహారులు కావడం వల్ల కప్ప, పాము ఎద్దుమాంసం తప్ప ఇతర జంతువులన్నింటినీ తింటారు. కొంగలు, ఉడుతలు, కుందేళ్ళు, నత్తలు, ఎలుకలు, చేఉపలు,

ISSN No.2319-3905

ఎం(డ్రకాయలు, పందికొక్కుల్ని ఆహారంగా తీసుకుంటారు. శాఖాహారంగా అన్ని రకాల కూరగాయలు తింటారు. కూరగాయలు, ఆకుకూరలు పప్పులు తదితర జానపదుల భోజన పదార్థాలనే వీరు స్వీకరిస్తారు. రోటిపచ్చళ్ళు చేసుకుంటారు. మిరపకాయలు, చింతపండుతో రోట్లో వేసినలగ్గొట్టి దానినే పచ్చిపులుసులాగా చేసుకొని అన్నంలో కలుపుకుని తింటారు.

ఉపవాసం

వీరిలో కొందరు పండుగ సందర్భాలలో ఉపవాసాలు ఉంటారు. శివరాత్రి శివుడికి, గురువారం షిరిడీ సాయిబాబాకు, శనివారం వేంకటేశ్వరుని, ఉపవాసం ఉంటారు. ఏరోజు ఏదేవుడికి మొక్కుతారో ఆరోజు ఉపవాసం చేస్తారు. ఒకే పూట భోజనం కాని, పండ్లుగాని తింటారు. సోమవారంరోజు మాంసాన్ని ముట్టుకోరు.

వైద్యం

యానాదులు ఆరోగ్యం సరిగ్గా లేకపోతే వారికి తెలిసిన మూలికలు వాడతారు. ఒక వేళ వీరితో కాకపోతే ఆసుపత్రులకు వెళతారు. పిల్లలకు జలుబు చేస్తే జిల్లేడు పాలు ముక్కులో పోస్తారు. అలాగే వరిపొలాల్లో దొరికే గుంటగరగల ఆకు పసరును కూడా జలుబుకు వాడతారు. కడుపునొప్పికి అల్లగడ్డ, సంగపాల వేళ్లు గుడ్డలో మడిచి పేడలో పెట్టి పొయ్యిలోని నిప్పులకు వేడిచేస్తారు. కొంతసేపుంచి వాటిని నూరి రసం త్రాగిస్తే నొప్పితగ్గుతుందని వీరి నమ్మకం. గతంలో ఇంటి దూలానికి తాళ్ళు కట్టించి ప్రసవం అయ్యేలా చూసేవారు. ప్రస్తుతం నాటు వైద్యాన్ని ఎవరూ చేయించుకోవడం లేదు.

ఆధారగ్రంధాలు

1. యానాది – వెన్నెలకంటి రాఘవయ్య.
2. కొండకోనల్లో తెలుగు గిరిజనులు – శివరామకృష్ణ
3. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరజన జీవన చిత్రణ – వేణుగోపాలు పొట్ట
4. తెలుగు కావ్యాల్లో గిరిజన సంస్కృతి – బి.రామాచార్యులు.
5. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ – వేణుగోపాలు మిట్ట

5

ద్రావిడ జానపద ప్రదర్శన కళలు

– ఆచార్య టి.రామప్రసాదరెడ్డి

సంగీతం, నాట్యం, రూపకం లాంటి ప్రక్రియలను జానపద ప్రదర్శన కళలు అంటారు. యక్షగానం, తోలుబొమ్మలాట, కోలాటం, చెక్కభజన, బుర్రకథ, పఠం కతలు, దప్పులు, గంగారెద్దులాట మొదలగు ఎన్నో దృశ్య కళారూపాలు ఉన్నాయి. ఈ జానపద కళలు మనిషిలోని సృజనాత్మకతకు అద్దం పడతాయి. జానపదులు రోజు వారి జీవితంలో ఎదుర్కొనే శ్రమను మరచిపోవడానికి ఈ కళలను సృష్టించి అభ్యాసం చేసుకున్నారు. ఒకతరం నుంచి మరొక తరానికి సంక్రమిండంలో వీటిలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ద్రావిడ జానపద కళలు గ్రామీణ ప్రజలకు తరతరాల నుంచి సంక్రమించే ఆస్థిపాస్తుల్లాంటివి. ఆయా గ్రామాల్లో నాటి నుండి నేటి వరకు ఈకళలు అగ్రతాంబూలం అందుకున్నాయి. సంగీతం, నృత్యం, సాహిత్యం లతో కలగలసిన ఈ కళారూపాలు అనేక పరిణామాలు చెందుతూ వస్తున్నాయి.

'కళ' అనేది అనుకరణగా పుట్టి వృత్తి చాతుర్యతను, భావనాశక్తిని చిత్ర, ధ్వని, లయ, రూపంలో అభివ్యక్తం చేయడమే అని పరిశోధకుల అభిప్రాయం. మనిషి మస్థిష్కంలో జనించి మానవుని చాతుర్యంతో సృష్టికి ప్రతిరూపంగా భాషించే ఈ కళారూపాలు ఒకతరంనుంచి ఇంకొక తరానికి మార్పులు చెందుతూ మానవ సమాజంలో అత్యంత ఆదరణ పొందుతున్నాయి. ఇందులో కురవంజి, బయలాట, కలాపాలు, చెంచు నాటకం, జాలరి భాగవతం, నక్కల భాగవతం, జేగంట భాగవతం, చిందుభాగవతం, తూర్పు భాగవతం, గంటె భాగవతం, మాల భాగవతం, యానాది భాగవతం, గొల్లభాగవతం ముఖ్యమైనవి.

కురవంజి

మన కళారూపాలలో అతి ప్రాచీనమైనది కురవంజి. తెలుగు కావ్యాలలో కురవంజి ప్రస్తావన చాలా చోట్ల కనిసిస్తుంది. కొందరు కొరవంజి అనీ మరికొందరు కురవంజి అని పిలుస్తుంటారు. పరిశోధకుల దృష్టి నుంచి ఆలోచిస్తే కొరవంజి పరిణామమే యక్షగానం అని స్పష్టమవుతుంది. కురవంజి అంటే కొరవజాతి స్త్రీ అని, ఎరుకలు చేసే నాట్య విశేషమని చెప్పబడింది. 16 వ శతాబ్దిలోనే కురవంజి ప్రస్థావన కనిపిస్తుంది. అయ్యలరాజు రామభద్రుడు

రామాభ్యుదయంలో 'జక్కణి కొరవంజి మేళమాల గేళికలు సల్పిరి' అని పేర్కొనడం వల్ల అప్పటికే కొరవంజి నాట్యం చాలా ప్రాచుర్యం పొందినట్లు ఊహించవచ్చు.

ఈ కురవంజులలో రెండు విభాగాలు గోచరిస్తున్నాయి. అందులో ఒకటి శృంగార కురవంజులు, రెండవది వేదాంత కురవంజులు. శృంగార కురవంజులు నాయికా నాయకుల ప్రణయానికి సంబంధించినవి. వేదాంత కురవంజులు వేదాంత బోధకు సంబంధించినవి. తెలుగు వారి మొదటి జానపద కళారూపం కొరవంజి. ఈ విషయాన్ని దృశ్యరూపాల మీద పరిశోధించిన చాలా మంది పరిశోధకులు రుజువు చేశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి కురవంజి పదం నుంచే యక్షగానం అనే పదం ఉత్పన్నమైనదని పేర్కొన్నారు. లయాత్మకంగా, రాగాత్మకంగా, నృత్యాత్మకంగా సాగిన ఈ ప్రాచీన కళారూపం నేడు పూర్తిగా కనుమరుగైంది. కళారూపంలోని ప్రధాన పాత్రలైన సింగి, సింగడు మాత్రమే మిగిలారు. ఈ రెండు పాత్రలు కొరవంజి ఆటకు సూత్రధారులై నడిపేవి.

<u>బయలాట</u>

బయలులో ఆడే ఆట 'బయలాట'. ఇది అచ్చమైన జానపద నాటకం. సర్కారు ప్రాంతాలలో ఉన్న యక్షగానం, వీధి భాగవతం అనే జానపద నాటకాలు రాయలసీమలో బయలాట అనే పేరుతో పిలువబడుతున్నాయి. ఈ బయలాటల మీద కన్నడ 'బయలాట' ల ప్రభావం కనిపిస్తుంది. దీనికి సాక్ష్యం అనంతపురం జిల్లాలోని పెనుగొండ, హిందూపురం, కళ్యాణదుర్గం ప్రాంతాలలో తెలుగు బయలాటలే కాకుండా కన్నడ బయలాటలు ఎక్కువగా ప్రదర్శించడం జరుగుతుంది.

బయలాటను ఆడటానికి నిర్దిష్టమైన రంగమంటపం ఉండదు. అప్పటికప్పుడే రంగమంటపాన్ని నిర్మించి, ఆట ముగిసిన వెంటనే తీసివేస్తారు. నాలుగు స్తంభాలను నాటి, ఆస్తంభాల మధ్య కొంత ఎత్తులో పలకలను జోడించి రంగమంటపాన్ని నిర్మిస్తారు. ఈ మంటపం 18 అడుగుల పొడవు 9 అడుగుల వెడల్పు ఉంటుంది. అలా ఉండటం వల్ల పాత్రధారులు ఎగరడానికి అనువుగా ఉంటుంది. అంతేకాకుండా ప్రేక్షకులు మంటపానికి ముందు, కుడి ఎడమల ప్రక్కగా కూర్చొని నాటకాన్ని చూడటానికి వీలుగా ఉంటుంది. ఈ బయలాట రంగమంటపాలు దేవాలయానికి దగ్గర్లోగాని ఊరి మధ్యలో చావడి ప్రదేశానికి చేరువలోకాని నిర్మిస్తారు.

బయలాటల్లో పౌరాణిక గాథలే అధికం. వీర, రౌద్ర, భయానక రసాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇందులో స్త్రీ పాత్రలను పురుషులు ధరిస్తారు. భావాలకు భాషలకు తగిన విధంగా రంగులువేయడం బయలాటలలోని ప్రత్యేకతగా చెప్పవచ్చు. బయలాటలు రాత్రి పదిగంటల సమయంలో మొదలై మరుసటి రోజు ఉదయం ఆరు గంటల దాకా ప్రదర్శింపబడతాయి. బయలాట వినోదాత్మక ప్రక్రియ కావడంవల్ల ప్రేక్షకులకు విసుగుపుట్టదు. యక్షగానాలల్లో లాగానే బయలాటల్లో కూడా పద్యాలు, పాటలు, దరువులు ఉంటాయి. సాధారణంగా ప్రేక్షకులు డబ్బిచ్చి నాటకాన్ని చూడటం పరిపాటి అయితే గ్రామసీమల్లో నాటకాల మీద అభిరుచి ఉన్న నటులే తమకుతాము

చందాలు వేసుకొని నాటకాలను కంఠస్థం చేసి ప్రదర్శనలు ఇస్తారు. బయలాటను గీత రూపం అనవచ్చు. పాడుతూ గంతులు వేయడం, గంతులు వేస్తూ పాడటం ఇందులోని విశేషం.

<u>కలాపాలు</u>

జానపద కళారూపాలలో కలాపం చాలా ప్రసిద్ధమైనది. ప్రాచీనమైనది కూడా. భామాకలాపం, గొల్ల కలాపం, చోడిగాని కలాపం అని వివిధ పేర్లతో కలాపాలు ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే యక్షగాన ప్రబంధాలకు రూపాంతరాలే కలపాలు. ఏదో ఒక నాయిక పాత్రను ధరించి ఆడుతూ, పాడుతూ తన కథను తానే చెప్పుకునే యక్షగాన రూపమే కలాపం. భామాకలాపం, గొల్లకలాపం వంటివి మార్గశాఖకు చెందినవి. చొడిగాని కలాపం దేశీశాఖకు చెందినది. కలాపం, కలాప రచనలు అనేవి వ్యవహారంలో ఉన్న పేర్లు. కలాపం ముఖ్య లక్షణం ఆడి పాడి అభినయించడం, పామరులను సైతం ఆకర్షించుకోవడం. కలాపాలు రసాత్మకతను నింపుకొని ఉండటం వల్ల ఇప్పటికీ జీవకళలుగానే ఉన్నాయి.

కళాప్రదర్శనలు ఎప్పటి నుంచి ప్రచారంలోకి వచ్చాయి అని చెప్పటానికి తగిన ఆధారాలు లేవు. విశేష ప్రచారం తెచ్చిపెట్టిన వారుగా కూచిపూడి వారినే పేర్కొనవలసి ఉంటుంది. చొడిగాని కలాపంలోని చొడిగాని వేషం చేతిలో వంకర కర్ర, కాలికి కడియాలు, గోచీ, కంబళీ, అడ్డంగా కట్టిన తలగుడ్డతో ప్రత్యక్షమవుతుంది. చోడిగాని వేషం హాస్యంతో కూడుకొని ఉంటుంది. ఒంటినిండా సున్నపు బొట్టులూ, మధ్య నల్లచుక్కలూ, కాకి ఈకల కుచ్చుతో అతని శరీరం ఉంటుంది. దసరా ఉత్సవాలలో గొంతాలమ్మ పండుగలలోని ప్రదర్శనల్లో ఇతనిదే అగ్రతాంబూలం. సోలెగాడు, చోలెగాడు, చోడిగాడు, సింగడని వివిధ పేర్లతో పిలవబడుతుంటాడు.

తోలుబొమ్మలాటలో జుట్టుపోలిగాడు, బంగారక్క, అల్లాటప్పగాడు అనే పాత్రలకు ఎటువంటి ప్రాధాన్యం ఉందో కలాపంలో చోడిగాడికి అంతటి ప్రాధాన్యం ఉంది. అయితే పాత్రలలో కాస్త తేడా ఉంది. బొమ్మలాటలలో అవి హాస్యపాత్రలు మాత్రమే. కలాపంలో చోడిగాడు హాస్యగాడుగా మరియు కథానాయకుడుగా కనిపిస్తాడు.

<u>చెంచునాటకం</u>

పూర్వ కాలంలో చెంచు నాటకాలను గొల్లవారు ప్రదర్శించేవారు. పల్లెటూళ్లలో వీరినాటకాలు గొప్ప ఆదరణ పొందాయి. కళాకారులు ప్రతి గ్రామంలోనూ నాటకాలను ప్రదర్శిస్తూ వారు ఇచ్చే పారితోషికాలను తీసుకొని జీవించేవారు. చెంచు నాటకాలలో ముఖ్యమైన నాటకం అహోబిల నరసింహ స్వామి నాటకం చెంచితల యొక్క వివిహ మహోత్సవం ఇందులో ఇతివృత్తంగా కనిపిస్తుంది.

చెంచులక్ష్మిని తమ ఆడబిడ్డగా భావించి ఆమెకు సంబంధించిన కథను నాటకంగా ప్రదర్శిస్తారు. వీరు శరీరాన్ని నెమలి ఈకలతో అలంకరించుకుంటారు. నెమలి ఈకల్ని చీల్చి సుందరంగా పేర్చి, తలకు కిరీటంలాగా మెడలో కంఠాభరణంగా వేసుకుంటారు. కొన్ని ప్రాంతాలలో

చెంచులే నాటకాల్ని ప్రదర్శిస్తారు. చెంచులక్ష్మి గుడి ఉన్న ప్రాంతాలలో వెంకటేశ్వరుడి పెండ్లి వేడుకల సందర్భంలో వీరికి ప్రాధాన్యం ఉంటుంది.

చెంచులలో ఎక్కు మంది నెమలి ఈకలు, పులిగోర్లు, ముత్యాలు అమ్ముకొని జీవిస్తారు. మరికొంత మంది అడవిలో దొరికే తేనెను అమ్ముకొని జీవిస్తారు. చెంచులలో చాలా వరకు శ్రీ పురుషులిద్దరూ భిక్షాటన చేస్తుంటారు. ఒకరి ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు మరొకరు వెళ్ళరు. విడివిడిగాను, లేదా బృందంగాను భిక్షాటన చేస్తారు.

బృందంలో ఒకరు పాడగా మిగిలిన వారు వంత పాడతారు. చేతిలో జేగంటలు పట్టుకొని, ఒక పుల్లతో పాడేపాటకు తాళంగా ఉపయోగిస్తారు. వీరు భిక్షాటన చేయగా వచ్చిన చొక్కాలు, లాగూలు, పూలదండలు, తలపాగాలు,పాగాలపై నెమలి ఈకలు, పులిగోరులు, అడవి పందికోరలు వంటివి అలంకరించుకుంటారు.

వీరిలో కొంతమంది ఎలుగుబంటిని పట్టుకొని గ్రామంలోకి తీసుకువస్తారు. ఎలుగుబంటిని ఆడించి డబ్బులు తీసుకుంటారు. ఎలుగుబంటి వెంట్రుకలను పిల్లల మొలత్రాళ్ళకు కడితే దయ్యాలు వంటివి వారి దరికి చేరవని, పిల్లలకు భయపడే కలలు రావని చెబుతారు. నరసింహా స్వామి ఉత్సవాలలో చెంచు స్త్రీలు విల్లంబులు చేత పట్టుకొని యాత్రికుల మధ్య స్వేచ్ఛగా తిరుగుతారు. కర్నూలు జిల్లాలో వీరి సంచారం ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా శ్రీశైలం అడవుల్లో ఎక్కువగా కనిపిస్తారు.

<u>జాలరి భాగవతం</u>

శ్రీకాకుళం జిల్లా జానపద కళారూపాలలో 'జాలరి భాగోతం' ఒకటి. బెస్తవారి ఆటపాటలే జాలరి భాగవతంగా రూపొందింది. శ్రీకాకుళం జిల్లాకు తీర ప్రాంతం విస్తృతంగా ఉంది. నదీ సంపద మీద ఆధారపడి జీవించే మత్స్యకారులు తమ ఆనందోత్సాహాల కోసం సృష్టించుకున్న కళారూపం వీధి భాగవతంగా రూపొంది జాలరి భాతవతం అయింది. సంగీతం నృత్యాలు ప్రధానంగా ఉన్న కళారూపం ఇది. వీరు ప్రదర్శించే జాలరి భాగవతంలో ముఖ్యంగా మత్స్యగంధి కథ, గుహుని కథ ముఖ్యమైనవి.

శ్రీకాకుళం జిల్లాలో నేడు భాగవత బృందాలున్నాయి. వీరి ప్రదర్శనలో భామ, విధూషకుడు ప్రధాన పాత్ర పోషిస్తారు. భామ వేశాన్ని ఆర్.వెంకటనాయుడు, హాస్య పాత్రను గుడివాడ చిన్న వేస్తారు. గంగాడ గ్రామంలోని ' రాధాకృష్ణ నాట్యమండలి' ఈ కళారూప ప్రదర్శనలో పేరెన్నికగన్నది. మృదంగం, హార్మోనియంలను సహకార వాద్యాలుగా ఉపయోగిస్తారు.

<u>నక్కల భాగవతం</u>

యక్షగానం పేరున యక్షులు కురవంజులను అనుకరించి ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. ఈ యక్షగానాన్ని రాష్ట్రంలోని వివిధ కులస్తులు గ్రహించి ఈ నాటకాలను ప్రదర్శించేవారు. ఇందులో భగవంతుని లీలలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. ఈ కథలను

గ్రహించి మాదిగలు చిందు అనే అడుగును జోడించి చిందు భాగవతమనే పేరున ప్రదర్శించారు. వీధినాటకం అనగానే వీధిలో ప్రదర్శించే నాటకమని స్ఫురణకు వస్తుంది. కూచిపూడి వారు ప్రదర్శిస్తే కూచిపూడి భాగోతం అని, చెంచుల ప్రదర్శిస్తే చెంచు నాటకం అని పేరు వచ్చింది. అలాగే నక్కలవాళ్ళు ప్రదర్శించటం వల్ల 'నక్కల భాగోతం' అని పేరు వచ్చింది. ఈ రూపం ఎక్కడ ప్రదర్శిస్తున్నారో? అసలు ఉందో లేదో తెలియలేదు.

<u>జేగంట భాగవతం</u>

పూర్వం దీపాలంకరణ చేయడానికి వీలులేక గరుడస్తంభం అనే పేరుతో దీప స్తంభాన్ని నడివీధిలో ఒక చోట నిలిచోబెట్టి, ఆదీపం చుటూ తిరుగుతూ, ఆ వెలుగులో చేతిలోని గంటను మ్రోగించుకుంటూ కథ చెప్పేవారు. అందువల్లే ఈ భాగవతానికి జేగంట భాగవతమని పేరువచ్చింది.

'ఎందుకయ్యా ఉంచినావు బందిఖానాలో' అని రామదాసు బందిఖానా విషయాన్ని రామాలక్ష్మణ సీత విగ్రహాలతో కూడిన దీపపు స్తంభాన్ని పట్టుకుని నోటితో పాడుతూ, గజ్జెలకాళ్లతో నృత్యం చేస్తూ, చిరుతలతో తాళం వేస్తూ, స్తంభం చుట్టూ కలయతిరుగుతూ నాట్యం చేస్తారు.

<u>చిందు భాగవతం</u>

'చిందు అంటే అడుగు' అని అర్థం. నృత్య విశేషం. చిందు భాగవతం ప్రధానంగా తెలంగాణా జిల్లాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వీరు ఎల్లమ్మ కథను, జాంబవంతుని కథను మాత్రమే ఆడతారు. పట్టపగలే ఆడతారు. కేవలం హరిజనులను మాత్రమే యాచిస్తారు. ఇతరులు ఎవరైనా ఇస్తే తీసుకుంటారు. కానీ యాచించరు. వీరు చిందు భాగవతంలో తావెల్లె,తగవాలెల్లె! అనే ఆవృతి పల్లవిని పలుకుతారు. ఆహార్యాదులు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఇందులోని దరువులు, కీర్తనలు, జోలలు, సప్తవిధ తాళములు అన్నీ యక్షగాన కళారూపానికి అతి దగ్గరగా ఉంటాయి. పురుషులు, మహిళలు కలిసి చిందు ప్రదర్శనలలో పాల్గొంటారు. ఒక్కోసారి పురుష పాత్రలను స్త్రీలు, స్త్రీల పాత్రలను పురుషులు ధరించడం ఈ కళారూపం ప్రత్యేకత. తమ కులదేవతను ప్రసన్నం చేసుకోవడానికి ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. తెలుగు సినిమా పాటలతో నృత్యంతో ప్రారంభమై ఎల్లమ్మ సాక్షాత్కారంతో ప్రదర్శన ముగుస్తుంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో ఉన్న చిందు భాగవతం బృందాలు ఈ ప్రదర్శనలకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.

<u>తూర్పుభాగవతం</u>

శ్రీ కూచిపూడి సిద్దేంద్రస్వామి నృత్య సంప్రదాయాలలో భామాకలాపం ఒకటి. సంగీత నృత్య అభినయాలతో కూడిన ఈ కలాపం తూర్పు భాతవతంగా చెక్కతో తయారు చేసిన సామాగ్రి వీరి వేషధారణలో ముఖ్య భాగాన్ని ఆక్రమించుకుంటుంది. వేషధారులు గానం చేస్తూ, భావానికి అనుగుణమైన అభినయం చేస్తారు. దీనికి అనుగుణంగా మృదంగం వాయిస్తారు. వేషధారి పాడే పాటకు వంతపాడతారు.

గంటె భాగవతాలు

పూర్వం విద్యుద్దీపాలు లేవు. కిరోసిన్ పెట్రొమాక్సులైట్లు లేవు. రాత్రిపూట వెలుతురు కోసం ప్రతి ఇంటి నుండి గరిటెడు తైలము తెచ్చి రచ్చమామిడి వద్ద ఒక పాత్రలో పోసేవారు. ఆ వెలుగులో భాగవతము ఆడేవారు. ఇందులోని ఆటలు, పాటలు, దరువులు, యక్షగాన ప్రక్రియకు సరిసమానంగా ఉండేవి. గంటెతో నూనె పోయడం వల్ల గంటె భాగవతం కావడం విచిత్రమనిపిస్తుంది.

మాలభాగవతం

మాలభాగవతులు నాటక ప్రదర్వన మొదట్లో వారి పల్లెలకే పరిమితమై ఉండేది. పల్లెల చివర ఖాళీ స్థలాల్లో చిన్న చిన్న డేరాలువేసి పాత చీరెలు తెరగుడ్డలుగా కట్టి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇందులో భాషా జ్ఞానము, సంగీత జ్ఞానము తగినంతగా ఉండేది కాదు. అనుకరణ ద్వారా వారు పాటలను, మాటలను నేర్చుకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. అక్షరజ్ఞానము ఉన్నవారు ప్రధాన భూమికను పోషిస్తూ తమకు తెలిసిన విషయాలు బోధించుకుంటూ ఆటాపాటలతో ప్రజలను ఆకట్టుకునేవారు. వారు నాటకాలలో స్త్రీ పాత్రలను పురుషులే దరించేవారు. వారు దరించిన ఆభరణములు అట్టలతో చేసిన కిరీటములు, భుజకీర్తులు రంగుకాగితాలతో తయారు చేసిన పూలు ధరించేవారు. ఈ వీధి భాగవతులు ప్రకాశం జిల్లాలో ఎక్కువగా కనిపిస్తారు. ప్రస్తుతం కొందరు కళాకారులు వయోభారము చేత ప్రదర్శనలు ఇవ్వలేక గ్రామాల్లో సరైన ఆదరణ లేక బ్రతుకును భారంగా భావిస్తున్నారు.

యానాది భాగవతం

యానాది భాగవతుల ప్రదర్శన ప్రత్యేకంగా విలక్షణంగా ఉంటుంది. వీరి ప్రత్యేకత ఏమనగా ప్రతి పాత్రధారుడు పాటపాడుతూ నృత్యం చేస్తూ బయటకు వస్తాడు. వీరి రాగాలాపన ఒక విధమైన యాసతో కూడుకొని ఉంటుంది. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరిస్తారు. ఇది వారి ప్రత్యేకత. పొడవాటి జడకలిగి దానికి రంగురంగుల పూలను ధరించి, చేతులకు రకరకాల గాజులను వేసుకొని, తగరములతో తయారుచేసిన ఆభరణాలను ధరిస్తారు. వీరి అలంకరణ మిగిలిన వారి అలంకరణ కన్న వైవిధ్యంగా ఉంటుంది. యానాది భాగవతులు ముఖ్యంగా చెంచులక్ష్మి, భక్తప్రహ్లాద, నల్లతంగాళ్, సైంధవ పరాభవము, శశిరేఖా పరిణయం వంటినాటకాలను ప్రదర్శిస్తారు.

కొన్ని నాటక బృందాల వారు ఈ నాటకాలకు సరియైన ఆదరణ లేకపోవుట చేత మాగాణి భూములకు కాపలాదారులుగాను, రిక్షాలు తొక్కుకుంటూ, చిన్న చిన్న పండ్ల వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. యానాదులు కేవలం భాగవతాలకే పరిమితం కాకుండా గుర్రాలాట, పగటివేషాలు, నెమలి ఆట, హాస్యం మొదలగు ఆటలు ఆడుతారు.

గొల్ల భాగవతం

యాదవులలో ఒక తెగవారు ఈ వీధి భాగవత నాటక ప్రదర్శన ఇస్తుంటారు. వీరినే ఎర్రగొల్లలని అంటారు. వీరు ముఖ్యంగా భక్త ప్రహ్లాద, కృష్ణలీలలు, కాటమరాజు కథ, హరిశ్చంద్ర,

కంసవధ, రుక్మిణి కళ్యాణం, శిశుపాలవధ, కృష్ణబలరాములు, పూతన సంహరణం, కాళీయమర్దనం, యాదవరాజుల చరిత్ర మున్నగునాటకాలను ప్రదర్శించేవారు. నాటకము పూర్తి అయిన తర్వాత స్త్రీ పాత్రలు ముఖ్యమైన పెద్దల ఇళ్ళకు వెళ్ళి సంభావనలు తీసుకునేవారు. ప్రకాశం జిల్లాలో ఈ గొల్ల భాగవతులు ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, తోకపల్లె, నాగళ్లముడిపి మొదలగు ప్రాంతాలలో నివసిస్తున్నారు. యాదవులైన గొల్లవారు ఈ నాటకాలను ప్రదర్శించడం వల్ల గొల్ల భాగవతం అని పేరు వచ్చింది.

ఆధార గ్రంథాలు

1. తెలుగు నాట జానపద వైద్య విధానాలు(1990) – అనంతయ్య పటేలు.
2. జానపద నాటకాలు – అరుణ కుమారి.
3. జానపద కళారూపాలు – సాహిత్యం – ఆనందన్ కొళాగుంట.
4. గిరిజన సంస్కృతి(2011 మే అండ్ జూన్ సంచిక)– ఈదన్న నిమ్మల.
5. తెలంగాణాలో యక్షగానం – రచన – ప్రయోగం (1994) – ఎల్లారెడ్డి ప్రొద్దుటూరు.
6. జానపద రంగస్థలం – ఆధునిక రంగస్థలం – బి.కె. కిరణ్ కుమార్
7. తెలుగు నాటక సాహిత్య విమర్శ, పరిణామాలు – కిషన్ ప్రసాద్ గంగు.
8. జానపద సరస్వతి – నాయిని కృష్ణకుమారి.
9. దశ రూపక సందర్శనం (ఉపన్యాస సంకలనం) – ఇరివెంటి కృష్ణమూర్తి.
10. చిత్తూరు జిల్లా వీధినాటకాలు – ఒక పరిశీలన – వి.గోవింద రెడ్డి.
11. జానపద కళాసంపద – తూమాటి దోణప్ప.
12. సాంఘిక జానపద ఆచారాలు – జి.యస్.మోహన్ (1994).
13. జానపద విజ్ఞానాధ్యయనం – జి.యస్.మోహన్ (2001).
14. నాటక విజ్ఞాన సర్వస్వం – పి.వి.రమణ (2008).
15. తెలుగు వారి జానపద కళారూపాలు – మిక్కిలి నేని రాధాకృష్ణమూర్తి (1992).
16. జానపద గేయ సాహిత్యం (1986) – కసిరెడ్డి వెంకటరెడ్డి.
17. వీధినాటకాలు – భాగవతాలు – కసిరెడ్డి వెంకటరెడ్డి.
18. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ (2008) విట్ట వేణుగోపాలు.

ISSN No.2319-3905

6

గురజాడ సంస్కరణాభ్యుదయం

- ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

(గురజాడ జయంతి సందర్భంగా కీలకోపన్యాసం)

ఆధునికాంధ్ర సాహిత్య నిర్మాణంలో, అభిరుచి నిర్ణయంలో రాళ్లెత్తిన తొలి ముగ్గురు కూలీలు కందుకూరి వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు గార్లే. గురజాడ పుట్టింది తే:21.09.1862న అయితే మరణించింది తే:30.11.1915 నాడు. శ్రీశ్రీ పుట్టిన ఐదేళ్లకే గురజాడ మరణించారు. వీరి తల్లిదండ్రులు వేంకటరామదాసు, కౌసల్యమ్మలు. 1882వ సంవత్సరం నాటికి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత ఎఫ్.ఏ, బి.ఏ చదివారు. 1882లోనే CUCKOO అనే గేయ రచన ఇంగ్లీషులో చేశాడు.

ఆధునిక మహా నాటకంగా చెప్పుకుంటున్న 'కన్యాశుల్కం' రచన అప్పారావు అధ్యాపకుడిగా పనిచేస్తున్న కాలం 1986-87 ప్రాంతంలో జరిగి ఉంటుందని కేవి రమణారెడ్డి భావించారు. 1893లో దీన్ని విజయనగర సంస్థానాధీశుడైన ఆనందగజపతిరాజుకి అంకితమిచ్చారు. అయితే తొలి ముద్రణ 1897లో జరిగింది. 1892వ సంవత్సరం ఆగష్టులోనే జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారిచే కన్యాశుల్క నాటక ప్రదర్శన జరిగింది. 'కన్యాశుల్కం' రెండవ కూర్పు ముద్రణ 1909వ సంవత్సరంలో జరిగింది. 1874లోనే మద్రాసులో స్త్రీ పునర్వివాహ సమాజం ఏర్పడింది. ఆ తర్వాత ఏడు సంవత్సరాలకు వీరేశలింగం ఆధ్వర్యంలో రాజమండ్రిలో మొదటి పునర్వివాహం జరిగింది. కందుకూరి వీరేశలింగం ప్రారంభించిన సంఘసంస్కరణోద్యమాన్ని బలపరిచే ఉద్దేశ్యంతోనే అప్పారావు ఈ నాటక రచనకి పూనుకున్నాడు. కన్యాశుల్కం నాటక రచన తర్వాత అప్పారావు తన సాహిత్య వ్యాసంగం యావత్తూ పుస్తక పఠనానికే పరిమితమైంది. మద్రాసులోని హిగ్గిన్ బాథమ్స్' వారితో, కేంబ్రిడ్జి ప్రచురణ సంస్థ సహకారంతో అనేక విదేశీ, స్వదేశీ పుస్తకాలు చదువుతూ వచ్చారు.

ఆనందగజపతిరాజు మరణం తర్వాత 1898లో రీవారాణి ఆంతరంగిక కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాడు. రీవారాణితో పాటు యాత్రలు చేస్తూ 1903 నుండి నీలగిరి యాత్రలు చేశాడు.

ఈ సందర్భంగా నీలగిరి పాటలు రాసి 1907లో ముద్రణ చేసి రీవారాణికి అంకితమిచ్చారు. 1906వ సంవత్సరంలో గురజాడ వారు రెండవ రచన నాటకం 'కొండుభట్టీయం' రచించారు. అయితే ఆ పుస్తకం కనిపించకుండాపోయింది. రెండేళ్ల తర్వాత మళ్లీ సరికొత్తగా రచించటానికి ఉపక్రమించారు. అయితే అది పూర్తి కాకుండా మిగిలిపోయింది. ఈ నాటకంలో రాజకీయ, మత, సాంఘిక జీవితంలో ఆనాటికి వచ్చినమార్పులు, వందేమాతర ఉద్యమం, దివ్యజ్ఞాన, బ్రహ్మసమాజ కార్యక్రమాలు, వేశ్యల అగచాట్లు, వితంతువుల కష్టాలు, యువకుల చేష్టలు వంటివి ఈ నాటకంలో ప్రతిబింబిస్తాయి.

చారిత్రకాంశం ఆధారంగా మూడవ నాటకం రాయడానికి గురజాడ ఆలోచించారు, నీలగిరి యాత్రలో ఒక నవల రాయడానికి తలపెట్టారు. అయితే ఈ రెండు రచనలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

1910వ సంవత్సరం నుండి ఆధునిక కవిత్వం ప్రారంభమైందని చెప్పడానికి ఆద్యుడు గురజాడ. ప్రాచీన లిఖిత సాహిత్యానికి చదువరులు తక్కువ. విద్యాధికుల సంఖ్య కూడా ఆనాడు తక్కువ. పద్యరచనా ప్రౌఢిమ, వర్ణనా పాగ్రల్భ్యం, రసాలంకార నిర్మాణ శైలి, చిత్రకవితారీతులు ఆహ్లాదాన్ని కల్గించాయోమో గానీ, స్పందనని కల్గించలేకపోయాయి. ఆధునిక కాలంలో విద్యావ్యాప్తి క్రమంగా పెరిగింది. సాహిత్య పాఠకులూ పెరిగారు. జీవన విధానంలో మార్పులు వచ్చాయి. ఎక్కువ మంది పాఠకుల అభిరుచి వైవిధ్యానికి సరిపడా సాహిత్య ప్రక్రియలు ఏర్పడ్డాయి. కథ, నవల, వ్యాసం వంటి సాహిత్య ప్రక్రియలు వచ్చాయి. అందువల్ల ఆయా ప్రక్రియల్లో వాడే భాష అందరికీ అందుబాటులో ఉండే భాష, కనీసం అర్థమయ్యే భాషగా రూపాంతరం చెందుతూవచ్చింది. అదేవిధంగా కవిత్వంలో కూడా శైలి సరళీకృతమైంది. కవుల పాండిత్య ప్రకర్షకి ప్రాధాన్యం తగ్గి, పాఠకుల అభిరుచికి తగ్గట్లుగా భావావేశానికి ప్రాముఖ్యత పెరిగింది.

గురజాడ 1882వ సంవత్సరం నుండే ఇంగ్లీషులో రచనలు చేశాడు. మొదట్లో సంప్రదాయ రీతిలో, ప్రాచీన వృత్తాల్లో మాటలు మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు, సుభద్ర, రుతుశతకంవంటి రచనలు చేశారు. అయితే అవి గురజాడను సంతృప్తి పరచలేదు. 1892లో 'కన్యాశుల్కం' నాటక రచనతో మొదలైన ఆయన సంస్కరణాభ్యుదయవాదం అనేక రూపాల్లో, ప్రక్రియల్లోకి రూపాంతరం చెందింది. భారత జాతీయోద్యమం బలపడుతున్న ఆ రోజుల్లో,ఆంధ్రదేశంలో బిపిన్ చంద్రపాల్ పర్యటించి జాతీయభావాల్ని రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు. వందేమాతర ఉద్యమం యువతని ఆకర్షిస్తోంది. ఆ సందర్భంలో ఎల్లలుదాటిన దేశ భక్తినిప్రబోధించడానికి 1910లో 'దేశభక్తి' గేయాన్ని గురజాడ అప్పారావు రాశాడు. బంకించంద్ర 'వందేమాతరం' గేయం జాతీయోద్యమ స్ఫూర్తితో కొండలు, నదులు, వృక్షాలు వంటివాటిని ప్రస్తావించిన తీరు గురజాడకి నచ్చలేదు. అందుకే ఆ గేయానికి విరుగుడుగా 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని

ISSN No.2319-3905

ఉద్ఘాటించారు. భౌతిక సంపద, కళా విలసనం, వ్యాపార వాణిజ్యాల అభివృద్ధి, ప్రగతి దృష్టి, సార్వజనీనమైన శాంతి, పరస్పర సహకారం, జాతుల మైత్రి, మతాల సంయమన ధోరణి, దేశమంతా ఒకే ఆర్థిక విధానం అమలు, స్వదేశీ పరిశ్రమల స్థాపన, ఇతర దేశాలతో వాణిజ్యాభివృద్ధి వంటి వాటిని ప్రస్తావిస్తూ, దేశభక్తిని ప్రబోధించాడు.

గురజాడ చేసిన కొత్త ప్రయోగాల్లో 'ముత్యాల సరం' ఒకటి. ఈ పేరు ఈయన కల్పించుకున్నదే. ముత్యాల సరాలు రాయడానికి గురజాడని ప్రోత్సహించిన ఒక విశేషం హేలీస్ కామెట్ (Halleys Comet) 1704లో ఎడ్మండ్ హేలీ ఒక తోక చుక్క. 75 ఏళ్లకు ఒకసారి దర్శనమిస్తుందని, దరిమిలా 1910లో కనిపించింది. అది శకల ప్రాయమై వేలాది మైళ్ల మేర ముత్యాల వంటి వెలుగులు విరజిమ్మిందని, అందువల్లే దానికి 'ముత్యాలహారం' అని పేరు పెట్టారని, ఈ కవితలకి 'ముత్యాల సరములు' అనే శీర్షిక పెట్టాడానికి కారణమైందని నార్లవేంకటేశ్వరరావు గారు తే: 13.10.1965 నాటి ఆంధ్రజ్యోతి సంపాదకీయంలో రాశారు. నిజానికి మొదట్లో అప్పారావు పెట్టిన శీర్షిక 'తోకచుక్క' మాత్రమే.

ముత్యాలసరంలో నాలుగు పాదాలుంటాయి. సాధారణంగా మొదటి మూడు పాదాల్లో 3+4, 3+4=14 మాత్రలుంటాయి. నాల్గవ పాదంలో 7 నుండి 12 మాత్రలుంటాయి. గురజాడ చేసుకున్న నియమం ఇది. ఫార్సీ గజల్ నడకను ముత్యాల సరాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నించాడని ఆయనే చెప్పారు. మిశ్రగతిలో నడిచే 'వృషభగతి రగడ'కు ఇది దగ్గరగా ఉంటుంది. రగడల్లో అంత్యప్రాస ఉంటుంది. యతి ప్రాస నియమం ఉంటుంది.

ఉదా:	దేశ	మునుప్రే	మించు	మన్నా
	3	4	3	4
	మంచి	అన్నది	పెంచు	మన్నా
	3	4	3	4
	వొట్టి	మాటలు	కట్టి	పెట్టోయ్
	3	4	3	4
	గట్టి	మేల్ తల	పెట్ట	వోయ్
	3	4	3	2

అదేవిధంగా:

ఆకులందున అణగిమణగీ
కవిత కోవిల పలక వలెనోయీ
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయీ!

ఆకుల మధ్య ఉండే కోయిల కనిపించదు. కానీ ఆ కోయిల గొంతుక శ్రావ్యంగా ప్రజలందరికీ వినిపిస్తుంది. కవి కూడా అలాంటి వాడే. కవి పలుకులు విన్న ప్రజల హృదయాల్లో దేశభక్తి మొలకెత్తాలని గురజాడ ప్రబోధించాడు.

అన్నిదేశాల్ క్రమ్మవలెనోయి
దేశి సరుకుల నమ్మవలెనోయి
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపదలబ్బవోయి

యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడనోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి

మనుషులు తమ తెలివి తేటలతో అన్ని రంగాల్లోనూ పరిశ్రమించి దేశి ఉత్పత్తులు పెంచాలని, అన్ని దేశాలు తిరిగి స్వదేశీ వాణిజ్యం పెంపొందించి డబ్బు సంపాదించి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆశించాడు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి కాకుండా, స్వదేశీ ఉత్పత్తులు పెంపొందించి, విదేశ వాణిజ్యం చేసి దేశానికి ఆర్థికాభివృద్ధి సాధించాలనే ప్రబోధం ఇందులో కనిపిస్తుంది.

స్వంతలాభం కొంత మానుకు
పొరుగువాడికి తోడుపడవోయి
దేశమంటేమట్టికాదోయి
దేశమంటే మనుషులోయ్

దేశమంటే మట్టికాదని, భౌగోళికమైన ఆస్తికాదని మనుషులని, పరస్పర సహకారం ప్రధానమని, స్వంత లాభం కొంత మాత్రమే మానుకుని నిస్వార్థంగా పక్కవాడికి సాయపడాలని ప్రబోధించాడు.

గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలు' గేయాలేకాక కాసులు, డామన్ పితియస్, లవణరాజుకల, ఉమాపతి అర్చన, కన్యక, పూర్ణమ్మ వంటి గేయ కావ్య రచనలు చేశారు. ఇంకా సత్యవతి శతక రచన, కొండు భట్టీయం, బిల్హణీయం వంటి నాటక రచనలు, గ్రామ్యశబ్ద విచారణము, ఆకాశరామన్న ఉత్తరాలు, కవిత్వము-వర్ధ్సువర్తు బాలికా పాఠశాల, రవీంద్రకవి వంటి వ్యాసరచనలు, సుభద్ర కావ్య రచనలు చేశారు.

ISSN No.2319-3905

తెలుగులో మొదటి సాంఘిక నాటకమే కాక, మొట్టమొదటి ఆదునిక కథా రచన చేశారు. కథానికను ఆధునిక సాహిత్య ప్రక్రియగా రూపొందించిన ఘనత గురజాడ అప్పారావుకే దక్కింది. సమకాలికమైన కథా వస్తువును ఎంపిక చేసుకోవడం, ఎత్తుగడ, ముగింపు వరకు కథను మంచి పట్టులో నడిపించడం, చక్కటి మలుపులు తిప్పడం, ఆధునిక భాషలో రచన చేయడం, ఆధునిక సంస్కారాన్ని అందించడం గురజాడ ప్రత్యేకత. ఆయన రాసినవి ఐదే కథలు,. అవి దిద్దుబాటు, మీపేరేమిటి, మెటిల్డా, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం.

కట్టుకున్న ఇల్లాలిసంగతి పట్టించుకోకుండా పరస్త్రీ వ్యామోహం పడిన భర్తను నేర్పుగా చక్కదిద్దిన ఇల్లాలి చుట్టూ నడిచిన కథ 'దిద్దుబాటు'. మతం పేరిట మూఢనమ్మకాలనూ, స్వార్థాలనూ, పరస్పర విద్వేషాలనూ పెంచుకునే మూఢ సమాజాన్ని కళ్లకు కట్టినట్టి చూపే కథ 'మీపేరేమిటి'. ముసలి మొగుడి పంజరంలో పడి రెక్కలు తెగిన పక్షిలా పడి ఉన్న పడుచు భార్య బతుకు ఎలా పరాధీనమై కష్టాలు అనుభవించిందో తెలిపే కథ 'మెటిల్డా'. ఒక నాటి హిందూ దేవాలయం కాలవైపరీత్యం వల్ల మసీదుగా ఎలా మారిపోయిందో, ఒక నిష్టాగరిష్ఠుడైన హిందువు ఎలా ముస్లిముగా మతాంతరం చెందాడో తెలిపే కథ 'పెద్ద మసీదు', చివరి కథ 'సంస్కర్త హృదయం' Stopping to rise పేర ఇంగ్లీషులో రాశారు. ఇది అచ్చు కాలేదు. తర్వాత దీన్ని అవసరాల సూర్యారావు తెలుగులోకి అనువదించాడు. ఈ విధంగా గురజాడ రాసిన కథలో సంఖ్యలో తక్కువైనా ఆణిముత్యాలుగా భాసించాయి. గురజాడ వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేయడమే కాకుండా, విమర్శ వ్యాసాలు కూడా రాశారు. ముఖ్యంగా ఆయన ఇంగ్లీషులో రాసిన 'అసమ్మతి పత్రం' వాడుక భాష తీరుతెన్నులు, కావ్యభాష పరిమితులనూ ఉదహరణపూర్వకంగా చర్చించిన సిద్ధాంత గ్రంథంగా భావించవచ్చు.

గురజాడ కథల్లో 'మీ పేరేమిటి' కథను తీసుకుంటే ఇందులో మతానికి సంబంధించిన చారిత్రక, సామాజిక పరిస్థితులు వెల్లడవుతాయి. 12వ శతాబ్ది ప్రాంతంలో వైష్ణవులకు, శైవులకు వివాదాలు తలెత్తాయి. వారిమధ్య సామరస్యం సాధించడం కోసం ఆ తర్వాతి శతాబ్దంలో ప్రయత్నాలు జరిగి, హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించడం జరిగింది. అయినప్పటికీ అవకాశం చూసుకుని ఒకరిపై మరొకరు ఆధిపత్యం ప్రదర్శించే సంఘటనలూ జరిగాయి. భక్తి పేరుతో మూఢ విశ్వాసాలు, భక్తిని స్వార్థానికి వినియోగించుకోవడం వంటివి పెరిగాయి. ఈ రకమైన మతపరమైనమూఢ విశ్వాసాలను కుటిల స్వభావాన్ని విమర్శించడానికి ఈ కథను రాశారు.

రామగిరిలో శైవ, వైష్ణవ మతాలకు వైరంఉంది. శైవులకు నాయకుడు శరభయ్య, వైష్ణవులకు నాయకుడు సాతాని మనవాళ్లయ్య. వారికి వారు తమ గురించి గొప్పలు చెప్పుకుటూ ఉంటారు. ఈ పరిస్థితుల్లో గుండం తొక్కడానికి శివాచార్లు ఏర్పాటు చేశారు. ఆ గుండం తొక్కనివ్వకుండా వైష్ణవులు ప్రయత్నం చేస్తారు. అప్పుడు ఆచార్లు కోడలు నాంచారమ్మ వాళ్లను చివాట్లు పెట్టి, పీరు

సాయిబుని పిలిచి గుండం తొక్కమని చెప్తుంది. పీరుసాయిబు 'అల్లా-రామ్'అంటూ గుండం తొక్కాడు. అతని వెనక మిగిలిన వాళ్లందరూ నిప్పులు తొక్కుకుంటూ వెళ్లారు. ఈ విధంగా మూఢవిశ్వాసాలను ఖండిస్తూ, పరమత సహనాన్ని,మత సామరస్యాన్ని ప్రబోధిస్తూ గురజాడ ఈ కథ రాశారు. గురజాడ కథల్లో సన్నివేశ చిత్రణలోను, పాత్ర చిత్రణలోనూ నైపుణ్యం ప్రదర్శించారు. వీటితోపాటు పాత్రోచిత భాషను ప్రయోగించడంలో గురజాడ నైపుణ్యం రచనలకు వన్నె తీసుకువచ్చింది.

ఆధునిక మహా నాటకంగా పేరుపొందిన 'కన్యాశుల్కం' లాంటి నాటకం మళ్లీ ఇప్పటి వరకు రాలేదంటే అతిశయోక్తి కాదు. వాడుక భాషకి పట్టంకట్టి కళింగాంధ్ర భాష, యాసలో రచించిన గొప్ప ఆధునిక నాటకం 'కన్యాశుల్కం'. 1897వ సంవత్సరం ముందే రచించిన ఈ నాటకం, రెండవ కూర్పు నాటికి మరిన్ని మెరుగులు దిద్దుకుంది. పాత్రల పరిధీ పెరిగింది. ముఖ్యంగా మధురవాణి, గిరీశం పాత్ర మరింత నైపుణ్యవంతంగా మలచబడ్డాయి. తొలి కూర్పుని గ్రాంథిక భాషలో రాశాడని వేలూరి శివరామశాస్త్రి చెప్పిపోయాడు. మొదట ప్రబంధ భాషలోనే కన్యాశుల్కంరాసి, అది రచించకపోవటంచేత గ్రామ్యంలో తిరగ వ్రాశా'నని గురజాడ వారే చెప్పినట్టు ఒక అధ్యక్ష్యోపన్యాసంలో వేలూరి శివరామశాస్త్రి రాసిన వ్యాసం జూన్, 1949లో భారతి పత్రికలో ప్రచురితమైంది. అంతేగాక 1897లో మొదటి ముద్రణ ప్రతిని సమీక్షిస్తూ, ఇంగ్లీషు పదాలను విచక్షణా రహితంగా వాడడం బాగుండలేదని విమర్శించారు. అందుకు ఉదాహరణగా-

"కదు శ్రద్ధగల్గి యక్కౌంట్యాంటు లక్కౌంట్లు ట్రిక్కుగా గంపేరు
జేయుచుండ "నననదియును, మఱియు నెసగఫసెట్టగ్జామినే
షనినార్బిచ్చి" యను వాక్యము లింగ్లీషురాని వారి కెంత యర్థ
మగునో యీగ్రంథ మునందలి కొన్ని యింగ్లీషు పదము లంతమాత్ర
మందఱకు నర్థమగువనియెదము" అనే సీస పద్యాన్ని 1897 మార్చిలో అముద్రితగ్రంథ చింతామణి అనే పత్రికలో ప్రచురించిన 'కన్యాశుల్క నాటక విమర్శనము' అనే వ్యాసాన్ని చూపించారు.అయితే ఈ సీస పద్యం మరెవరో రాసిందని, గురజాడ వారిది కాదని కెవిఆర్ గారు తన 'మహోదయం'లో అభిప్రాయపడ్డారు.

తొలి కూర్పు 'కన్యాశుల్యం'లో ఐదు అంకాలు, 32 రంగాలు, 108 పుటలు ఉన్నాయి. 1909లో ప్రచురించిన మలికూర్పులో ఏడు అంకాలు, 33 రంగాలు, 196 పుటలకు విస్తరించింది. పాత్రల్లో కూడా కొంత మార్పు కనిపిస్తుంది. తొలిప్రతిలో మధురవాణి వేశ్య మాత్రమే. రెండోప్రతిలో మధురవాణి పాత్ర ద్వారా వేశ్యలకూ నీతి ఉంటుందని చెప్పారు. వేశ్యావృత్తిని గర్హిస్తానంటూ, ఆ వృత్తి ధర్మాన్ని సాగిస్తున్న వేశ్యలను చూసి మాత్రం దు:ఖం కలుగుతుందని, కోపంతో నిందించమనస్సు కాదని గురజాడ భావించారు. విమర్శించాల్సింది సంఘాన్ని అని, కావలసింది

సంఘసంస్కారం అని అప్పారావు గారు గిడుగు రామ్మూర్తిపంతులు గారితో అన్నట్లు తెలుస్తోంది. మధురవాణి పాత్రను సంస్కరించడం ద్వారా వేశ్యా సమస్యను సంస్కరించదలచుకున్నట్లు ఈ నాటకం ద్వారా వ్యక్తమవుతుంది. ఆరుద్ర గారు చెప్పినట్లు కన్యాశుల్క నాటకానికి మధురవాణి పాత్ర ఒక జీవశక్తి. నాటకానికంతా అతిముఖ్యమైన స్త్రీ పాత్ర. ఆమె వల్ల కథ సూటిదారిలో ప్రవహిస్తుంది. కథలో కాంప్లికేషన్స్ తీసుకొచ్చేది, విడగొట్టేది కూడా మధురవాణిపాత్రే.

ఇక తెలుగు వారి జాతి సొత్తు, చిరంజీవమైన పాత్ర గిరీశం. ఎందరెందరో వేషధారులు, డాంబికులు, వాచాలురూ మాటలతో కోటలు దాటించేవారు, అరచేతిలో స్వర్గం చూపించేవారూ, ఏరుదాటాక తెప్ప తగలెట్టేవారూ అందరూ భుజాలు తడుముకునే పాత్ర గిరీశం. ఇటు వంటి అంటువ్యాధిని ముందుగానే కనిపెట్టిన వైద్యుడు గురజాడ అప్పారావు. నాటకమంతా కమ్ముకొనిపోయిన పాత్ర గిరీశం. తమతెలివి తేటలతో, నోటి మంచితనంతో ఊరిని మంచి చేసుకుంటూ, అదృష్టాన్నీ పరీక్షించుకుంటూ సమాజం మీద పడి బతికే తెగులు లాంటి ధోరణిని ఈ గిరీశం పాత్రలో చూపెట్టాడు. అప్పటికి వీళ్లకింకా ఒక నైతిక దృక్పథం, కట్టుబాట్లూ ఏర్పడని గిరీశం లాంటి పాత్ర ఈ నాటకంలో మలిచిన తీరు అద్భుతం. గిరీశం పాత్ర ద్వారా అప్పారావు సంఘసంస్కరణను హేళన చెయ్యలేదు. సంస్కరణ వాదపు ముసుగులో తిరిగే మేకవన్నెపులులను, సమకాలిక ఉద్యమాలను ఫ్యాషన్‌గా తప్ప ప్యాషన్ (Passion)గా కాక వ్యవహరించే వ్యక్తులను ఈ నాటకంలో పరిచయం చేశాడు. శ్రీపాద కామేశ్వరరావు గారు అన్నట్లు, "గోడ మీద పిల్లిలాగ జీవించే ఏబ్రాసి కాని స్థిర మనస్కుడు కాదు; పాపభీతిలేని పాషాండుడు, ఋజుమార్గవర్తి కాదు" ఈ గిరీశం పౌరహిత ఉద్యమాల్ని తమ స్వార్థానికి వినియోగించుకునే అనేక మందికి ప్రతిబింబమే గిరీశం పాత్ర. ఈ ఆధునిక సమాజంలో ఇటువంటి గిరీశాల్ని అనేక మందిని మనం చూస్తూనే ఉంటాం. 'డామిట్, కథ అడ్డం తిరిగింది' అనే గిరీశం డైలాగ్ తెలుగు నాట ఎంత ప్రాచుర్యం పొందిందో మనకు తెలియందికాదు.

తెలుగు భాషలో మొదటిసారిగా వాడుక భాషకి పట్టంకట్టి భారతీయ భాషల్లో వచ్చిన ప్రముఖ నాటకాల్లో అగ్రభాగాన నిలిచే నాటకం 'కన్యాశుల్కం'. కన్యాశుల్కం చదివిన, పాత్ర చిత్రణ చూసినా హాస్యరస ప్రధానం అనిపిస్తుంది. గిరీశం మాటలు, ఉపన్యాసాలు, అగ్నిహోత్రావధాన్ల మొండితనం, మధురవాణి కంటెదాచి లుబ్ధావధాన్లు, రామప్పంతులని ముప్పుతిప్పలు పెట్టిన వైనం వంటి విషయాలు చదివితే పాఠకులకు నవ్వు వస్తుంది. అయితే కేవలం హాస్య ప్రధానంగా గురజాడ ఈ నాటకం రాశాడా? అని ఆలోచిస్తే ఖచ్చితంగా కాదు అనే చెప్పాలి. మహాకవి శ్రీశ్రీ ఒక ముఖాముఖిలో కన్యాశుల్కం నాటకం విమర్శనాత్మక దృష్టితో చదివితే అర్థమవుతుంది. కన్యాశుల్కంలో వీర, కరుణ, హాస్య రసాలున్నా ఇది బీభత్సరస ప్రధానమైందిగా పేర్కొన్నాడు.

బీభత్స రసానికి స్థాయీ భావం జుగుప్స. వస్తుదోష సందర్శన వంటి వాటి వలన కలిగే రోత బీభత్సరస స్వరూపం. ఈ నాటకం చదివితే గిరీశం, అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, మీనాక్షి పాత్రలు, కొన్ని సంఘటనలు, సంఘ దురాచారాలు, ఆనాటి సాంఘిక పరిస్థితులపై రోత కలిగి బీభత్స రసానికి స్థాయీ భావమైన జుగుప్స కలుగుతుంది. ఉదాహరణకి గిరీశం పాత్రనే తీసుకుని పరిశీలిస్తే, నాటకం మొదటి నుండి చివరి రంగం వరకూ ఉంటాడు. పుటకి రికానాలేని తన పొట్ట నింపుకోవడానికి, స్వార్థంకోసం ఇతడు ఏపనినైనా చేస్తాడు. అభిప్రాయాల్ని తరచూ మార్చుకుంటాడు. అబద్ధాలు అవలీలగా చెప్తాడు. శిష్యుడు వెంకటేశానికి చుట్ట తాగడం నేర్పుతాడు. నమ్ముకున్న మధుర వాణిని మోసం చేస్తాడు. తనతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్ అని, పొగ తాగని వాడు దున్నపోతై పుడతాడని సందేశమిస్తాడు. సర్వం తెలిసినట్లు పోజుకొడతాడు. వృద్ధులకు చిన్న పిల్లనిచ్చి పెళ్లి చేయడం వలన కలిగే లాభాలను గురించి శిష్యుడికి వక్రభాష్యం చెప్తాడు. బుచ్చమ్మని పెళ్లి చేసుకుంటే వితంతు వివాహం చేసుకున్న క్రెడిట్ దక్కుతుందని లాభనష్టాల పట్టిక తయారు చేస్తాడు. నాటకమంతా అబద్ధాలతో, ఆత్మవంచనతో, అడ్డదిడ్డపు వ్యాఖ్యానాలతో బతికిన తీరు జుగుప్సను కల్గింపజేస్తుంది.

ఇలాంటి గిరీశాలు నేటికీ సమాజంలో కోకొల్లలుగా కనిపిస్తారు. నాటకం ఆసాంతం చదివిన తర్వాత ఇలాంటి మనుషులపై రోత కలుగుతుంది. ఇలా అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, రామప్పంతులు పాత్రలు పరిశీలించినా అటువంటి జుగుప్స భావమే కలుగుతుంది. ఈ విధంగా ఈ నాటకంలోని చాలా పాత్రలు స్వభావాలు, చర్యలు పాఠకుల్లో బీభత్స రసాన్నే కలుగజేస్తాయి. కరుణ, హాస్య రసాలు పోషించబడినప్పటికీ, ప్రధాన రసంగా బీభత్స రసమే కనిపిస్తుంది. ఈ దృష్ట్యా శ్రీశ్రీ అభిప్రాయమే సమంజసమనిపిస్తుంది.

ఈ విధంగా తెలుగులో మొదటి సాంఘిక నాటకం, మొదటి ఆధునిక కథానిక, ఆధునిక కవిత్వం కొత్త బాణీతో రాసిన వారు గురజాడ అప్పారావు. ఆనాటి వాడుక భాషలో ఈ రచనలు మొదలుపెట్టారు. నలుగురూ నడుస్తున్న దారినే నడవకుండా, ఒక వ్యక్తి కొత్తదారులు తీసినట్లయితే, కొత్త చూపు ఇచ్చినట్లయితే, తర్వాతి తరాల వాళ్లని తన వెంట నడిపించగల వాడయినట్లయితే, అటువంటి వ్యక్తిని యుగకర్త అని అంటారు. జాతిని మేలుకొలిగపిన వైతాళికుడని అంటారు. గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకర్త, వైతాళికుడు.

గురజాడ 'కన్యాశుల్కం' అంకితంలో చెప్పినట్లుగా "నైతిక పతనంవల్ల ఉత్పన్నమైన సామాజిక రోగిలక్షణాలతో నిండి ఉన్న దుర్భర హింసాత్మక బానిసత్వంలో మ్రగ్గిపోయే స్త్రీ జాతిని ఉద్ధరించడమెలాగ అనే సమస్యపై... ప్రజా బాహుళ్యపు దృష్టిని మళ్లించి ఆలోచించేటట్లు చేయడానికై సామాజిక దోషాలను బహిర్గతం చేస్తూ" రచనలు చేసిన మహాకవి, ఆధునిక రచయిత, యుగకర్త, వైతాళికుడు గురజాడ అప్పారావు.

 ISSN No.2319-3905

7
అన్నమయ్య - భావుకత

- ఆచార్య ఎం.రామనాథం నాయుడు

గదత

శిష్ట సాహిత్యానికి, జానపద సాహిత్యానికి వారధి లాంటిది పద సాహిత్యం. పాలకుల ఆదరణ, పండితుల ప్రోత్సాహం లేకపోయినా ప్రజల మధ్య జీవించేది పద సాహిత్యం. పద సాహిత్యాన్ని సృజించిన వారు వాగ్గేయకారులు. వీరిలో మొదట స్మరింపదగినవారు అన్నమాచార్యులవారు. ఈయన తెలుగులో పద కవితా పితామహుడుగాను, సంకీర్తనాచార్యుడుగాను ఖ్యాతి గడించాడు. ఈ మహాకవి పదాలలో అనంత విశ్వం వుంది.

అన్నమయ్య వైవిధ్య భరితంగా ఒక స్వామి కేంద్రంగా, ఆలయ అనుబంధంగా, సనాతనులైన వారి ఆమోదం కూడా పొందగలిగిన రీతిలో పదాలు రాసి, పాడినవాడు. అందుకే అన్నమయ్య పదాలకు అలాంటి వైశిష్ట్యం లభించింది. ఆయన ఆలయకవిగా, అనేక దివ్యదేశాలను సంచరించిన కవిగా, వ్యక్తిత్వం గల వాగ్గేయకారునిగా తాను తరించడమే కాకుండా తన సంతతినికూడా ఆ మార్గంలో నడిపించిన తెలుగుకవి.

తెలుగు పాటకు ప్రాణం పోసి, పదకవితకు పట్టం కట్టి, జానపదానికి వన్నె తెచ్చిన కవివరేణ్యుడు అన్నమయ్య. ఆయన "ఆడిన మాటెల్ల అమృత కావ్యంగా, పాడిన పాటెల్ల పరమగానం"గా భక్తితో పదాల్ని పాడటమే కాకుండా ఊరూరా తిరిగి విష్ణుభక్తిని ప్రచారం చేస్తూ, ప్రజలకు తరతమభేదాల్ని మరచి శ్రీహరిని పూజించి తరించమని ప్రబోధం చేశాడు. తనలో అహంకారం నశించి, తన సర్వస్వాన్ని భగవదర్పితం చేసినపుడే భగవంతుడు భక్తున్ని స్వీకరించేదని

"ఆకటి వేళల అలపైన వేళల

వేకువ హరినామమే దిక్కు మరిలేదు" అనే కీర్తనతో స్వతః నిరూపించిన భక్తాగ్రేసరుడు. అన్నమయ్య ఏ భాష వాడినా, ఎలా వర్ణించినా, భావాన్ని ఏ తీరులో చెప్పినా, ఏ దేవుడిని స్తుతించినా అందులో మనకు గోచరించేది ఒకే తత్త్వం. అదే భక్తితత్త్వం. 'సమబుద్ధి'ని ప్రచారం చేయడమే ఆయన లక్ష్యం.

'కవి' అనే మాటకు వర్ణించువాడని అర్థం. సాధారణంగా సామాన్యులు అయితే కన్నదాన్ని, విన్నదాన్ని కనులకు కట్టినట్టు వీనుల విందుగా చెప్పేవాడని సమన్వయించుకుంటారు. కానీ కన్నదాన్ని మాత్రం కాదు చూడనిది, విననిది అయిన అంశాలను సహితం సహృదయులు చూచేవిధంగా, వినగలిగేటట్లు చెప్పడమే కవి పని. ఈ పని 'భావుకత' వల్లనే సాధ్యం అవుతుంది.

అన్నమయ్య కవి. కవి మాత్రం కాదు మహాకవి. మహాకవులకున్నంత పాండిత్యం, శాస్త్రపరిజ్ఞానం, లోకజ్ఞత అన్నీ అన్నమయ్యలో వున్నాయి. అన్నమయ్య భావుకతను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అది ఆకాశమంత విశాలం. సముద్రమంత గంభీరం. అతని కవి సమయాలు నక్షత్రాలంత. అతని వర్ణనలు అలలంత. అతని పద సంపత్తు రత్నాకరమంత. అన్నమయ్య భావుకతను "కొండ అద్దమందు కొంచెమై కనుపించదా" అన్నట్టు విశదం చేయడం నా ప్రథమ కర్తవ్యం.

"ఏ మొకొ చిగురుటధరమున యెడ నెడ గస్తురి నిండెను

భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా".

ఇక్కడ భావుకతను అనుసరించిన భావం. భావాన్ని అనుసరించిన భాష ఒకటిని మించి ఒకటి పోటీపడుతున్నట్టు తెలుస్తుంది. కస్తూరితో నిందిన నాయిక లేత పెదవి, తన ప్రియుడికి రాసిన పత్రిక లాగ వుందని భావించడంలో ఏ కావ్యకవికీ తీసిపోని రీతిలో వుంటుంది అన్నమయ్య భావుకత. దాని ద్వారా అతని ప్రతిభ స్పష్టమవుతుంది.

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని భక్తుడు. శ్రీనివాసుడిని తప్ప ఇతరులను సేవించడానికి ఇష్టపడని భక్తుడు. భగవద్విశ్వాసంతో పాటు తాను ఎంపిక చేసుకున్న మార్గగమనానికి విరుద్ధంగా నడవడం ఇష్టం లేక "నరహరికీర్తన నానిన జిహ్వ పరుల నుతింపగ నోపదు జిహ్వ" అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. "చిల్లర రాళ్ళకు మొక్కుతువుంటే చెడిపోవునోరేవొరే" అన్నాడు ఒక వాగ్గేయకారుడు. అన్నమయ్య ఆ సత్యాంశాన్ని చాలా చక్కగా కింది కీర్తనలో తెలిపాడు.

"ఇలవేలుపు ఒకడు హరి ఎదుటనుండగా

పలువేలుపుల తోడి భ్రమత లేల

మెలగి సూర్యుడొక్కడు మిక్కిలివిగా వెలుగగా

వెలలేని దీపములు వేయునేమిటికి?"

సూర్యుడు మనకు తెలుసు. దీపం తెలుసు. సూర్యుని కాంతి తెలుసు. దీపం కాంతి కూడా తెలుసు. విద్యుత్తుపోతే వెంటనే మైనపు వత్తులు లేదా దీపాలు వెలిగిస్తాం. విద్యుత్తురాగానే ఆర్పేస్తాం. ఈ నైజాన్ని ముఖ్యంగా శ్రీనివాస తత్త్వానికి జతపెట్టాడు అన్నమయ్య. 'హరి' సూర్యభగవానుడు. ఇతర దేవతలు దీపాలు. దీపకాంతి సూర్యాంశమే. వాటికి శాశ్వతత్త్వం లేదు. సూర్యకాంతి శాశ్వతం. హరి 'పాపహరి' కూడా. అందుచేత ఇతర దేవతలను కొలువ వద్దని హెచ్చరిక తోడి ప్రశ్నార్థకం అన్నమయ్య చేశాడు. ఇది ప్రకృతి దృశ్యాల భావుకత.

అన్నమయ్య శృంగార సంకీర్తనలో ఒక పౌరాణిక సన్నివేశం భూమికగా ఒక భావుకతా చిత్రం వుంది. నాయిక నాయకుని పాదాలు ఒత్తుతూ వుంది. నాయకుడు విష్ణువు. నాయిక లక్ష్మి కావచ్చు. పాదాలు ఒత్తునప్పుడు బిరుసు తనం పనికిరాదు. కరకుతనం వుండకూడదు. ఆప్యాయత, అనురాగం వంటివన్నీ పాద సంవహనంలో వుంటాయి. కవి "అమ్మా! గట్టిగా పాదాలు ఒత్తకు. ఎందుకంటే పాద స్పర్శచేత ఒక రాయి 'స్త్రీ'గా మారింది. అంతేకాదు పాదం నుండి 'గంగ' పుట్టింది అని; అహల్యా వృత్తాంతాన్ని, గంగానదీ ప్రాదుర్భావాన్ని గుర్తుచేశాడు.

"రంగుమీరిన మంచి రత్నాలు దాచెనని
వుంగరాల చేత పాద మొత్తకుమమ్మ
అంగన పుట్టెను పాదమంటి శిలనుదొల్లి
కంగి నీకుం బ్రతి మొనగడియించెచుమ్మి".

అలంకారాలలో భ్రాంతి, స్మృతి, సందేహాలంకారాలున్నాయి. తాడును పామనుకోవడం భ్రాంతి. తాడా? పామా? అని అనుకోవడం సందేహం. తాడు కాలికి తగలగా పామును స్మరించడం స్మృతి. అన్నమయ్య ఈ అలంకార సమ్మి శ్రణంలో అపురూపమైన చిత్రం గీశాడు.

"నిండు నీమై సొమ్ముల నిగ్గు మాణికములలో
అండ తన నీడ చెలి యన్నిటా చూచి
కొండుక పదారు వేల గోపాంగనలు నీమై
నుండు వారని తలచి వొగి తలవంచెను".

నాయిక నాయకుని దగ్గరికి వచ్చింది. నాయకుడు ఎన్నో ఆభరణాలు ధరించి యున్నాడు. నాయిక దగ్గరకు రాగానే ఆమె రూపం ఆభరణాల అంతటా ప్రతిబింబించింది. కాని నాయకి ఆ ప్రతిబింబాలు తనవి అని తెలుసుకోలేకపోయింది. పదహారు వేల గోపికల ప్రతిబింబాలని భావించింది. ఇందరిని తనలో దాచిన వానినా నేను ప్రేమించింది అని బాధపడింది. కాని చేసేదేమిలేక ప్రియుని ముందు తలవంచిందట.

భక్తునికి భగవంతుడు సన్నిహితుడుగా వుంటాడు. పసిపిల్లవానికి అనేక వేషాలు వేసి తల్లిదండ్రులు మురిసిన విధంగా భక్తుడు స్వామిని అనేక రూపాలలో దర్శించి తన్మయత్వం చెందుతాడు. అలాగే అన్నమయ్య స్వామిని పండుగాను, భూతంగాను, బోయ నాయకుడుగాను భావించి ఎన్నో కీర్తనలు పాడాడు. ఇది అతని భక్తి భావుకతకు తార్కాణం.

"పొలసి మీసాల పెద్ద బోయనాయడు
మలగి వీపున గట్టి నుంకు బోయనాయడు
పొట్టి పొట్టి అడుగుల బోయనాయడు
పుట్టు పగ సాధించె బోయనాయడు."

ఈ కీర్తనలో చెప్పిన పెద్ద మీసాలు, చిన్న చిన్న అడుగులు, పగ సాధించే గుణం బోయనాయకులది కావచ్చు. కాక పోవచ్చు. కాని అన్నమయ్య ఈ చరణాలలో అవతార రహస్యాలు

చెప్పాడు. మీసాలనడంలో మత్స్యావతారం, వీపున కట్టడంలో కూర్మావతారం, పొట్టి పొట్టి అడుగులలో వామనావతారం, పగ సాధించడంలో పరశురామావతారాన్ని స్పష్టం చేశాడు.

తమిళంలో వైష్ణవులకు నాలాయిరం 'పారాయణ గ్రంథం. పన్నిద్దరు ఆళ్వారులలో పెరియాళ్వారు ఒకరు. పెరియాళ్వారు వాత్సల్య భక్తిని చక్కగా వ్యక్తీకరించిన ఆళ్వారు. తన్ను తండ్రిగా భావించుకుని శ్రీకృష్ణుని చిలిపి చేష్టలకు విసిగినట్లు, మురిసినట్లు 'పాశురాల'ను పాడారు. తెలుగులో అలాంటి కీర్తనలు పాడిన వారిలో అన్నమయ్య ఒకడు.

అది గోకులం. గోకులంలో శ్రీకృష్ణుడు తచ్చాడుతున్నాడు. ముద్దు మురిపాలతో అందరినీ ఆకట్టుకొంటున్నాడు. ప్రతి గొల్లెత చిన్ని కృష్ణుడిని ఎత్తుకొంటుంది. తిప్పుతుంది. వేళాపాళాలేక బాలకృష్ణుడిని లాలిస్తున్నారు. కాని తల్లికేమో బెంగ. పక్షి దోషమో, పాము దోషమో, అంటు దోషమో అంటుకుంటుంది. అందుచేత గోపికలను చూసి ప్రాధేయ పడుతుంది.

"బాయట పెట్టకురే పక్షులు పారెడిప్రొద్దు
వోయమ్మ బాలులకు నొప్పదందురు
మాయపు పులుగొకటి మచ్చిక నీ బాలుని
చేయిచ్చి ఎక్కించుకొని చేరీనట".

సామాన్య దృష్టితో చూస్తే పక్షి దోషం, పురుగు దోషం కావచ్చు. కాని ఇక్కడ పక్షి ఎవరో కాదు గరుత్మంతుడు. పురుగు ఎవరో కాదు సర్పం. ఆదిశేషుడు, గరుడాదులు స్వామి ఎక్కడ వుంటే అక్కడ వుంటారు. శ్రీకృష్ణుడు భగవంతుడు కనుక స్వామి సేవ కోసం అక్కడే సిద్ధంగా వున్నారని విశేషార్థం. ఒక తల్లి తన బిడ్డపైగల అవ్యాజమైన అనురాగంతో, మమకారంతో ఆ బిడ్డ భగంతుడని తెలిసినా, అది మరచిపోయి బిడ్డపైగల ప్రేమతో మాతృధారను కురిపించడం అమోఘం. ఇది అన్నమయ్య కీర్తించిన వాత్సల్య భావుకతకు నిదర్శనం.

కవిత్వం ఒక కుంచె. కవి తన భావన అనే కుంచెతో రమణీయ చిత్రాలు గీస్తాడు. అన్నమయ్య అలాంటి చిత్రభావుకుడు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

శ్రీకృష్ణుడు పుట్టుకతో నల్లనివాడు. శ్రీరాముడు, శ్రీనివాసుడు నీలమేఘఛాయ పోలినవారు. "నలుపు నారాయణ మెచ్చు" అని జానపదుల మాట. పోతన "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అని, మొల్ల "నీలమేఘచ్ఛాయబోలు దేహమువాడు" అనీ చిన్నికృష్ణుడిని, శ్రీరామచంద్రుని రూపును తమ రచనల్లో పొందుపరిచారు. కాని నల్లదనానికి కారణాలు ఎవరూ చెప్పలేదు. అన్నమయ్య మాత్రం చాలా చక్కగా చమత్కరించాడు.

శ్రీకృష్ణా! శ్రీవేంకటేశ్వరా! శ్రీరామచంద్ర ప్రభూ! మీరు బంగారు వన్నె కలవారే. అయినా ఎందుకు నల్లని వారయ్యారు. ఓహో! తెలిసిందిలే. మీ రూప సౌందర్యానికి ముగ్ధులై ఎందరో సుందరాంగిణులు తదేక దృష్టితో చూచారేమో. వారి కళ్ళు నల్ల కలువల లాంటివి. నల్ల కలువల లాంటి కళ్ళున్నవారు తదేకంగా కాటుక కళ్ళతో చూడడం వల్ల మీ ఒళ్ళంతా నల్లగా అయిపోయిందేమోనని చమత్కరించాడు అన్నమయ్య.

ISSN No.2319-3905

"నల్ల కలువల వంటి నాతి చూపు నీ మైనంటి
నల్లనాయ నిలువెల్లా నాథుడ నీకు".

ఇక్కడ పరిహాసముంది. సానుభూతి వుంది. సౌందర్యముంది. రూపవర్ణన కూడా వుంది. అలాగే అన్నమయ్య ఒక చోట కృష్ణుని చూచి నీపై సానుభూతి ఎందుకు చూపాలో నాకు తెలియరావడం లేదు. చిన్నతనంలో బండి తొక్కావు." (శకటాసురుని సంహరించావు) బండి తొక్కడం నేరం. ఆ నేరానికి ప్రతిఫలం అనుభవించాలి. అందుచేత బండి బోయడైనావు. అంటే శ్రీకృష్ణుడు అర్జునునికి సారధి కావడమన్నమాట. ఇది అందరికీ స్ఫురించని చమత్కార వినోదం.

ఒక అంశాన్ని నాగరికులు భావించే తీరు వేరు. జానపదులు భావించే తీరు వేరు. జానపదుల భావన బాగుండి, తమకు నచ్చితే మహాకవులు వాటిని స్వీకరించి కావ్యాలలో వర్ణిస్తారు. రామాయణంలో 'ఉడుతా భక్తి' లాంటివి ఇటువంటివే. అన్నమయ్య ఒక పాటలో జానపద ధర్మాన్ని చక్కగా ఆవిష్కరించాడు.

"చందమామ పాడితల్లి సరిపొత్తుకు రమ్మంటే
చందురు చూచి కృష్ణుడు సన్న జేసెను
ముందర చంద్రుడు వచ్చి మొక్కితే యశోదచూచి
ముందేలా యంటి నోయని మరచి వెరగందెను".

తల్లి చందమామ పాట పాడుతూ వుంది. "చందమామరావే, చందమామరావే" అని. చిన్ని కృష్ణుడు తల్లిని ఆట పట్టించాలనుకున్నాడు. సైగ చేశాడు. తన 'ఏలిక' రమ్మనగానే చంద్రుడు ఆకాశం నుండి సరాసరి భూమి మీద వాలాడు. ఈ హఠాత్ దృశ్యానికి యశోద దిగ్భ్రాంతి చెందింది. అయినా తేరుకుంది. తాను పిలవడం వల్లనే కదా చంద్రుడు వచ్చాడని అనుకుంది. ఇది జానపద ధర్మం. జానపదుల భావుకత కూడా. "చందమామరావే జాబిల్లిరావే" అనే పాట అన్నమయ్యదే.

ఇక అన్నమయ్య వైదుష్య భావుకతను చూద్దాం. 'వైదుష్యమంటే శాస్త్ర పరిజ్ఞానం'. అన్నమయ్య కృతుల్ని 'శ్రుతులై, శాస్త్రములై' అని కొనియాడారు. అలాగే అన్నమయ్య పరమేశ్వరుని విశ్వ వ్యాపకత్వాన్ని

"నిండ యిన్నిటిలోన నీవు కలవను భ్రాంతి
నుండుదువుగాని నీవొకటియును గొవు
దండిగల గిరిప్రతిధ్వని దోచుగానియది
కొండ లోపల లేదు కొండయుగాదు". అని అన్నాడు.

కొండ దగ్గరగాని, గుహలలో గాని నిలిచి 'కో' అని పలికినప్పుడు ప్రతి ధ్వని వినబడుతుంది. కాని ఆ ధ్వని కొండలోగాని, కొండ గుహల్లోగాని అణిగి వుందా?. ఒకవేళ అణగి వున్నా కొండ, ధ్వని వేర్వేరా? లేక ఒకటేనా అనే సందేహాలు వస్తాయి. భగవంతుడు అన్నింటా వుంటే ధ్వని అన్ని చోట్లా రావాలి. కొండలలో మాత్రం రావడం మేమిటి అనే వైదిక తార్కిక భాషతో అన్నమయ్య వర్ణించాడు. తాను పలికినప్పుడే ప్రతిధ్వని. అలాగే మానవుడు

భగవంతుని తత్త్వాన్వేషణపరుడై కోరినపుడే స్వామి బదులు ఇస్తాడు. ఇది నిరంతర మానవ ప్రయత్నం, జీవి పరమాత్ముని కోసం చేసే తపస్సు, కొండ, ధ్వని, ప్రతి ధ్వని మొదలైనవి పరిభాషలు. సాంకేతికాంశాలు. ఇది వేదాంత జిజ్ఞాస ప్రబోధాత్మక భావుకత.

లౌకికమైన మనస్తత్త్వాలను జోడించి భావుకతతో వేదాంతం చెప్పడం అన్నమయ్య ప్రత్యేకత. అన్నమయ్య చాలా చోట్ల పురుషుల నైజాలను, స్త్రీల స్వభావాలను వర్ణించాడు. ఇవన్నీ లౌకికాంశాలుగా పైకి కన్పిస్తాయి. కాని వీటిలో ఆధ్యాత్మిక భావుకత వుంది.

"మగవాడెంత చక్కని మగువగలిగినాను
మిగుల వేరొకతెతో మేల మాడును
చేసుకున్న ఇల్లాలు చేరువనే వుండగాను
వేసరక వెలయాలి వెదకినట్లు".

వెలయాలి పొందు శాశ్వతం కాదు. ఆ సుఖం క్షణికం. అలాగే దుష్టదేవతలు, క్షుద్రదేవతలు ప్రసాదించేవి అన్నీ నిలువవు. వెలయాలి కంటే ఇల్లాలు క్షేమకారిణి. ఇక్కడ చెప్పబడ్డవారంతా జీవులు. జీవులు పరమాత్మను చేరుకోవాలి. పరమాత్మ ఎవరని తెలియడం ముఖ్యం. వైష్ణవులకు విష్ణువే పరమాత్మ. ఆ పరమాత్మ అర్చావతార మూర్తిగా దగ్గరేవున్నా జీవుడు గుర్తించలేడు. చిల్లర దేవతల్ని సామాన్య లౌకిక సుఖాలను ఇచ్చే దేవుళ్ళను ఆశ్రయిస్తాడు. అందువల్ల ఇవి తగవని చెప్పడం అన్నమయ్య ఉద్దేశం.

అన్నమయ్య కీర్తనలలో వ్యవసాయం, నేత, వ్యాపారం, రాజనీతి మొదలైన అంశాలనన్నింటినీ వేదాంత పరంగా అన్వయించి చెప్పాడు. అన్నమయ్య ప్రబంధాలు రాయగలిగిన వాడయినా పదకవితను అభిమానించిన వ్యక్తి. ప్రబంధ కవులెందరో అన్నమయ్య పద భాండాగారాన్ని కొల్లగొట్టినవారే.

అన్నమయ్య ఉత్తమ భావుకుడు. భావజ జనకుని కొలిచిన భక్తుడు. భవ్య విగ్రహాన్ని మనసా నిలుపుకున్న పరమ భక్తాగ్రేసరుడు. పదాలతో పరమాత్మకు కైంకర్యం చేసిన మహాకవి. అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన చేసి వర్ణనా నైపుణ్యం ప్రదర్శించి, భావుకతను చూపిన అగ్రేసరుడు అన్నమయ్య.

ఆధార గ్రంథాలు

1. అన్నమాచార్య చరిత్ర, 2012, చలపతి గల్లా, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2. వ్యాసవీచికలు, 2016, సర్వోత్తమరావు.కె., సి.ఎన్.ప్రింటర్స్, తిరుపతి.
3. సాహితీ మందారం, 2021, రామనాథం నాయుడు, మొగరాల, ముద్రికా ప్రింటర్స్, విజయవాడ.
4. రా.నా. వ్యాస సంకలనం, 2016, రామనాథం నాయుడు, మొగరాల, గుప్తా ప్రింటర్స్, మైసూరు.
5. అన్నమయ్య పదకోశం, 2012, శ్రీహరి, రవ్వా, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

8

తెలుగు కళలు – ద్రావిడ సంస్కృతి ప్రతిఫలనం

– *ఆచార్య ఎస్. చిన్నరెడ్డయ్య*

1. ఉపోద్ఘాతం :

దక్షిణ భారతదేశాన్ని ద్రావిడ దేశంగా చరిత్రకారులు పరిగణిస్తున్నారు. అయితే నేడు ద్రావిడ దేశం అంటే తమిళనాడు అనే భావిస్తున్నారు. ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళరాష్ట్రాలు ఇంచుమించు ఒకే భౌగోళిక స్వరూపం, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు కలిగి ఉన్నారనవచ్చు. ఈ విషయాన్ని అనేక గ్రంథాలు సోదాహరణంగా తెలియజేస్తున్నాయి. తమిళ తెలుగు కన్నడ మలయాళంలో వెలువడిన సాహిత్యాన్ని పరిశోధించి, భాషల స్వరూపాన్ని వింగడించి వాటి మూలాలు ఒకే కుదురులో ఉన్నట్లు పరిశోధకులు తేల్చి చెబుతున్నారు. ఇందులో నూరు శాతం సత్యముందని ప్రాచ్య పాశ్చాత్య పండితులు తెలుపుతున్నారు.

ఇక తెలుగు సాహిత్యం విషయానికి వస్తే సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్తమాల్యదలో ద్రావిడ సంస్కృతి అడుగడుగునా కనిపిస్తుంది. దీనికి ప్రబల నిదర్శనమే ఈ పద్యం.

తల బక్షచ్చట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపగఁ జూచి యారెకులుష స్స్నాత ప్రయాత ద్విజా
వలి పిండీకృత శాటి కల్పవిదదావాహంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గిన్వెసఁ బాఱువానిఁగని నవ్వున్నాలి గోప్యోఘముల్
(ఆముక్తమాల్యద – ప్రథమాశ్వాసం – పద్యం 64)

ప్రాతఃకాలంలో బాతులు కొలను ఒడ్డున నీటిలో తలవాల్చి ముడుచుకొని పడుకొని ఉంటాయి. అవి చూడడానికి ఉదయాన్నే స్నానం చేసి తెల్లటి వస్త్రాలు పిండి ముద్దగా వేసినట్లుంటాయి. పురోహితులు స్నానం చేసి బట్టలు పిండి అక్కడ ఉంచి మరచిపోయి వెళ్ళినారేమోనని పొలానికి నీరుగట్టడానికి వెళ్ళిన రైతులు భ్రమించి వాటిని ఎత్తుకోవటానికి ముందుకెళతారు. అవి భీతిచెంది కొలనులోకి వెళతాయి. అప్పుడు తాము శ్రమపడి మోసపోయామని రైతులు గుర్తిస్తారు. ఆ

దృశ్యాన్ని చూసి ద్రావిడ మహిళలు పగలబడి నవ్వుతారు. దాంతో రైతులు సిగ్గుపడతారు. ఈ అంశం ద్వారా మనం ఈ క్రింది అంశాలను గ్రహించవచ్చు.

- పురోహితులు ప్రాతః కాలంలోనే కొలనులు, నదుల్లో చన్నీటి స్నానం చేసేవారు.
- రైతులు ప్రాతః కాలంలోనే పొలానికి నీళ్ళు గట్టుటకు వెళ్ళేవారు.
- ద్రవిడాంగనలు ఉదయాన్నే పొలాల్లోకి వెళ్ళి పసుపురాసుకొని స్నానం చేసేవారు.
- పొలాల్లో బాతులుండేవి.

ఇలాంటి అంశాలన్నీ ద్రావిడ దేశం మొత్తం మీద కనిపిస్తాయి. వస్త్రధారణ, గృహనిర్మాణం, ఆలయ సంస్కృతి, వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలన్నింటిలో చాలా వరకు ఏకసూత్రత కనిపిస్తుంది. చివరికి సినీ సంస్కృతిలో కూడా ఏకత్వం కనిపిస్తుంది. ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసికొని ద్రావిడ కళల సంస్కృతి దక్షిణాది రాష్ట్రాలపై ఎలా ప్రభావం చూపుతున్నదో ఈ వ్యాసంలో దిఙ్మాత్రంగా పేర్కొనడం జరిగింది.

1565 లో జరిగిన తళ్ళికోట యుద్ధానంతరం విజయనగర రాజ్యం చిన్నాభిన్నమైపోయింది. రాయల వంశ సంతతివారు కొంతమంది పెనుగొండకూ మరికొంతమంది చంద్రగిరికి వెళ్ళారు. మిగిలినవారు తంజావూరుకూ, మధురకూ చేరుకున్నారు. అటు తరువాత ఈ రెండూ కూడా విజయనగర రాజుల కింద సామంత రాజ్యాలుగా వుండేవి. వీటిని పరిపాలించిన నాయకరాజులు చివరివరకూ ఆంధ్రభాషను పోషిస్తూనే వచ్చారు.

తంజావూరు రాజ్యాన్ని 1535 నుండి 1673 వరకు సుమారు 140 సంవత్సరాలు నాయకరాజులు పరిపాలించారు. ఈ వంశంవారు ఆఖరువరకూ విజయనగర రాజులపట్ల విశ్వాసపాత్రులుగా ఉంటూ వచ్చినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు.

తంజావూరును అచ్యుతరాయలు, రఘునాథరాయలు, విజయరాఘవరాయలు వరుసగా పరిపాలించారు. విజయరాఘవ నాయకునికి మరో పేరు మన్నారుదాసు. మధురనాయకుడైన చొక్కనాథుడికి ఇతనికి జరిగిన యుద్ధంలో (1674) విజయరాఘవుడు మరణించాడు. అనంతరం రెండు సంవత్సరాల తరువాత శివాజీ తమ్ముడైన ఎక్కోజీ తంజావూరును ఆక్రమించాడు. ఒక శతాబ్దంపాటు మహారాష్ట్రులు దాన్ని పరిపాలించారు. ఎవరు పరిపాలించినా ఈ నాటికీ వారి సంస్కృతి అంతా అచ్చం అలా నిలిచేవుంది.

2. స్వర్ణయుగంగా శోభిల్లిన నాయకరాజ్య రంగుహంగులు :

దక్షిణదేశ చరిత్రలో ఆంధ్రనాయకరాజుల పరిపాలన ఒక సువర్ణయుగమని చెప్పవచ్చు. విజయనగర చక్రవర్తుల కాలంలో లలితకళలు అభివృద్ధి చెందినట్లే, తంజావూరు నాయకరాజుల కాలంలో కూడ లలితకళలన్నీ వికాసం పొందాయి. తెలుగు సాహిత్యం, సంగీతం, నాట్యం, శిల్పం, యక్షగానవాఙ్మయం ఒక మహోన్నత స్థానాన్ని అలంకరించాయి. ఆ నాటికీ ఈ నాటికీ ఆ మహావైభోగానికి సాక్ష్యాధారాలుగా తంజావూరులో మనకు నేటికీ దర్శనమిస్తున్నాయి.

ISSN No.2319-3905

3. కవి, పండిత పోషణలో ఘనాపాఠి :

రఘునాథనాయకుడు, క్రీ॥శ॥ 1600 నుండి 1634 వరకూ రాజ్యాన్ని పరిపాలించాడు. ఈయనకు దానకర్ణుడనే పేరు కూడా వుంది. గోవింద దీక్షితుడు ఈయనకు మంత్రి. ఈయన కర్ణాటక సంగీతశాస్త్రంలో బహుముఖ ప్రజ్ఞాశాలి. అనేక రాగాలను, తాళాలను ఈయన స్వయంగా కల్పనచేశాడు. రఘునాథ నాయకుని ఆస్థానంలో కవులు, పండితులు, విశేషంగా పోషింపబడ్డారు. ఈయన ఆస్థానంలో ముద్దు చంద్ర రేఖ అనే రాజనర్తకి వుండేదట. గోవింద దీక్షితుని ఇరువురు పుత్రులైన భాస్కర దీక్షితుడు, రాజాచూడామణి దీక్షితుడూ లక్ష్మీకుమార తాతాచార్యులూ నృత్య, గాన విద్యల్లో ఆరితేరిన దిట్టలు. కవయిత్రులైన రామభద్రాంబ, ముద్దు పళని, లీల మొదలైన వారందరూ రఘునాథుని ఆస్థానం అలంకరించినవారే. ఆయన ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం సర్వతోముఖాభివృద్ధి చెందింది. ఎన్నో యక్షగానాలు నాటకరూపంలో రాసి ప్రదర్శింపబడ్డాయి.

4. సంగీత సాహిత్యదోహదంలో విజయరాఘవుని వితరణ :

రఘునాథనాయకుని అనంతరం విజయరాఘవనాయకుడు రాజ్యానికి వచ్చి 1663 నుండి 1673 వరకూ పరిపాలించాడు. రఘునాథ నాయకునివలెనే ఈయన కూడ సంగీత, సాహిత్య, నాట్యకళలను పోషించాడు. మువ్వ గోపాల పద కర్తయైన క్షేత్రయ్య విజయ రాఘవనాయకుని ఆస్థానంలో చాలా సన్మానాలందుకున్నాడు. ఈ క్షేత్రయ్య పదాలు ఈనాటికీ దక్షిణాపథమంతటా బాగా ప్రచారంలో వున్నాయి. ఇంకా కళాకారులైన పురుషోత్తమ దీక్షితుడు, పసుపులేటి రంగాజమ్మ, కోనేటి దీక్షితుడు, కావరసు వెంకటపతి సోమయాజి, మన్నారు దేవుడు మొదలైన వారెందరో యక్షగాన రచయితలుగాను, ప్రదర్శకులుగాను ప్రసిద్ధి పొందారు.

నాయకరాజుల కాలంలో 54 మంది కవి పండితులు సంస్కృతాంధ్ర భాషల వ్యాప్తికి తోడ్పడ్డారు. నాయకరాజులు ఎంతోమంది కళాకారులకు మడులు, మాన్యాలు, అగ్రహారాలు ఇచ్చి సన్మానించారు. దేవాలయాలకూ, మఠాలకూ, సత్రాలకూ, దేవదాసీలకూ మాన్యాలిచ్చారు.

5. యక్షగాన వాఙ్మయానికి అక్షయమైన భిక్ష :

ఈయన హయాములో యక్షగాన వాఙ్మయం బహుముఖాల విజృంభించింది. ఈయన రాజదర్బారులో ఒక నాట్య మందిరాన్ని భవ్యంగా నిర్మించి, ఆ రంగస్థలంపై ప్రత్యక్షంగా యక్షగాన ప్రదర్శనలను ప్రదర్శింపజేశారు. అనేక ప్రయోగాలను చేయించాడు. రఘునాథాభ్యుదయం అనే విజయరాఘవనాయకుని నాటకంలో రాజప్రాసాదంలోని మనోహర చిత్ర దృశ్యాలూ, అనేక చారిత్రిక ఘట్టాలూ వర్ణింప బడ్డాయి. నాయకరాజులు ఆంధ్ర తమిళ భాషలను రెంటినీ, కన్నబిడ్డలవలె సమంగా ఆదరించి పోషించారు.

ఈ విధంగా దక్షిణదేశంలో ఆంధ్ర నాయకరాజులు సంగీత సాహిత్యాలను ఆదరించి ఒక ఉజ్వల చరిత్రను సృష్టించారు.

5.1. తెలుగు కన్నడాలను తలదన్నిన పేరు పెంపులు :

యక్షగానాలు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలల్లో ఎక్కువ ఖ్యాతిలో ఉన్నప్పటికీ ఎక్కువ ప్రతిభావికాసంతో విరాజిల్లినవి తంజావూరు యక్షగానాలు మాత్రమే. రఘునాథరాయల కాలంలో యక్షగానాలు అంతగా రాణించకపోయినా, విజయరాఘవ నాయకుని కాలంలో చాలా ఔన్నత్యాన్ని పొందాయి. రఘునాథరాయల కుమారుడైన విజయరాఘవుడు తండ్రివలె కవులను, గాయకులను, నృత్యశాస్త్రకారులను అపారంగా పోషించాడు. ఈయన స్వయం కవి, నాట్యశాస్త్రవేత్త కూడా. స్వయంగా అనేక రచనలు చేశాడు. వాటిలో ముఖ్యమైనవి యక్షగానాలే. ఈయన స్వయంగా కృతులలో ముఖ్యమైన వాటిని ఇలా పేర్కొనవచ్చు.

ప్రహ్లాద చరిత్ర	రాజగోపాల విలాసం
ఉషాపరిణయం	రఘునాథాభ్యుదయం
మోహినీ విలాసం	పూతనాపహరణం
మంజరీ నాటకం	సముద్రమథన నాటకం
కృష్ణవిలాసం	జానకీకళ్యాణం

ఈయన అనేకమంది కవిగాయక నటులకు ఆశ్రయమిచ్చాడు. అనేక అన్నదానాలు చేశాడు. అన్నదానాన్ని కథావస్తువుగా తీసుకుని పురుషోత్తమ దీక్షితుడు విడిగా ఒక అన్నదాన నాటకాన్నే రచించాడు. ఈయన తన తండ్రి రఘునాథ రాయల చరిత్రను రఘునాథాభ్యుదయమనే యక్షగానంగా రాసి ప్రచారం చేయించాడు.

5.2. పాత నుంచి కొత్తకు :

ఆనాటి యక్షగానాలు పురాణ కథావృత్తాలతో కూడివుండేవి. కానీ విజయ రాఘవుడు మహావీరుని చరిత్రను యక్షగానంగా రచించాడు. ఈ విధంగా విజయరాఘవుని ఆధ్వర్యంలో యక్షగానాలు అజరామరంగా వెలుగొందాయి.

నాయకరాజుల కళాకాంతులను విరజిమ్మే తంజావూరు సరస్వతీ మహల్‌లో దాదాపు 30 యక్షగాన నాటకాలున్నాయి. వీటిలో ఎన్ని రఘునాథరాయల కాలంలో రాయబడ్డాయో తెలియదు. ఈ 30 నాటకాల్లోనూ ఒక్క శాహిరాజు పేరనే 18 నాటకాలు ఉన్నాయి. తంజావూరును 1634 నుంచి 1710 వరకు పరిపాలించిన శాహిరాజే ఈయన అనే ప్రతీతి ఉంది. యక్షగానాల్లో చాలా భాగం క్షత్రియులు రాసినట్లుగా ఉంది. యక్షగానాల్లో తేలిక భాష ప్రయోగించబడింది.

6. బహిరంగ ప్రదర్శనశాల :

దీనిని 'తిరంవెళి ఆరంగం' అని పిలుస్తారు. ఇది నాయకరాజుల ప్రాసాదంలో సరస్వతీ గ్రంథాలయానికి పడమటి దిక్కుగా, దానిని ఆనుకుని వుంది. దీని పూర్వరూపం ఎటువంటిదో తెలియదు. పైన కప్పు లేదు. నాలుగు దిక్కుల్లోనూ తక్కిన ప్రసాదానికి సంబంధించిన ఎత్తైన గోడ లున్నాయి. చతురాకారంగా వున్న ఈ ప్రదేశంలో నేలమీద 2000 మంది వరకూ కూర్చునే

ISSN No.2319-3905

అవకాశ ముంది. ఈశాన్య దిశలో ఎత్తైన దిమ్మ ఒకటుండేదట. దీనిమీద నిలబడి మాట్లాడినట్లయితే శబ్ద, గ్రహణ యంత్రాల సహాయం లేకుండానే రెండువేల మందికీ స్పష్టంగా వినిపించేదట.

1952లో పళనియప్పన్ అనే జిల్లా కలెక్టరు దీనిని పునరుద్ధరించి, రమణీయమైన రంగస్థలాన్ని నిర్మింపజేశాడు. ఈనాడది బహిరంగ నాటకమండపంలాగా ఉంది. ఒక మూలగా ఉన్న ఈ రంగస్థలంమీద నిలబడి చూచినట్లయితే ప్రేక్షకస్థానం వర్తులాకారంగా ఉన్నట్లు కనబడుతుందని పి.యస్.ఆర్.అప్పారావు గారు తెలియజేశారు.

7. తెలుగుతేజం దీపించే తంజావూరు నాట్యం :

తంజావూరు రాజాస్థానంలో నృత్యం ఏకపాత్రాభినయ కళారూపంగా అభివృద్ధి చెందింది. అదే నేటి తంజావూరు భరతనాట్యంగా ప్రసిద్ధి పొందింది. ఈ ప్రదర్శనకాలం మూడు గంటలు, ఆ మూడు గంటలూ ఒకే ఒక నర్తకి నృత్యం చేస్తుంది. ప్రక్కనున్న నట్టువనారు పాడే పాటకు అనుగుణంగా అభినయం చేస్తుంది. ఇది కేవలం తెలుగు వారు సృష్టించిన నాట్యం.

ఈ ఏకపాత్రాభినయ భరతనాట్యం దాదాపు 150 సంవత్సరాల క్రిందటనే రూపొందింది. తంజావూరు భరతనాట్యం కేవలం తెలుగువారి సృష్టి. ఇందుకు ఉదాహరణగా నాయకరాజులూ, మహారాష్ట్ర రాజుల కాలంలో తెలుగు వాగ్గేయకారులూ, తెలుగు నర్తకీమణులే ఆ ఆస్థానాల్లో ఉండటాన్ని పేర్కొనవచ్చు. త్యాగరాజు కీర్తనలు, సారంగపాణి పదాలు, క్షేత్రయ్య మువ్వ గోపాల పదాలు, నారాయణ తీర్థులవారి తరంగాలు వంటివన్నీ మనకు సాక్ష్యాధారాలుగా కనిపిస్తున్నాయి.

8. సకల కళా సరస్వతి సరస్వతీమహల్ :

తెలుగుదేశపు ఈ భరతనాట్యాన్ని తీర్చిదిద్దింది దేవదాసీలూ, రాజనర్తకీమణులేనని పి.యస్.ఆర్. అప్పారావుగారు ఉద్ఘాటించారు. విజయనగర సామ్రాజ్య వైభవం వెలుగొందినన్ని రోజులూ మన భాగవతులు రాయలవారి ఆస్థానంలోనూ, విస్తరించిన ఆయన సామ్రాజ్యంలోనూ ప్రదర్శనలిస్తూ ప్రజాప్రబోధాన్ని గావించారు. కానీ విజయనగర రాజ్య పతనానంతరం కవి గాయకులతోపాటు మన కళాకారులు కూడా విధి లేక వలస వెళ్ళిపోవలసి వచ్చింది.

ఆ రోజుల్లో 1561 నుంచి 1614 వరకూ రాజ్యాన్ని పరిపాలించిన ఆంధ్రరాజు అచ్యుతప్ప నాయకుడు. నాట్యకళా సాంప్రదాయాలను అభివృద్ధిపరిచాడు. ఆనాడు తంజావూరు సరస్వతీ మహల్ కవులతోనూ, గాయకులతోనూ, కళాకారులతోనూ అద్వితీయంగా వెలుగొందింది. అచ్యుతప్పనాయకుల వారి ఆస్థానంలో పంచన చేరిన కూచిపూడి బ్రాహ్మణ కుటుంబాల వారందరికీ అగ్రహారాలను దానంగా ఇచ్చాడు. అలా దానం చేసినవాటిలో కూచిపూడి భాగవతులకు దానం చేసిందే అచ్యుతాపుర అగ్రహారం. అచ్యుతప్పనాయకుని దానం కనుకనే దానికి అచ్యుతాపురమనే పేరు వచ్చింది. దీనినే తరువాత మేరటూరని, మెలట్టూరని, మేలటూరని వ్యవహరించారు. కానీ ఈ నాటికీ తంజావూరు చుట్టుప్రక్కలవారు మేరటూరనే పిలుస్తున్నారు.

9. వివిధ రాజుల ఆదరణలో వీధినాటకాలు :

తంజావూరు రాజుల్లో అచ్యుతప్పనాయకుని మరణానంతరం రాజ్యపరిపాలనకు వచ్చిన రఘునాథరాయల కాలంలో కూడ ఈ భాగవతాలు ఆదరించబడ్డాయి. తరువాత తంజావూరు రాజ్యాన్ని పరిపాలించిన, మహారాష్ట్ర ప్రభువుల కాలంలో కూడ ఈ వీధి భాగవతాలు విశేష ప్రశస్తి పొందాయి. అంతేకాక ఆనాడు దక్షిణదేశంలో మైసూరు, పుదుక్కోట మొదలైన సంస్థానాలలో కూడ భాగవతాల ప్రభావం పెరిగింది.

9.1. వరదరాజు పెరుమాళ్లు వసంతోత్సవాలు :

వీధి భాగవతాలు ఎక్కువగా వైశాఖమాసంలో జరుగుతాయి. ఇవి వారంరోజులు జరుగుతాయి. నృసింహ జయంతినాడు ప్రహ్లాద నాటకంతో ప్రారంభిస్తారు. ప్రదర్శనలను తిలకించటానికి పరిసర గ్రామాల ప్రజలు ఆబాలగోపాలం కదిలి వస్తారు. పాత్రధారులు వారు ధరించే ప్రతిపాత్ర వేషధారణతోనూ, తంజావూరు రాజాస్థాన సంప్రదాయాల ననుసరించి రాజు పాత్రలకు తంజావూరు రాజదుస్తుల మాదరిగానే ధరిస్తారు. బ్రహ్మ, విష్ణు, నృసింహమూర్తి, ఇంద్రుడు, యముడు మొదలైన పాత్రలకు ముసుగులను ఉపయోగిస్తారు. ప్రదర్శ రోజున, దుష్టపాత్రలు ధరించే నటులు ఆ రోజంతా ఉపవాసం చేస్తారు.

9.2. ప్రదర్శన ప్రారంభం :

రాత్రి పది గంటలకు ప్రదర్శనం ప్రారంభమౌతుంది. వీరికి హంగుగా తిత్తి, ముఖవీణ, మృదంగం, తాళపుచిప్పలూ వుంటాయి. వంత పాట పాడేవారు నలుగురుంటారు. ఒకరు పద్యంగాని ఎత్తుకుంటే మిగిలిన వారందరూ అదే పద్యాన్ని వంతపాడతారు. వీరందరూ ప్రారంభ శ్లోకాలను ఆశుధారగా వల్లించిన అనంతరం సభాంగణానికి ఒక విచిత్రమై పాత్ర ప్రవేశిస్తుంది. ఆ పాత్రధారి కొంటెకోణంగి.

9.3. కొంటె కోణంగి :

మన భాగవతాల్లోని మాధవి,సైరంధ్రి, ధర్మి, విదూషకుడు, అల్లాటప్పా, కేతిగాడు, సుంకరకొండడు, బంగారక్క, రత్నాల పోలిగాడు మాదిరే ఈ కొంటె కోణంగి పాత్రదారి కూడా ఉంటాడు. కోణంగి పాత్రధారి ప్రవేశానికి ఒక హద్దూ పద్దూ ఏమీ లేదు. ప్రదర్శనలో సమయానుకూలంగా ఎప్పుడు పడితే అప్పుడు ప్రత్యక్షమై ప్రేక్షకుల్ని ఆనందపరుస్తాడు. పాత్రల మధ్య కలహాలు పెంచుతాడు. వాటిని చమత్కారంగా పరిష్కరిస్తాడు. ఒకేసారి ప్రేక్షకులలో ప్రేక్షకుడై నటిస్తాడు.

10. ఆంధ్ర, తమిళ సమరస సాంప్రదాయం :

కూచిపూడి కళాకారులు ప్రదర్శించే సంగీత నాటకాలకూ, దక్షిణాది సంగీత నాటకాలకూ చాలా దగ్గర పోలికలున్నాయి. వారూ వీరు భరతనాట్య సాంప్రదాయాలనే అనుసరిస్తూ వచ్చారు. అంతేకాకుండా తమిళంలో ఆడబడే నాటకాలూ, పాడబడే పాటలూ అన్నీ తెలుగువే. దీనిని బట్టి

ఆంధ్ర తమిళ సాంప్రదాయలకు మూలం ఒక్కటేనని మనకు బోధపడుతూ ఉంది. తమిళులు ఏయే శ్లోకాలను వల్లిస్తున్నారో అదేవిధంగా ఆంధ్రులు కూడా వల్లించారు. వారూ వీరూ కూడా కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలనే ఉపయోగించారు.

కూచిపూడి భాగవతులు క్షేత్రయ్య పదాలను పాడి అభినయించినట్లే, దక్షిణాది కళాకారులు కూడ ఆ సాంప్రదాయాన్నే అనుసరించారు. ముఖ్యంగా క్షేత్రయ్య పదాలు దక్షిణదేశంలో బహుళ వ్యాప్తిలోకి రావడానికి కారణం కూచిపూడి భాగవతులేనని మనం చెప్పుకోవచ్చు.

తంజావూరును పరిపాలించిన అచ్యుతప్పనాయకుడు ఆంధ్ర దేశం నుంచి వలస వెళ్ళిన కళాకారులను ఆహ్వానించి ఆదరించిన దానినిబట్టి చూస్తే క్షేత్రయ్య పదాలు దక్షిణదేశంలో ప్రభావం చూపినట్లు మనం గ్రహించవచ్చు. దీనికి నిదర్శనంగా భాగవత కర్తలుకూడ ఆనాటినుంచి ఈనాటివరకూ వంశపారంపర్యంగా ఆ సాంప్రదాయాలనే అనుసరిస్తూ ఉండటాన్ని పేర్కొనవచ్చు.

తమిళదేశంలో భాగవత మేళనాటకాల్లో ప్రసిద్ధి వహించిన పండనల్లూరు మీనాక్షి సుందరం పిళ్లై గారు జీవించినంత కాలమూ కూచిపూడి భరత నాట్య సాంప్రదాయలనూ, పదాభినయాన్నీ విద్యార్థులకు నేర్పాడు. వారిలో ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగు వారు కూడా ఉండటం విశేషం. అనేక అంశాలను పరిగణనలోకి తీసికొని పరిశీలిస్తే ఆంధ్ర తమిళదేశాల్లోని నాట్యసాంప్రదాయాలు ఒక్కటే అని వారి వారి పాటలూ, ఆటలూ నిరూపిస్తున్నాయి. అంతేకాక నాయిక ప్రవేశంతో తనకు తనే చరిత్ర చెప్పుకోవడంలోనూ, విదూషకపాత్రలను ప్రవేశపెట్టడంలోనూ కూడా ఆంధ్ర సాంప్రదాయాలనే అనుసరిస్తున్నారు.

11. కురవంజి :

దక్షిణాదిన విజయనగర చక్రవర్తుల కాలంలో కళలు ఎలా అభివృద్ధి చెందాయో అలాగే తంజావూరు, మధుర నాయకరాజుల కాలంలో కూడ సంగీత, సాహిత్య, నాట్య, నాటకాలకూ కవి, పండితులకూ, ఆదరణా, పోషణా లభించాయి.

ఆ యా రాజుల కాలాల్లో ఎన్నో కళలు అభివృద్ధి చెందాయి. అయితే నాటినుంచి నేటిదాకా ఏదో ఒక రూపంలో కురవంజి కళారూపం బ్రతికే వుంది. ముఖ్యంగా ఇక ఆంధ్ర దేశంలో సోదెమ్మో సోదె అంటూ వచ్చే ఎరుకలవారిలో కురవంజి జీవిత రేఖలు కనిపిస్తూ ఉన్నాయి.

కురవంజి ఒక జానపద దృశ్యం కురవంజి అంటే ఎరుకలసాని. పూర్వం ఈ ఎరుకలసాని సంఘంలో ఎక్కువ పలుకుబడి సంపాదించుకుంది. విజయనగర రాజుల కాలంలోనూ ఎరుకలసాని ఎంతో ప్రాధాన్యం వహించింది. వినోదం కలిగించటానికి యాథాలాపంగా ఆటలు పాటలు జోడించి ప్రారంభించిన కళారూపం ఈ కురవంజి.

11.2. అర్థం :

కురవంజి అనగా ఒక నృత్య విశేషంతో కూడిన అడుగు. అడవులలో నివసించే కురవలనే వారి అడుగు కాబట్టి, దానిని 'కురవంజి' అని కూడ పిలుస్తూ వచ్చారు. గంతులు, చిందులు,

గొండ్లి, అంజె అనేవి ఈ నృత్యవిశేషానికి సంబంధించిన పర్యాయపదాలు. కురవంజి కళారూపం ఆటవికులది. మానవులు అడవుల్లో నివసించే కాలంలో ప్రచారంలో కొచ్చిందీ కళారూపం.

11.3. వినోద ప్రదర్శనగా కురవంజి :

ఇలా ఉత్సవాలకు వచ్చిన యాత్రికుల వినోదార్థం ఆటవికులైన కురవలు వినోద ప్రదర్శనలు ఇస్తూ వుండేవారు. ఈ వినోదాన్ని యాత్రికులు ఎంతగానో మెచ్చుకుని వారికి మంచి మంచి బహుమతులు దానం చేసేవారు.

ఏ మాత్రం నిర్మాణ పటుత్వం లేని అడుగులనే ప్రారంభదశలో ప్రారంభించినా క్రమేపీ వారి అడుగులకు ప్రేక్షకులు అమిత ఉత్సాహాన్నిచ్చిన తరువాత, కురవంజి అడుగు ఒక కళారూపంగా అభివృద్ధి చెందింది.

కురవంజులు వేషధారణలో అడవిజంతువుల రకరకాల చర్మాలూ, నెమలి ఈకలూ, పంది ముళ్ళూ, కోరలూ, పులిగోళ్ళూ, ఎలుగుబంటి వెంట్రుకలూ మొదలైనవాటిని ధరించి నృత్యాలు చేస్తూ వుండేవారు.

ప్రారంభదశలో కాలికి వచ్చిన చిందులు తొక్కి నోటికి వచ్చిన పాటలు పాడి ఆడినా, క్రమేపీ ఒక విశిష్టరూపాన్ని పొందింది కురవంజి. ఏ యే క్షేత్రాల్లో వారు యాత్రికుల వినోదార్థం ప్రదర్శనలు యిస్తూ వుండేవారో, ఆ యా పుణ్య క్షేత్రాల మహోత్సవాలను గురించి, కథలల్లి వాటిని ఒక కళారూపంతో చెప్పి, యాత్రికుల్ని ముగ్ధుల్ని చేసేవారు. వీరు రక్తికి రక్తి, భక్తికి భక్తిగా శివలీలలూ, విష్ణుకథలూ చెపుతూ వీనులకూ, కనులకూ విందు చేసే వారు. ఈవిధంగా కురవంజులు చక్కని ఇతివృత్తాలను కథలుగా తీసుకుని వాటిని గేయాలుగా రాయించి, వాటికి క్రమమైన అడుగులు అమర్చి, కురవంజి అడుగును క్రమేపీ ఒక కళారూపంగా అభివృద్ధిలోకి తెచ్చారు. ఇలా యాత్రాస్థలాల్లో పుట్టి పెరిగిన ఈ కొరవంజి కళారూపమే క్రమేపీ దేశం నాలుగు మూలలకూ వ్యాపించింది. ఈ కురవంజి కళారూపం ఒరవడినే జక్కులవారనే (యక్షులు) కళావంతులు మొదైలనవారు కూడ ప్రదర్శనలను ప్రారంభించారు.

11.4. కొత్తరూపానికి కొత్త కళాకాంతులు :

ఇలా కురవంజి అడవుల నుండి పుణ్యక్షేత్రాలకూ, క్షేత్రాల నుండి ప్రజాసామాన్యంలోకి ప్రచారం పొంది, క్రమేపీ దేవోత్సవాల్లోనూ ప్రవేశం సంపాదించి గ్రామ జాతర్లలో ఘనత గడించి, రాజసభల్లో ప్రవేశం సంపాదించి, ప్రాపకం పొంది ప్రదర్శింపబడింది. ఈ కళారూపాన్ని అడవిజాతులవారి తరువాత అభివృద్ధిలోకి తెచ్చినవారు జక్కులవారు. వీరి నృత్యం కంటే గేయానికీ, గానానికీ, వచనానికీ ప్రాముఖ్యమివ్వడం వల్ల అవి యక్షగానరూపంలో అభివృద్ధి పొందాయి.

ప్రాథమిక దశలో కురవంజి ఒక క్రమం లేకుండా ప్రదర్శింపబడేదని అంటారు. కథలో వచ్చే అన్ని పాత్రలకూ ఒక్కడే నిర్వచనం ఇచ్చినా రాను రాను నాటకాల్లోని నాందీ ప్రస్తావన, సూత్రధారుడు, నటి, నర్తకి, విటుడు, విదూషకుడు, చేటకుడు, మాదిరి, సింగీ సింగడూ వచ్చి

పురుష పాత్రలకు సింగడూ, స్త్రీ పాత్రలకు సింగీ పాత్రినిధ్యం వహించేవారు. ఈ పాత్రల మధ్య ప్రేక్షకులను నవ్వించేందుకు తోలుబొమ్మ లాటలో జుట్టుపోలిగాడి మాదిరి – కొంటె కోణంగి ఒకడు ప్రవేశించి – సింగీ సింగని మధ్య చెణుకులు వేస్తూ – ఇద్దరి మధ్యా కయ్యాలు పెంచి పరిష్కరించేవాడు.

ఇలా కురవంజి కళారూపం క్రమానుగతంగా పరిణామం పొందింది. కురవలు ఈ కళారూపాన్ని ఏదో వినోదం కొరకు ప్రారంభించినా క్రమేపీ ఇది వారి జీవనోపాధికి తోడ్పడింది. ఏ క్షేత్రంలో వారి కార్యక్రమం వుంటుందో ఆయా యాత్రాస్థలం పవిత్ర కథల్నీ, గాథల్నీ అశువుగా చెప్పి వారు ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేస్తున్నారు.

11.5. ద్రావిడ కళారూపం :

ఇలా పరిణామం పొందిన కురవంజి కళారూపం ఈనాడు మన ఆంధ్రదేశపు ప్రదర్శనాల్లో మచ్చుకు కూడా కనిపించకపోయినా అది సోదె చెప్పేవారిలో ఇంకా కొంచెం మిగిలే ఉందని. చెప్పవచ్చు. కానీ దక్షిణదేశంలో "కొఱత్తి యాట్టమ్", కన్నడదేశంలో "కొఱవంజి", తెలుగుదేశంలో "కురవంజి ఎరుకలసాని" అని ప్రచారం పొందింది.

ఆంధ్రదేశంలో జీవ కొరవంజి, రాజమోహన కొఱవంజి, జానకీ సుఖోల్లాస కొఱవంజి అనే నాటకాలు ప్రచారంలో వున్నాయి. వీటికి కూడా క్రమంగా ఆదరణ తగ్గుతూ వస్తున్నది.

11.6. కురవంజి నేర్చిన విద్యలు :

స్తంభన, వశీకరణ, ఆకర్షణ, ఉచ్చాటన, విద్వేషణ, వ్యోమగమనం, పరకాయ ప్రవేశాది విద్య లెరుంగదునే యవ్వా, పరమంత్ర పరయంత్ర, భేదంబు లెరుంగుదునే యవ్వా, "అశ్వలక్షణ", "గజలక్షణ" "రత్నలక్షణ" "స్త్రీ లక్షణ" "పురుష లక్షణ" "సాముద్రిక లక్షణంబు" లెరుంగుదునే యవ్వా అంటుంది కురవంజి కళాకారిణి.

ఉత్తమ ఔషధాలు అమ్మటమే కాకుండా కురవంజి చేతులు చూచి భవిష్యత్తు కూడా చెపుతుంది. తన వేష మహిమవల్లనైతేనేమి, తన మాటల చమత్కారం వల్ల నైతేనేమి భూతభవిష్యత్ వర్తమానాలను కరతలామలకం చేసుకున్న తన ప్రజ్ఞవల్లనైతేనేమి ఈ కురవంజి తెలుగు వాఙ్మయంలోనే కాకుండా ద్రావిడభాషలన్నిటిలోనూ శాశ్వత స్థానం సంపాదించుకుంది.

కొన్ని తెలుగు ప్రబంధాలలో అక్కడక్కడ కొరవంజి రచనలు కనిపిస్తాయి. కొన్ని యక్షగానాలలో కొరవంజి పాత్ర వుంది. సుగ్రీవ విజయం లాంటి పాత యక్షగానాలలో కొరవంజి పాత్ర లేదు.

11.7. పార్వతీదేవే కొరవంజి :

కొరవంజి కేవలం వినోదం కల్పించడానికి మాత్రమే కాక కథానిర్వహణానికి ఎంతగానో తోడ్పడుతుంది. సంస్కృత నాటకాల్లో విదూషకుని మాదిరే, యక్షగానాల్లో వున్న ఈ కొరవంజి తెలుగు కృష్ణలీలలు మొదలైన యక్షగానాల్లో చల్ల అమ్మే గొల్లది ఈ కొరవంజి లాంటిదే నంటారు.

చింతాదీక్షితులుగారు వారి ప్రజావాఙ్మయంలో, భామాకలాపంలో గొల్లది ఈ విధంగా వేదాంతోపన్యాసం చేసి ప్రజలను ఎలా అలరిస్తుందో ఆ విధంగానే కొన్ని యక్షగానాల్లో కొరవంజి పూర్తిగా వేదాంతబోధే చేస్తుంది.

ఇంతకీ యక్షగానాల్లో వేషం వేసుకునివచ్చే కొరవంజి మామూలు ఎరుకలసాని కాదని పెద్దల నిర్వచనం, పార్వతీపరమేశ్వరుల విలాసార్థం కిరాతక వేషం ధరించిన విధంగా, పార్వతీదేవే కొరవంజి వేషం ధరించి యక్షగానాల్లో వినోదం కల్పిస్తూ వుంది.

మన తెలుగు కొరవంజి నాటకాల్లో వర్ణించబడ్డ ఎరుకలసాని ఎటువంటిదో ఆమె చాకచక్యం ఎటువంటిదో, మాటల చాతుర్యం ఎటువంటిదో గోకులపాటి కూర్మనాథకవి రచించిన మృత్యుంజయ విలాసం ద్వారా తెలుసుకోవచ్చు.

11.8. కొరవంజే శివుడు :

పార్వతి శివుని గూర్చి తపస్సు చేస్తుందనీ, శివుడు సమాధిలో వుంటాడనీ, మన్మథుడు తపోభంగం చేసి దగ్ధమై పోతాడనీ, పార్వతిని హిమవంతుడు తీసుకుపోతాడనీ, అప్పుడు శివుడు విరహవేదనను భరించలేక, పార్వతిని, చూడాలని తహతహ లాడతాడనీ, అందుకోసం తాను కొరవంజి వేషం వేసుకుని పార్వతి దగ్గరకు వెళ్ళి ఎరుక చెపుతాడనీ, ఇలా వేషం ధరిస్తాడనీ వివరించబడింది.

ముక్కున బలు కెంపు ముక్కెర చెలగ
పెక్కు రత్నము పూస పేర్లు చెన్నొంద
సిరమున రత్నభాసిత పాత్ర బూని
యెరుకతయై వచ్చె హిమశైలమునకు.

ఎరుకల సాని ప్రవేశం ఈ విధంగా సాగుతుంది.

ఎరుకసాని వచ్చె ఎరుకనుచు "అను"

ఎరుకలసాని వచ్చె నెరుకో యెరుకో యెరుకో యనుచు అని తెలిపారు.

మురిపెంపు నడకలతోడ, ముంగురు లల్లాడ సరసంపు మాటల – చతురతతో – శిరమున నవరత్నఖచితమైన బుట్ట పెట్టి మెఱుపువలె మేను మెఱయగ వచ్చి తన గొప్ప చెప్పుకుంటుంది.

12. యక్షగానం :

ఒకనాడు యక్షగాన వాఙ్మయం దక్షిణ భారతదేశంలో అంతటా దేదీప్యమానంగా వెలుగొందిందనటానికి కారకులు మన జక్కులవారే.

యక్షగానాలన్నా జక్కులవారన్నా ఈనాటి వారిలో కొంత హీనదృష్టి వుంది కానీ ఆంధ్రదేశంలో శతాబ్దాల తరబడి యక్షగాన వాఙ్మయం, యక్షగాన కళారూపాలు విచ్చలవిడిగా ప్రచారంలో వున్నాయి.

ISSN No.2319-3905

జక్కులవారు విద్యావివేకాల్లో ఘటికులు. ప్రాచీన జాతుల్లో జక్కులు... బవనివాండ్లు మొదలైనవారు, మేధావివర్గంగా ఎంచబడేవారు. సంగీత సాహిత్యాలలో, చిత్రశిల్ప కళాప్రతిభల్లో, అద్వితీయ స్థానాన్ని సంపాదించి ప్రతిభావంతులుగా పేరుపొందారు.

12.1. ఈనాటి వైదుష్యం :

ఈనాడు కూచిపూడి భాగవతుల కళావైదుష్యాన్ని మనం ఎలా స్తుతిస్తున్నామో అలాగే నాటి జక్కుల వారిని, బవనివాండ్లనూ స్తుతించేవారు. కానీ వంశ పారంపర్యంగా వీరి కళాకౌశలం క్షీణిస్తూ వచ్చింది. ఉన్నతాదర్శాలు నశించాయి. ఆనాటి యకగాన వాఙ్మయానికి ప్రతీకగా ఈనాడు, అచ్చుగ్రంథాలైతేనేమి, వ్రాత ప్రతులైన తాళపత్ర, సాధారణ పత్రగ్రంథాలైతేనేమి నాలుగువందల వరకూ యక్షగాన రచనలున్నాయని తెలుస్తున్నది.

అయితే కొండవీటి రెడ్డిరాజుల కాలంలో విజయనగరరాజుల కాలంలో, తంజావూరు ఆంధ్రనాయక రాజుల కాలంలో, యక్షగానాలూ, యక్షగాన వాఙ్మయం దేదీప్యమానంగా వెలుగొందిన విషయం సర్వసామాన్యంగా అందరికీ తెలిసిందే.

12.2. ప్రాచీనంలో ప్రాచీనం – యక్షగానం :

మన ప్రాచీన కళారూపాల్లో అతి ప్రాచీనమైంది యక్షగానం. ఇది ఆంధ్ర, తమిళ, కర్ణాటక రాష్ట్రాల్లో అతి విస్తారంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఈనాడు మనం చూస్తున్న వీధి భాగవతాల మాతృకలు ఈ యక్షగానాలేనని పరిశోధకులంటున్నారు.

13. ధర్మరాజు తిరునాళ్ళు :

చిత్తూరు జిల్లాలో ఆంధ్రదేశంలో ఎక్కడా జరగని విధంగా ధర్మరాజు తిరునాళ్ళని ప్రతి సంవత్సరం జరిపిస్తుంటారు. దీనినే ద్రౌపదమ్మ తిరునాళ్ళు, భారతం తిరునాళ్ళు, అగ్గి తిరునాళ్ళు అని కూడా అంటారు. ఇప్పుడిప్పుడే ఈ తిరునాళ్ళు పక్క జిల్లాలకు కూడా పాకుతున్నాయి. ఈ తిరునాళ్ళను పద్దెనిమిది రోజులు జరుపుతారు. తొమ్మిదో రోజు నుండి రాత్రి పూట గుడి ముందు భారతంలోని వివిధ పర్వాలు, వాటిలోని వివిధ ఘట్టాలను నాటకాలుగా ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన రాత్రి 10 గంటల నుండి తెల్లవారి 5 గంటల వరకు జరుగుతుంది. అందులో బకాసురవధ, అర్జునుడు తపస్మాను ఘట్టాలు చూడ చక్కనివి. బకాసుర వధలో భీమ పాత్రధారి రెండు దున్నపోతులను కట్టిన బండిపై ఊరిలోని ఇళ్ళ వద్ద సేకరించిన అన్నం, కూరలతో ఊరి వెలుపలకు వెళ్ళి బకాసురుణ్ణి సంహరించి, ఆ అన్నాన్ని ఊరి వాళ్ళందరికీ పంచిపెడ్తాడు. అలాగే అర్జున పాత్రధారి తపస్సు చేయడానికని గుడి ముందు నాటివున్న తాటి చెట్టును ఎక్కి అక్కడ్నుంచి పళ్లు, పూలు, వెదజల్లుతాడు. ఇది కూడా ఎంతో ఆకర్షణీయమైన ప్రదర్శన.

ఈ మహాభారత నాటకాల్లో స్థానిక నటులే కాకుండా, జిల్లాలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన కళాకారులు కూడా జిల్లా అంతటా వీటిని ప్రదర్శిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు కుప్పం నియోజకవర్గంలోని కొత్త ఇండ్లు, గుండ్లమడుగు, అనిమిగానిపల్లి, వసనాడు, గోనుగూరు

గ్రామవాసులు. వీరు ధర్మరాజు తిరునాళ్ళలోనే కాకుండా ప్రతి ఏడాది ఉగాది, శ్రీరామనవమి, మహాశివరాత్రి, దీపావళి, గంగజాతర వంటి పర్వదినాల్లో కూడా వీధినాటకాలను ప్రదర్శిస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రాంత వీధినాటకాల వారికి ఎంతో గొప్ప పేరు ఉంది. వీరు గతంలో హైదరాబాదు, న్యూఢిల్లీ దూరదర్శన్ కేంద్రాల నుండి కూడా నాటకాలను ప్రదర్శించారు, మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన నుండి ఈ వీధి నాటక కళాకారులు షీల్డును అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం సాంస్కృతిక వ్యవహారాల శాఖల వారు కూడా వీరి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఇలా చిత్తూరు జిల్లాలోని వీధినాటకాలు ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉన్నాయి.

14. పులివేషం :

పులివేషం వేసేవాళ్ళు తలకు బిగుతుగా గుడ్డను చుట్టి పులి తలలా చేస్తారు. ఇలా చేయడం వల్ల తల నేలను తాకుతున్నప్పుడు దెబ్బ తగలకుండా ఉంటుంది. లంగోటాను చుట్టి శరీరానికి పసుపు రంగు పూసి, చారలు వేసి వెనుక వైపున తోకను కూడా అమర్చుతారు. పులిని కవ్వించడానికి పెద్ద చెండును ఉపయోగిస్తారు. గడకొయ్యను తీసుకొని దానికి వెదురు దబ్బలను అమర్చి రంగు, సరిగ కాగితాలను అతికించి తయారు చేస్తారు. డప్పు, కాజాలు వాయిస్తూ ఉంటే పులి అడుగులు వేస్తూ వేషధారులు వెళ్తుంటారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో, బంధువుల, స్నేహితుల ఇండ్లముందు, గ్రామ దేవతల గుళ్ళ ముందు పులి ఆట పూర్తిగా ప్రదర్శిస్తారు. పులి వేషధారి నిమ్మకాయను వెల్లకిలా పడుకొని నోటితో ఎత్తుకొని విజయ సంకేతంగా చిందులు వేస్తూ, అరుపులు అరుస్తూ ఆటను ముగిస్తాడు. నేడు పులి వేషానికి ఎనామిల్ రంగులను శరీరానికి పూసుకుంటున్నారు. ఇది ఎండిపోయి శరీరాన్ని బాధపెడుతున్నా లెక్క చేయరు. వారి కళాభిరుచికి, అంకిత భావానికి ఇది నిదర్శనం.

15. గెరిగాట :

గెరిగాటనే గెరిగనృత్యం అని కూడా అంటారు. నిజానికి ఇది కరగ నృత్యం. కరగము అంటే అభిషేకానికి పనికి వచ్చే పవిత్ర జలంతో నిండిన కడవ అని అర్థం. దీన్ని కూడా మొక్కుబడి కోసం వేస్తారు. కొత్త దుత్తను తీసుకొని దానికి పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టి టెంకాయను తీసుకొని దానికి కూడా పసుపు కుంకుమలు రాసి తమలపాకులను చెంబుపై నాలుగు పక్కల పెట్టి దానిపై టెంకాయ పెట్టి టెంకాయపై నిమ్మకాయను నిలబెడ్తారు. దాన్ని పూలతో అలంకరిస్తారు. మగవారికి ఆడవేషం వేసి నుదుటిపై కుంకుమ బొట్టు దాని కింద నల్ల చుక్కబొట్టును పెడెతారు. పూర్ణ కుంభంలా ఉండే గెరిగను ఉత్సవ సమయాల్లో నెత్తిన పెట్టుకొని డప్పులు కొమ్ములు వాయిద్యాలతో లయబద్ధంగా ఆడుతూ వెళ్తుంటారు. ఈ గెరిగలు తమిళనాడు, ఆంధ్ర, కర్నాటకలో బహు ప్రసిద్ధంగా ప్రదర్శింపబడుతున్నాయి.

ISSN No.2319-3905

15. ఇంద్రచాపాలు – రంగవల్లులు :

తెలుగింటి ఆడపడుచులు పల్లెల్లో ఉన్నా, పట్టణాల్లో ఉన్నా పొద్దున్నే లేచి వాకిళ్లు చిమ్మి, కల్లాపుచల్లి ఏదో ఒక ముగ్గు వేయడం వారి దినకృత్యం. పండుగ సమయాల్లో అయితే ప్రత్యేక శ్రద్ధతో అరుగులు అలికి, లోగిళ్ళలో ముగ్గులు పెడ్తారు. స్త్రీ ముగ్గులు వేసే ప్రతి సారి ఒక విధమైన అనుభూతిని పొందుతుంది. ఆమెకు రంగవల్లి ఒక పవిత్రమైన కళ. ఈ కళ ద్వారా ఆమె దేవతల్ని తన కుటుంబ సౌభాగ్యం కోసం ప్రార్థిస్తుంది.

ముగ్గులను బియ్యం పిండితోను, ముగ్గుపిండితోను, సుద్దముక్కలతోను, వివిధ రంగుల్తోను వేస్తారు. పూర్వం రాజులు, ఐశ్వర్యవంతులు ముత్యాలతో, రత్నాలతో ముగ్గులు వేసేవారని ప్రతీతి.

ఈ రంగవల్లులను ఒక్కో ప్రాంతలో ఒక్కో పేరుతో పిలుస్తారు. పశ్చిమ బెంగాల్‌లో "అల్పనా" అని, ఉత్తర ప్రదేశ్‌లో "చాక్" అని, రాజస్థాన్‌లో "మందన" అని, గుజరాత్‌లో "సాంత్యా" అని తమిళనాడులో "కోలమ్" అని ఆంధ్రప్రదేశ్‌లో "ముగ్గులు" అని అంటారు.

రంగవల్లుల ప్రసక్తి క్రీ.పూ. 150 సంవత్సరాలకు పూర్వం వాత్స్యాయనుడు రాసిన కామసూత్రాల్లో కనిపిస్తోంది. ఈ గ్రంథంలో స్త్రీ 64 కళల్లో ప్రావీణ్యం సంపాదించినట్లు, అందులోని నాల్గవ కళను "అలేఖ్య" (రంగుల గీతలు)గా, ఆరవ కళను "రంగోలి" (దేవతలను సంతృప్తి పరచేది)గా, తొమ్మిదవ కళను "మణికర్మ" (రంగురాళ్లను ఒక ఆకారంలో అమర్చడం)గా పేర్కొన్నాయి. గోపికలు ముగ్గులు వేడయంలో నిమగ్నమై శ్రీకృష్ణుణ్ణి మరచిపోతారు. తర్వాత వారు చింతించినట్లు భాగవతంలో పేర్కొనబడి ఉంది. ఆనాటి తెలుగువారి సంస్కృతిని కళ్ళకు కట్టినట్లుగా చూపే క్రీడాభిరామం గ్రంథంలో

"చందనంబున కలయంపి చల్లినారు
ముగ్గులిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినారిందు రజమున రంగవల్లి
కంజముల దోరణంబుల గట్టినారు" (178)

అని ముగ్గులు పెట్టిన విధానాన్ని చక్కగా శ్రీనాథుడు వర్ణించాడు.

రంగవల్లి ఒక "బిందువు" (చుక్క) నుంచి పుట్టిందని చెప్పొచ్చు. అందుకేనేమో చుక్కలు పెట్టి ముగ్గులు గీస్తుంటారు. ముగ్గుల్లో కొన్ని పద్ధతులు సులభమైనవి, మరికొన్ని కష్టమైనవి ఉంటాయి. ముగ్గులు అనాలోచితంగా అప్పటికప్పుడు గృహిణులచే రూపుదిద్దుకుంటాయి. ఒక్కోసారి అవి ఎంతో సృజనాత్మకంగా ఉంటాయి. అవి జఠిలమైన ఆలోచనలకు సులభమైన సమాధానాలుగా భాసిస్తాయి. వారంలో ఒక్కోరోజు ఒక్కో రంగవల్లిని వేసి ఆ దినానికి సంబంధించిన గ్రహాన్నో, దేవతనో ఆరాధిస్తారు. అలాగే పండుగల సమయాల్లో కూడా ఆయా పండుగలకు వర్తించే రంగవల్లులనే వేస్తుంటారు. భూత ప్రేతాలు ఇండ్లలోకి ప్రవేశించకుండా ఉండడానికి కొన్ని ప్రత్యేకమైన రంగవల్లులను వేస్తారు.

రంగవల్లుల్లో వేదాంత భావాలను స్ఫురిస్తాయి. మన పూర్వీకులు వేదాల పవిత్రతను రంగవల్లి ద్వారా ప్రతిబింబించారు. ఒక్కో ముగ్గును వేసేటప్పుడు దాని స్వభావం మనకు తెలియక పోవచ్చు. కానీ అది ఎన్నో భావాలను ఇముడ్చుకొని ఉంటుంది. అలాంటి మతపరమైన భావాలు కలిగిన వాటిలో స్వస్తిక, సర్వతోభద్ర, లజ్జావతి, పద్మం, లక్ష్మీపాదాలు వంటివి ప్రధానమైనవిగా వున్నాయి.

చిత్తూరు జిల్లాలో ధర్మరాజుల ఉత్సవాలు జరుగుతాయి. ఇవి తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లాలో గంగజాతర జరుగుతుంది. ఇలాంటి జాతరలు తమిళనాడు, కర్నాటకలో కూడా జరుగుతున్నాయి. ఆడికృత్తిక ఉత్సవాలు తమిళనాడులో అత్యంత వైభవంగా జరుగుతాయి. అందులో భక్తులు భీభత్సం కలిగించే రీతిలో విన్యాసాలు చేస్తారు. ఒళ్ళంతా సూదులు గుచ్చుకోవడం, వీపుకు కొక్కీ తగిలించుకొని గుండును కొండపైకి లాగడం వంటి విన్యాసాలు చేస్తారు. అవే వేడుకలు, విన్యాసాలు చిత్తూరు జిల్లాలోని కుప్పం, గుడుపల్లె, చిత్తూరు, తిరుపతి, నగరి వంటి ప్రాంతాల్లో ప్రదర్శిస్తారు. ఆడికృత్తిక రోజు భక్తులు తమిళ సంప్రదాయాలు పాటిస్తూ తిరుత్తణికి వెళతారు.

తెలుగునేల నలుచెరగులా పండిత పామరులందరూ వేమన పద్యాలను చెబుతారు. ఆ పద్యాలను తెలుగు దేశానికి సుదూరంగా ఉన్న రామేశ్వరంలో తమిళ ప్రజలు పాడుకుంటున్నారు. తమిళనాడులో జల్లికట్టు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. వారి ప్రభావంతో చిత్తూరు జిల్లాలో అనేక గ్రామాల్లో జల్లికట్టు నిర్వహిస్తున్నారు. తిరుమల దేవాలయంలో ఇత్సవాలు వేడుకలన్నీ తమిళ సంప్రదాయం ప్రకారమే జరుగుతున్నాయని చెప్పవచ్చు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని శ్లాఘించిన వారిలో 12 మంది ఆళ్వారులు సమిదులే. స్వామి వారి దేవాలయంపై తమిళ లిపిలో రాయబడిన శాసనాలున్నాయి. శ్రీ స్వామి వారిని సంక్రాంతి మాసంలో 30 రోజులపాటు ఒక్కో రోజు ఒక్కో పాశురంతో వర్ణించిన గోదాదేవి తమిళస్త్రీయే. ఆ పాశురాలను ఆ మాసంలో తెలుగవారందరూ పాడుతూ స్వామి సేవ చేస్తున్నారు. ఇలా ద్రావిడ కళలు, సంస్కృతి సంప్రదాయాలు దక్షిణ దేశంలో విరివిగా ప్రయోగించబడుతూ ప్రజలను ఏకతాటిపై నడిపిస్తున్నాయని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర – సురవరం ప్రతాపరెడ్డి
2. యక్షగాన వాఙ్మయం – డా॥ యస్వీ జోగారావు
3. క్రీడాభిరామం – శ్రీనాథుడు
4. ఆంధ్రుల చరిత్ర – ఏటుకూరి బలరామమూర్తి
5. మన ప్రాచీన కళలు – పుట్టుపూర్వోత్తరాలు – ఎల్లోరా
6. తెలుగు జానపద గేయ సాహిత్యం – డా॥బి.రామరాజు

ISSN No.2319-3905

7. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి – కంభంపాటి సత్యనారాయణ
8. తంజావూరు ఆంధ్రనాయక చరిత్రము – కురుగంటి సీతారామయ్య
9. జానపద విజ్ఞానం – ఆర్.వి.ఎస్. సుందరం
10. ప్రజా వాఙ్మయము – చింతా దీక్షితులు
11. తెలుగు సంస్కృతి – మల్లంపల్లి సోమశేఖరశర్మ
12. జానపద విజ్ఞానాధ్యయనం – ఆచార్య జి.ఎస్. మోహన్.
13. రాయలసీమ జానపద కళలు – ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి
14. ఆముక్త మాల్యద – శ్రీకృష్ణదేవరాయలు
15. జానపద నృత్యాలు – నేదునూరి గంగాధరం
16. ప్రజా కళారూపాలు – డా॥జయదీర్ తిరుమలరావు

9

జానపద కథలలో – స్త్రీ పాత్ర చిత్రణ

– డా.జి.శైలమ్మ

జానపదులు తమ కష్టసుఖాలను ఒకరితో ఒకరు చెప్పుకొని మనసులోని బాధను పోగొట్టుకుంటారు. మానసిక ఆందోళనను పోగొట్టుకోడానికి కథలు చెప్పుకుంటారు, గేయాలను పాడుకుంటారు.

జానపదులు చెప్పుకొనే అనేక కథల్లో స్త్రీని వర్ణించే తీరు, బహుభార్యత్వం, స్త్రీ జీవన విధానం సుస్పష్టంగా తెలుస్తుంది. మహారాణిగా వర్ణించబడిన స్త్రీ గర్వంతో రాజ్యాన్ని కోల్పోయి సామాన్య స్త్రీవలె జీవించడం, అందమైన స్త్రీ ఎవరో ఒకరు మునుల శాపానికి బలికావడం. స్త్రీని జీవమున్న వస్తువు వలె చూడబడటం జానపద కథల్లో చూడవచ్చు.

జానపదులు చెప్పుకునే కథలలో ఒకేరాజు నలుగురు లేదా ఐదుమంది లేదా ఇంకా ఎక్కువ మంది స్త్రీలను భార్యలుగా చేసుకున్నట్లు తెలుస్తుంది. వీరికి వ్యక్తిత్వం లేనట్టుగా పురుషునికి ఆనందాన్నిచ్చే వస్తువుగా స్త్రీని చిత్రించడం పరిపాటి. అలాగే, నక్కలు, కుక్కలు, పాములు, చేపలు, పక్షులు అనేక రకాల జీవరాసులతో స్త్రీలకు వివాహాలు చేయడం జరుగుతుంది. వాళ్ళు సమాజంలో అనేక రకాల సమస్యలు, అవమానాలు ఎదుర్కోవడం కనిపిస్తుంది. జానపదుల కథల్లో స్త్రీ కష్టాలుపడుతూ గాని, సుఖంగా జీవిస్తుంటుంది. కటిక పేదరికంలో పిల్లలను పోషించే తల్లిగా చిత్రించడం జరిగింది. అంతేకాకుండా నీతి బోధకతను తెలియజేసే కథలలో స్త్రీ ఎలా వుండాలో తెలియజేస్తాయి.

1. అద్భుత కథలు: జానపదునికి, పాముకి విడదీయరాని సంబంధం వుంది. పాము చెత్తలోనో, గడ్డిలోనో, చెట్ల మీదో, మట్టి గుంతల్లోనో నివసిస్తుంటుంది. మానవుడు ఆహారాన్వేషణ కోసం చెత్త పేరుకుపోయిన ప్రదేశాలు, చెట్టు, మట్టి తొర్రలను తనకు కావాల్సింది సేకరించాల్సినప్పుడు పాము కాటు నుండి తప్పించుకోవాలి. తమ పిల్లలు జీవనోపాధిలో భాగంగా చెట్లల్లో, పుట్టల్లో పని చేస్తున్న సమయంలో తమ పిల్లలను కాటేయవద్దని పాములకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. నాగలోకానికి సంబంధించిన అద్భుతకథలు జానపదులు చెప్పుకుంటారు.

నాగుపాము శివునికి పూజ చేసిన భక్తురాలిగా, శివుని మెడలో హారంగా ప్రత్యక్షమవుతుంది. నాగుపాము పాతాళ లోకంలో నివసిస్తుందని అక్కడ రత్నాలు, మణులు వుంటాయని సర్వసంపదలతో తులతూగుతుంటుందని నమ్ముతారు. నాగలోకానికి చెందిన వస్తువులను మానవులకిచ్చి ఆనందింప చేస్తాయని నమ్ముతారు.

1.1. ఎనుములరాజుకథ:

గేదెలు మేపుకొని జీవనం సాగించే ఒక కుటుంబం వుంటుంది. తండ్రిలేని లోటు తెలీకుండా బిడ్డను పెంచుతుంది. ఊర్లో వాళ్లందరి ఎనుములు (పశువులను) మేపుకొచ్చే పని చేస్తుంటాడు. ఫలితంగా గేదల యజమానులు ఎంతో కొంత ధనాన్ని జీతంగా ఇచ్చేవారు. ఎనుములు మేపుకొనే పిల్లవాడు అనుకోకుండా రాజుగా మారిపోతాడు. ఎలా సాధ్యపడింది. ఇది సాధ్యమేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి.

భర్త బిడ్డను వదిలి వెళ్లిపోయాడు. ఆ స్త్రీ ఒకటే బిడ్డను పోషిస్తుంది. పోషించడమే కాదు బతుకుదెరువుని చూపిస్తుంది. ఆ బిడ్డ భారమని తన దారి తాను చూసుకోలేదు.

"ఒకరోజు తల్లి సరుకులు తెమ్మని డబ్బులిస్తే ఒక పాముపిల్లను కొనుక్కొస్తాడు. కుమారుడు చేసిన పని మంచిది కాదని, పామును స్వేచ్ఛగా వదిలేయమని చెప్తుంది. తల్లిమాటవిని పాముని ఒక పుట్టలో వదిలేస్తాడు"[1]పుట:218.

పిల్లవాడు చేసిన పని మంచిదని గ్రహించిన పాము నాగలోకానికి వెళ్లి జరిగిన సంగతి తండ్రికి వివరిస్తుంది. నాగేంద్రుడు ఎనుములరాజుని నాగలోకానికి ఆహ్వానిస్తాడు. ఏది కావాలంటే అది సమకూర్చే నాగమణిని కావాలని అడుగుతాడు. ఇది రహస్యంగా వుంచాలని, కాదని ఎవరితోనైనా చెపితే సంపదనంతా కోల్పోతావని తెలియజేస్తారు. ఆ ఒప్పందం మీద మణిని నాగరాజు ఆ పిల్లవానికి బహుకరిస్తాడు. ఆ పిల్లవాడు ఇంటికి వచ్చి తన కుటుంబానికి కావాల్సిన ప్రతి అవసరాన్ని తీర్చుకుంటాడు. ఇతనికి రాకుమార్తెతో వివాహం జరుగుతుంది. ఒకరోజు ఆకాశంలో విహరించే సమయంలో ఆమె కాలికున్న బంగారు చెప్పు కింద పడిపోతుంది. ఆ చెప్పు ఒకరాజు కుమారునికి దొరుకుతుంది. ఈ బంగారు చెప్పు గల స్త్రీని వివాహమాడాలని అనుకొంటాడు.

వివాహమైన స్త్రీని మరో వ్యక్తి వివాహం చేసుకోవాలనుకోడం? రాకుమారుని ఇంట్లో బంగారం, ధనానికి కొదువలేదు. అయినా రోడ్లో దొరికిన బంగారు చెప్పులు వేసుకున్న మహిళను వివాహమాడాలని, ఆమెను తెచ్చిచ్చిన వారికి అర్థరాజ్యమివ్వాలని దండోరా వేయిస్తాడు. నాగలోకం నుంచి తెచ్చిన మణిసాయంతో ఎనుములరాజుగా ధనవంతుడయ్యాడని తెలుసుకున్న వృద్ధురాలు సాటిస్త్రీ అయిన ఎనుములరాజు భార్య జీవితంలో అన్యాయం చేయడానికి ముందుకొస్తుంది.

ఆమెను ఆ రాజుకి అప్పగిస్తుంది. ఆ వృద్ధురాలికి ధనముపట్ల వ్యామోహం. మానవ సంబంధాల పట్ల అవగాహన లేకపోవడం కనిపిస్తుంది.

ఎనుముల రాజుగా వున్న (ఎనుములు మేపుకొనేవాడు) వాడు పేదవాడిగా మారిపోతాడు. అతను నాగలోకం వెళ్లి నాగేంద్రునితో జరిగిన మోసం వివరిస్తాడు. నాగేంద్రుడు ఎనుముల రాజుకి సాయం చేస్తాడు. ఫలితంగా తన భార్యను బంధించిన రాజుని ఓడించి భార్యను, మణిని సంపాదించుకుంటాడు. తిరిగి తన సంపదలతో హాయిగా జీవిస్తాడు.

ఈ కథలో నాగుపాముకి చేసిన సాయం మరిచిపోకుండా సాయమందించడం గమనించవచ్చు. నాగలోకంతో సంబంధం వున్నా స్త్రీ పరిస్థితి, స్త్రీలపై జరుగుతున్న దోపిడీలు మాత్రం యథాతథంగానే వున్నాయని తెలుస్తుంది.

కాలికేసుకున్న చెప్పును చూసి, ఆ చెప్పు వేసుకున్న స్త్రీని వివాహమాడాలని అనుకోవడాన్ని గమనిస్తే, ఆమెకు వివాహమైనా, కాకున్న ఆమె అభిప్రాయాలతో పని లేకుండా ఆమెను నిరభ్యంతరంగా వివాహం చేసుకునే సంప్రదాయం వున్నట్లు తెలుస్తుంది.

2. జీవరాసులకు సంబంధించిన కథలు:

జానపదుల కథల్లో తమతోపాటు జీవించే కుక్క, నక్క, పిల్లి, పక్షులు, చేపలు ప్రధాన పాత్రలుగా వుండి స్త్రీ వారికి భార్యగానో, యజమానురాలిగానో వుంటుంది.

2.1. చేపరాజు కథ:

ఒక రాణి వుంటుంది. ఆమెకు పిల్లలు కలగరు. పిల్లలు లేకపోతే అందరు ఆమెను అవమానించడం జరుగుతుంది. అవమానం భరించే కన్నా చేపపిల్లలన్నా తన కడుపున పుట్టాలని అని కోరుకుంటుంది. "రాణి ఒకరోజు బావివద్ద నిలబడి బావిలోని చేపలు, చేపపిల్లలను చూసి ఇలాంటి చేపపిల్లలన్నా పుట్టకపోయెనే అని అనుకొని ఇంటికి వస్తుంది"[2] (పుట:192, చేపరాజుకథ – సావిత్రమ్మ, కృష్ణాపురం, కోలారుజిల్లా) అనుకున్నట్టుగానే ఆమెకు చేపపిల్ల పుడుతుంది. సమాజంలో ఆమెకు అవమానం కలిగుంటుంది. అయినా భయపడకుండా ఆమె చేప బిడ్డను నీటిలో వేసి పెంచుతుంది. తరువాత పెళ్లి చేస్తుంది. ఆ అమ్మాయి జీవితంలో కష్టాలు మొదలవుతాయి.

చేప చాలా పెద్దదవుతుంది. ఆ చేప పెళ్లి చేయమని అడుగుతుంది. చేపరూపంలో వున్నది అమ్మాయా అబ్బాయా ఎలా తెలుస్తుంది. చేపరూపంలో వున్నది అమ్మాయి అయితే అబ్బాయినిచ్చి పెళ్లి చేయరు. కాబట్టి జానపదులు చేపను కొడుకుగా సృష్టిస్తారు. అమ్మాయి అయితే దొరుకుతుందని నమ్మకం. అతనికి నలుదిక్కుల నుండి పిల్లను వెతుకుతారు. ఒక సవతి తల్లి మాత్రం ఎంతో కొంత డబ్బుకి ఆశపడి కుమార్తెను చేపకిచ్చి వివాహం చేస్తుంది. చేపతో సహజీవనం అసలు ఊహించుకోలేం. ఆ అమ్మాయి చనిపోవాలనుకొంటుంది. దేవతలు ప్రత్యక్షమై మంత్రించిన

ఇసుకను తెచ్చి చేపమీద చల్లుతుంది. చేప అందమైన యువకుడిగా ప్రత్యక్షమవుతాడు. చేపరూపంలో వున్నది అబ్బాయి. స్త్రీకి చేపతో కూడా ముడిపెట్టగలరనడానికి ఇదొక నిదర్శనం.

దేవుడు ఆమె కష్టాలను చూసి తనకు భర్తగా వున్న చేప మనిషిగా మార్చాల్సిన అవసరం ఏర్పడింది. దేవుడు ప్రత్యక్షం కాకుంటే ఆమె జీవితం ఏ గుర్తింపు లేకుండా పోయుండేది.

స్త్రీకి స్త్రీనే శత్రువు అనే సామెత వుంది. స్త్రీలు స్త్రీలను చూసి ఎందుకు అసూయపరులవుతారో స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేకపోయినా ఒకరికంటే ఒకరు ఉన్నతంగా వుండటం మాత్రం చూసి ఓర్వలేరు.

చేపరాజు కథలో సవతి తల్లిపోరు. తన బిడ్డ మాత్రమే బాగుండాలని కోరుకుంటుంది. వివాహం చేయాల్సిన కుమార్తెకు వివాహం చేయకుండా అక్క భర్త దగ్గరకు పంపుతుంది. ఆమెకు వేరే వ్యక్తితో వివాహం చేయవచ్చు కాని చేయదు. సమాజంలో ఇలాంటి సంఘటనలు సహజంగా వుండటం గమనించాలి.

సవతి తల్లి కుమార్తె, తన నగలన్నీ ధరించి సోదరి సమానురాలైన వివాహితను బావిలోకి తోసేస్తుంది. ఆమెలో వున్న ఈర్ష్య, తోటి సహోదరిని చంపడానికి ఏ మాత్రం వెనకడుగేయని కుట్ర ఇక్కడ సాటి స్త్రీ పట్ల గమనించవచ్చు.

"సవతి తల్లి కూతురు ఈమెను బావి వద్దకు తీసుకొనిపోయి ఆమె నగల్ని పెట్టమని, చూసి ఇస్తానని ఇప్పించుకొని అన్నీ పెట్టుకొని బావిలో నీడ చూసుకొని అక్కను కూడా వచ్చి చూడమని పిలుస్తుంది. చూస్తుండగా ఆమెను కూడా బావిలో తోసేస్తుంది"[3] పు:193. అసూయ కారణంగా, తల్లి చెప్పిన మాట విని మానవత్వం మరచిపోయి సాటి స్త్రీ అని చూడకుండా చంపడానికి తెగిస్తుంది. సోదరి ఒంటి మీద నగలు ధరించి, సోదరి భర్తతో కలిసుండటానికి సిద్ధపడుతుంది. సవతి తల్లి కారణంగా చేపకు భార్యగా వుండటానికి ఒక స్త్రీ అమ్ముడుపోతే, ఏదో ప్రయత్నం వలన చేప మనిషై సంతోషంగా జీవించే ఆ స్త్రీ జీవితంలో సవతి తల్లి కుమార్తె వరుసకు సోదరి ఆమెను చంపేయాలని, తన భర్తతో జీవితాన్ని పంచుకోవాలనుకొనే చెడ్డ తలంపులతో స్త్రీలు వున్నారు. ఆ స్త్రీ ఎన్నో అవమానాలను ఎదుర్కొని జీవిస్తుంది.

2.2. నక్క బావ కథ: స్త్రీని వివాహం చేసుకొనే జీవులలో నక్క కూడా ఒకటి. నక్కకి మనిషికి సంబంధం లేదు. ఒక రైతు తన కుమార్తె ఏడుస్తుంటే, ఆ ఏడుపుని ఆపడానికి నక్కకిచ్చి వివాహం చేస్తాను అని తమాషాగా అనేవాడు. అదే నిజమై ఆమె జీవితంలో నక్క భర్తగా లభిస్తాడు. నక్క చాల ధనాన్ని తన బొరియలో దాచి వుంటాడు. ఒక్కో బహుమతి రైతు అయిన మామకిచ్చేవాడు. మామ అనేకమార్లు నక్క దగ్గర బహుమతి పొందుతాడు. కుమార్తె బాగుందా లేదా, నక్కతో ఎలా జీవించగలుగుతుంది అని తండ్రి అడిగి తెలుసుకున్నట్టు కథలో వుండదు. అమ్మాయి తండ్రి ధనవంతుడయ్యే ప్రయత్నం కనిపిస్తుంది. అల్లుడైన నక్క దగ్గర అనేక బహుమతులు పొందుతాడు. ఆమెకు మనసుందని, ఆమెకు కోరికలుంటాయని తల్లితండ్రి గమనించరు.

"రైతు అన్నీ సౌకర్యాలు చూసి ఆనందపడి ఇంటికి బయలుదేరినప్పుడు నక్క మామగారికి గుమ్మడివిత్తనాలిస్తాడు"[4] పుట:191. (ఆదెమ్మ, కంభం, ప్రకాశం) నక్క బొరియలో అన్ని సౌకర్యాలున్నాయి. ఇక కుమార్తెకు ఏ లోటు లేదని అనుకుంటాడు.

స్త్రీలు బ్రతడానికి చేస్తున్న పోరాటంలో తన భావాలకు ప్రాతినిథ్యం లేకపోవడం శోచనీయం. స్త్రీలంటే నాటి సమాజంలో ఏ విధమైన గుర్తింపులేదు. స్త్రీలను తమ స్వార్థం కోసం అమ్ముకొని జీవిస్తున్నట్టు తెలుస్తుంది.

3. దెయ్యాలతో స్త్రీలు: దెయ్యాలున్నాయని ఇవి మనిషి రక్తమాంసాలు తింటాయని అనుకుంటారు. దెయ్యాల కథలు పిల్లలకు భయాలను పెంచి పోషిస్తాయి. దెయ్యాలతో మనుషులకు వివాహం చేసుకోవాలన్నప్పుడు పురుష దెయ్యం అయి వుంటుంది. ఆ దెయ్యానికి మానవకాంతను వివాహం చేయాలని పుట్టక ముందే నిబంధనలు జరుగుతాయి. అమ్మాయి పుడితే దెయ్యం పేరే పెట్టాలని, దెయ్యానికిచ్చి వివాహం చేయాలని చెప్పడం స్త్రీ పట్ల నాటి సమాజం పోకడ అర్థమవుతుంది.

3.1. ధాలంబరి కథ: 'ధాలంబరి కథ'లో దానిమ్మపండు తినాలన్న తల్లి కోరికను నెరవేర్చడానికి ఒక కుమారుడు వెళతాడు. దెయ్యం అధీనంలో దానిమ్మ చెట్టు వుంది. ఆ దెయ్యం కొన్ని నిబంధలు పెడుతుంది. కుమారుడు పుడితే రాక్షసుని పేరు పెట్టాలని, కుమార్తె పుడితే దెయ్యానికిచ్చి వివాహం చేయాలని చెప్తుంది.

అమ్మాయిలకు దెయ్యాలతో, సంబంధాన్ని ఏర్పరచడం జానపదుల కథల్లో విస్తృతంగా గమనించవచ్చు.

ఆ రాణికి కుమార్తె పుడుతుంది. ఆమెకు దెయ్యంతో వివాహం అవుతుంది. దెయ్యానికి చాకిరీలు చేస్తుంది. అక్కడ నుండి మేనమామ ఇంటికి మారువేషంలో వెళ్లి ఆశ్రయం పొందుతుంది. అది గమనించిన మేనమామ ఆమె వేషం వేసే సెట్టుని దొంగిలిస్తాడు. ఆమె తన మరదలేనని గ్రహించి వివాహం చేసుకుంటాడు. వారికి ఒక కొడుకు పుడతాడు. దెయ్యం వెంటాడి ఆమె ఆ చాకిని గురుతుపడుతుంది. ఆమెకు ఇష్టమైన చోట వుంటుంది. కాని ఆమెకు ప్రశాంతత లేదు.

"గాజుల వర్తకునిగా బ్రహ్మరాక్షసుడు ధాలంబరి కోసము వెతుకుతూ వచ్చి ఆమెను చూచి కోపంతో మరుసటిరోజు వచ్చి ఆమెను, భర్తను, ఆమె కొడుకును తినేస్తానని చెప్పి వెళ్ళిపోతాడు"[5] పుట:203.

ఆమెను ఒక దెయ్యం బెదిరించడం జరిగింది. ఆమెను ఆ దెయ్యమే భయపెట్టడం జరిగింది. 'మహిళ'గా పుట్టడమే ఆమె చేసిన తప్పా? దెయ్యాలతో స్త్రీలకు వివాహం చేయడమేంటి? అందుకే ఆమె సాహసం చేస్తుంది.

ISSN No.2319-3905

గ్రామస్థులందరి సాయంతో దెయ్యం పీడ విరగడయ్యేలా చేయగలుగుతారు. తన కుటుంబంతో హాయిగా జీవిస్తుంది. (కథ చెప్పిన వారు: తుంగరామప్ప, తంగేడుకుంట, అనంతపురం, పుట:203)

3.2. మోసకారి దయ్యం: ఇదొక గిరిజన సమూహానికి చెందిన కథ. తాండాలో జరుగుతున్న సంగతులు, పరిష్కారాలు ఈ కథలో వర్ణించబడ్డాయి. స్త్రీలను లైంగిక, శారీరకంగా దోపిడీ చేస్తున్న ఒక సమూహం. ఎదుర్కొని నిలబడ్డ స్త్రీల పోరాటం ఈ కథలో వున్నాయి.

ఈ కథలో దయ్యాలు మనుషుల్ని (స్త్రీలను) వివాహం చేసుకుంటాయి. విచిత్రమేమిటంటే పురుషుల్ని వివాహమాడే ఆడ దయ్యాలుండవు. ఇది ఒక విధంగా తాండాలోని స్త్రీలను మోసం చేస్తున్న ఒక జన సమూహమైనా అయివుండాలి. ఈ కథను చదువుతున్నంతసేపు పాఠకులకు అత్యంత ఆసక్తిని గొలుపుతుంది. స్త్రీల దుస్థితిని ఆలోచింప చేస్తుంది.

ఒక పెద్ద తాండాలో వివాహం కానటువంటి అనేక మంది స్త్రీలున్నారు. తాండాకి దగ్గరలో వున్న దయ్యాల పెంట అనే ఊరువుంది. పెద్ద దయ్యం తాండాలోని అమ్మాయిలను వివాహం చేసుకొని దయ్యాల పెంటకు తీసుకుపోయి రక్తం తాగి చంపేవి. చంపడానికే అయితే అమ్మాయిలను మాత్రమే పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదు. అమ్మాయిను వివాహం చేసుకొనబోయే పెండ్లి కుమారుని పాదాలు మనుషులకున్నట్టు ముందుకి కాకుండా వెనక్కి వుండటం తాండావాసులను భయకంపితులను చేసి వుండవచ్చు. తాండాలలో ఆడపిల్లలపై జరిగే దాడులు ఎలా వుండేవో ఈ కథ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. దెయ్యం వేషమేసుకొని స్త్రీలను మోసం చేస్తున్న తీరు ఈ కథలో కనిపిస్తుంది.

దెయ్యాన్ని యామార్చి ఆ అమ్మాయి బయటపడి మరో గ్రామంలో తలదాచుకొంటుంది. కొంతకాలానికి మరో వ్యక్తితో వివాహమై బిడ్డ పుడతాడు. ముందు వివాహం చేసుకున్న దెయ్యం ఆ అమ్మాయి ఎక్కడ వుందో తెలుసుకొంటుంది. ఆ స్త్రీని ఎలాగైనా దెయ్యం బారి నుండి కాపాడాలని గ్రామస్తులనుకుంటారు. ఆమె రూపురేకలతో బొమ్మను తయారు చేస్తారు. బొమ్మలోపల బొంతపాలు పోస్తారు. ఆమె చీరను చుట్టి మనిషిలా తయారు చేస్తారు. ఆ రాత్రి దెయ్యం ఆ బొమ్మను స్త్రీ అనుకొని గొంతుకొరుకుతుంది. బొంతపాలు దెయ్యం కడుపులోకి పోయి చనిపోతుంది. దెయ్యం పీడ విరగడవుతుంది. ఆమె భర్త పిల్లలతో తాండాలోకి వెళ్లి తన వాళ్లతో కలిసిపోతుంది. గిరిజన మహిళలపై దోపిడీ విధానం, బలాత్కారం జరుగుతున్నదనడానికి ఈ కథే నిదర్శనం. (పుట:189, కథ చెప్పినవారు – సత్తిరమ్మ, కొండకమర్లతాండా, అనంతపురం)

4. నీతిబోధక కథలు: జానపదులు నీతిని ప్రబోధించే విషయాలను కథలుగా చేసి చెప్పుకునే సంప్రదాయం వుంది. అలా వచ్చిన కథల్లో ఒకరికి మనం దానం చేస్తే మనకు మరొకరి నుండి సహాయం అందుతుంది. మనకున్న దాంట్లో ఎంతో కొంత మరొకరికి దానం చేయడంవల్ల

మంచి ఫలితాలు, పుణ్యం లభిస్తుందని విశ్వసిస్తారు. దానం చేయకపోతే స్త్రీలు భయంకరమైన కష్టాలు పడతారని చెప్పేకథ.

4.1. కుక్కమ్మ కథ:

ఒక ఊర్లో ఒక గర్భవతి వుంటుంది. అదే ఇంట్లో కుక్క కూడ గర్భం ధరించి వుంటుంది. ఈమె రోజు రకరకాల పదార్థాలు తింటుంది. కాని కుక్కకు కొంచెం కూడా పెట్టదు. కుక్క చాలా బాధపడేది. అప్పుడు కుక్క తన కడుపులో కుక్క పిల్లలకు బదులు ఆమె కడుపులో వున్న పిల్లలు తనకు పుట్టాలని అనుకునేది. ఒకరోజు ఆమె ప్రసవిస్తే ఆమెకు కుక్కపిల్లలు పుడతాయి. కుక్కకి మాత్రం మనిషి పిల్లలు పుడతారు. కుక్క పిల్లలిద్దరిని అల్లారు ముద్దుగా పెంచుతుంది. ఇక్కడ కుక్కకు కొంచెం ఆహారం పెట్టివుంటే ఇలా జరిగుండేది కాదు. కుక్కైన, మనిషైనా వున్నదాంట్లో కొంచెం దానం చేసే లక్షణాన్ని కలిగుండాలని నీతి తెలియజేస్తుంది.

కుక్క పెంచిన ఇద్దరు అమ్మాయిలు పెద్దవారవుతారు. అటువైపుగా వచ్చిన రాకుమారులు వారిని వివాహం చేసుకొని వెళతారు. తల్లి పెద్దకుమార్తె దగ్గరకెళుతుంది. తల్లి అని చూడకుండా ఇంటి నుండి 'కుక్క' అని తరిమేస్తుంది. చిన్న కుమార్తె మాత్రం బాగ చూసుకుంటుంది. తల్లి కుక్క చనిపోతూ చిన్నకుమార్తెతో తన దేహాన్ని బయటపడేయకుండా పెట్టెలో దాచి పెట్టమంటుంది. కొద్దిరోజుల తరువాత పెట్టెను తెరిచి చూస్తుంది. పెట్టినిండా ధనము వుంటుంది. ఆ ధనంతో కుమారునితో, భర్తతో హాయిగా వుంటుంది. పెద్దకుమార్తెకు కుక్కపిల్ల పుడుతుంది. కష్టాల పాలవుతుంది. కుక్క శాపానికి కూడా స్త్రీ తన గర్భంలో బిడ్డలు మార్పు చెందుతారు. ఇది కేవలం దానం చేయకపోతే వచ్చే నష్టాలను తెలియజేసే కథ.

దానం చేసే గుణం లోపిస్తే సాటి జీవుల ఉనికి అంతరించి పోయే ప్రమాదం ఉంది. కనుక దానం చేసే గుణాన్ని పెంపొందించుకోవాలని లేకుంటే అనేక అనర్థాలు కలగొచ్చని ఈ కథ ద్వారా తెలుస్తుంది. (పుట:190, కుక్కమ్మ కథ–కథ చెప్పిన వారు–రాముడు, శాకివేల. కోలారుజిల్లా)

5. ప్రకృతికి సంబంధించిన కథలు: జానపదుల కథలు చెప్పుకొనే క్రమంలో ప్రకృతితో మమేకమైపోయుంటారు. మనుషుల పిల్లల్ని ప్రకృతి పెంచుతుంది. వారి జీవితంలో గుంత, చెట్టు, పిల్ల, ఏనుగు, చేప, పిల్లి ఇలా ఎన్నో కథనిడివిని బట్టి అల్లుకుపోతుండటం ఈ కథల్లో వున్న ఒక లక్షణం. సంతానానికి సంబంధించిన కథల్లో ఆ స్త్రీలు, వారికి పుట్టిన పిల్లలు ఎదుర్కొనే కష్టాలు కోకొల్లలు.

5.1. బచ్చలిగుంతకథ: ఈ కథ పేరులోనే ఎన్నో పరమార్థాలు దాగున్నాయి. బచ్చలి తీగ అల్లుకుపోతుంది. దీని పెరుగుదలకు పెద్ద ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. దీని ఆకులతో కూర చేసుకోవచ్చు. దీనికి కాయలు గుత్తులుగా కాస్తాయి. పిల్లలను పోషించగల శక్తి వున్న బచ్చలికూర పొదగా జానపదులు గుర్తిస్తారు.

ఎంత మంది రాణులను పెళ్లి చేసుకున్నా రాజుకి సంతానం కలగదు. సంతానం లేని రాణులు చాల బాధపడతారు. ఆ రోజుల్లో ఎక్కువమంది స్త్రీలకు సంతానం కలగనట్టు తెలుస్తుంది. లోపం ఎవరిలో వుందో తెలుసుకోకుండానే రాజు అనేక మంది స్త్రీలను వివాహం చేసుకుంటాడు. దీనివల్ల సంతానం లేని ఆ రాణులు సమాజంలో అవమానాలకు గురౌతారు.

రాజు ఒకరోజు గర్భంతో వున్న యువతిని పెళ్లి చేసుకుంటాడు. ఆమెకు ఏడుమంది పిల్లలు పుడతారు. ఒక కుమార్తె, ఆరుమంది కొడుకులు పుడతారు. మిగిలిన రాణులకు సంతానం లేనందున అసూయ కలుగుతుంది. ఆ పుట్టిన పిల్లల్ని బచ్చలి పొదలో పడేస్తారు. రాజుకి పిడకలు పుట్టినాయని రాణులు అబద్ధాలు చెప్తారు. రాజు నిజమేననుకుంటాడు. రాణి పిల్లల్ని కోల్పోయి దిగులు పడుతుంది. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతుంది ఆ బచ్చలి పొద.

పిల్లలు లేని రాణులు బచ్చలి పొదను తగలబెట్టిస్తారు. బచ్చలి పొద పిల్లల్ని వాళ్లకంటే ముందు దిబ్బమ్మ దగ్గరికి పంపుతుంది. దిబ్బమ్మను ఎత్తేపిస్తారు. దిబ్బమ్మ ఏనుగు దగ్గరకు పంపుతుంది. ఏనుగు చెవుల్లోపెట్టి పెంచుతుంది. ఏనుగుని చంపిస్తారు. ఆ ఏనుగు ఒక ముసలివానికిస్తుంది. ముసలివాడు పిల్లలకు తమ గురించిన కథను తెలియజేస్తాడు. ఆ పిల్లలు జీవితాన్ని పాటలుగా పాడుకుంటూ రాజు దగ్గరకి వస్తారు. ఆ పిల్లలు పాడిన పాట ఆధారంగా తమ పిల్లలని గుర్తిస్తారు. వారిని ఇంట్లోకి ఆహ్వానం పలుకుతారు.

ఈ కథలో ఒక స్త్రీ సంతానవంతురాలైతే మిగిలిన స్త్రీలకు అసూయ కలిగింది. ఆ పిల్లలను పెంచే బాధ్యతను ప్రకృతి తీసుకొంది. పిల్లలున్నా పరస్త్రీ మోసంవలన తన పిల్లల్ని తాను పెంచలేకపోతుంది. ఈ కథలో చివరకు తమ పిల్లలని గుర్తించి వారికి ఆహ్వానం పలికి, తప్పు చేసిన రాణులను రాజు సున్నపు రాళ్ళ పాతరలో వేసి శిక్షిస్తాడు. తల్లిగా తన బాధ్యతను నిర్వర్తించలేక పోయినందుకు ఆ స్త్రీ ఎంతో బాధను అనుభవించి వుంటుంది.

5.2. ముద్దుటుంగర చక్రవర్తి: ఈ కథలో ఒక రాజుకి ఇద్దరు భార్యలు వుంటారు. వీరిద్దరు అక్కచెల్లెళ్లు. అక్క రూపగంధావళి, చెల్లెలు అపురూపగంధావళి. ఏపాలం – గోపాలం అనే ఊరికి రాజుగా వున్న వ్యక్తి వారిని వివాహం చేసుకుంటాడు. అపురూపగంధావళి రాజు ప్రేమను పొందగలుగుతుంది. అక్క రూపగంధావళి రాజు ప్రేమను పొందలేకపోతుంది. ఇక్కడ అక్క చెల్లెళ్లు అయినప్పటికి వారి మధ్య సఖ్యత లేదు. చెల్లెలికి ఇద్దరు మగపిల్లలు పుడతారు. అక్కకి సంతానం లేదు.

భర్త ప్రేమను పొందలేని అక్క రూపగంధావళి అన్నసాయంతో తన భర్తతో వుండేలా చేస్తాడు. మారువేషంలో వున్న రూపగంధావళిని రాజు ఇష్టపడతాడు. ఆమె రాజు వద్ద వున్న పట్టపుకత్తి, ముద్దుటుంగరం, రాజు దుస్తులు తీసుకొని రాజు కోరిక నెరవేరుస్తుంది. రాజుకి తెలీదు తన భార్య రూపగంధావళే. ఆమె మగ బిడ్డకు జన్మనిస్తుంది. ప్రేమగా ఇచ్చిన ఉంగరం పేరునే కుమారికి ముద్దుటుంగరుడు అని పెడుతుంది.

ఇద్దరు భార్యల పిల్లలు ఒకే గురువు వద్ద విద్యను అభ్యసిస్తారు.

ఇక్కడ స్త్రీ పరిస్థితి రెండు దృక్కోణాలలో సాగుతుంది. స్త్రీ వివాహమైతే సంతానం కలగాలి. సంతానం లేకుంటే సమాజంలో గుర్తింపు వుండదు. అక్క సంతానం పొందడానికి తనే వేషాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. అంతేకాదు ఎవరితో కలిసిందో, ఎవరి ద్వారా సంతానాన్ని పొందిందో గుర్తుగా ఆ వ్యక్తి దగ్గర వున్న ముఖ్యమైన వస్తువులు తీసుకొంటుంది. పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరో తెలియాలి. ఇన్ని జాగ్రత్తలు తీసుకొంటుంది రూపగంధావళి. రూపగంధావళి సమాజంలో గుర్తింపబడటానికి ఎన్నో విధాలుగా ప్రయత్నం చేస్తుంది.

రూపగంధావళి కొడుకు పేరు ముద్దుటుంగర చక్రవర్తి. ఇతను సాహసకార్యాలు చేస్తాడు. తనను చంపాలని పిన్ని కుమారులు ఎత్తుగడ పన్నుతారు. వారి కుయుక్తులను ముందే తెలుసుకొని వమ్ము చేస్తాడు.

సోదరులు బావిలో తోసి చంపాలనుకుంటారు. బావిలో పడిన వ్యక్తి బావి లోపల వున్న నాగలోకం చేరుకుంటాడు. అక్కడ రాజుగారికి సోకిన గాయానికి చికిత్స చేసి మాన్పుతాడు. ఫలితంగా నాగరాజు తన ఆరుమంది కుమార్తెలను ముద్దుటుంగరరాజుకిచ్చి వివాహం చేస్తాడు. ఒక వ్యక్తికి ఒక కుమార్తెనిచ్చి వివాహం చేయవచ్చు కదా! అనే సందేహం కలగొచ్చు. ఒక పురుషునికి ఎంతమందైనా భార్యలుగా వుండొచ్చు అనేది ఆనాటి నియమం అదే నాగరాజు ఆరుమంది కుమార్తెలను ముద్దుటుంగరపు రాజుకి బహుకరిస్తారు. ఈ కథలో స్త్రీ వ్యక్తిత్వ చిత్రణ, బలహీనంగాను గుర్తింపులేనట్టు తెలుస్తుంది. వివాహం చేసుకున్న స్త్రీకి సంతానం కలగకపోతే తక్కువగా చూడబడే అవకాశం వుంది. భర్త ప్రేమను పొందడానికి ఎంత కష్టమైనా వెనకడుగేయని స్త్రీలున్నట్లు తెలుస్తుంది. పు. 184 (కథకురాలు – సౌదమ్మ, తిమిరికుంట్లపల్లి, అనంతపురం.)

6. ప్రేమకు సంబంధించిన కథలు : స్త్రీలను ప్రేమించడం పెళ్లి చేసుకోడం, మధ్యలో వారిని వదిలేయడం. తరువాత కలుసుకోడం జరుగుతుంది. ప్రేమ వివాహాలు చేసుకున్న స్త్రీలు అనేక రకాలుగా కష్టాలను అనుభవిస్తుంటారు. ప్రేమ వివాహం చేసుకున్న స్త్రీలకు సంబంధించిన వారిని కూడా కష్టాలు పాలు చేయడం సహజం.

6.1. 'కీలుగుర్రంకథ': 'కీలుగుర్రం' కథ సినిమాగా కూడా తీయబడింది. రాకుమార్తె అంత:పురంలో వుంటుంది. అంత:పురం లోపలికి పరపురుషుడు కూడా ప్రవేశించగలడు. అందరు నిదురించే సమయంలో కీలుగుర్రంపై ఒక రాజకుమారుడు రాకుమార్తె వద్దకు వచ్చి స్నేహం చేస్తాడు. ఆ స్నేహం ప్రేమగా మారుతుంది. రాజకుమారితో చెలికత్తెలు వుండరా? వారు రాకుమార్తె నిదురపోతుంటే మేల్కొరా? కాపలాదారులు ఏమి చేస్తున్నట్టు ఇవన్నీ పాఠకుని ప్రశ్న వేసేలా చేస్తాయి.

రాకుమార్తెను రోజు తూకమేయడమనే సంప్రదాయం వుంది. ఆమెకు పూలు తెచ్చే పేదరాసి పెద్దమ్మ తక్కెడలో ఏడుపూలు వేసి తూచేది. ఈ తూకమెందుకు అంటే ఆమె బరువులో మార్పు వస్తే ఆమె గర్భవతి అయినట్టు గుర్తించడానికని తెలుస్తుంది. ఏడు పూలు తక్కెడలో పైకి పోతుంది. ఈమె గర్భవతి అని నిర్ధారించుకుంటారు. ఈమె గర్భానికి కారణమెవరో ఆ రాకుమారిని అడిగితే తెలిసిపోతుంది కదా అలాంటివేమీ లేకుండానే కథ సాగుతుంది. ఆడపిల్లకు పేదరాసి పెద్దమ్మను పరిచారికలా, గూఢాచారిగా నియమిస్తారు.

రాకుమారి ఇంట్లోకి ప్రవేశించిన రాకుమారుడు రహస్యంగా దాచిన మత్తు వాసన చూసి స్పృహకోల్పోతాడు. అతనే రాణి గర్భం దాల్చడానికి కారణమని గ్రహిస్తారు. అతను మత్తులో వున్నందున పేదరాసి పెద్దమ్మ ఇంటి దగ్గరపడిపోతాడు. భటులు బంధిస్తారు. అతను వారి దగ్గర నుండి తప్పించుకొని అంతఃపురం వెళ్లి రాకుమారిని కీలుగుర్రంపై ఎక్కించుకొని వెళతాడు.

ఇంతవరకు బాగుందనుకొంటే, మధ్యలో ఆమెకు చలిగా వుందని నిప్పును వెంట తీసుకొస్తాడు. ఆ నిప్పుసెగకి కీలుగుర్రంలో వున్న కీలు కరిగిపోయి నేలపడిపోతారు. రాకుమారుడు ఎక్కడో పడిపోతాడు. రాకుమారి మరెక్కడో పడిపోతుంది. చివరకు ఆమె భర్త కోసం ఎదురు చూస్తుంది. అతను ఎంతకీ రాకపోవడంతో బిడ్డను ప్రసవించి ఒక చెట్టు ఆకు మీద పెట్టి నదిలో వదిలేస్తుంది. భర్తను కోల్పోతుంది. బిడ్డను కోల్పోతుంది. ఒంటరిగా జీవనాన్ని సాగిస్తుంది. నదిలో వదిలిన బిడ్డను ఒకరాజు పెంచుకుంటాడు. ఈ బిడ్డ పెరిగి పెద్దవాడై తల్లినే మోహిస్తాడు. ఇంత విచిత్రమైన దుస్థితిలో స్త్రీ వుండటాన్ని జానపదుల కథల్లో గమనించవచ్చు. ఇది సామాజిక విరుద్ధమైన సంఘటన. దీనిని తప్పించాలి. ఇదొక సంఘ దురాచారం. నియమం తప్పిపోయే ప్రమాదం వుంది.

ఆ రాకుమారునికి ఆమె తనకు జన్మనిచ్చిన తల్లి అని చెప్పడానికి ఎవరూ లేరు. జానపదుడు సృష్టించిన పాత్రలు ఆవు, దూడ. ఆవు, దూడ మధ్య సంభాషణ జరుగుతుంది. "ఆమె ఈ రాకుమారునికి తల్లి. ఇది అతనికి తెలియదు. తల్లికి తన కుమారుడని తెలియదు" అని ఆవు, దూడతో చెప్తుంది. ఈ సంభాషణను విన్న రాకుమారుడు తల్లిని గుర్తిస్తాడు. ఆమెను అంత:పురానికి తీసుకుపోతాడు. తల్లి చిత్రపటాన్ని గీయించి సత్రంలో పెట్టిస్తాడు. ఒక సత్రానికి భోజనానికొచ్చి ఆ పటంలో వున్న మహిళను గుర్తిస్తాడు. ఆమె తన భార్య అని చెప్పడంతో కథ సుఖాంతమవుతుంది. రాకుమారి అంతఃపురంలో వున్నప్పటికీ ఆమెకు రక్షణ లేదు. ఒంటరిగా స్త్రీ కనిపిస్తే ఆమెను మోహించడం, వరసలు, విచక్షణ లేకుండుట వంటివి ఈ కథలో పాఠకుని ఆలోచింపచేస్తాయి.(కథ చెప్పినవారు – తుంగరామప్ప – తంగేడుకుంట, అనంతపురం, పుట: 184)

6.2. వేశ్యస్త్రీ కథ: వేశ్యగా ముద్రించబడిన అనేకమంది స్త్రీలు, తమ జీవన విధానంలో ఎదుర్కొనే అనేక రకాల ఇబ్బందులు, తమ ఉనికిని చాటుకోడానికి స్త్రీలుపడే ఆవేదన, మానసిక

సంఘర్షణ ఈ కథల్లో చిత్రితమైంది. వేశ్యలుగా మారిన స్త్రీలు దోపిడీలకు పాల్పడుతున్న విధానాలు, వేశ్యలుగా మారిన స్త్రీలు నిజాయితీగా వివాహమాడి భర్తతో కలిసి జీవించడానికి చేసే ప్రయత్నాలు అడుగడుగున సవాలుగా నిలుస్తాయి.

సంతానం లేని రాజు, రాణి, సంతానం కోసం అనేక పూజలు చేస్తారు. దైవం అనుగ్రహం మేరకు ఒక రాకుమారుడు పుడతాడు. వాడు బుద్ధిమాంధ్యం గల కుమారుడు. వానికి వివేకం కలగాలని తండ్రి అనేక విద్యలు నేర్పిస్తాడు. యుక్తవయసు వచ్చిన కుమారుడు వేశ్యను ఇష్టపడతాడు. వేశ్యలకు వివాహం విరుద్ధం కనుక ఆమెకు వివాహం చేయాలంటే రాజ్యాన్ని, సంపదను తమ స్వాధీనం చేయాలని తోటి వేశ్యలు అడుగుతారు.

ఇక్కడ ఒక వేశ్యాస్త్రీకి వివాహం చేసి పంపేస్తే ఆమె ద్వారా వచ్చే రాబడి తగ్గిపోతుంది. ఈ రాబడిని పూరించుకోడానికి రాజ్యాన్ని, సంపదను తమకు స్వాధీనం చేయమని వేశ్యాస్త్రీ పెద్దలు అడుగుతారు. వేశ్యగా మారిన ఆ స్త్రీలో అనేక నైపుణ్యాలుంటాయి. ఆమె పూలబంతులను అందంగా అల్లగలదు, పూలనే అందంగా అల్లగలుగుతుందంటే ఇంక ఆమె కూడా అందంగా వుంటుందనుకుంటారు. ఆమె ఇంకా అందంగా వుండగలదని గుర్తించిన మరో రాకుమారుడు ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటారు. ఆమెకు మరో వివాహం చేసుకోడం ఇష్టం లేదు. "ఈమె గౌరీనోములు ఉన్నాయని కొంతకాలం ఆగమని ఆ రాజుకు చెప్తుంది"[6] పుట:187. బంధీగా చిక్కుకుపోయిన వివాహిత (వేశ్య) ఉపాయంతో సమాధానం ఇస్తుంది. వివాహిత అయిన స్త్రీకి పరపురుషుని ద్వారా కలిగే ప్రమాదాలు కథలో చిత్రించారు.

పూజనెపంతో ఒంటరిగా వుండటానికి ప్రయత్నం చేస్తుంది. భర్త భార్యను కోల్పోయి పిచ్చివాడైపోతాడు. ఎలాగైనా తన భర్తను, అత్తమామలను తిరిగిపొందాలనుకొంటుంది. ఈ క్రమంలో ఈమె ఒక దొంగకు దొరుకుతుంది. ఎలాగోలా దొంగ నుండి తప్పించుకొని వెళుతుంది. మళ్లీ పురుష వేషం వేసుకొని మరో ఊరూ వెళుతుంది.

పురుషవేషంలో వున్న వేశ్యస్త్రీని మరోరాజుకుమార్తె పురుషుడనుకొని ఇష్టపడతుంది. వేశ్యకు, ఆ రాకుమార్తెకు వివాహమవుతుంది. రాకుమార్తెకు వేశ్యస్త్రీ జీవితంలో జరిగిన ప్రతి అంశాన్ని తెలియజేస్తుంది. ఆ రాకుమార్తె వేశ్యస్త్రీకి అండగా నిలుస్తుంది. ఆమె చిత్రపటాన్ని ప్రదర్శనకు పెడుతుంది. ఆ పటాన్ని చూసి ఏడ్చేవారు తన ఆత్మీయులుగా గుర్తిస్తుంది. ఆగ్రహించే వారిని శత్రువులుగా భావిస్తుంది. ఇలా ఆమె తయారు చేసిన చిత్రపట సందర్శన ద్వారా తన అత్తమామలను, భర్తను కనుగొంటుంది. తమ రాజ్యాన్ని ఆక్రమించిన వేశ్యలను పారద్రోలి రాజ్యాన్ని భర్తకు అప్పగిస్తుంది. ఆ రాకుమార్తెకు తన భర్తతో వివాహం జరిపిస్తుంది. ఇద్దరు భార్యలతో రాకుమారుడు రాజ్యాన్ని అనుభవిస్తాడు. ఒక పురుషునికి ఇద్దరు భార్యలుండటం సర్వసాధారణంగా కనిపిస్తుంది. (పు: 186 కథ చెప్పిన వారు – కోటిరెడ్డి, కుంట్లపల్లి, అనంతపురం)

ISSN No.2319-3905

జానపదుల కథలలో స్త్రీలు ఇంటా, బయట అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. స్త్రీ కూడా మనిషేనన్న విషయమే మరుగున పడిపోతుంది. స్త్రీ ఒక్కో సమయంలో సాహసవంతురాలుగా సృష్టించబడితే, మరోచోట కీలుబొమ్మల్లా వ్యక్తిత్వం లేనివారుగా, తమ జీవితం ఇంతే అని ఊరకుండిపోయే వారున్నారు. బహుభార్యత్వం కారణంగా ఒకే వ్యక్తికి అనేక మంది స్త్రీలు భార్యలుగా వున్నారు. వేశ్యావృత్తి కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. తమ ఉనికి కోసం పోరాటం చేసే స్త్రీలున్నారు.

పాదసూచికలు:

1. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.
2. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.
3. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.
4. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.
5. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.
6. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు.

ఉపయుక్త ఆధారాల సూచిక:

1. జి.ఎన్. మాలతి – జానపదకథలు – మూలాంశాలు – ద్రావిడ విశ్వవిద్యాలయ పబ్లికేషన్స్– 2016.
2. జి.ఎస్. మోహన్ – జానపద విజ్ఞానాధ్యయనం – ద్రావిడ విశ్వవిద్యాలయం పబ్లికేషన్స్ – 2010.

10

అనువాద కళ: యంత్రానువాదం – విశ్లేషణ

– డా. టి. వెంకటస్వామి

ఒక శాస్త్రానికి లేదా విజ్ఞానానికి సంబంధించిన వివేచనకు పూనుకునే ముందు దాని నిర్వచనాన్ని స్పష్టపరచుకోవడం అవసరం. చాలా సందర్భాలలో ఆ శాస్త్రానికి లేదా విజ్ఞానానికి ఇచ్చిన శీర్షికే దాని నిర్వచనాన్ని లోగొని వుంటుంది. భాషాంతరీకరణానికి పర్యాయంగా వాడే 'అనువాద' శబ్దం 'అనుసరించి చెప్పడం' అనే అర్థాన్ని కలిగివుంది. 'తర్జుమా' అనే ఫారసీ పదాన్ని ఇదే అర్థంలో వాడడం జరిగింది. 'భాషాంతరీకరణ', 'అనువాద' శబ్దాలు చాలా పూర్వకాలంనుండి వాడుకలో వున్నా, ఈనాడు ఈ పదాలకు ఆరోపిస్తూ వున్నా నిస్సారిత అర్థంలో ఈ పదాల విశ్లేషణ జరగలేదనే చెప్పాలి. సంస్కృతం నేపథ్యంలో పెరిగి పరిపుష్టాలైన దేశభాషలలో నిరంతరం అనువాదకార్యం జరుగుతూనే ఉన్నా ఈ పదాలు మీమాంసావస్తువులు కాలేదు. కావ్య మీమాంసా గ్రంథాలలో కొన్నిసార్లు అనువాదాల ఔచిత్య – అనౌచిత్యాల చర్చ కనిపిస్తూవున్నా, దీనికి సంబంధించిన శాస్త్రీయ జిజ్ఞాస, తాత్త్విక చింతన, విధి విధానాల విశ్లేషణ సంస్కృతంలోగానీ, దేశభాషలలోగానీ, జరిగినట్లు కనిపించదు. సంస్కృతం లేదా ఇతర మూలాలనుండి అనువాదానికి లేదా దాన్ని ఇందులో పొందుపరచే క్రియకూ ప్రయత్నించినప్పుడూ 'మెయి చెడకుండా' ('కథెయ మెయొడలీయదె', విక్రమార్జున విజయం, పంపమహాకవి) చెప్పే ఆదర్శాన్ని ఉంచుకొని వుండడాన్ని, 'మంగళమహిమ తప్పకుండా' భాషకు నూతన ఆవరణాన్ని కల్పించడాన్ని గమనించవచ్చు. భాషాంతరీకరణ ప్రవాహం వరదలాపారి సమృద్ధ సాహిత్య రాశిని కలిగివున్న పాశ్చాత్య సాహిత్యంలో అందులోనూ ప్రత్యేకించి ఇంగ్లీషులో – దీనికి సంబంధించిన ఆలోచన వివేచన తగినంత స్థాయిలో జరిగిందని చెప్పవచ్చు.

భాషాంతరీకరణం అంటే ఏమిటి? అనే చర్చకు పూనుకొనేముందు భాషాంతరీకరణానికీ లిప్యంతరీకరణానికీ వున్న భేదాన్ని గమనించాలి. మూల భాష అంటే ఏ భాష నుంచి అనువదిస్తున్నామో ఆ భాష. ధ్వని సంకేతాలకు, ఉద్దిష్ట భాషయొక్క – అంటే ఏ భాషలోకి అనువదిస్తున్నామో, ఆ భాషయొక్క – ధ్వని సంకేతాలని పొందుపరచేందుకు లిప్యంతరీకరణమని పేరు. దీని అర్థం – అంతరం లిపికి మాత్రమే పరిమితమై ఉంటుందని. ఉదా॥ 'These are

ISSN No.2319-3905

girls' అనేదాన్ని 'దీస్ ఆర్ గరల్స్' అని వ్రాస్తే లిప్యంతరీకరణం అవుతుందేగాని భాషాంతరీకరణం కాదు. 'వీరు బాలికలు' అన్నప్పుడు భాషాంతరీకరణం చేసినట్లు అవుతుంది. అంటే భాషాంతరంలో ఉద్దిష్ట భాషాలక్షణానికి అనుగుణంగా మూలం రూపుగొనాలి. దీన్నే 'Viiru balikalu' అని వ్రాస్తే లిప్యంతరీకరణం కాకపోయినా (మూలదృష్టిలో) భాషాంతరీకరణమే అవుతుంది. అంటే, ఇక్కడ ఏర్పడిన అంతరం భాషకు సంబంధించింది అనేది స్పష్టం. మొత్తంమీద, లిప్యంతరం భాషాంతరంకాదు. లిప్యంతరం కాకపోయినా భాషాంతరం అయి ఉండవచ్చు అన్నట్లయింది. ఇదే భాషాంతరీకరణానికీ లిప్యంతరీకరణానికీ ఉన్న భేదం.

"True translation is metempsychosis" అనేది విలమోవిట్ అభిప్రాయం. 'మెటిమ్ సైకోసిస్' అంటే మరణం తరువాత ఆత్మ మరో శరీరాన్ని ప్రవేశించడం అని అర్థం. 'పరకాయ ప్రవేశమనే పర్యాయపదం ఈ అంశాన్ని సమర్థంగా అభివ్యక్తీకరించ గలదు. "నిజమైన అనువాదం పరకాయ ప్రవేశం లాంటిది" అనే మాట మూలరచయిత–అతని కృతి అనువాదకుడు – వీరి నడుము ఏర్పడాల్సిన తాదాత్మ్యాన్ని సూత్రీకరిస్తుంది. అనువాదకుడు తన మొత్తం ప్రతిభను మూల రచయిత ప్రతిభకు అధీనంచేయడం ద్వారా, మూల రచయితకూ తనకూ నడుమ అంతరాన్ని తక్కువ చేయడం ద్వారా ఈ పరకాయ ప్రవేశాన్ని సాధించాలి. అలాంటి తాదాత్మ్యం ఏర్పడినప్పుడు నిజమైన అనువాదమేకాదు, ఆదర్శ అనువాదమూ సుసాధ్యమౌతుంది. అంటే మూల రచయితే స్వయంగా ఈ భాషలో వ్రాసి వుంటే ఎలా వుండేదో అలాగే అనువాదమూ సిద్ధమైవుంటుంది.

అత్యంత శ్రేష్ఠమనదగిన అభిప్రాయం లేదా నిర్వచనం 'వెబ్‌స్టర్ డిక్షనరీ'లో చెప్పబడింది. అనువాదం అనే పదానికి వివరణ ఇవ్వడంతోపాటు అది: Translation is an art that involves the recretaion of a work another language for leaders with a different background. ఈ నిర్వచనం స్పష్టం చేసే నాలుగు అంశాలు ఇవి: 1. Translation is an art; 2. The art of trnaslation involves the recreation of a work; 3. This recreation is to be done in another language; 4. Translation or recreation of a work is meant for readers with a different background. అంటే, అనువాదానికి ఒక ఉన్నతమైన 'కళా'స్థానాన్ని ఈ నిర్వచనం కల్పించింది. అంతేకాదు. అనువాదమనేది ఎంత గొప్ప కృత్యమో అలాగే దాని లక్ష్యం, ఉద్దేశ్యం, ప్రయోజనం ఏమిటో ఇది స్పష్టం చేసింది. సాహిత్యకారుని పనిని మనం 'సృష్టి' అని అనుకుంటే అనువాదకుని కృత్యాన్ని 'పునస్సృష్టి' అనవచ్చు. సృష్టికార్యం ఎంత గొప్పదో, 'పునస్సృష్టి' కార్యమూ అంతే గొప్పది. దీనికి కారణం, 'పునస్సృష్టి' కార్యంలో నిమగ్నమయ్యే వ్యక్తి వేరొకభాషలో ఈ మహిమను ప్రదర్శించాలి. ఈ వేరొక భాషకు చెందిన ప్రజలు వేరొక నేపథ్యాన్నే పొందినవాళ్లై వుంటారు కాబట్టి, ఈ వేరొక భాష శక్తి సామర్థ్యాలు భిన్నమైనవి కావడంవల్ల, ఆ ప్రత్యేక సమస్యలను ఎదుర్కొని, పరిష్కరణోపాయాలను కనుగొని

సాధించాల్సిన కార్యమైనందువల్ల పునస్సృష్టి కర్త (అనువాదకుడు) బాధ్యత పెద్దది. సృష్టించబడిన సాహిత్యం మూలపాఠకుల హృదయాలను ఆకర్షించినట్లే, పునస్సృష్టి పొందిన సాహిత్యం మరొక భాషకు చెందిన పాఠకుల హృదయాలను ఆకర్షించగలగాలి. లేకపోతే అనువాదం సార్థకం కాదు. అంటే, సాఫల్యాన్ని సాధించకపోతే అది 'పునస్సృష్టి' అనే పేరుకూ అర్హంకాదు.

అనువాదాన్ని ఒక కళగా పరిగణించిన మరొక విద్వాంసులైన ఎస్.వి. రఘునాథరావ్‌గారు ఇలా చెప్పారు. అనువాదం అనేది ఒక కళ, దీని ద్వారా మరొకరి ఆలోచనలు ఒక భాషనుండి మరొక భాషలోకి స్పష్టంగా బదిలీ చేయబడతాయి, తద్వారా మూల రచయితని ప్రభావితం చేసే విధంగా పాఠకుడి మనస్సును ప్రభావితం చేస్తుంది. మరోమాటలో చెప్పాలంటే ప్రక్రియా, పరిణామాల దృష్టితో అనువాద ప్రక్రియను అవలోకించే ఈ నిర్వచనం అనువాదం ఒక కళ అనే సిద్ధాంతంతో ప్రారంభమౌతుంది. ఈ కళ పరిణామాన్ని సాధించే మాధ్యమమౌతుంది. 'అనువాదం ఒక కళ' అనే అభిప్రాయంలోని 'కళ' అనే శబ్దానికి సార్థకమైన ఒక విశేషణాన్ని జతచేయడం ద్వారా డా॥ సి.పి. కృష్ణకుమార్‌గారు ఒకానొక విశిష్టనిర్వచనాన్ని సృష్టించారు. "అనువాదం ప్రజ్ఞాన్విత కళ" అనేది వారి ఉక్తి. మౌలిక సాహిత్య సృష్టికి పూనుకున్న వ్యక్తి భావావేశానికి లోనై లేదా మైమరచి తన సృష్టి కార్యాన్ని నిర్వచించి ఉండవచ్చు కాని, అనువాదకుడు ఒక్క క్షణమూ ఏమరుపాటు పొందేందుకు వీలులేదు; అర్థగ్రహణంలో, సదృశమైన అభివ్యక్తిలో అనువాదకుని ప్రతిభ, వ్యుత్పత్తి, వైదుష్యాలన్నీ ఎప్పుడూ జాగృతాలై వుండాలి. మైమరిస్తే ప్రమాదం సంభవిస్తుంది. ఇలా అనువాదమనేది ఒళ్ళంతా కళ్ళుగా, పునస్సృష్టికార్యానికి పూనుకోవాల్సిన మహత్తరమైన సేవ అని చెప్పవచ్చు.

యంత్రానువాదం:

ఆధునిక యుగంలో అనువాదానికి లభించిన విశిష్టతను, ప్రాధాన్యాన్ని, అవసరాన్ని బట్టి కంప్యూటర్లను ఆశ్రయించే అవకాశాలనూ పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. దాని ఫలితమే యంత్రానువాదం. భాషాశాస్త్రజ్ఞులూ, ఇంజనీయర్లూ, సాంకేతిక విజ్ఞానులూ, ఈ దిశలో పనిచేశారు. గత రెండు మూడు దశాబ్దాలనుండి రష్యా, ఇంగ్లండ్, అమెరికా, కెనడా, భారత్ మొదలైన దేశాలలో దీనికి సంబంధించిన అధ్యయనమూ, పరిశోధనా జరిగాయి. కెనడా వంటి రెండు అధికార భాషల దేశాలకు ఇలాంటి ప్రయోగం చాలా విలువైంది. ఎందుకంటే పార్లమెంట్ సమావేశాలలో ఏకకాలంలో ద్విభాషా ప్రయోగం అత్యవసరంగా మారింది. మొదటి ప్రయత్నాలు ఇంగ్లండులో జరిగాయి. దీన్ని వ్యావహారికతను పరిశీలించే దృష్టితో రష్యాదేశమూ దీనికి సంబంధించినకొన్ని ప్రయోగాలు చేసింది. అమెరికా కూడా చాలా ఆసక్తితో దాని సాధ్యాసాధ్యతల పరిశీలన జరిపింది. బహుభాషాదేశమైన భారతదేశమూ ఈ అంశం పట్ల ఆసక్తితోవుంది.

కంప్యూటర్లను అనువాదానికీ ఉపయోగించవచ్చు అనే సూచనను మొదట చేసిన కీర్తి ఎ.డి. బూత్ గారిది. నిజానికి యంత్రానువాద ప్రణాళికా జనకుడు ఈయనే. 1946 నాటికి

అస్పష్టమైన ఊహలా ఉన్న ప్రణాళికను శబ్ద రూపంలో ప్రకటించేందుకు 1947లో సాధ్యమైంది. బూత్, వ్యారెన్ వీవర్లు ఈ సమస్యల్ని చర్చించారు. ఒక అనువాదకుడు కోశాలను పరిశీలించి పర్యాయాలను తెలుసుకున్నట్లు, కంప్యూటర్ ద్వారానూ పరిశీలనాకార్యాన్నీ జరిపేంత స్థాయికి మాత్రమే ఆ వేళకు సాధ్యమై ఉంది. ఈ ప్రయత్నాలు చాలా ఆసక్తి దాయకంగా ఉండి, చాలా నమ్మకం కలిగించాయి. కొన్ని నెలల్లోనే అనువాద కృత్యానికి పూనుకోదగిన కంప్యూటర్ యంత్రం లభించవచ్చుననే ఆశ కలిగినా 1950 వరకు ఇలాంటి యంత్రం అవతరించలేదు. ఈ సమయంలో బూత్, రిచెన్స్ కంప్యూటర్‌లో వాడదగిన కోశ స్వరూపం ఎలా వుండాలన్నదాన్ని గురించి అధ్యయనాలు చేసి తమ తాత్కాలికాభిప్రాయాలను ప్రతిపాదించారు.

1953లో రాకి ఫెలర్ సంస్థ మరొక గొప్ప ముందడుగు వేసేందుకు సహకరించింది. ఈ రంగంలో ఆసక్తితో కృషిచేస్తున్న విద్వాంసులను ఆహ్వానించి ఆ సంస్థ ఒక సమ్మేళనాన్ని నిర్వహించింది. బార్ హిలెర్ యంత్రానువాదంలోని ముఖ్యమైన సమస్యల్ని విశ్లేషించడం ఈ సమ్మేళనంలో ప్రాధాన్యతను సంతరించుకున్న సంగతి అయింది. ఈ సమ్మేళన విశేషాలన్నిటినీ ప్రకటించకపోయినా యంత్రాను వాదానికి పూర్వరంగంగా విషయనిష్ఠ కోశాలను సిద్ధంచేయాలనీ, భాషా సంబంధంగా భాషా శాస్త్రజ్ఞులు ఇంతవరకు ప్రతిపాదించని సంఖ్యాశాస్త్రీయ విశ్లేషణలనూ చేయాలనే అభిప్రాయాలను ఈ సమ్మేళనం స్పష్టంచేసింది. ఈ సమ్మేళనం జరిగిన సమయంలోనే ఐ.బి.యం. కార్పోరేషన్, జార్జ్ టౌన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జరిపిన ప్రయత్నమొకటి చాలా ప్రచారంలోకి వచ్చింది. ఈ ప్రయత్నంలో 250 పదాల పరిమిత పదకోశాన్ని ఉంచుకుని ఎన్నుకున్న కొన్ని రష్యన్ వాక్యాలను అనువదించడం జరిగింది. తరువాత దీని నివేదిక కూడా ప్రకటించబడింది.

లండన్ విశ్వవిద్యాలయానికి చెందిన బిర్బెక్ కాలేజీకి నఫ్ఫీల్డ్ ప్రతిష్ఠానం 1955లో ఉదారంగా సహాయ ధనాన్ని మంజూరు చేసిప్రయోగాలను కొనసాగించేందుకు సాయపడింది. ఈ ప్రయోగానికి ఫ్రెంచ్ భాష గ్రహించబడింది. ఏ రకమైన పూర్వాభి ప్రాయానికీ లోనుకాని భాషా శాస్త్రజ్ఞులు ఈ ప్రయోగంలో నిమగ్నులయ్యారు. ఫలితం అత్యంత ఉత్తేజకరంగా ఉండింది. 1956 నాటికి ఫ్రెంచ్ భాషకు సంబంధించిన అన్ని సమస్యల్నీ చాలవరకు దాటి నిలిచేందుకు సాధ్యపడినట్లు చెప్పబడింది. అందువల్ల మరింత క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే దిశలో ఈ బృందం దృష్టిసారించింది. జర్మన్ భాషను కూడా ఈ ప్రయోగం పరిధిలోకి తేవడం జరిగింది.

అమెరికాలో సైద్ధాంతిక తార్కిక వివేచనలు జరుగుతున్నాయి. రాక్‌ఫిల్లర్ మళ్ళీ సహకారం అందించినందువల్ల, మెస్సాచ్యుసెట్ సాంకేతిక విజ్ఞాన సంస్థ పూర్తికాలం సేవనందించే కార్యకర్తలను నియమించుకుని, దీనికి సంబంధించిన అధ్యయనాన్ని కొనసాగించింది. యంత్రానువాదం గురించి మొదటి పుస్తకం ప్రకటించబడింది అప్పుడే. దానితోపాటు యంత్రానువాదం గురించిన వ్యాసాలకు

ప్రత్యేకించబడిన నియతకాలిక పత్రిక 'ఎం.టి'ని ప్రారంభించారు. రైఫ్లర్, ఓస్వాల్డ్ మొదలైన వాళ్ళు సైద్ధాంతిక పక్షాన్ని వివరించే వ్యాసాలు వ్రాశారు. కంప్యూటర్లను వాడే దిశగా దృష్టిసారించక పోవడంవల్ల ప్రగతి ఏదీ సాధించబడలేదు. అయినా అమెరికా వాయుసేన కోశ సంగ్రహణయంత్రనిర్మాణంలో నిమగ్నమైంది.

రష్యన్లూ ఈ విషయంలో ఆసక్తులై ప్రయోగాలు జరుపుతున్నారనేది 1955 నాటికి బహిర్గతమైంది. 1955లో 'ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలెక్ట్రికల్ ఇంజినీయర్స్' సంస్థవారి ఒక సభలో సమర్పితమైన వ్యాసంలో మాస్కో విశ్వవిద్యాలయంలో ఈ విషయమై జరిగిన ప్రయోగాల నివేదికను పొందుపరచడం జరిగింది. ఫలితాలను చూచినప్పుడు యంత్రం మాత్రమే అందులో పాల్గొనజాలదన్న సందేహం కలిగేలా వుంది. అయినా రష్యన్ల విశ్లేషణలు, అనువాద విధానాలు, ఉత్తమ కక్ష్యకు చెందినవని పాశ్చాత్య పరిశోధకులూ అభిప్రాయపడ్డారు.

1956లో అపెక్స్ (APEXC) కంప్యూటర్ను ఉపయోగించుకుని బిర్బక్ కాలేజీలో అనేక ప్రయోగాలు జరిగాయి. ఫలితాలు కోరుకున్న అన్ని అంశాలనూ కలిగివుండక పోయినా ఉత్తేజకరాలూ, గమనార్హాలూ అయివున్నాయి.

యంత్రానువాదం-సమస్యలు:

అన్ని అనువాదాలకు లాగే, యంత్రానువాదానికీ మూలభూతమైన సమస్య కోశానికి సంబంధించింది. సాంప్రదాయక నిఘంటువులను పరిశీలించే అనువాదకుడైన వ్యక్తి సందర్భానికి సరిపడే అర్థం వెదుక్కోగలడు. అతని వ్యుత్పత్తి, అధ్యయనం అనుభవం సందర్భానికి తగిన అర్థం వెదకడంలో సాయపడతాయి. మనిషి మేధస్సుకున్న ఈ సహజలీల, యంత్రం దృష్టితో చూచినప్పుడు అద్భుత మహిమలా కనిపిస్తుంది. యంత్రానికి ఈ సౌలభ్యాలు ఉండవు. అందువల్ల యంత్రం దృష్టిలో మొట్టమొదటి అవసరం తగిన కోశం. 1946 నాటికి బూత్ ఇలాంటి కోశ స్వరూపంమీద అధ్యయనం చేశారు. 1946-49 నడుమ బూత్, రిచెన్స్ ఈ సమస్యను పరిశీలించారు. మొదట సూచించిన సంగతి కంప్యూటర్ స్మరణాంగం (Memory organ)లో ఒక సాంప్రదాయిక కోశాన్ని పొందుపరచడం. అయితే ఇలాంటి కోశం ఉపయుక్తంకాదని త్వరలోనే కనిపెట్టబడింది. నూతన తత్త్వం ఆధారంగా రచితమైన ఒక కోశాన్ని పొందుపరచాలని భావించబడింది. ధాతువులు నామ వాచకాల ఏకవచనరూపాలు మొదలైన వాటికి బదులు ఈ పదాల గరిష్ఠాంశాన్ని సంగ్రహించాయాలని భావించబడింది. ఒక పదానికున్న వివిధ రూపాలలో సమానరూపంలో లభించే అంశాన్ని 'గరిష్ఠాంశ'మని భావించడం జరిగింది.

సందిగ్ధతల, నుడికారాల సందర్భంలో యంత్రాను వాదానికి ఎదురయ్యే సమస్యల్ని గురించి ఒకటి రెండు మాటలు చెప్పవచ్చు. సందిగ్ధత అర్థానికి సంబంధించిన విషయం. ఇది పలువిధాలుగా వుండవచ్చు.

(i) విషయానుగుణంగా అర్థంలో మార్పు

(ii) ఇతర పదాలతో చేరినప్పుడు అర్థంలో వచ్చే మార్పు

(iii) సందర్భానుగుణంగా అర్థంలో వచ్చే మార్పు

మొదటిరకం సందిగ్ధత ఒక విధంగా సరళమైంది. అనేక పారిభాషిక పదాలు ఈ వర్గానికి చెందినవి. వాటికి ఆయా శాస్త్రాలలో విశేషార్థాలుంటాయి. ఈ సందిగ్ధతను బూత్, రిచెన్స్‌లు కూడా గమనించారు. ఇలాంటి సందర్భాలలో రెండు విధాలుగా పరిష్కారం కనుగొనేందుకు వీలుంది, ఒకటి, కంప్యూటర్లో అర్థాలన్నిటినీ నమోదు చేసి, సరైన అర్థాన్ని ఎన్నుకునే బాధ్యతను పాఠకునికే వదలివేయడం. రెండు, విషయనిష్ఠ కోశాలను వాడుకోవడం ద్వారా ఈ సమస్యను మూలంలోనే పరిహరించివేయడం, అంటే, విషయం తెలిసివున్నప్పుడు రెండో పద్ధతిని అనుసరించవచ్చు. విషయం తెలియనప్పుడు దాన్ని గురించి పూర్వభావి విశ్లేషణ అవసరమౌతుంది.

రెండోరకం సందిగ్ధత పదాలు నుడికారాలుగా పరిణమించి అర్థభేదాన్ని పొందే అంశానికి సంబంధించింది. దీనికొక పరిష్కారంగా నిర్మాణకోశాన్ని వాడుకోవచ్చు కోశంలోని నిర్మాణాంకం (structural number) గురించి యంత్రానికి సూచన ఇస్తేచాలు. 'boite de nuit' అనే ఫ్రెంచ్ నుడికారపు పదక్రమార్థం 'box of night' అని అయితే నుడికారంగా ప్రయోగం పొందినపుడు దానికి 'night club' అనే అర్థం వస్తుంది. ఇలాంటప్పుడు యంత్రానికిచ్చే సూచనలు ఇలా వుంటాయి.

(i) 'boite' పదం వచ్చినప్పుడు, తక్షణం దాన్ని అనువదించరాదు.

(ii) తరువాతి పదాన్ని గమనించి అనువదించాలి.

(iii) తరువాతి వదం కారకమో, ప్రత్యయమో అయివుంటే దాన్ని అనువదించకుండా, ముడవ పదాన్ని పరిశీలించాలి. అది 'nuit' అయివుంటే 'night club' అనీ, 'chocolat' అయివుంటే 'box of chocolates'. అనీ అనువదించాలి. పై చూపునకిది సులభమనిపించవచ్చుకాని, భాషలో ఇలాంటి నుడికారాలు అపార సంఖ్యలో ఉన్నందువల్ల ఇది అభేద్య సమస్యగానే మిగులుతుంది. అయితే వైజ్ఞానిక, సాంకేతిక లేఖనాలలో ఇలాంటి నుడికారాల సంఖ్య పరిమితంగా ఉంటుందన్నది మాత్రమే దీనికున్న సమాధానం.

మూడోరకం సందిగ్ధతా సమస్య మరీ సంక్లిష్టమైంది. ఉదాహరణకు 'She cannot bear children' అనే వాక్యంలో 'bear' అనే పదానికున్న అర్థమే వేరన్నది మనిషి బుద్ధి తక్షణమే గ్రహించగలదు. అయితే యంత్రం ఇంత సులభంగా ఈ పనిచేయలేదు. అందువల్ల, యంత్రానికి, ఇక్కడ 'bear' పదానికి ప్రసూతిశాస్త్రసంబంధమైన అర్థం ఉందనే సూచన ఇవ్వాల్సివస్తుంది. లేకపోతే తప్పు అర్థమో, కొన్నిసార్లు నవ్వు తెప్పించే అర్థంలో, అనువాదంలో కనిపించవచ్చు.

మొత్తంమీద యంత్రానువాదరంగం అనేక సమస్యలతో క్రిక్కిరిసివుంది. రైష్లర్ చెప్పినట్లు, ఇప్పటికిది (ఎండమావిలో నీరు వెదకడం వంటి వ్యర్థప్రయత్నం) అవుతోంది. అయినా ఆ సమస్యలన్నింటిని అధిగమించి అది స్వతంత్రంగానే పని నిర్వహించి సరైన, యంత్రానువాదం చేసే రోజులు త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నాను.

ఆధార గ్రంథాలు

1) ప్రధాన గురుదత్త, అనువాద – ఆధునిక జగత్తినల్లి, మైసూరు: త.వెం. స్మారక గ్రంథమాలె.

2) రామకృష్ణారావు, గోవిందరాజు, కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం. 2007.

3) సదానందం, జె. అనువాద కళ, కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం. 2009.

4) Booth, A.D. & Others (eds.) Aspects of Translation. Sacker and Warburg. 1958.

5) Savory, T.H., "The Art of Translation". London: Jonathan Cape, 30 Bedford Square. 1969.

11

తిరువళ్లువర్, వేమన రచనల్లో సారూప్యత – విశ్లేషణ

– డా.యం.హరికృష్ణ

'తిరువళ్లువర్'– 2300 సంవత్సరాలకు ముందు, క్రీస్తు పూర్వం 2,3 శతాబ్దాల కాలంలో తమిళ భూభాగం మీద పుట్టి.. ఆ ప్రాంతాన్ని పునీతం చేసిన మహాయోగి. గృహస్థాశ్రమంలో వుంటూనే యోగిత్వాన్ని సాధించవచ్చని నిరూపించిన గొప్ప తత్వవేత్త. ఆయన రాసిన 'తిరుక్కురళ్' కావ్యాన్ని తమిళవేదంగా భావిస్తారు. అంతటి విలువైన సాహిత్యాన్ని, తిరువళ్లువర్ ప్రపంచానికి అందించారు. తిరుక్కురళ్ కావ్యం ద్విపదల సమాహారం. ఈ కావ్యంలో ఆయన ప్రధానంగా ధర్మ, అర్థ, కామాలుగా విభజించారు. వాటి మొత్తాన్ని 133 భాగాలుగా చేసి, ఒక్కో భాగంలో పది పద్యాల చొప్పున పొందుపరిచారు. తిరుక్కురళ్ ఎంతో లోతైన అర్థాలతో కూడుకుని వున్నది కాబట్టే ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ నాయకులు, తత్వవేత్తలు 'తిరుక్కురళ్' తమకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

"పూజ్య బాపూజీ, పూజ్య వినోబాజీ ఇందలి మూల భావాన్ని స్వయంగా తెలిసుకోడానికి తమిళభాషను అభ్యసించారంటే ఇంతకన్నా దీని ప్రాశస్థానికి దృఢతరమైన నిదర్శనం అక్కరలేదు" అంటారు గురుచరణ్ దూటలూరి జగన్నాథం.

అందుకే కంచి పీఠానికి పరమగురువులు, కామాక్షీదేవికి ప్రియమైన భక్తుడు, సాక్షాత్తూ ఆదిశంకరుని అవతారంగా పేరుగాంచిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వయంగా తిరుక్కురళ్ వేదతుల్యమని, అది ద్రవిడ భాషలో వుండడం ఆ భాష గొప్పదనాన్ని తెలుపుతోందని వ్యాఖ్యానించారు.

తిరువళ్లువర్ ఆనాటి సమాజం పట్ల సంతృప్తి చెంది ఇంకా మెరుగైన సమాజాన్ని కోరుకొని తిరుక్కురళ్ రచన చేశారని భావించవచ్చు.

తిరుక్కురళ్ కావ్యంలో దైవస్తుతి, కుటుంబం గురించి (గృహమేధి), ఇల్లాలు, నడవడి, ఆశ, విద్య, జ్ఞానం, దుర్జన సాంగత్యం, కార్యసిద్ధి, ధనార్జన, మోహం, ప్రశంస, భావప్రకటన,

ఆక్రోశం, అల్పబుద్ధి మొదలైన విషయాల గురించి ప్రస్తావించారు. మోక్షాన్ని గురించి మాత్రం ఆయన ప్రస్తావించలేదని, ఆయన మోక్షమార్గాన్ని విశ్వసించనందువల్లే ప్రస్తావించకపోయి వుండవచ్చని పరిశోధకుల భావన. అయితే కొన్ని ద్విపదలలో ఆయన మోక్షం గురించి ప్రస్తావించడం కూడా మనకు కనిపిస్తుంది.

వేమన 1367– 1478 మధ్యకాలానికి చెందినవాడు. ఆయన మొదట సాంసారిక జీవనాన్ని గడిపి అనంతరం సన్యాసిగా మారి ఊరూరా సంచరిస్తూ, ఆయా ప్రాంతాల్లో తను చూసిన విషయాలు, ఎదురైన సమస్యలకు పరిష్కారాన్ని ఆశువుగా పద్యాలు చెప్పారు. పామరులకు కూడా అర్థం అయ్యేంత తేలికభాషలో ఆయన పద్యాలు వుండడం విశేషం. ఆయన తన పద్యాలలో అనేక విషయాలను స్పృశించారు. ఒక్కొక్క విషయం మీద ఒకటే పద్యం కాకుండా పలు పద్యాలను, పలు కోణాలలో చెప్పారు. దీనిని బట్టి చూస్తే ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించే సమయంలో తనకు ఎదురైన సమస్యలకు ఒక్కో విధంగా పరిష్కార మార్గాన్ని చూపేవారని పరిశోధకులు భావిస్తున్నారు.

"వేమన భాష ఒక సామాజిక విప్లవం. ఇది ఒక తాత్విక జీవితపు ఉద్రేకం. ధైర్యమైన సంభాషణ యొక్క జ్వాల. ప్రజల ఆవేశపు మంట. చారిత్రక వాస్తవికతకు ప్రతిబింబం. మానవత్వం యొక్క గొప్ప జీవన పోరాటం. అసంఖ్యాక సామాజిక విప్లవకారులకు స్ఫూర్తి, చైతన్యం. వేమన ఆకస్మిక పదాలు అతన్ని మొదటి తెలుగుకవి (ఆదికవి)గా గుర్తించాయి." అంటారు కత్తి పద్మారావు

"అలతి పదాలతో సమాజంలోని రుగ్మతలను తూర్పారబట్టిన మనో వైజ్ఞానికుడు వేమన. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘసంస్కర్త, విప్లవకారుడు వేమన". 9

వేమన తన పద్యాలలో సంసారం, నీతి, భక్తి, ఆశ, జ్ఞానం, సుగుణం, దుర్జనుల సాంగత్యం కులమతాలు, లోకం తీరు, మూఢనమ్మకాలు, అభ్యుదయం మొదలైన విషయాల గురించి ప్రస్తావించారు.

వేమన, తిరువళ్లువర్ రచనల్లో సారూప్యత:

వేమన, తిరువళ్లువర్ ఇద్దరూ కూడా ప్రజాకవులే. ఇద్దరూ సమాజాభ్యున్నతిని ఆకాంక్షించినవారే. తిరువళ్లువర్, వేమన సమాజాన్ని తాత్విక ధోరణిలో పరిశీలించారు. సమాజాన్ని అభ్యుదయ కోణంలో నడవాలని ఆకాంక్షించారు. ఆనాటి పరిస్థితుల ప్రకారం సమాజ ధోరణుల పట్ల తిరువళ్లువర్ సంతృప్తి చెంది అంతకెంటే మెరుగైన సమాజాన్ని కోరుకున్నట్లు కనిపిస్తే, వేమన మాత్రం తన కాలంనాటికి నెలకొన్న మూఢాచారాలు, దుర్మార్గాలపై నిప్పులు చెరిగారు. వీరిద్దరి సాహిత్య రచనల్లో వున్న కొన్ని పోలికలను పరిశీలిద్దాం.

తిరువళ్లువర్, వేమన ఇద్దరూ దేవుడు, దైవస్తుతి, భక్తి గురించి చెప్పారు. వారిద్దరి అభిప్రాయాలను పరిశీలిస్తే..

"చదివినందుకేమి సఫలమ్ము సర్వజ్ఞు

చరణములకు బూజ సలుపకున్న"

దేవుని పాదాలకు పూజ చేసి సేవించకపోతే ఎంత విద్యను అభ్యసించినా ఏమి ఫలితమని ప్రశ్నిస్తారు తిరువళ్ళువర్. అలాగే మరో పద్యంలో...

"దేనియందు ప్రియము ద్వేషమ్ము లేనట్టి

నిర్గుణ పదసేవ నిత్య సుఖము"

మనిషి దేనినైనా ప్రేమ, ద్వేషం లేకుండా ఆ దేవుని పాదాలను ఆశ్రయించి సేవిస్తే అదే ఎల్లప్పుడూ సుఖాలను కలుగజేస్తుదందని అంటారు తిరువళ్ళువర్.

వేమన కూడా దైవాన్ని గురించి ఇంచుమించు తిరువళ్లువర్ చెప్పిన విషయాన్నే చెప్పారు

చదువరి మతికన్న సాధకు మతిమేలు

వేదములను లేదు వాదములను

ఒడలు శుద్ధిచేసి ఒడయుని చూడుదు ॥విశ్వ॥

దేవుని సాంగత్యం పొందడానికి చదువుతో పనిలేదని, వేదవేదాంగాలు, తర్క, మీమాంసాది వాదప్రతివాదాలు వంటివి అవసరం లేదు. మనసు నిర్మలంగా ఉంచుకుని సాధన చేసినవాడికి దైవసాన్నిధ్యం లభిస్తుందని చెబుతారు వేమన. వేరువేరు కాలాలకు చెందిన తిరువళ్లువర్, వేమనలిద్దరూ కూడా ఈ విషయంలో ఒకే అభిప్రాయం వెలిబుచ్చారు.

అలాగే, గృహము, కుటుంబము, సంసారాల గురించి వారిద్దరి అభిప్రాయాలు పరిశీలిస్తే..

"నిందబడక నున్నదందరికిని బెట్టి

కుడుచునతని గృహము కొరత బడదు"

తనకు ఉన్నదానిలోనే అతిథి అభాగ్యులకందరికీ పట్టి ఆదరించే గృహస్తు వున్న ఇంట్లో ఏ కొరతా రాదని చెబుతారు తిరువళ్లువర్.

"క్రమము దప్పనట్టి కాపురస్తుడు మిన్న

కోరితపము జేయు వారికన్న"

పూని తపస్సు చేసే రుషి కన్నా, సంసార బాధ్యతలను సక్రమంగా నిర్వహించే గృహస్తు గొప్పవాడని చెబుతారు తిరువళ్లువర్.

"భాగ్యవంతురాలు పరుల యాకలిదప్పి

తెలిసి పెట్టనేర్చు, తీర్పనేర్చు

తనదు దుష్టభార్య తన ఆకలినే గాని

పరుని యాక లెరుగబడదు వేమ"

ఈ విషయంలో కూడా వేమన తిరువళ్లువర్‌లు ఒకే రకమైన భావాల్ని వ్యక్తం చేశారు. ఇతరుల ఆకలి దప్పికలు తెలుసుకుని తీర్చే గృహిణి భాగ్యవంతురాలు. దుష్టబుద్ధి కలిగిన స్త్రీ తన ఆకలి గురించి మాత్రమే ఆలోచిస్తుందే కానీ ఇతరుల గురించి పట్టించుకోదని అంటారు వేమన. ఇక్కడ మనం స్త్రీ, పురుషుల బేధంతో చూడకూడదు, గృహస్తు దృష్టితో చూడాలి.

ఇక ఇంటికి మూలస్తంభమైన ఇల్లాలి ఎలా వుండాలన్న విషయంలో వీరిద్దరూ ఏ అభిప్రాయాలు వెలిబుచ్చారో పరిశీలిస్తే..

"తగిన గుణములుండి తన భర్త ఆదాయ

మెరిగి ఖర్చుబెట్టు తరుణి గృహిణి"

భర్త స్తోమతను, అతని సంపాదనను తెలుసుకుని ఇంటిని జాగ్రత్తగా, పొదుపుగా నడిపే గృహిణి వున్న యిల్లు స్వర్గతుల్యమని చెబుతారు తిరువళ్ళువర్. అలాగే మరో పద్యంలో

"ఇంటికి దగినట్టి యిల్లాలు లేకున్న

ఎంతభాగ్యమున్న నేమి ఫలము"

ఇంటికి తగిన విధంగా జాగ్రత్తగా, బాధ్యతగా, ప్రేమగా నడుచుకునే ఇల్లాలు లేకుంటే ఎంత సంపదవున్నా వ్యర్థమే అంటారు తిరువళ్లువర్.

"గుణవతియగు యువతి గృహము చక్కగనుండు

చీకటింట వెలగు దివ్వెరీతి

దేవియున్న ఇల్లు దివ్యార్చన గృహంబు ॥విశ్వ॥

గుణవంతురాలైన గృహిణి వున్న ఇల్లు చీకటింట్లో దీపం వెలిగించినట్లుగా దేదీప్యమానంగా వుంటుందని అంటారు. అలాంటి మహిళ వున్న ఇల్లు దేవాలయంతో సమానంగా శోభిల్లు తుంటుందని, అక్కడ సకల సుఖసంతోషాలు నెలకొని వుంటాయని అంటారు వేమన.

మనిషి నడవడిక, ప్రవర్తన ఏవిధంగా వుండాలి అన్న విషయం మీద కూడా ఇద్దరూ ఒకే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"సకల శాస్త్రములను చదివియు మూర్ఖుండె

లౌకికంబు తెలియ లేకయున్న"

లోకజ్ఞానం లేకుండా, సమాజంలో ఎలా మెలగాలో తెలియకుండా ఎన్ని శాస్త్రాలు చదివినా ఏమీ ఉపయోగం లేదు. సకల శాస్త్రాలు అభ్యసించినా అలాంటి వాడు మూర్ఖుడే అవుతాడు అంటారు తిరువళ్ళువర్.

అల్పుడెన్ని విద్యలభ్యసించినగాని

ఘనుడుగాడు హీనజనుడెగాని

పరిమళముల మోయ గార్ధభము గజమౌనె॥విశ్వ॥

హీనమైన, దుర్మార్గమైన మనస్తత్వం కలిగినవాడు ఎన్ని విద్యలను అభ్యసించినా కీర్తిని పొందలేడు. ఎలాగంటే గంధపుచెక్కల వంటి సుగంధద్రవ్యాలను మోసినా గాడిద ఏనుగు కాలేదుకదా అంటారు వేమన.

ఏ విషయాన్నైనా తిరువళ్లువర్ కాస్త సున్నితంగా చెబితే, వేమన మాత్రం కాస్త కఠినంగానే కర్రుగాల్చి వాతపెట్టడం కనిపిస్తుంది.

తిరువళ్లువర్ ధర్మార్థ కామాలనే ప్రస్తావించారని, మోక్షమార్గాన్ని గురించి ప్రస్తావించ లేదని ఆచార్య గోపి తన పరిశోధనలో పేర్కొన్నారు. అయితే తత్త్వార్థము అనే విభాగంలో తిరువళు ్లవర్ మోక్షాన్ని గురించి కూడా ప్రస్తావించడం కనిపించింది.

"తాత్త్వికముగ నిజము దరచి చూచిన వారి

మనసు మోక్షమార్గ మనుసరించు"

తాత్త్విక బుద్ధితో వాస్తవాలను పరిశీలిస్తే మనసు మోక్షం వైపు పయనిస్తుందని అంటారు తిరువళ్ళువర్. అదేవిధంగా మరో పద్యంలో

"తత్త్వచింతనమున తత్త్వంబు నెరిగిన

తిరిగిపుట్టనట్టి స్థితి లభించు"

తాత్త్విక దృష్టితో పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకుంటే పునర్జన్మ ఉండదని అంటారు తిరువళ్లువర్. అదేవిధంగా మరో పద్యంలో

"పుట్టుగిట్టునట్టి బుద్ధి హీనతబాపి

మోక్షమిచ్చు బుద్ధి బుద్ధియగును"

మనిషి జనన మరణాల మధ్య కొట్టుమిట్టాడకుండా మనసును పరమాత్మయందు నిలిపితే మోక్షం లభిస్తుందని అంటారు తిరువళ్లువర్.

ఈ మూడు పద్యాల్లోనూ తిరువళ్లువర్ మోక్షమార్గం ఎలా సిద్ధిస్తుందనే విషయాన్ని గురించి ప్రస్తావించారు. వేమన కూడా మోక్షానికి అదే విధమైన మార్గాన్ని చూపించాడు.

"కూడి పరవశంపు కోర్కెలు లేకుండ

నాటవలెను బుద్ధి నియముగాను

చోటుగనని వెలుగు చోరుటయే మోక్షంబు ॥విశ్వ॥

పంచేంద్రియాలను అదుపులో వుంచుకుని, కోర్కెలను విడిచి, మనసును భగవంతునిపై లగ్నంచేసి వెలుగు ప్రవేశించలేని ఆత్మ స్వరూపంలో వెలుగునింపితే మోక్షం సిద్ధిస్తుందని చెబుతారు వేమన.

జ్ఞానాన్ని సముపార్జించడం గురించి ఇద్దరు కవులూ చెప్పిన విషయాలు క్రింది విధంగా వున్నాయి.

"చదువులేనివాడు చదవరితో నుంట

మృగము మనిషి కలిసి మెలసినట్లు"

విద్యనేర్చని వాడు విద్యాధికుడితో కలిసి వుంటే మృగము, మనిషి కలిసి వున్నట్లు అంటారు తిరువళ్ళువర్.

"విద్యలేనివాడు విద్యాధికుల చెంత

నుండినంత బండితుండు గాడు

కొలని హంసల కడ కొక్కెర యున్నట్లు ॥విశ్వ॥

సరోవరంలో హంసల సరసన కొంగ కూర్చున్నంత మాత్రాన అది హంస కాలేదు. అదేవిధంగా పండితుల సరసన పామరుడు కూర్చున్నంత మాత్రాన అతడు పండితుడు కాలేడు అని అంటారు వేమన.

ధనము చేసే గారడీల గురించి ఇద్దరు ప్రజాకవులు వేరువేరు కాలాలలో ఒకేరకంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశీలిద్దాం.

"లేని వాని నెవరు లెక్కింప రెచ్చట

ఉన్న వాని నెల్ల సన్నుతింత్రు."

ధనం లేనివాడిని, దరిద్రుడిని ఎవరూ పట్టించుకోరని, అతనికి విలువనివ్వరని అంటారు. ధనవంతుడైన వాడికి అందరూ అపారమైన విలువనిస్తారని చెబుతారు తిరువళ్ళువర్. అంటే కాలం ఏదైనా సరే ధనవంతునికి, పేదవాడికి మధ్య అంతరం, వారికి వున్న విలువ ఏ మాత్రం మారలేదన్న విషయం మనకు అర్థం అవుతుంది.

"కనకమున్నవాడు కాముండు, భీముడు

మిగుల తేజమలరి మెలగుచుండు

విత్తహీనుడైన వెర్రులలో మేటి ॥విశ్వ॥

వేమన కూడా ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేస్తారు. డబ్బులు వున్నవాడు అంధహీనుడు, కురూపి అయినా సరే మన్మధుడితో సమానుడిగా పరిగణిస్తారు. బలహీనుడైనా సరే భీమబలుడని చెప్పుకుంటారని, అత్యంత గౌరవప్రదంగా చూస్తారు. అదే పేదవాడు గొప్ప అందం, శౌర్యం కలిగివున్నా సరే అతన్ని వెర్రిబాగులవాడిగా ప్రజలు పరిగణిస్తారని అంటారు వేమన. కాలం ఏదైనా సరే, ఎన్నివేల సంవత్సరాలు గడిచినా సరే, డబ్బుల మహిమ మాత్రం మారలేదని ఈ పద్యాల ద్వారా తెలుస్తుంది.

ముగింపు:

తిరువళ్లువర్, వేమనలిద్దరూ దైవస్తుతి, సంసారం, ఇల్లాలు, ప్రవర్తన, మోక్షం, జ్ఞానసముపార్జన, ధనప్రాధాన్యత, ఆశ, దుర్జన సాంగత్యము, కార్యసాధన, అల్పబుద్ధి, మోహము, స్నేహము, వ్యర్థభాషణం, ప్రేమ, సత్యము, అవివేకము, భార్యా విధేయత వంటి అంశాలతో పాటు అనేక అంశాలమీద ఒకే రకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చడం వారి పద్యాలలో కనిపిస్తుంది. తిరువళ్లువర్, వేమన కాలాలకు దాదాపు వెయ్యిసంవత్సరాల వ్యత్యాసం వుంది. అయితే, ఇరువురి కాలాల్లో అనేక అంశాలు ఒకే రకంగా వుండేవన్న విషయం ఈ ఇద్దరి పద్యాలను పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఏ విషయాన్నైనా తిరువళ్ళువర్ కాస్త సున్నితంగా చెబితే వేమన మాత్రం కాస్త కఠినంగానే చెప్పటం కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు:.

1. వేమన వాక్కులు సంకలనం, అంగత వరప్రసాదరావు, విజయవాడ, 2015
2. వేమన పద్య రత్నాకరము, భాగవతుల సుబ్రమణ్యం, నవరత్న బుక్‌హౌస్, విజయవాడ, జులై 2016
3. తిరుక్కురళ్ ఆఫ్ తిరువళ్ళువర్ ఇన్ తెలుగు, గురుచరణ్ దూటలూరి జగన్నాధమ్, ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం, అక్టోబర్ 2000
4. శతకమంజరి, రుషి ప్రచురణలు, విజయవాడ, 2008
5. ప్రజాకవి వేమన, డాక్టర్ ఎన్. గోపి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ఏప్రిల్ 2000

6. తిరుక్కురళ్ ఆఫ్ తిరువళ్లువర్ ఇన్ తెలుగు, గురుచరణ్ దూటలూరి జగన్నాధం, ద్రవిడియన్ యూనివర్సిటీ పబ్లికేషన్స్, అక్టోబర్ 2000, ప్రస్థావన
7. వేమన మరియు జాషువా, కత్తి పద్మారావు, నడుస్తున్న చరిత్ర పత్రిక, ఫిబ్రవరి 2006
8. లోకకవి మన వేమన, విజయబాబు, అధికార భాషాసంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్, సాక్షి దినపత్రిక, జనవరి 19 2023
9. వేమన, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, వేమన ఫౌండేషన్, హైదరాబాద్ స్టడీ సర్కిల్, మార్చి – 2010.
10. వేమన శతకము (జాగృతి వ్యాఖ్యా సంహితము) విద్వాన్ డా.కసిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీ పావనీసేవ సమితి ప్రచురణ, హైదరాబాద్, 2004.
11. వేమన – నార్ల వెంకటేశ్వరరావు, వేమన ఫౌండేషన్, హైదరాబాద్ స్టడీ సర్కిల్, 2006

ISSN No.2319-3905

12

బంజారా భాషా సాహిత్యం పరిరక్షణ – ఆవశ్యకత

– డా॥ వి. గోపాల్

భారతదేశమంతటా విస్తరించి ఉన్న బంజారా తెగ గ్రామీణ సంస్కృతికి, నగర సంస్కృతికి భిన్నంగా ఒక విశిష్ట సంస్కృతిని కలిగి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంజారాలు తెలంగాణాలో 9.5 ఆంధ్రప్రదేశ్‌లో 5.6 శాతం ఉన్నారు. లంబాడీలు మైదాన మరియు అటవీ ప్రాంతాల్లో నివశిస్తున్న ఒక గిరిజన తెగ. వీరు దేశమంతటా వ్యాపించి ఉండటమే కాకుండా వీరికి 47 పేర్లు వాడుకలో ఉన్నాయి. వీరిని మనదేశంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. ఒక్క తెలంగాణలోనే లంబాడీ, బంజారా అనే పేర్లు వాడుకలో ఉన్నాయి. భారతదేశంలో ఈ లంబాడీల జనాభా, దేశ జనాభాలో 10శాతం వరకు ఉండవచ్చని ఒక అభిప్రాయం. భారతదేశంలో ఉత్తరాది రాష్ట్రాల తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో వీరి జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా తెలంగాణ, కర్ణాటక మరియు ఆంధ్రప్రదేశ్‌లు.

భాషా సాహిత్యం:

భాష అనేది ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని పరిరక్షించే బలమైన సాధనం. సాహిత్యం ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని ప్రపంచానికి చాటే సాధనం. ప్రపంచంలో ఎన్ని భాషలున్నప్పటికీ ఏదో ఒక భాష మాత్రమే వ్యక్తికి స్వంత భాష అవుతుంది. కాని ఇతర భాషలన్నీ అతనికి పరిచయమున్న భాషలుగానే వ్యవహరించబడతాయి. ఈ నేపథ్యంలో భాష అనే పదానికి పూర్వానుబంధం చేరి మాతృభాష ప్రథమభాష, ద్వితీయ భాష, అంతర్జాతీయ భాష, అధికార భాష లాంటి వైవిధ్యాలు ప్రపంచంలో ఉన్నాయి. వీటిలో మాతృభాష తప్ప ఇతర భాషలన్నీ వ్యక్తిగత సాంఘీకరణానికి, నాగరిక సంపర్కానికి ఏర్పడ్డ అపార ప్రాధాన్యం దృష్ట్యా భాష కూడా తగిన ప్రాధాన్యం సంతరించుకుంది. లంబాడీలు దేశమంతా విస్తరించి ఆయా ప్రాంతీయ భాషలు మాట్లాడగలిగి నప్పటికీ తిరిగి అందరూ కలిసి ఒకే భాషలో మాట్లాడటం ఒక విశేషంగా చెప్పవచ్చు. "బంజారా భాష" ఎన్నో సంవత్సరాలుగా ప్రకృతి జీవనంలో ముడిపడి తన సంస్కృతి సంప్రదాయాలను, సాహిత్యాన్ని, జానపద విజ్ఞానాన్ని మౌఖిక రూపంలో ముందుతరాలకు అందిస్తూ

వస్తుంది. బంజారా వేష భాషలోను, జీవన విధానాన్ని, వైభవాన్ని ప్రపంచానికి చాడడంలో బంజారా భాష "గోర్‌బోలి", బంజారా సాహిత్యం రెండూ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

భారతదేశంలో 398 భాషలున్నట్లు భాషావేత్తల అభిప్రాయం. అందులో 99 భాషలు విలుప్తమైనాయి. ఐదుకోట్ల కంటే ఎక్కువ జనాభా మాట్లాడే భాషలు హిందీ, బెంగాలీ, తెలుగు, మరాఠీ, తమిళం తరువాత బంజారా భాష 'గోర్‌బోలి'దే. గోర్‌బోలీకి 'లిపి' లేకపోవడం లేదా లిపికి ఎంచుకొని భాషాభివృద్ధికి ప్రయత్నాలు జరగకపోవడం వల్ల, వారి సాహిత్యంలోని సౌందర్యం బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం లేదు. తద్వారా బంజారా జాతి ఎంతో నష్టపోయింది. వారి భాషా సాహిత్యాలు అంతరించి పోతున్న భాషల సరసన చేరిపోయాయి.

భాష, సాహిత్యం రెండూ అభివృద్ధి చెందాలంటే అట్టి భాషకు 'లిపి' అనేది ఉండాలి. మౌఖిక భాషా సాహిత్యాన్ని ఒకరి నుండి మరొకరికి చేరవేస్తుంది. కానీ వాగ్రూపంలోని సాహిత్యానికి లిఖితరూపం ఇచ్చి శాశ్వతత్వాన్ని చేకూర్చేది లిపి మాత్రమే. అటువంటి లిపి బంజారాలకు లేకపోవడం ప్రధాన సమస్య. కాబట్టి ఇట్టి భాషకు దేశమంతటా ఒకే లిపిని వాడకంలోనికి తేవాల్సిన అవసరం ఉంది. బంజారాల వేషభూషణాదులు ఎంత విలక్షణమైనవో వారి భాష కూడా అంతే విశిష్టమైనది. భారతదేశమంతటా నివసిస్తున్న దాదాపు ఏడుకోట్లమంది మాట్లాడే భాషను 'గోర్‌బోలి' సుమారు 'ఆరువేల' సంవత్సరాల పూర్వమైందని భాషావేత్తల అభిప్రాయం. బంజారా భాషను మిగతా భారతీయుల భాషలలో పోలిస్తే ఉత్తర భారతదేశ భాషలైన హిందీ, రాజస్థానీ, గుజరాతీ, మరాఠి మొదలైన భాషలతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. కాబట్టి బంజారాల 'గోర్‌బోలి' ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినదిగా భాషావేత్తలు నిర్ధారించారు.

బంజారా శబ్దం 'వాణిజ్యం' అనే సంస్కృత పదం నుండి "బనజ్" అనే హిందీ శబ్దంనుండి "బంజారా" రూపొందిందని భాషా పరిశోధకులు పేర్కొన్నారు. వీరు వివిధ రాష్ట్రాల్లో ఒకే భాష గోర్‌బోలిని ఉపయోగించినప్పటికీ ఆయా రాష్ట్రాల్లో బంజారాలు వివిధ నామాలతో పిలువబడు తున్నారు. రాజస్థాన్‌లో వీరిని 'గవారియా' లేదా 'గమాలియా' అని ఢిల్లీ, హర్యానాలలో 'సిరికిబాండ్' అని, పంజాబ్‌లో 'సిరికివాలా' అని మిగతా రాష్ట్రాల్లో బంజారా, వనచర, బ్రంజారి, బ్రజ్వాసి, లఖాన్, సిఖాన్, సబాన, బళదియా, లదణియా, అని కర్ణాటకలో 'లమాన్' లంబాణి, మహారాష్ట్రలో 'సింగడి బంజారా', కేరళలో 'గహర్', తెలంగాణలో 'లంబాడి' రాయలసీమలో 'సుగాలి' అని పిలుస్తారు.

బంజారా భాష ఎదుర్కొంటున్న సమస్యలు

భారతదేశ వ్యాప్తంగా ప్రమాదంలో ఉన్న భాషలు 196, అత్యంత ప్రమాదంలో ఉన్న భాషలు 35. గడచిన 50 సంవత్సరాల కాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారుగా 20 భాషలు కనుమరుగైనాయని "ది లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా" వారు పేర్కొన్నారు. లంబాడి

భాష కూడా ప్రస్తుతం అంతరించిపోతున్న భాషల జాబితాలో చేరింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లంబాడీలు గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకోవడం, పట్టణ ప్రాంతాల్లో కొందరు ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం, ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడటం, ప్రసార సాధనాలు మాతృభాషలో లేకపోవడం అలాగే ఇంటిదగ్గర కూడా మాతృభాషలో మాట్లాడుకోకపోవడంవల్ల, నేడు ఈ భాష అంతరించే స్థాయికి చేరింది. భాష అంతరించిపోవడం ద్వారా తనవాళ్ళ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పాటలు, ఐతిహ్యాలు, కవిత్వం మొదలైనవి నశించిపోతాయి. అంతే కాకుండా వాటిని భాషల్లోకి యథాతథంగా అనువదించలేము. దాని ద్వారా వాళ్ళ జాతికి గుర్తింపు తక్కువ తద్వార సామాజిక వెసులుబాటుతనం కన్పిస్తుంది.

బంజారా భాషపై తెలుగు భాష ప్రభావం మన రాష్ట్రంలో దాదాపు రెండు వందల సంవత్సరాలుగా ఉంది. సాధారణంగా ఏ తెలుగు పదాన్నైనా సులభంగా ఇముడ్చుకోగల భాషా సహనం బంజారాలకు సాంస్కృతికంగా వచ్చిన వారసత్వం. ఏ భాష అయినా మాట్లాడేవారు లేకపోతే, కొన్ని రోజులకు ఆ భాష అంతరించే అవకాశం ఉంది. ఉదాహరణకు బంజారా భాషను చూసినట్లయితే రాను రాను ఆ జాతివారే వారి భాషను మాట్లాడకుండా ఆధునిక నాగరికతకు అలవాటుపడి వారి భాషనే మర్చిపోయే ప్రమాదం ఉంది.

ఆవశ్యకత

భాష అనేది ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని పరిరక్షించే బలమైన సాధనం. సాహిత్యం ఆ భాష మాట్లాడే వారి సంస్కృతిని ప్రపంచానికే చాటే సాధనం. భాష, సాహిత్యం రెండూ అభివృద్ధి చెందాలంటే అట్టి భాషకు ఒక 'లిపి' అనేది ఉండాలి. మౌఖిక భాష సాహిత్యాన్ని ఒకరినుండి మరొకరికి చేరవేస్తుంది. కానీ వాగ్రూపంలోని సాహిత్యానికి లిఖితరూపం ఇచ్చి శాశ్వతత్వాన్ని చేకూర్చేది లిపి మాత్రమే. వీరి భాష అభివృద్ధి జరగాలంటే ఆ భాషకు ఒక లిపిని అధికారికంగా చెలామణిలోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా బంజారా సాహిత్యాన్ని అభివృద్ధి పరచి చెల్లాచెదురుగా ఉన్న బంజారాలను ఏకం చేయాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా విలుప్తం చెందుతున్న భాషకు ప్రాణం పోసే అవకాశం ఉంది. అత్యధిక సంఖ్యలో ప్రజలు మాట్లాడే ఒక భాషను బ్రతికించి అభివృద్ధి చేస్తే ప్రజల సంస్కృతికి ప్రాణం పోసినట్లే అవుతుంది. వారి భాషా సాహిత్యాలు అభివృద్ధి చెంది మిగతా సమాజంలో కలిసిపోయే అవకాశం ఉంది.

గత ప్రభుత్వాలు పాఠశాల ప్రాథమిక స్థాయిలో బంజారా భాషలో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాయి. ఆ పాఠ్యాంశాల్లో ఉపయోగించిన లిపి తెలుగులిపి కావడం, తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది కావడం వల్ల భాషా సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందిన 'దేవనాగరలిపి'ని ఎన్నుకోవడం మంచిది. అలాగే ఈ భాష ఇండో-ఆర్యన్ భాషా కుటుంబానికి చెందింది కావున ఉత్తరాది

భాషల్లో ద్రావిడ భాషకు వ్యాకరణ, మాండలికాల దృష్ట్యా వ్యత్యాసం ఉంటుంది. ఈ ద్రావిడ భాషలు ఏవీ కూడా బంజారా సాహిత్యాన్ని అనువాదం చేసినా దాని సహజసిద్ధ ఆత్మ సౌందర్యాన్ని ఆవిష్కరించలేవు. ఉత్తరాది భాషలైన హిందీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ భాషలు దేవనాగరిలిపిని వాడి ప్రాచుర్యం పొందాయి. అలాగే బంజారా భాష కూడా దేవనాగరి లిపిని వాడుకున్నట్లయితే ఆ లిపిలో గోర్‌బోలీ భాష కూడా ఇమిడిపోయే అవకాశం ఉంది. ఈ భాషను షెడ్యూల్ ఎనిమిదిలో చేర్చినట్లయితే సత్వరం పరిరక్షణ చర్యలు చేపట్టవచ్చు. షెడ్యూల్ ఎనిమిది ద్వారా అట్టి భాషలను కాపాడాల్సిందిగా రాజ్యాంగంలో చట్టం చేశారు. కనుక సంబంధిత శాఖకు నిధులు విడుదల చేసి బంజారా భాషను రక్షించాల్సిన అవసరం ఉంది. అలాగే బంజారా భాషకు సంబంధించి భాషాజ్ఞానం, సాహిత్య పఠనం మొదలైనా అంశాలకై ప్రభుత్వమే స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియాలు, వివిధ టీ.వి. ఛానళ్లు బంజారా భాషకు భావప్రసార భాషా మాధ్యమంగా ప్రచారం కల్పించాలి. బంజారా భాషకు ప్రత్యేకతను చాటే వారి జానపద సాహిత్యాన్ని గ్రంథస్తం చేసి, భాషా సాహిత్యాభివృద్ధికి ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేయడం ద్వారా బంజారా భాషను అభివృద్ధి చేయవచ్చు.

పరిరక్షణ

ఒకప్పుడు సంచార జీవనాన్ని సాగించిన బంజారా గిరిజనులు ప్రస్తుతం దేశమంతటా ఎక్కడి వారక్కడ స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. బంజారాలతో పోలిస్తే భారతదేశంలో ఏ ఇతర గిరిజన తెగ కూడా ఇంతలా దేశమంతటా వ్యాపించలేదు. దేశంలో అత్యధిక జనాభా మాట్లాడే భాష హిందీయే. ఆ తర్వాత తెలుగు. ఈ రెండింటి తర్వాత ఎక్కువ జనాభా మాట్లాడే భాష ఏదంటే అది బంజారాభాష అనే చెప్పాలి. అంతటి విస్తృతమైన పరిధి కలిగిన బంజారా భాషకు 'లిపి' లేకపోవడం, కేవలం లిఖితసాహిత్యం లేకపోవడం వల్ల ఎంతో గొప్ప మౌఖిక సాహిత్యం ఉన్న బంజారా భాష నేడు కేవలం ఒక గిరిజన భాషగానే మిగిలిపోయింది. వీరికి ఎంతోగొప్పదైన సాహితీ సంపద ఉంది. ఎన్నో ఇతర భాషలకన్నా బంజారాభాషలో ప్రాచీనమైన జానపద కథనాలు, పాటలు, సామెతలు మొదలైన మౌఖిక సాహితీ విజ్ఞానం ఉంది. తరతరాలనుండి ఈ సాహిత్యమంతా మౌఖికంగానే ఉంది. ఒక భాష గొప్పదనం తెలియాలంటే ఆ భాషా సాహిత్యానికి తగిన ప్రాచుర్యం కల్పించాలి.

లిఖిత సాహిత్యం ఎంత అభివృద్ధి చెందితే, బంజారా సాహిత్యంలోని అందచందాలు బాహ్య ప్రపంచానికి అంతలా తెలిసే అవకాశం ఉంటుంది. మన దేశంలో 22 భాషలు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్‌లో చేర్చబడ్డాయి. అందులో 5 భాషలు మాత్రమే "ఐదు" కోట్ల కంటే ఎక్కువమంది మాట్లాడుతున్నారు. మిగతా 16 భాషలు మణిపురి, డోంగ్రీ, బోడో లాంటి భాషలు కేవలం 11 నుండి 22 లక్షల మంది మాత్రమే మాట్లాడుతున్నప్పటికీ ఆయా భాషలకు

8వ షెడ్యూల్‌లో చోటు దక్కింది. కానీ దేశమంతటా ఆరుకోట్ల మంది మాట్లాడే "గోర్‌బోలి" బంజారా భాషకు చోటు దక్కకపోవడం శోచనీయం. దానికి కారణం లిపి లేకపోవడం మరియు సాహిత్యం ప్రాచుర్యం పొందకపోవడంగా భావించవచ్చు. బంజారా భాషయైన "గోర్‌బోలి"కే లిపి ఉండి ఉంటే, మౌఖిక సాహిత్యం గ్రంథస్థం కాబడి లిఖి సాహిత్యం అభివృద్ధి చెంది ఉంటే, ఈ రోజు దేశంలో గొప్పవిగా, పెద్దవిగా చెప్పబడుతున్న భాషల సరసన గోర్‌బోలి ఉండేది. సంఖ్యలో పది లక్షల కంటే తక్కువమంది ప్రజలు మాట్లాడే కాశ్మీరి, ముండారి లాంటి భాషలకు భాషాపరమైన జనాభాలెక్కల్లో దక్కిన చోటు ఇంతటి వ్యాసార్థం కలిగిన బంజారాభాషకు దక్కకపోవడం విచారకరం.

ఆధార గ్రంథాలు

1) తెలుగు భాషాధ్యయనంలో లంబాడీ విద్యార్థుల సమస్యలు-పరిష్కారాలు-డా॥ వన్నెగోపాల్.

2) గిరిజన సాహిత్యం – ఆచార్య ఎం. గోనానాయక్.

3) మాతృభాషలో ప్రాథమిక విద్య శాస్త్రీయ వివరణ

4) నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం- జీవన చిత్రణ – ఆచార్య సూర్యధనంజయ్.

5) తెలుగు – బోధనా పద్ధతులు – తెలుగు అకాడమి.

6) భారతదేశంలో లంబాడీలు – ఆచార్య ఎం. గోనానాయక్.

7) ఆధునిక సమాజంలో గిరిజన భాష – సంస్కృతులు – డా॥ భూక్యా తిరుపతి.

13

తెలుగుకథా సాహిత్య వికాసం – సన్నపురెడ్డి కథల్లో పాత్ర చిత్రణ

డా. డి. జ్యోతమ్మ

ఇంగ్లీషు చదువుల వల్ల 19వ శతాబ్ది ద్వితియార్థంలో విశాల భావాలు పెంపొందాయి. సంప్రదాయ కవిత్వం చెప్పేవారు రాజులను, జమిందారులను సందర్శిస్తూ అష్టావధానాలపై శతావధానాలపై మోజును పెంచారు. కందుకూరి వీరేశలింగం సాహిత్యాన్ని సంఘసంస్కరణవైపు మళ్ళించాడు. నవల, నాటకం, ప్రహసనం, చరిత్ర, వ్యక్తుల చరిత్ర, పత్రికా రచన మొదలైన అన్ని ప్రక్రియల్లోనూ కొత్త ఒరవడి చూపించారు. 19వ శతాబ్ది చివరి దశాబ్దంలో గురజాడ అప్పారావు సామాజిక స్పృహతో కలం పట్టారు. వాస్తవ జీవితం నుంచి ఇతివృత్తాలు చేపట్టాలని గురజాడ భావించారు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వృద్ధిచెందుతూ ఆధునికాంధ్ర వాఙ్మయానికి పరిపుష్టి కల్గిస్తున్న సాహిత్య ప్రక్రియల్లో శిల్ప ప్రధానమైన సాహిత్య ప్రక్రియ కథానిక. ఒకే రకమైన ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమిత పాత్రలు, చక్కని పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యం, ఒక జీవిత సత్యాన్ని ప్రతిపాదించటం అన్నిటినీ మించి వస్త్వైక్యం. మంచి వినోదమో, విజ్ఞానమో కల్పించగల చిన్నకథ కథానిక.

ప్రపంచంలో కొన్నివేల సంవత్సరాలు సంప్రదాయ పదసాహిత్యం ప్రజలకు ఆధ్యాత్మికతను ఉపదేశ ఆనందాలను అందిస్తూ వచ్చింది. 18వ శతాబ్దంలో ఫ్రాన్సులో బయలుదేరిన పారిశ్రామిక విప్లవం తర్వాత ప్రపంచ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పరిశ్రమలవల్ల వస్తూత్పత్తి, సంపద ఎక్కువగా పెరగడం వల్ల మానవునికి తీరిక లేకుండా పోయింది.

దానికనుగుణంగానే సాహిత్యం తన రూపాన్ని మార్చుకుంటూ వచ్చింది. పద్య సాహిత్యానికి ప్రాధాన్యత తగ్గి వచనానికి ప్రాముఖ్యత పెరిగింది. పైగా కార్మిక, కర్షక చైతన్యం ప్రబలసాగింది. ఇన్ని కారణాలవల్ల సాహిత్యంలోను అంతకు ముందు అంతగా చోటుచేసుకోని సామాన్యుల

గురించిన అంశాలు సాహిత్యంలో చోటు చేసుకుంటూ వచ్చాయి. సామాన్యుల సాహసాలు, కష్టాలు ఇతివృత్తాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ఆధునిక సాహిత్య ప్రక్రియలు పుట్టుకొచ్చాయి. వాటిలో కవిత్వం ప్రాధాన్యత తగ్గి కథ, నవల, నాటక ప్రక్రియల ప్రాధాన్యత పెరిగింది. వీటిలో సర్వజనుల ఆమోదం పొంది సామాజికమోదాన్ని సంతరించుకున్నది వచన సాహిత్యం. ఇందులో కథ, నవల నేడు సాహిత్యంలో ప్రధానపాత్ర వహిస్తున్నాయి. వీటిలో కథే ప్రధానం. ఐతే కథ మనకేమీ కొత్తకాదు సాహిత్యంలో కథ అత్యంత ప్రాచీనమైంది.

కథల విశిష్టగుణం అర్థంకాని విషయాలను సులభంగా అర్థమయ్యేటట్లు చేయడమే. అనేక ఆధ్యాత్మిక, తాత్త్విక విషయాలను, పలు నీతిశాస్త్రాలను హృద్యంగా చెప్పటమే ప్రాచీనకథల ప్రయోజనం. ఐతే ఆ కథ నేటి కథకు సరిపోదు. ఈ ఆధునిక సాహిత్య ప్రక్రియల సృష్టికర్తలు వస్తువును సమాజం నుంచే తీసుకుంటారు. దీన్నే "తెలుగు కథకులు కథనరీతులు" అనే గ్రంథంలో సింగమనేని నారాయణ "ఒక సాహిత్య ప్రక్రియ పుట్టుక, ప్రగతి, పరిణతిలాంటి దశలన్నీ దానికి రంగభూమి ఐన సమాజంలోని పరిస్థితులపైన ఆధారపడి ఉంటాయి" అని అన్నారు.

ఈ విధంగా వచన రచయితలు తాను చూసిన లేదా విన్న అంశాలను కళాత్మకంగా కథకులుగా మలచుకుంటారు. అలా మలచబడిన ఆధునిక కథా సాహిత్యం గురించి చర్చించడం కూడా అవసరమే.

కథ ఆవిర్భావ వికాసాలు

ఆధునిక కథ జర్మనీ, అమెరికా, ఫ్రాన్సు, రష్యా వంటి దేశాలలో దాదాపు ఒకే కాలంలో పుట్టింది. జర్మన్ దేశపు మహాకవి గేథే ఒక పత్రికకు వినోదార్థమై రాసిన వచన రచనలనే తర్వాతి కాలంలో 'కథ' అని పిలిచారు. కాలక్రమంలో ఆ పేరే దానికి స్థిరపడిపోయి నేటి 'కథ' (short story)గా పిలువబడి అందరి అభిమానం చూరగొన్నది. ఈ వచన రచననే కాస్త కళాత్మకంగా మలిచారు నికోలాయ్ గొగోయ్, నెథానియల్, హాథరిక్, ఎడ్గార్ ఎలెన్‌పో, మామ్, గైడీమపాసా, టాల్‌స్టాయ్ లాంటి మహారచయితలు. ఇలా మహనీయులచే ఆదరింపబడ్డ కథా సాహిత్యంలో ఎన్నో మార్పులు వచ్చాయి. శిల్పనైపుణ్యం పెరిగింది.

తెలుగు కథా సాహిత్య వికాసం

మన భారతదేశంలో ఆంగ్లవిద్య ప్రభావంవల్ల ప్రపంచ సాహిత్యాన్ని చదువుకున్న మేధావులు కథలు రాయడం ప్రారంభించారు. మొట్టమొదట కథ రాసినవారు రవీంద్రనాథ్ ఠాగూర్. వీరు రాసిన కథల్లో "కాబూలీవాల", "పోస్ట్‌మ్యాన్" లాంటి కథలు ప్రసిద్ధి చెందాయి. ఆ తర్వాత మున్షీ ప్రేమ్‌చంద్ తాను రాసిన కథల్ని "కఫన్" పేరుతో ఒక సంపుటిగా వెలువరించారు. ఇదే భారతదేశంలో వెలువడిన మొదటి కథల సంపుటి.

తెలుగులో మొట్టమొదట బండారు అచ్చమాంబ 'ధనత్రయోదశి', 'స్త్రీవిద్య' లాంటి కథలు రాసినా శైలీశిల్ప నైపుణ్యాల దృష్ట్యా గురజాడ రాసిన 'దిద్దుబాటు' (1910) కథ మొదటి కథగా

గుర్తింపు పొందింది. గురజాడ మెటిల్డా, దేవతలారా మీరేమిటి, పెద్దమసీదు లాంటి కథలు వెలువరించి కథాసాహిత్యానికి బాటలు వేశాడు. తర్వాత నోరి నరసింహశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, మొక్కపాటి నరసింహశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, అడవిబాపిరాజు, తిలక్, త్రిపుర, శ్రీశ్రీ, గోపీచంద్, చింతాదీక్షితులు, బుచ్చిబాబు, రావిశాస్త్రి, మాలతీచందూర్ వంటివారు కథలు రాశారు. మార్క్సిస్ట్ దృక్పథంతో కథా సాహిత్యంలో మొట్టమొదట కథలు రాసినవారు కొడవటిగంటి కుటుంబరావు. మునిపల్లిరాజు, కాళీపట్నం రామారావు, చాసో, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, మధురాంతకం రాజారాం, కేతువిశ్వనాథరెడ్డి లాంటివారు తెలుగులో ప్రసిద్ధ కథకులు.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'కడితివేట'(1987) కథతో రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించి కథా సాహిత్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. యాభైకి పైగా కథలు రాసారు. ఐదు నవలలు, అరవైకిపైగా కవితలను రాసారు. ఇతని రచనలన్నీ గ్రామీణ నేపథ్యాన్ని కల్గివుండడం విశేషం.

రాయలసీమలో ఎన్నో ఏళ్లుగా సమసిపోకుండా వస్తున్న సమస్యలపట్ల భిన్నంగా ఆలోచించి, ఆ సమస్యలకు గల మూలాలను అన్వేషించి, తన రచనల్లో వాటిని చిత్రించడం చేసేవాడు. ప్రతి సమస్యకు స్పదించే గుణం రచయితలు, కళాకారుల్లో కన్పిస్తుంది. ఈ లక్షణం వెంకట రామరెడ్డిలో ఎక్కువగా కన్పిస్తుంది. తన ప్రాంతంలోని పల్లెల్లో కొనసాగుతున్న నీచ రాజకీయాల్ని, నిరంతర కరువుల్ని, ఆకరువు రక్కసి పాదాలకిందపడి ఛిద్రమైపోతున్న బతుకుల్ని, గ్రామీణుల ప్రాదేశికతే ప్రాణంగా అక్కడి ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ విషయాలే అవయవాలుగా శిల్పీకరించి సాహిత్యసేద్యం చేస్తున్నాడు. గ్రామీణ ప్రాంతమన్నా, గ్రామీణ ప్రజలన్నా ఎంతో ఇష్టమున్న విషయం అతని రచనల ద్వారా తెలుస్తుంది. అందుకే రామిరెడ్డి గారు గ్రామీణ జీవితాన్ని ఎంచుకొని తన రచనాప్రస్థానం సాగిస్తున్నాడనే భావం మనకు కల్గుతుంది.

సాహిత్య జీవితం

వెంకటరామిరెడ్డి రెండవ తరగతి నుంచే రామాయణాన్ని, భారత భాగవతాన్ని చదివి ఆకళింపు చేసుకున్నాడు. ఏడవ తరగతిలో పద్యరచన ప్రారంభించాడు. ఎనిమిదవ తరగతిలో ఛందోపరిజ్ఞానం సంపాదించాడు. ఇతను రాయలసీమ ప్రత్యేక నైసర్గిక, సామాజిక పరిస్థితుల మధ్య నివసిస్తున్నాడు. కనుక ఆ జీవిత వాస్తవాలను, పరిస్థితులను అధ్యయనం చేయడం, ఆ అనుభవాలను నలుగురితో కలిసి పంచుకోవడం చేసేవాడు. ఎవరికైనా జీవితం తెలిసినంత మాత్రాన సరిపోదు. దాంతో కథలు రాయడం కుదరదు. అనుభవమూ, అవగాహన ఉన్నంతమాత్రాన కథలు పుట్టుకునిరావు. ఎత్తుగడ, ఏం చెబుతున్నాం, ఎవరికోసం చెబుతున్నామన్న స్పృహవుండాలి. రచయిత మనసులో సంవేదన జనిస్తేనే కథలు రూపుదిద్దుకోవు. వాటి నిర్మాణకీలకాలు తెలియాలి.

ISSN No.2319-3905

సన్నపురెడ్డి కథలు

కడలివేట, నీతి నీవెక్కడ, వీరమరణం, కొత్తదుప్పటి, నేర్చుకో, మువ్వలు రాలిన పాట, గిరగీయొద్దు, ఒక్కవానచాలు, కొడుకు–కూతురు, రాలిన చింతపండు, తడి, వాళ్ళు మా పార్టీవాళు కాదు, కొక్కొరొకో, చనుబాలు ఏడోకడ్డి, పట్టుచీర, పునాది, కన్నీటికత్తి, బొగ్గులబట్టీ, నేను–తను, దిగంబరం, అంటు, ప్రతిమల మంచం, వసంతం, పాటలబండి, కొమ్ములు, దెబ్బ, ఎంతెంతదూరం, ఆమెచూపు, తమ్ముడి ఉత్తరం, గంపెడుగడ్డి, వీరనారి, పేడదెయ్యం, భయంనీడ, బతుకుసేద్యం, ఊరిమిండి, చివరి మజిలి, అరలు అరలుగా, సెగలలోగిలి, బిలం మొదలైనవి రామిరెడ్డి రచించిన కథలు. వీటిలో కొన్ని కథలను 'కొత్తదుప్పటి', 'బతుకు సేద్యం' పేరుతో సన్నపురెడ్డి రెండు సంపుటాలుగా వెలువరించారు.

ఏ రచయిత ఐనా తన రచనల్లో సంవాద, నటన ద్వారా స్వీయ ప్రవృత్తిని ప్రకటించే వ్యక్తిని పాత్ర అంటారు. రచయిత తాను సృష్టించబోయేపాత్రకు ఒక రూపాన్ని కల్గించే పద్ధతిని పాత్ర చిత్రణ లేదా పాత్రసృష్టి లేదా పాత్ర నిర్మాణం అంటారు. ప్రతి రచయితా తాను ఎన్నుకునే ఇతివృత్తం, సృష్టించే పాత్రలు తాను నిజజీవితంలో దర్శించినవే సృష్టించేవిధంగా తన రచనల్లో వుండాలి. పాత్రలు పాఠకుల్ని ఆలోచింపజేసే విధంగా వుండాలి. అటువంటి పాత్రలు కొన్ని బావాలకు, కొంతమంది వ్యక్తులకు ప్రతీకలుగా నిలిచివుండాలి. ఏ రచనలోనైనా కథావస్తువు భరించేవారూ, కథాంశాన్ని చూపించే వారూ, కథను చివరి వరకూ నడిపించేవారూ పాత్రలు, కథ పాత్ర చుట్టూ నడుస్తుంది. కథల్లో ప్రవేశంలేని పాత్రలు ఉండవచ్చుకానీ, పాత్రలు లేని కథ ఉండదు. కాబట్టి పాత్రచిత్రణ శిల్ప రచనలో ఒక ముఖ్యమైన అంశంగా భావించవచ్చు.

కథల్లో పాత్రల సంఖ్య పరిమితం. కథలో రచయిత మనసులో రూపొందిన పాత్ర పాఠకుని ముందుకొస్తుంది. కథల్లోని పాత్రల్లో కూడా పాత్రకు సంబంధించి అనేక ముఖాలు, అనేక విభిన్న లక్షణాలు వుంటాయి. వాటిల్లోంచి కథారచయిత కథాంశానికి దోహదం చేసే ఒక లక్షణాన్నో, అనేక విభిన్న లక్షణాల్నో ఎన్నుకుంటాడు. ఈ ఎన్నిక రచయిత జీవితానుభవంపైన, పాత్ర నిర్మాణ సామర్థ్యంపై ప్రభావం చూపుతాయి.

రచయిత సృష్టించే ఏ పాత్రలైనా వాస్తవ జీవితానికి దగ్గరగా వుండి వాస్తవికతను తమలో ఇముడ్చుకొని ఉంటాయో ఆ పాత్రలు మంచి పాత్రలుగా గుర్తింపుపొంది పాఠకుల మనసులో నిలిచిపోతాయి. అంటే రచయిత తాను సృష్టించిన పాత్రకు రచయితకు అవినాభావ సంబంధముంటుందని భావించవచ్చు. అదేవిధంగా కథా గమనానికి ఆటంకం లేకుండా సరిపోయే ప్రధాన, అప్రధానపాత్రల్ని కూడా రచయిత సృష్టించగలగాలి. పాత్రచిత్రణ అనేది రచయితయొక్క నిశితదృష్టి, నిశితపరిశీలనపై ఆధారపడివుంటుంది. అదేవిధంగా రచయిత తన రచనల్లో సజీవపాత్రలు, నిర్జీవపాత్రల్ని సృష్టిస్తాడు. ఒక వ్యక్తి ఒక ఆశయాన్ని సాధించడానికి ఆ వ్యక్తి

ఇతర విషయాల్ని పక్కకు పెట్టి ఏకాగ్రతతో మంచి ఫలితాన్ని పొందితే అతడే సజీవపాత్ర అవుతాడు. రచయిత చేసే రచనల్లో నిర్జీవపాత్ర కేవలం అలంకారప్రాయంగా వుంటుంది.

రచయిత తాను పాత్రను సృష్టించి, ఆ పాత్రస్వభావాన్ని, ఆపాత్రను తీర్చిదిద్దిన విధానాన్ని పరిశీలించి, తాను పాత్ర సృష్టించడంలో సఫలం అయ్యాడా లేదా అనే విషయాన్ని గమనిస్తాడు. కథలో ఎన్నో పాత్రల్ని ప్రవేశపెడతాడు. కథలో కొన్ని ప్రధాన పాత్రలుంటాయి. ప్రధానపాత్రకు ఆధారంగావున్న ఇతర పాత్రలన్నీ ప్రధాన పాత్రకు సాధనాలు మాత్రమే. ఏ రచనలోని పాత్రలైనా ప్రధాన, అప్రధానపాత్రలు అని రెండు రకాలుగా కన్పిస్తాయి. కాబట్టి ఏ రచనలోనైనా ప్రధానపాత్రలు ప్రముఖపాత్ర వహిస్తాయి. అలాగే ప్రధాన పాత్రలకు సహాయకారిగా నిలిచి కథాగమనానికి సహకరించే పాత్రలుంటాయి. వాటినే అప్రధానపాత్రలు అంటారు. నిజానికి అవి అప్రధానపాత్రలు కావు. అవి లేకపోతే కథలో కొన్ని మలుపులు, మెలికలు సాధ్యంకాకపోవచ్చు. అందువల్ల అన్ని పాత్రలూ కథలో అంతర్భాగమే.

ఏ రచయిత ఐనా ప్రధానపాత్రల్ని ఆకర్షణీయంగా చిత్రించడానికి ప్రయత్నించేటప్పుడు అప్రధాన పాత్రల అవసరం కల్గుతుంది. ఫలితంగా రచయిత అప్రధాన పాత్రల్ని సృష్టిస్తాడు.

అప్రధానపాత్రల ప్రాధాన్యత గురించి ప్రముఖ విమర్శకుడు రాబర్ట్‌లిడ్ “It is probably wiser to use an accident for the removed of a minor character. The result of his accidental death and reaction of the principal characters may be interesting there seems no reason for the novelist today deny himself a modreate use of his theme’ అంటాడు.

పాత్ర చిత్రణ ప్రాముఖ్యాన్ని గూర్చి విహారిశాలివాహన “ఆధునిక కథా రచనలో పాత్రసృష్టికి శ్రద్ధ పెరిగింది. పాత్ర యొక్క వ్యక్తిత్వ నిరూపణకు ప్రాముఖ్యమూ పెరిగింది. దీనితోపాటు తాను నివసిస్తున్న సమాజంలోని కొన్ని విచిత్రమైన పరిస్థితుల్ని కొందరి విలక్షణమైన మనస్తత్వాన్ని కథల్లో ప్రస్ఫుటీకరించటానికి రచయిత ప్రయత్నిస్తున్నాడు” అని అంటాడు.

మధురాంతకం రాజారాం మంచి రచయిత, చేతిలోని పాత్ర ఎలా గుర్తుండి పోతుందో వివరిస్తూ “సిద్ధహస్తుడైన రచయిత చేతిలో సమగ్ర చిత్రణకు నోచుకున్న పాత్ర పాఠకుడి మనసుపైన స్థిరంగా హత్తుకుపోతుంది” అని అంటాడు.

“సాధారణంగా ఇతివృత్తానికి స్థూలంగా ఒకరూపం ఏర్పడిన తర్వాత దానికి జీవం పొయ్యడానికి పాత్రలను నిర్దిష్టం చేసుకోవడం జరుగుతుంది. ఐతే పాత్రల ప్రవృత్తులన్నింటినీ, పరిణామాలన్నింటినీ నవలలో ఐతే ముందుగా నిర్ణయించుకోకపోయినా ఇబ్బంది లేదు. కానీ కథలో మాత్రం వాటి స్వరూపస్వభావాలు, పరిణామాలు స్పష్టంగా రచయిత మనసులో రూపుగట్టుకొని ఉండాలి. ఉత్తరోత్తరా ఆ పాత్ర విషయమై చెప్పే ప్రతిచిన్న మాటనైనా సరే

రచయిత నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తాడు. చెప్పుకోవలసిందేదో క్లుప్తంగా, స్పష్టంగా చెప్పేసి మాటల్లోనూ చేతల్లోనూ కూడా వాటంతట అవే బయటపడడానికి అవకాశమిస్తాడు. ఉద్దిష్ట విషయానికి ఖచ్చితంగా కట్టుబడి సాగుతూ వీలైనంత దగ్గర దారిలో గమ్యం చేరుకుంటాడు" అని పోరంకి దక్షిణామూర్తి గారి అభిప్రాయం.

సన్నపురెడ్డి కథల్లో పాత్ర చిత్రణ

సన్నపురెడ్డి కథల్లోని పాత్రలను బాగా పరిశీలించిన తర్వాత వాటిని వృద్ధుల పాత్రలు, రైతుపాత్రలు, గృహిణిపాత్రలు, యువకులపాత్రలు, పేదలపాత్రలు, ధనవంతులపాత్రలు, ఉద్యోగపాత్రలు, రాజకీయనాయకుల పాత్రలు, ఫ్యాక్షనిస్ట్ పాత్రలు, కథకుల పాత్రలు, సహాయకులపాత్రలు, వృత్తులకు సంబంధించిన పాత్రలు, దళితపాత్రలు, విటులపాత్రలు, వేశ్యాపాత్రలుగా విభజించుకోవచ్చు. మచ్చుకు రెండు మూడు పాత్రలను గూర్చి ఈ వ్యాసంలో చర్చించదలచాను.

వృద్ధుల పాత్రలు

సన్నపురెడ్డి తన కథల్లో వృద్ధులపాత్రలను సృష్టించి వారి సమస్యలకు పరిష్కారాలను సూచించాడు. చలిని భరించలేక కొత్త దుప్పటికోసం ఆశపడే 'రామయ్యతాత' పాత్ర, దురలవాట్లకు బానిసైన కొడుకును చూసి వేదన చెందే 'రామయ్య' పాత్ర, తన కొడుకు నిరాదరణకు గురి చేశాడని బాధపడే 'లక్ష్మమ్మతండ్రి' పాత్ర, తన కొడుకు కోడలూ విధించిన ఆంక్షలకు స్వేచ్ఛను కోల్పోయిన వృద్ధుడు 'కొండారామయ్య' పాత్ర, తన కొడుకుల కొట్లాటను పరిష్కరించాలనే 'చెన్నమ్మ' పాత్ర, తన కొడుకులపై అలిగి అన్నం తినడం మానేసిన 'బాలమ్మ' పాత్ర మొదలైన పాత్రలు దర్శనమిస్తాయి.

రామయ్యపాత్ర

'ఆకుపచ్చని మాయ' కథలో రామయ్య ప్రధానపాత్ర. ఇతడు దురలవాట్లకు గురైన తన కొడుకు కుటుంబాన్ని చక్కదిద్దాలనుకున్న ఓ తండ్రి పాత్రకు ప్రతీకగా కన్పిస్తాడు.

రామయ్య తన పొలంలో పనిచేసి పొలంగట్టున వున్న వేపచెట్టు కింద కూర్చొని బీడీ కాలుస్తుంటాడు. తన కొడుకు రాఘవ దురలవాట్లతో సంసారం నాశనం చేసుకుంటున్నాడని బాధపడుతాడు. పొలంగట్టున వున్న చెట్లు నరికించి అమ్మగా వచ్చిన డబ్బుతో పిల్లల స్కూల్‌ఫీజు కట్టాలనుకుంటున్న కొడుకు ఆలోచనల్ని చూసి బాధపడుతాడు. చెట్లను అమ్మమని తన వద్దకు కొడుకు రాయబారం పంపగా వచ్చినవాళ్ళపై కోప్పడతాడు. తాను సాగుచేసే ఎకరాపొలంతోపాటు తన కొడుకు సాగు చేసే మూడు ఎకరాలపొలంలో గట్టుమీద తానే పని చేశాడు. ఇన్ని పనులు చేస్తున్నా తన కొడుకు వారానికొకసారైనా పొలంలోకి రాకపోవడం చూసి బాధపడతాడు. మొక్కజొన్నల మొలకల్ని తింటున్న ఉడతల్ని తోలుతుంటాడు. ఇంతలో తన కొడుకు రాఘవ

చుట్టుపక్కల పొలాలవాళ్ళతో, సీడ్ కంపెనీ వాళ్ళతో కలసి అక్కడికి వస్తాడు. మొక్కజొన్న మొలకల్ని తింటున్న ఉడతల్ని చంపమని సీడ్ కంపెనీవాళ్ళు చెప్పగా అందుకు అంగీకరించడు. మీరిచ్చే ఆదాయం వద్దని మొక్కజొన్న మొలకలపై కాడిగట్టి గుంటక తోలుతానంటాడు. దాంతో తనకొడుకు రాఘవ రామయ్యపై దాడి చేస్తాడు. ఈ లోపు అక్కడ ఉన్నవాళ్ళు రాఘవను వెనక్కు లాక్కుపోతారు. తాను ఏమి చేయడానికి తోచక కొడుకును తదేకంగా చూస్తుంటాడు రామయ్య. రాత్రి తొమ్మిది గంటలైనా తన కొడుకు రాఘవ ఇంటికి రాకపోవడంతో కొడుకు ప్రవర్తన చూసి బాధ పడతాడు. చెట్లను అమ్మేదానికంటే మోటరు సైకిల్‌ను అమ్మి పిల్లల స్కూలుఫీజు కట్టమని, అవసరమైతే భర్త నెదిరించి సంసారాన్ని కాపాడుకొమ్మని రామయ్య తన కోడలుకు హితబోధ చేస్తాడు. తనమాట వినని కొడుకు జీవితాన్ని కోడలు చేత చక్కదిద్దించే వ్యక్తిగా రామయ్య పాత్రను రచయిత చిత్రించాడు.

రైతు పాత్రలు

గ్రామాల్లో అనాదిగా భూమిని నమ్ముకొని తమశ్రమను పెట్టుబడిగా పెట్టి పంటలు పండించి పదిమందికి అన్నం అందించే పాత్రలను రైతు పాత్రలుగా పేర్కొనవచ్చు. ఇటువంటి రైతు పాత్రల్ని సన్నపురెడ్డి కూడా సృష్టించాడు. వాటిలో దొంగతనం చేయకపోయినా ఒకరోజు జైలు జీవితాన్ని గడిపిన 'సూరయ్యపాత్ర', తన జీవితాన్ని మరోక వ్యక్తి ద్వారా 'వసంతం' చేసుకున్న 'బాలకొండన్న' పాత్ర, వ్యవసాయమే ఊపిరిగా జీవించే 'కృష్ణ' పాత్ర, తన కొడుకు చదువుద్వారా ఉద్యోగం సంపాదించుకోవాలని ఆశపడే 'సీతారామయ్య' పాత్ర, తనమామ ప్రేమకు కరిగిపోయి మనసు మార్చుకున్న 'ఓబన్న' పాత్ర, పత్తిమొలకలు గొర్రెలు కొరికి పంట నష్టపోయిన 'సుబ్బారెడ్డి' పాత్ర, దురలవాట్లకు బానిసైన 'రాఘవ' పాత్ర, కరెంటుకోతవల్ల పంటను కోల్పోయిన కృష్ణారెడ్డి పాత్ర మొదలైనవి సన్నపురెడ్డి కథల్లో కన్పిస్తాయి.

కృష్ణారెడ్డి

'పాలకంకులశోకం' కథలో ప్రధానపాత్ర కృష్ణారెడ్డి. కరెంటుకోతవల్ల తన పంటను కాపాడుకోలేని నిస్సహాయుడిగా కన్పిస్తాడు. బోరుబావి కింద ఉన్న మూడెకరాల పొలంలో ఒక ఎకరా వరి, మరొక ఎకరాలో పసుపు, మిగిలిన ఎకరాలో మిరపపంట సాగుచేస్తాడు కృష్ణారెడ్డి. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోవడంవల్ల బోరుబావిలో నీళ్ళు పంటల్ని తడపలేకపోతున్నాయి. దానికి తోడు కరెంటు కోత. ఎంత కష్టపడినా కృష్ణారెడ్డికి రెండెకరాలు తడవడమే కష్టమవుతుంది. ఎటుతిరిగి ఏదో ఒక పైరును ఎండబెట్టుకోవాల్సి వస్తుంది. ఏ పైరును ఎండబెట్టుకోవాలో అర్థం కాదు.

ఈ విషయమై తన గ్రామ స్కూల్ టీచర్ రమణను సలహా అడగ్గా అతడు ఏమీ చెప్పలేకపోతాడు. ఈ క్రమంలోనే తన కూతుర్ని సరిగా స్కూల్‌కు పంపలేకపోతాడు. ఇంతలో కరెంట్ రావడంతో పొలానికి పోతాడు. మళ్ళీ కరెంటు పోతుంది. తన కొడుకు చదివే స్కూల్ యాజమాన్యం ఫీజు కట్టమని ఫోన్ చేసి చెబుతారు. ఎంత ప్రయత్నించినా అప్పు పుట్టడం లేదని

బాధపడుతాడు. కాశినాయన దర్శనానికి వచ్చే భక్తులు దప్పిక అవడంతో కృష్ణారెడ్డి పొలంలోని బోరుబావి వద్దకు నీళ్లు తాగడానికి వస్తారు. ఒక్కో ప్రాంతంవారు ఒక్కొక్క పైరును ఎండబెట్టుకోమని సలహా ఇస్తారు. ఇంతలో వడ్డీ వ్యాపారి కృష్ణారెడ్డి వద్దకు వచ్చి అప్పుతీర్చమంటాడు. ఏ పైరును ఎండబెట్టుకోవాలో అర్థంకాక వడ్డీ వ్యాపారి సలహా అడుగుతాడు. వరిపైరును ఎండబెట్టి పసుపు మిరప పైర్లను కాపాడుకొమ్మని సలహా ఇస్తాడు. తన శ్రమను అగౌరవపరుస్తున్న ప్రభుత్వాన్ని తిట్టిపోస్తాడు. నాలుగువందల రూపాయలున్న ఫాస్పేట్‌ధర ఇప్పుడు వెయ్యి రూపాయలైందని, వెయ్యి రూపాయల వడ్లబస్తా ఏడు వందలకు తగ్గిందని ఆవేదన చెందుతాడు. బియ్యంరేటు కిలో రూపాయి ఐతే ఒక్క ఫాస్పేట్ బస్తా ధర వెయ్యి రూపాయలు అంటే వెయ్యి కిలోల బియ్యం ఒక్కఫాస్పేట్ బస్తాకు సమానమని వాపోతాడు. హోటల్‌లో రెండు ఇడ్లీల ధర పదిరూపాయలని కిలోబియ్యం ఒక్కరూపాయికి తగ్గించి ప్రభుత్వం రైతుల శ్రమను అగౌరవపరుస్తుందని రైతు పండించే పంటకు విలువ లేదని ఆవేదన చెందుతాడు. ఎంతసేపు ఎదురు చూసినా కరెంటు రాకపోవడంతో ఇంటిదారి పడతాడు. దారిలో టీచర్ రమణ కన్పించి ఏ పైరును ఎండ బెట్టుకోవాలనుకుంటున్నావని ప్రశ్నించిగా ఏదో ఒక పైరును ఎండబెట్టుకొని మిగతా రెండు పైర్లను బతికించుకుందామనుకుంటే కరెంటు కోతవల్ల మూడు పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతాడు. అక్కడ వున్న అరుగు మీద కూర్చొని కరెంటును, ప్రభుత్వాన్ని, రాజకీయాల్ని తిడతాడు. కేవలం వ్యసాయాన్ని నమ్ముకొని జీవనం సాగించే వ్యక్తుల దయనీయస్థితిని కృష్ణారెడ్డి పాత్ర ద్వారా రచయిత తెలియజేసాడు.

గృహిణి పాత్రలు

తన బిడ్డలకోసం, భర్తకోసం జీవిస్తూ తన కుటుంబానికి లోటురాకుండా చూసుకునే వారిని గృహిణులు అంటారు. అటువంటి గృహిణుల పాత్రల్ని సన్నపురెడ్డి తన కథల్లో సృష్టించాడు. అతడు సృష్టించిన పాత్రల్లో పొలంలో కూలీలతో పనిచేయించే జయమ్మ పాత్ర, ఫ్యాక్షన్ భర్తతో విసిగిపోయిన ఈశ్వరమ్మపాత్ర, పల్లెదనాన్ని నిలుపుకున్న ఇందిర పాత్ర, కష్టపడి చదివి టీచర్ ఉద్యోగం పొందిన సుశీల పాత్ర, తన కుటుంబ అవసరాల్ని తీర్చుకున్న ఇందిరపాత్ర, తన జీవితాన్ని వసంతం చేసుకున్న బాలమ్మపాత్ర మొదలైన పాత్రలు కన్పిస్తాయి.

ఆధారగ్రంథాలు:

1. "తెలుగు కథకులు కథన రీతులు" – సింగమనేని నారాయణ.
2. మధురాంతకం రాజారాం – తెలుగు కథ పాత్ర చిత్రణ.
3. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి – 'పాలకంకులశోకం' కథ.
4. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు – నవలలు అనుశీలన – డా॥ కుమ్మెత లక్ష్మినారాయణరెడ్డి.

14

గిరిజన తెగల్లో వివాహాలు – విభిన్న సంప్రదాయాలు

డా. తరపట్ల సత్యనారాయణ

ప్రవేశిక:

అనాగరిక సమాజం నుండి నాగరిక సమాజం వరకు గల చరిత్రను పరిశీలిస్తే ఎన్నో విభిన్నమైన, విచిత్రమైన ఆచార సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఎన్నో కనిపిస్తాయి. ప్రాథమిక మానవ దశ నుండి క్రమ క్రమంగా మారుతూ వచ్చిన జన జీవన విధానం, అందులో ప్రధానంగా కనిపించే సాంస్కృతిక, సామాజిక స్థితిని అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. గత కాలపు చరిత్రకు, సంస్కృతికి, నేటికాలపు చరిత్రకు, సంస్కృతికి మధ్య క్రమ వికాస పరిణామ దశలను ఆధునిక కోణంలో అధ్యయనం చేయాలి. వైజ్ఞానిక భావనలతో, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణల కొరకు పరిశోధనలు పుంజుకోవాలి. అంతరించిపోతున్న ఆదివాసీల భాషలు, కాలగర్భంలో కలిసిపోతున్న సాంస్కృతిక మూలాలు, కనుమరుగౌతున్న గిరిజన వైద్యం, అటకెక్కిన ఆహార సంస్కృతి, నేటితరం విస్మరిస్తున్న అమరవీరుల త్యాగాలు, గాథలు, ఇవన్నీ నూతన దృక్పథంతో పరిశీలించి పరిశోధన చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇంత విస్తృతమైన గిరిజన విజ్ఞానంలో అనేక అంశాలపై పరిశోధకులు దృష్టిపెట్టి రేపటి తరానికి అంతరించిపోతున్న తరతరాల వారసత్వ, సాంస్కృతిక, చారిత్రక సంపదను అందించాలి. అప్పుడే గత కాలపు చరిత్ర రేపటి తరం తెలుసుకునే వీలుంటుంది. అందులో భాగంగా వివాహ వ్యవస్థలో ఎన్నో విచిత్రమైన, విభిన్నమైన సంప్రదాయాలు నేటితరానికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

ముఖ్యోద్దేశం :

గిరిజన తెగలకు అతి ప్రాచీనమైన చరిత్ర ఉంది. మానవ జీవన విధానంలో పెనవేసుకున్న అతి విస్తృతమైన సంస్కృతీ సాంప్రదాయాలు కొంత విభిన్నంగా కనిపిస్తాయి. కొంతమందికి విచిత్రంగాను, ఆశ్చర్యంగాను కనిపించినా సమాజంలో ఉన్న ఆ వ్యవస్థలోవున్న వివిధ అంశాలు ప్రాతిపదికగా విభజింపబడ్డాయి. అందలో వివాహ వ్యవస్థ ఒకటి. ఇది మానవ సమూహాలు

ఏర్పడడానికి, బంధుత్వాలు పటిష్ఠంగా ఉండటానికి, సంబంధ, బాంధవ్యాలు విస్తృతమవ్వడానికి, సహాయ సహకారాలతో మానవ సంబంధాలు పెరగడానికి, కుటుంబం పేరుతో విస్తరిల్లింది. అటువంటి వ్యవస్థలో, గిరిజన వివాహ వ్యవస్థ, పద్ధతులు ఆచార సంప్రదాయాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, మొదలైన అంశాలపై వివాహ వ్యవస్థ ఏవిధంగా విస్తరించిందో అందులో ఉన్న ప్రాధాన్యతను, ప్రత్యేకతను తెలియజేసే ప్రయత్నమే ఈ పత్రం యొక్క ముఖ్యోద్దేశ్యం.

వివాహాలు మానవ జీవితంలో అతి ప్రధానమైనవి. ప్రపంచంలో అనేక సమూహాల్లో వివాహాలు వివిధ రకాలుగా కనిపిస్తాయి. దేశాన్నిబట్టి, ప్రాంతాన్నిబట్టి, సమూహాన్నిబట్టి, కులమతాలనుబట్టి, కట్టుబాట్లనుబట్టి, ఆయా సాంప్రదాయాల్లో వివాహాలు జరగటం గమనించవచ్చు. సాంఘిక కట్టుబాట్లనుబట్టి ఒక ప్రత్యేక సంస్కృతిని వ్యక్తీకరించే వివాహ వ్యవస్థలో ఎవరి సంస్కృతి వారికి గొప్పగానే కనిపిస్తుంది. అది వారి జీవన విధానంలో అంర్భాగమౌతుంది. వివిధ గిరిజన తెగల్లోనే కాకుండా మిగిలిన తెగలలో కూడా వివాహ వ్యవస్థ విభిన్న రీతుల్లో కొనసాగుతుంది. ఈ వివాహ వ్యవస్థ కోసం మానవ శాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించారు. వారి నిర్వచనాలను పరిశీలిస్తే వివాహ వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలతోపాటు పరిణామ స్థితి, వికాస స్థితి తెలుస్తుంది.

వివాహ – వ్యవస్థ – ప్రముఖుల నిర్వచనాలు :

వెస్టర్ మార్క్ : వీరి నిర్వచనం ప్రకారం "మతాచారాలు, సంప్రదాయాలు, చట్టం, గుర్తించిన రీతిలో ఒక్కరుగాని అంతకంటే ఎక్కువమందిలో గాని స్త్రీ పురుషులు కొన్ని హక్కులకు బాధ్యతలకు లోబడి ఏర్పరచుకున్న సంగమమే వివాహం" అని పేర్కొన్నారు.

విలియం స్టీఫెన్స్ : వీరి నిర్వచనం ప్రకారం "వివాహమనేది సమాజం న్యాయబద్ధంగా ఆమోదించిన లైంగిక సంయోగం. ఇది బహిరంగ తీర్మానం ద్వారా మొదలై శాశ్వత సంబంధాన్ని కొనసాగించడానికి కృతనిశ్చయంతో ఉన్న దంపతులు తమ భావి సంతానంకోసం, ఆర్థిక బాధ్యతలను పంచుకోవడంకోసం ఏర్పడిన వ్యవస్థ" అని పేర్కొన్నారు.

లీచ్ : వీరి నిర్వచనం ప్రకారం "వివాహమనేది స్త్రీ పురుషుల లైంగిక కలయికతో ఉద్భవించిన శిశువులను చట్టపరంగా ఆమోదింపబడిన వ్యవస్థ" అని పేర్కొన్నారు.

కేథలిన్ గవ్ : వీరి నిర్వచనం ప్రకారం "వివాహమనేది ఒక స్త్రీ మరియు ఒక పురుషుడు లేక అనేక మంది పురుషుల మధ్య ఏర్పడిన లైంగిక సంబంధము ద్వారా ఆ స్త్రీకి కలిగిన సంతానం సామాజిక ఆమోదం పొంది, సమాజంలో మిగిలిన సభ్యులుకున్న అంతస్తు వారికి సంక్రమించినపుడే ఆ వ్యవస్థ వివాహ వ్యవస్థ అనబడుతుంది" అని పేర్కొన్నారు.

ప్రముఖ మానవ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల ఫలితంగా వెల్లడించిన నిర్వచనాలను పరిశీలిస్తే వివాహ వ్యవస్థ మానవుడు తన జైవిక, లైంగిక, సామాజిక అవసరాలతోపాటు ఒక ప్రత్యేకమైన స్థాయిని పొంది చట్టసమ్మతంగా అన్ని విషయాల్లోను హక్కులు సంపాదించుకున్న అతి ముఖ్యమైన వ్యవస్థగా తెలుస్తుంది. సమాజంలో స్త్రీ పురుషుల మధ్య సంబంధమే భార్య భర్తలుగా సమ్మతింపబడి, అధికారికంగా దృఢీకరింపబడే వ్యవస్థలో భాగమే కుటుంబంగా చెప్పవచ్చు. దానివల్ల బాంధవ్యాలుతోపాటు లౌకి సంబంధాలు, సాంఘిక సంబంధాలు, అంతర్భాగమై ఉంటాయి. ఇటువంటి వివాహ వ్యవస్థలో చాలా రకాల భేదాలు కనిపిస్తాయి, అందులో ముఖ్యంగా గిరిజన తెగల్లో కనిపించే వివాహ వ్యవస్థలో సాంప్రదాయాలు విచిత్రంగా కనిపించినా వాటిలో ఉన్న పూర్వీకుల సాంప్రదాయాన్ని తెలుసుకుంటే చాలా విషయాలు అవగతమౌతాయి.

వివాహాలు – విభిన్న సంప్రదాయలు :

గిరిజన తెగల్లో వివాహాలతో పాటు ఆచార సాంప్రదాయలు కూడా భిన్నంగా కనిపిస్తాయి. అవి నేటి తరానికి విచిత్రంగా ఉన్నా ఆశ్చర్యాన్ని కలిగించినా గిరిజన సమూహాలకు అది ఒక సంప్రదాయబద్ధమైన కట్టుబాట్లుగా కనిపిస్తాయి. ఈ ఆచారాలనుబట్టి గిరిజన తెగలు పూర్వీకుల సాంప్రదాయాలు, తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, బలీయంగా ఏర్పడ్డ కట్టుబాట్లు, నమ్మకాలు, వాటిని కొనసాగింపుగా నేటికి గిరిజన తెగల్లో వివాహ వ్యవస్థను చూస్తే తెలుస్తుంది. అటువంటి విభిన్న సంప్రదాయాల్లో కొన్నింటిని పరిశీలిద్దాం.

1) దేవరన్యాయ వివాహ సంప్రదాయం :

మన దేశంలో ఉన్న గిరిజన తెగల్లో బగత, సవర, గదబ తెగల్లో నేటికీ ఈ వివాహ సంప్రదాయం కొనసాగుతుంది. ఇది వారి పూర్వీకుల నుండి కొనసాగుతున్న సదాచారంలో భాగంగా నిలిచింది. దేవర అంటే భర్త సోదరుడు అని అర్థం. ఆ సోదరుని సమ్మతితో జరిగే వివాహమే దేవరన్యాయ వివాహము. ఒక కుటుంబంలో తమ్ముడు చనిపోతే అతని మరణాంతరం తన తమ్ముని భార్య అయిన మరదలను ఇష్టపూర్వకంగా అధికారికంగా అగ్రజుడైన అన్నచేసుకునే వివాహమే ఈ దేవరన్యాయ వివాహం. అలాగే అన్న చనిపోయినప్పుడు అన్న భార్య అయిన వదినను తమ్ముడు చేసుకొనే సంప్రదాయం కూడా ఈ వివాహ వ్యవస్థలో ప్రధాన అంశం. ఈ ఆచారం గిరిజన తెగల్లో కొనసాగుతూనే ఉంది.

2) భార్య భగినీ వివాహ సంప్రదాయం :

కుటుంబంలో ఉన్న ఒక వ్యక్తి భార్య చనిపోయినప్పుడు ఆ భార్య యొక్క చెల్లెల్ని అధికారికంగా చట్ట సమ్మతంగా వివాహం చేసుకోవడమే భార్య భోగిని వివాహమని అంటారు. ఇటువంటి ఆచారాలు కేవలం గిరిజన తెగల్లోనే కాకుండా చాలా వరకు హైందవ సమాజంలో కూడా కొనసాగాయి. నేటికీ ఈ సంప్రదాయం గిరిజన తెగల్లో కొనసాగుతూనే ఉంది.

3) భగినీ బహు భార్యత్వ వివాహ సంప్రదాయం :

సాధారణంగా ఒక పురుషుడు అనేక మంది స్త్రీలను పెండ్లి చేసుకోవడం సాధారణంగా చూస్తాం. కానీ ఒక స్త్రీ అనేకమందిని పెండ్లి చేసుకొని కాపురం చేయడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పౌరాణిక పాత్రల్లో ద్రౌపది వివాహం కూడా ఇదే వివాహ వ్యవస్థలో భాగంగా కనిసిస్తుంది. అది ఆనాటి ఆచార సాంప్రదాయాల్లో భాగమైందని తెలుసుకోవచ్చు. ఒకే స్త్రీని ఐదుగురు అన్నదమ్ములు వివాహం చేసుకోవడం సంతానాన్ని పొందటం దానితో పాటు సమాజిక గౌరవాన్ని పొందటం గమనించవచ్చు. మనదేశంలో ఉన్న గిరిజన తెగల్లో ఇటువంటి వివాహాలు పూర్వకాలం నుంచి జరుగుతూనే ఉన్నాయి. వీటిని భగినీ బహుభార్యత్వం, అభగినీ భార్యత్వం అని రెండు రకాల వివాహ పద్ధతులుగా విడిపోయింది.

భగిని బహుభార్యత్వం అంటే అక్కచెల్లెళ్ళు ఒకే భర్తను వివాహం చేసుకొని కలకాలం జీవించడం. అది అధికారికంగా వంశపారంపర్యంగా గిరిజన తెగల్లో కనిపిస్తుంది. రెండవది అభగినీ బహుభార్యత్వం అంటే ఒక వ్యక్తి అనేక మంది స్త్రీలను పెండ్లిచేసుకోవడం. కేవలం ఒక కుటుంబం నుంచే కాకుండా ఇష్టమైన అనేకమందిని వివాహం చేసుకునే సాంప్రదాయంగా చెప్పవచ్చు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న గిరిజన తెలగల్లో ఈ వ్యవస్థ కనిపిస్తుంది. ఆ గ్రామంలో ఉన్న పెద్ద ఆస్థిపరుడైతే అతని ఇష్టప్రకారం ఎంతమందినైనా వివాహం చేసుకోవడం గిరిజన తెగల్లో సాంప్రదాయంగా కనిపిస్తుంది.

4) బహుబర్తృత్వ వివాహ సంప్రదాయ పద్ధతి :

గిరిజన తెగల్లో ఆచారణలో ఉన్న ఈ వివాహ పద్ధతి కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఒక పురుషుడు అనేకమంది స్త్రీలను వివాహం చేసుకోవడం సహజమే, కాని ఒక స్త్రీ అనేకమందిని అధికారికంగా వివాహం చేసుకోవడం, అందులోను ఒక కుటుంబానికి చెందిన అన్నదమ్ములను ఇష్టపూర్వకంగా అంగీకరించి వరించడం చివరి వరకు కలిసి కాపురం చేయడం సంతానాన్ని పొందటం, ఈ వివాహ సంప్రదాయ పద్దతుల్లో ప్రత్యేకంగా కనిపించే అంశం. ఈ సంప్రదాయం ఖాసీ తెగకు చెందినవారిలో నేటికీ ఆచరణలో ఉంది.

బహుబర్తృత్వాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటిది ఒకే గోత్రానికి లేదా ఒకే కుటుంబానికి చెందిన వారితో వివాహం చేసుకోవడం. అన్నదమ్ములంతా కలిసి ఒకే స్త్రీని వివాహమాడటం. ఈ పద్దతిలో కుటుంబంలో ఉన్న అన్నదమ్ములందరికి ఆమె భార్యగానే ఉంటుంది. అన్నదమ్ములందరిని సమానంగానే భర్తగా స్వీకరించి గౌరవిస్తుంది. ఆమెకు గర్భం ధరిస్తే భర్తలందరూ కలిసి గొప్పగా ఒక వేడుకను జరుపుతారు ఆ వేడుకలో పుట్టబోయే బిడ్డకు తండ్రి ఎవరు అనేది సమిష్టిగా నిర్ణయించి ప్రకటిస్తారు. ఈ సంప్రదాయం తోడా తెగలో నేటికీ అమలులో ఉంది. ఇదే సంప్రదాయం పాండవుల్లోకూడా కనిపిస్తుంది.

5) స్వయంవర వివాహ సంప్రదాయ పద్ధతి :

మన వైదిక సాహిత్యంలోను, ఇతిహాసాల్లో కనిపించే స్వయంవరం పద్ధతికి ఈ పద్ధతి కొంత దగ్గరగా కనిపిస్తుంది. ఇది రాజస్థాన్‌లో ఉన్న భిల్ గ్రామంలో నేటికి కొనసాగుతుంది. భిల్ తెగలవారికి అత్యంత ఉత్సాహాన్ని నింపే వివాహపద్దతి ఇది. దీనిని హోళీ పండుగ రోజున జరుపుతారు. ఆ రోజు ఆ గ్రామంలో ఉన్న యువతీ యువకులు ఎక్కువగా పాల్గొంటారు. ఒక ఎత్తైన చెట్టుకు గాని, పొడవైన స్థంభానికి గాని ఒక ఉట్టి కట్టి అందులో బెల్లం, టెంకాయ పెడతారు. అప్పుడు యువకులు పోటీపడి ఆ ఉట్టిలో ఉన్న బెల్లం, టెంకాయను ఎవరైతే పట్టుకొస్తారో వారిని విజేతగా ప్రకటిస్తారు. అతడు ఆ సమూహంలో ఉన్న తనకు నచ్చిన ఆడపిల్లను ఎవరినైనా వివాహం చేసుకోవచ్చు. ఇది ఉత్తమ సంప్రదాయంగా చెబుతారు. ఇది అంత సులభమైన విషయం కాదు. యువకులు ఆ ఉట్టిలో ఉన్న వాటిని తెచ్చేటప్పుడు చుట్టూ ఉన్న ఆడపిల్లలు చాలా రకాలుగా అడ్డుకునే ప్రయత్నంచేస్తారు. ఇది యువకులయొక్క యుక్తికి, సాహసానికి, దేహదారుఢ్య శక్తికి ప్రతీకగా భావిస్తారు. ఈ ఉత్సవం వల్ల కొత్త జంటలు ఆనందోత్సవాలతో మునిగితేలుతారు.

పరిక్షా విధి వివాహ సంప్రదాయం :

మణిపూర్‌లో ఉన్న కూకీ తెగలో ఈ సంప్రదాయం నేటికి కొనసాగుతుంది. యువతీ యువకులు కొంత కాలంపాటు దూరంగా వెళ్ళి కలిసి జీవించిన తరువాత తిరిగివచ్చి వివాహం చేసుకునే సరికొత్త సాంప్రదాయం. ఊరికి దూరంగా వెళ్ళి వేరే గ్రామంలో తల్లిదండ్రులకు తెలియకుండా కొన్నాళ్ళు కాపురం చేసి ఇష్టా ఇష్టాలతో వివాహం చేసుకుంటారు. సహజీవనం నచ్చితేనే వివాహానికి ఇరువురు అంగీకరిస్తారు. ఒకవేళ కాపురం చేసి ఆకాలం పూర్తి అయినతరువాత ఇద్దరిలో ఎవరికి ఇష్టం లేకపోయినా వివాహం చేయరు. ఒక వేళ విడిపోయే పరిస్థితి వస్తే తాత్కాలికంగా భార్యగా ఉన్నందుకు అతడు కొంత సొమ్మును సమాజం ముందు లేక సంఘం ముందు ఆమెకు చెల్లించే నిబంధన నేటికి కొనసాగుతూనే ఉంది. ఇటువంటి సంఘటనలు జరగటం అరుదుగా కనిపిస్తుంది.

సహపలాయన వివాహ సంప్రదాయం :

యువతీ యువకులు ప్రేమించుకుని స్వేచ్ఛగా కలిసి జీవించడం కోసం వేరే ప్రాంతానికి రహస్యంగా వెళ్ళిపోయి చివరకు వివాహం చేసుకునే పద్ధతి ఇది. దీనినే వ్యవహారిక భాషలో లేచిపోవడమని అంటారు. కొంతకాలమైన తరువాత అసలు గ్రామానికి వచ్చి తల్లి దండ్రుల సమ్మతితో, గ్రామస్తుల సమ్మతితో కాపురాన్ని కొనసాగిస్తారు. తల్లి దండ్రులు వెళ్ళినటువంటి వీరి కోసం వెతుక్కుంటూ వెళ్ళి ఇంటికి తీసుకొచ్చి వివాహం చేస్తారు. ఇది గోండు, భగత, సవర, ఖోండు తెగల్లో నేటికి ఆచరణలో ఉంది.

అపహరణ వివాహ సంప్రదాయం :

ఈ పద్దతిని రాక్షస వివాహ పద్దతిగా భావించవచ్చు. ఇష్టమున్నా, లేకపోయినా ఆ యువతిని బలవంతంగా ఎత్తుకుపోయి వివాహం చేసుకునే పద్ధతి ఇందులో కనిపిస్తుంది. ఇది కూడా రకరకాలుగా జరుగుతుంది. మొదటి పద్ధతి ప్రకారం ఇష్టా ఇష్టాలతో పనిలేకుండా శత్రు శిభిరాలుగా ఉన్న ప్రాంతాలుగాని పక్కన ఉన్న గూడాలను గాని ఎంచుకుని బలవంతంగా చొరబడి తను వలచిన యువతిని బలవంతంగా తీసుకుపోయి వివాహం చేసుకోవడం. రెండవ పద్దతి వ్యక్తిగత స్థాయిలో జరిగే వివాహ పద్దతి. యువతికి ఇష్టంలేకపోయినా సరే ఆ యువకుడు యువతి కూడా ఉన్న వారికి ప్రేమరాయబారం పంపిస్తాడు. దానికి ఆమె అంగీకరిస్తే సరేసరే కాదంటే బలవంతంగా అదునుచూసి తీసుకొనిపోయి వివాహం చేసుకుంటాడు. ఈ సంప్రదాయం బీహార్‌లో ఉన్న బిర్హోరు, రాజస్థాన్‌లో ఉన్న భిల్లులు, తమిళనాడులో ఉన్న బడగాలు, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సవర తెగల్లో నేటికి ఆచరణలో ఉంది. మూడవ పద్దతి ప్రేమలో పడ్డ యువతీ యువకులు వివాహం చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు గాని, ఇతర ఇబ్బందులుగాని అడ్డుగా వచ్చినప్పుడు వారి కుటుంబ సభ్యులే ఆడపిల్లను ఎత్తుకు పోవడానికి ప్రోత్సహిస్తారు. అందులో భాగంగా ఆ యువకుడు వచ్చి అమ్మాయిని తీసుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. ఆమె తల్లిదండ్రులు ప్రతిఘటించినట్లు నటిస్తారు. చివరకు ఆమెను తీసుకొనిపోయి వివాహం చేసుకుంటాడు. మరొక రకమైన వివాహ పద్దతి బీహార్ రాష్ట్రంలో భిల్‌హోర్ తెగల్లో కనిపిస్తుంది. ఇది చాలా విచిత్రంగా ఉండే వివాహ పద్ధతి. ఆ ఊరిలో జరిగే సంతల్లో, జాతర్లలో, కొంతమంది యువకులు యువతుల కోసం ఎదురుకాచి మార్గమధ్యంలో వారిని ఎత్తుకునిపోయి ఆమె నుదుట బొట్టు పెడతారు. అలా బొట్టు పెట్టినచో ఆమె అతనికి భార్య అయినట్టుగా భావిస్తారు. ఆ తరువాత వివాహం చేసుకుంటారు.

ఈ విధంగా అతి ప్రాచీనమైన గిరిజన తెగల్లో నేటికీ ఇటువంటి భిన్నమైన వివాహ పద్ధతులను పరిశీలిస్తే కొంత విచిత్రంగాను, ఆశ్చర్యంగాను కనిపిస్తాయి. ఈ వివాహ పద్దతులు వారి ఆచార సాంప్రదాయాల్లో ప్రధాన భూమిక పోషిస్తాయి కాబట్టి అవి ఆ తెగలకు సమ్మతమైన, అంగీకరామైన, చట్టబద్దమైన, ఆచారాలుగా నిలిచాయి. కొన్ని వివాహ పద్ధతులను గమనించినప్పుడు వాటిలో కొన్ని ఈ కాలానికి సహేతుకంగా కనపబడటంలేదు. ఉదాహరణగా బహుభార్యత్వం, బహుభర్తృత్వం వలన అనేకమైన శారీరక, సమస్యలతో పాటు వ్యాధులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కనుక అటువంటి వివాహ పద్దతులను సంస్కరించే పనిలో ప్రభుత్వాలుతో పాటు ప్రజా సంఘాలు అనేక విధాలుగా ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తున్నాయి. అంతేకాకుండా ఆయా తెగల్లో ఉన్నటువంటి మూఢ విశ్వాసాలను, మూఢ నమ్మకాలను, ప్రక్షాళన చేస్తూ అనేక పథకాలను రూపొందిస్తున్నారు. ఒకప్పటి సంప్రదాయాలు ఆనాటి కాలానికి, ఆనాటి సమాజానికి, ఆనాటి సమూహాల భావజాలానికి అనుగుణంగా ఉండేవి. కాని ఇప్పుడు సమాజంలో అనేక

మార్పులు వచ్చాయి. మార్పులకు అనుగుణంగా ప్రజల్లోను, భావజాలంలోను ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. దానివల్ల సామాజిక సంస్కరణతోపాటు సామాజిక చైతన్యం కూడా రావలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే సంస్కృతి సంప్రదాయాల్లో మత విశాసాల్లో మార్పును ఆహ్వానించే దిశగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆశిద్దాం.

ఆధార గ్రంథాలు :

1). Luchy Mair - an introduction of Social Anthropology 1972

2). Mirdock. G.P. - Social structure 1965

3). Gough.K - The Nayars and the traditions.

4). Nadim Hasan - Indian Tribes 1955

రచయితల చిరునామాలు

1. **ఆచార్య కె.మధుజ్యోతి,** తెలుగు శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి 517502, ఆంధ్రప్రదేశ్,
2. **Prof. Surya Dhananjay**, Senior Professor, (Former Member TSCHE, Former Head & Chairperson (BOS)), Department of Telugu, University College of Arts And Social Sciences, Osmania University, Hyderabad - 500 007, T.S., India. Email: suryadhananjay@yahoo.co.in Cell: +91 9849104187
3. **ఆచార్య కె. శ్రీదేవి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం & వై.స్రవంతి, పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
4. **ఆచార్య .పి.రమాదేవి,** తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.
5. **ఆచార్య .టి.రామప్రసాద రెడ్డి,** డీన్ ఫ్యాకల్టి ఆఫ్ ఆర్ట్స్ & ఎడ్యుకేషన్, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.
6. **ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్,** సంచాలకులు, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
7. **ఆచార్య ఎం.రామనాథం నాయుడు,** తెలుగు శాఖ, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు, కర్ణాటక.
8. **ఆచార్య ఎస్.చిన్నరెడ్డయ్య,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
9. **డా.జి.శైలమ్మ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
10. **డా.టి.వెంకటస్వామి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
11. **డా.యం.హరికృష్ణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
12. **డా.వి.గోపాల్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
13. **డా.డి.జ్యోతమ్మ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
14. **డా॥ తరపట్ల సత్యనారాయణ**, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ద్రావిడి

(అర్ధ వార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

శైలీ పత్రం

- వ్యాసాలు ద్రావిడ భాషాసాహిత్యాలు, చరిత్ర, సంస్కృతి, జానపదవిజ్ఞానం, తత్త్వశాస్త్రం, మానవశాస్త్రం, ఇతర ఏ మానవీయ శాస్త్రాలకు చెందినదైనా ద్రావిడ సంబంధమైన పరిశోధన వ్యాసాలు రాయవచ్చు. కాని విషయం ఏ శాఖకు చెందినదైనా వ్యాసం తెలుగులోనే ఉండాలి.
- ఇతర ద్రావిడ భాషల పరిశోధన పత్రికలలోని ఉత్తమ వ్యాసాలను మూల రచయితల, ఆ పత్రికల యాజమాన్యాల అనుమతితో తెలుగులోకి అనువదించి పంపవచ్చు. కాని మూలభాషలోని మూల ప్రతిని కూడా పంపాలి.
- వ్యాసాలు తప్పనిసరిగా సరికొత్త పరిశోధనాంశాలతో ఆ శాఖాంశాలపై సరికొత్త ప్రతిపాదనలు కాని సరికొత్త విజ్ఞానదృష్టిని కాని అందించేవై ఉండాలి. ఏ ప్రాచీన సాహిత్యం సరికొత్త సాహిత్య ధోరణుల గురించి రాసినా పరిశోధనలో కొత్తదనం తప్పనిసరి. గతానుగతికమైన వాదనలను ఇప్పటికే చాలా మంది చెప్పిన విషయాలపైన తిరిగి రాసే వ్యాసాలను పత్రిక అనుమతించకపోవచ్చు.
- వ్యాసాల పరిమాణం మరీ చిన్నదిగా ఉండకూడదు. అచ్చులో కనీసం ఐదు పుటల వ్యాసాలు చిన్నవిగా ఉండవచ్చు. మరీ ఎక్కువ పుటలలో ఉంటే పరిశోధన గురుత్వాన్ని బట్టి అంగీకరించవచ్చు.
- వ్యాసాలు ఆధునిక ప్రామాణిక భాషలో ఉండాలి. మాండలిక కథలపైన, ఇతర మాండలిక భాషాధారిత ప్రక్రియలపైన వ్యాసాలు రాసినా వ్యాసం ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉండాలి.
- పులుముడు వాక్యాల శైలి దూరాన్వయం దురన్వయం ఉన్న వాక్యాల శైలి కాక సూటిగా క్లుప్తంగా ఉండే వాక్యాలతో విషయాన్ని సూటిగా చెప్పే శైలిని పాటించాలి.
- ఇప్పటికే విస్తృతంగా జరిగిన పరిశోధనాంశాలపైన కొత్త ప్రతిపాదనలు చేసే వ్యాసాలలో తిరిగి ఉపోద్ఘాతాలు చేయకుండా తిన్నగా విషయాంశానికి వెళ్ళి చర్చించవచ్చు. ఉదాహరణకు జానపద గేయాలపై కొత్త వ్యాసం రాయదలచుకున్నప్పుడు. తిరిగి నిర్వచనాలను గురించి చెప్పడం గేయలక్షణాలు వగైరా రాయనవసరం లేదు. భావకవిత్వంపైన సరికొత్త ప్రతిపాదనలు వివాదాలు రాయదలచుకున్న వారు తిన్నగా విషయంలోనికి వెళ్ళవచ్చు. కాని తిరిగి భావకవిత్వ నిర్వచనాలను గురించి ఉపోద్ఘాతాలు అవసరంలేదు.
- విసంధులు పాటించవచ్చు. అందంగా ఉన్నంత వరకూ వైరి సమాసాలను పాటించవచ్చు. పాలాభిషేకం, మెట్లోత్సవం, ఫిల్మోత్సవ్ వంటి మామూలు పాపులర్ భాషలోని దుష్టసంధులు వర్జించాలి. వ్యావహారికమైన పాపులర్ పత్రిక భాషను వాడకూడదు.

 ISSN No.2319-3905

- థ–ధ, శ–ష–స భేదాన్ని తప్పక పాటించవలసి ఉంది. శకట రేఫ అవసరమైన చోట అంటే భాషాశాస్త్ర సంబంధి వ్యాసాలలో ప్రాచీన సాహిత్య చర్చకు సంబంధించిన వ్యాసాల్లో వినియోగించవచ్చు.
- వ్యాసానికి పాదసూచికలు/అంత్యసూచికలు ఇవ్వండి. సూచికలో స్పష్టమైన అవసరమైన సమాచారం ఉంటేనే ఇవ్వండి. చర్చలో అధికంగా ఇవ్వవలసిన సమాచారం ఉన్నా ఇవ్వండి. అతి ముఖ్యమైన విషయమైతేనే వ్యాసంలో ఉండాలి.
- ఉపయుక్త గ్రంథాల పట్టీ ఇచ్చేటప్పుడు వ్యాసంలో చర్చలో వినియోగించిన గ్రంథాలను మాత్రమే ఇవ్వాలి. దీనికి సంబంధం ఉన్నా ఇతర పుస్తకాలు జాబితాలో చేరవలసిన పనిలేదు.
- ఉపయుక్త గ్రంథాల జాబితా ఆధునికంగా అంతర్జాతీయంగా ఉపయోగించే పద్ధతిలో ఉండాలి. కింద ఉదాహరణ చూడవచ్చు.

  కృష్ణకుమారి నాయని, 1979. **జానపద గేయగాథలు,** తెలుగు అకాడమీ, హైదరాబాదు.
- జాబితాలో రచయితల పేరు పక్కన వారి బిరుదులు, హోదాలు రాయనవసరం లేదు. వ్యాసాన్ని కోట్ చేసినప్పుడు వ్యాసం ఉన్న పుస్తకాన్ని పై విధంగా రాయాలి. గ్రంథాల జాబితా గ్రంథకర్తల పేర్లతో అకారాది క్రమంలో ఉండాలి. జాబితాకు వరుస సంఖ్య అవసరం లేదు.
- అముద్రిత గ్రంథాలను, అముద్రిత సిద్ధాంత గ్రంథాలను కూడా ఉపయుక్త గ్రంథాల జాబితాలో అకారాది క్రమంలోనే రాయాలి. కాని (అముద్రితం) అని కుండలీకరణంలో, చివరిలో చెప్పాలి.
- Ibid, et.al. Op. Cit, వంటి వాటిని యథాతథంగా వాడుకోవచ్చు.
- ఉపశీర్షికలు వ్యాసరచనలో మరింత స్పష్టతనిస్తాయి. కాబట్టి వాడుకోవచ్చు.
- ఉటంకించే పాఠ్యం చిన్నది అయితే కొటేషన్ మార్కులలో ఉంచండి. లేదా ఒక పేరా అంత పరిమాణం ఉంటే దాన్ని ప్రత్యేకంగా మార్జిన్ పెట్టి వేరే చిన్న ఫాంట్‌లో రాయాలి.
- వ్యాసకర్తలే డి.టి.పి చేయించి పంపే పక్షంలో అను (version-7) కు కన్వర్ట్ కాగలిగిన ఫాంట్‌లనే వాడాలి. ఏ సాఫ్ట్‌వేర్ వాడింది ఏ ఫాంట్ వాడింది స్పష్టంగా రాసి పంపాలి. సాఫ్ట్ కాపీ ఇ–మెయిల్‌లో పంపవచ్చు.

  E-mail - dravididu@gmail.com
- మూలరచయిత అనుమతి పత్రం అనువాదానికి తప్పక జతచేయాలి.

ఈ పత్రికను ప్రాంతీయ భాష అయిన తెలుగులో వెలువరిస్తున్నా అంతర్జాతీయంగా వెలువడుతున్న పరిశోధన పత్రికల స్థాయిలో ప్రచురించాలనే మా అభిలాషను అర్థం చేసుకుని పరిశోధకులు సహకరించవలసిందిగా మనవి. ఇందుకు మీరూ తగిన సూచనలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు సంపాదక మండలిని సంప్రదించవచ్చు. మీ రచనలు అందించి పత్రికను ఉత్తమ ప్రామాణిక పత్రికగా దిద్దితీర్చడంలో సహకారం అందించాలని మనవి.

సంపాదకమండలి